విజయ్ శేఖర్ ఉపాధ్యాయుల
మరణంతో నా అనుభవాలు
ఎమెస్కో

ఈ పుస్తకం చదివాక... అయ్యో! ఇందులో ఇన్ని చావులు ఉన్నాయేంటి అని అనుకోకండి. ఒక్కసారి మీ జీవితాన్ని తిరగెయ్యండి. మీరు చూసిన విన్న మరణాల గురించి లెక్కేయండి. మీ చుట్టూ చనిపోయిన ఆత్మీయుల గురించి ఆలోచించండి. వాటితో పోలిస్తే ఇది తక్కువే. కాని అంతకు ముందుగా ఈ పుస్తకాన్ని పూర్తిగా చదవండి. ఇది నా మొదటి నవల. దీని గురించి మంచిని పదిమందికి చెప్పి చెడుని నా చెవిలో వేస్తారని ఆశిస్తూ.

– రచయిత

నన్ను కన్న తల్లిదండ్రులకి,
అక్షరాలు నేర్పిన గురువులకి,
తోడు నిలిచిన మిత్రులకి,
పాఠక దేవుళ్లకి...

అంకితం

చచ్చినట్టు చదవించే నవల...!!

గతంలో నేను Key (కీ) అనే షార్ట్ ఫిల్మ్ ఆత్మహత్య మీద తీసే క్రమంలో... మరణం గురించిన కొన్ని విషయాలు... కొన్ని కొటేషన్లు సేకరించాను. 'మోరీతో మంగళవారం' అనే పుస్తకం చదవడం తటస్థించింది! ...చాలా తమాషా పుస్తకం.

ఇన్నేళ్ల తర్వాత ఓ కుర్రాడు 'మరణంతో అనుభవాలు' అన్న పుస్తకం చదివి ముందుమాట రాయమంటే... ఆశ్చర్యపోయా! ఎమెస్కో వాళ్లు వేస్తున్నారంటే ఆనందించా... విషయం లేకపోతే ఎమెస్కో విజయకుమార్ ఇంత సాహసం చేయరు!

చదవడం మొదలెట్టా... చిత్రంగా ఉంది... ఒక మరణానుభవం లోంచి.. ఓ ప్రేమకథై... తర్వాత... మరో మరణంతో భగ్నమై... ఫిలాసఫీ వైపు వెళ్తూ... ఇదో కొత్త తరహా నవల.. అన్ని రసాలూ ఉన్నా... అతి సహజంగా ఉంటూ... పాఠకుడికి... ప్రతి పేజీ ఉత్కంఠ కలిగిస్తుంది! ...పాఠకుడి మేధకి కొన్ని కొత్త కిటికీల్ని తెరుస్తుంది! ...ఇది ఆషామాషీగా రాసింది మాత్రం కాదు... ఎంతో రీసెర్చి... మరెంతో శ్రమా... ఎంతో విషయసేకరణ... అన్నిటినీ మించి చాలా చాలా... ఇష్టంగా.. రాసిన నవల...

ఇదే ఇంగ్లీష్‌లో నవలగా వస్తే ఉపాధ్యాయుల విజయశేఖర్ 'ఓవర్ నైట్ స్టార్ రైటర్' అయ్యే అవకాశం ఉంది!

తమాషా ఏమిటంటే... ఈ పుస్తకం గలగలా చదవడం కుదరదు... అలా అని ఆపడమూ కుదర్దు.. ఆస్వాదిస్తూ... అనుభవిస్తూ... ఆనందిస్తూ... పేజీలు తిప్పడమే!

మరణం మీద రాసిన కుర్రాణ్ణి 'చిరంజీవ' అని ఆశీర్వదిస్తూ...

శుభం

తనికెళ్ల భరణి

కృతజ్ఞతలు

ఆలోచనని ఆచరణలో పెట్టి రాయడం ఒక్కటే ఒకరి కష్టం. అది పూర్తయ్యి పది మందిని చేరడానికి ఒక సమూహం ఎంతో కష్టపడుతుంది.

నా బి.టెక్ మూడవ సంవత్సరంలో మొదలు పెట్టిన ఈ నవలని ఎప్పటికప్పుడు చదివిన కిషోర్, నాగేంద్ర, మౌనిక, రమ్య, ప్రియాంక, షామిలి వారందరికీ..

అలాగే నవలకు ఉన్న చిన్నపాటి రీసెర్చ్‌కు సంబంధించిన విషయాలను, సందేహాలను చెప్పిన పవన్ ఆకొండి గారికి, నా బి.టెక్ hod సార్ సుబ్బారావు గారికి ...

ఏమి ఆశించకుండా ఈ నవల మొదటి వెర్షన్ టైపు చేసిన శివ కృష్ణ గారికి... అడిగిన వెంటనే డమ్మీ బుక్స్ వేసి ఇచ్చిన చేరన్ అన్నకి...

పదిమందికి నచ్చేలా కవర్ డిజైన్ చేసిన గణేష్‌కి.. తెలుగులో మొట్టమొదటి నవల ట్రైలర్ గా ఈ బుక్ VFX ట్రైలర్‌ని అద్భుతంగా తీర్చిదిద్దిన సునీల్ చరణ్‌కి... కాన్సెప్ట్‌లో నాకు సహకరించిన అనురాగ్ పాలుట్లకి,

తమ విలువైన సలహాలని అందించి, నాతో పాటు ప్రయాణించిన భాస్కర్ రాజ్‌కుమార్, సాయి శంకర్, విజయ్ కుమార్, కార్తికేయ, గస్తీ, రాజ్ మాదిరాజు, వేణు గార్లకు...

పుస్తకాన్ని చదివి తమ విలువైన మాటలను ఇచ్చిన ఆకెళ్ళ రాఘవేంద్ర గారికి, సత్యానంద్ గారికి, దేవి ప్రసాద్ గారికి,

ముందుమాట అందించిన తనికెళ్ళ భరణి గారికి.. పుస్తకాన్ని అచ్చు వేస్తున్న ఎమెస్కో వారికి...

చివరిగా నన్ను మూడేళ్లు ఓపికగా రూములో భరించిన నా రూంమేట్స్ శ్రీహరి, శర్మలకు... ఇన్నేళ్లు భరిస్తున్న మా అమ్మ, నాన్న, అక్కబావలకి ... నా కజిన్స్‌కి.... నాకు కనిపించిన ప్రతి మనిషికీ, నన్ను కదిలించిన ప్రతి కథకీ...

కృతజ్ఞతాభివందనాలు

మరణంతో నా అనుభవాలు

"అభి అభి" అని ఎవరో నన్ను కుదుపుతున్నారు. నా కళ్లు తెరుచుకున్నాయి కానీ అన్నీ అస్పష్టంగానే కనబడుతున్నాయి. రూమ్‌లో ఉన్న ఎ.సి. కి అనుకుంటా ఇన్నాళ్లూ చలనం లేని నా శరీరం వొణుక సాగింది.

"ఎలా ఉన్నారు అభిమన్యు" అన్న ప్రశ్నకు మౌనమే సమాధానం అయ్యింది.

ఎందుకో మాట పెగలట్లేదు. నీరసం వల్ల అనుకుంటా చాలాకాలం నుండి నా నోట్లోకి ఏమీ వెళ్లలేదు అని తెలుస్తోంది. కొంతసేపటికి నా కళ్లు మెల్ల మెల్లగా తేరుకున్నాయి. స్పష్టంగా చూడటం తెలిసిన తర్వాత మొదట చూసినది మా అమ్మ, నాన్న కన్నీళ్లు. కన్న ప్రేమకు అవి సహజం అనుకుంటా.

ఇంతలో త్రిపుర బత్తాయి జ్యూస్ అందిస్తూ "అభి నిన్ను కలవాలని ప్రొఫెసర్ శ్రీరాములు గారు అడుగుతున్నారు. ప్రయోగం సక్సెస్ కదా?"

"అవును" అని ఇంకా చెప్పబోతుంటే అమ్మ వారించింది.

ఒక నెల వరకూ ఈ రీసెర్చ్‌లు గట్రా పక్కన పెట్టి ఊరికి వెళ్దాం లేకపోతే నా మీద ఒట్టు అనడంతో "సరే" అన్నాను.

"ఆయన్ని తరవాత కలుస్తాను అని చెప్పు త్రిపుర" అన్నాను.

అదేంటో హాస్పిటల్లో అందరూ వింతగా చూస్తున్నారు. వాళ్ల వింతకు కారణం సంవత్సరంన్నర శవంలా పడుకున్న నేను ఈ రోజు మరలా లేవడమే. నాకు, జోషి, త్రిపురకి తెలిసిన విషయాలు ఈ బయట ప్రపంచానికి తెలిస్తే ఇంకెంత వింతగా చూస్తారో అనిపించింది.

అసలు ఈ హాస్పిటల్‌కి ఎలా వచ్చానో? నన్ను కన్న ప్రేమే ఇక్కడిదాకా తీసుకొచ్చిందనుకుంటా. కాస్త నడవటం మొదలుపెట్టినా, అప్పుడే డిశ్చార్జి చేయలేమని చెప్పారు డాక్టర్స్.

హాస్పిటల్‌ను మించిన మరో నరకం ఉండదనుకుంటా. మనిషి మరణం నుంచి తప్పించుకుందామనే ఆశతో హాస్పిటల్‌ను ఆశ్రయిస్తాడు. కానీ అతనికి తెలియదు హాస్పిటల్ కన్నా నరకమే బాగుంటుందని.

మనిషి దేనికి భయపడినా, భయపడకపోయినా చావు, నరకం అన్న మాటలకు భయపడుతూనే ఉంటాడు. వాటిని తప్పించుకోవడానికి పూజలు, పునస్కారాలు, ఉపవాసాలు. "దేవుడా నాకు స్వర్గాన్ని ప్రసాదించు మరియు నా జీవితంలో సుఖాన్నే ప్రసాదించు" ప్రతి ఒక్కడూ గుడికెళ్తే కోరుకునేదే కానీ ఆ పిచ్చివాడికి తెలీదు ప్రతిరోజూ సుఖంగానే గడిస్తే దాని విలువ తెలీదని..

ఇలా అనుకుంటూ ఉండగానే ఒక మంచి వార్తే వచ్చింది సాయంత్రమే డిశ్చార్జి అని. నాకు సైకాలజీలో గోల్డ్ మెడల్ వచ్చినప్పుడు కూడా ఇంతలా సంతోషపడలేదనుకుంటా.

చాలా సంవత్సరాల తర్వాత మా ఊరికి...

మా ఊరు ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటుంది. ఇళ్లైతే మరీను... ఏదో ఎవరో నిశ్శబ్ద విప్లవం చేస్తున్నట్లు... అది గ్రామాల్లోనే సాధ్యం అనుకుంటా.

ఎప్పుడూ నా తలకు తగిలే ఇంటి గుమ్మం ఈ సారి తగలలేదు. నాకున్న నీరసానికి ఒంగి నడవడంతో అలా జరిగిందని భావించా.

"ఒరేయ్!! ఒక నెలరోజుల పాటు ఎక్కడికీ కదలడానికి వీల్లేదు అర్థమయ్యిందా"

"సరేమ్మా ఈ నెల రోజులు నాకు కావలసినవన్నీ చేసిపెట్టు నీ చేతి భోజనం తిని చాలా రోజులైంది" అన్నాను. అమ్మ చేతిని మించిన అమృతం, ఔషధం లేదనిపించింది. త్వరగా కోలుకుంటాను అన్న స్వార్థంతో అలా చెప్పి ఉండవచ్చు.

ప్రతి ఒక్కరూ పరామర్శకు వచ్చి పోతూనే ఉన్నారు. ఏదో చిరంజీవి సినిమా బెనిఫిట్ షోకు ఉన్న సందడి మా ఇంట్లో... పల్లెటూర్లో పరామర్శకు వచ్చేవారు పేషెంట్ పరామర్శకన్నా ఊర్లో ఉన్న కబుర్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఉంటారు.

ఇందులో ఆడవాళ్ళు అయితే మరీను. ఇది ప్రపంచంలో ప్రతి మగవాడికి తెలిసిన విషయమే. అందుకే "ఆడవారి నోట నువ్వు గింజ అయినా నానదంటారు."

ఎలాగైతేనేం పరామర్శల పర్వం ముగిసింది.

రోజులు గడుస్తూనే వున్నాయి.

"ఎన్నాళ్లనీ ఇలా మంచం పట్టుకుని కూర్చుంటాను. పట్టుమని పాతికేళ్ళు కూడా లేని వాడిని" అంటూ అరిచా అమ్మతో.

"అలా అలా కాస్త మన పొలం దాకా వెళ్లి రారా" అంది అమ్మ. చాలారోజుల తరువాత వచ్చింది పర్మిషన్ అమ్మ దగ్గర్నుంచి.

"హమ్మయ్యా!!" అనుకుని స్విచ్ఆఫ్ చేసిన నా ఫోన్‌ని ఆన్ చేసి బయటకు నడిచా.

పల్లెటూరు బయటకి వస్తే గానీ సిగ్నల్ రాదాయే, బయటకు రాగానే కాస్త సిగ్నల్ వచ్చిందో లేదో ఒక 20, 30 మెసేజ్‌లు ఫోనుని కుదిపేసాయి. మన యాంత్రిక జీవితాలు అంతే అనుకుంటా. ఇక్కడ కూడా ప్రశాంతంగా ఉండనివ్వరేమో అనుకుని మెసేజ్‌లు చదవడం మానేసా.

ఊరు చాలా మారిపోయింది. ఎక్కడా కుర్రోళ్లే కనిపించట్లేదు. చదువులకు, ఉద్యోగాలకు వలస పోయినట్లున్నారు. పల్లెటూర్లన్నీ ఇలాగే బోసిపోయినట్టున్నాయి. ఊర్లో ఎంతసేపు నడిచినా అలసటే తెలియదు. ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఎంత దూరం అయినా నడిచేయొచ్చు. అసలు మా పొలానికి "అప్పుడే చేరిపోయానా!!" అనే సందేహం.

ఇంతలో అక్కడే ఉన్న సుబ్బయ్య నన్ను చూసి "బొండం బాబు గారు సానా బాగుంటాది... మన కోనసీమ బొండమండి పట్నంలో కొన్నట్టుండదండీ" అని అనగానే "నాకు తెలుసు సుబ్బయ్యా.. నేనూ ఇక్కడే పుట్టి పెరిగాను" అన్నాను.

"సర్లేండి బాబయ్యా మీ ఆరోగ్యం కుదుటపడిందాండి. ఇందా ఇక్కడ తడికి వేస్తున్నాను. మీరు దీనిమీద కూర్చోండి. నేనే కరణం గారింటి దాకా వెళ్లొత్తాను.. చల్లగా ఉండండి" అన్నాడు.

"సరే సుబ్బయ్య.." అన్నాను తన మాటలకి తల ఊపుతూ. .

పల్లెటూర్లో ప్రేమలు ఆప్యాయతలు ఇంతే. ఊర్లో ఎవరికి ఏది వచ్చినా, అది తమ ఇంట్లో వాళ్లకొచ్చినట్లే భావిస్తారు. అది పండగైనా, శుభకార్యమైనా, దినకార్యమైనా... సుబ్బయ్య వేసిన తడిక మీద వాలానో లేదో...కొబ్బరిచెట్లు వింజామరలాగ ఆకులను ఊపుతున్నాయి. చల్లని గాలికి మెల్లగా కునుకులోకి జారుతుండగా ఫోన్ త్రిపుర దగ్గరనుంచి... ఎందుకో మనసులో "ఫోన్ ఎత్తకూడదు" అని ఉన్నా ఫోన్ ఎత్తాను.

"అభి! శ్రీరాములు గారు నీ గురించి పదే పదే అడుగుతున్నారు. ఏం చెప్పమంటావు. నాకు ఏం చెప్పాలో తెలియట్లేదు" అంది త్రిపుర.

"సర్లే త్వరలో కలుస్తానని చెప్పు. నువ్వు ఆయన దగ్గర ఏమీ మాట్లాడకు" అని ఫోన్ పెట్టేశా.

ఫోన్ పెట్టినప్పటి నుండి నా ప్రయోగాలు, నా అనుభవాలు నా మనసుని చుట్టుకుంటున్నాయి.

నిండా 26 ఏళ్లు... "నేను ఏంటి?? ఇన్నాళ్లూ మరణం చుట్టూ తిరిగానా" అని నాకే సందేహం.

ఈ సంవత్సరంన్నరలో జరిగినది తలచుకుంటే నా ఒళ్లే గగుర్పొడుస్తోంది. కలయా, నిజమా అన్నట్టు... అంతకు ముందు జరిగిన ఎన్నో అనుభవాలకు మూలం, ప్రేరణ ఆ ప్రయోగం. అంత ప్రయోగాన్ని ఎవరూ చేయలేరేమో....

అసలు మరణం గురించి తెలుసుకోవాలన్న నా తాపత్రాయానికి, తపనకి కారణం నా అనుభవాలే కారణం కావచ్చు. అవి నన్ను ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి. ప్రస్తుతాన్ని గతం వెంటాడినట్లు..

అసలు అబ్దుల్‌గాడు చనిపోకపోయుంటే ఈ పాటికి నేను అందరి కుర్రాళ్లలాగే ఏ అమ్మాయి వెనుకో చక్కర్లు కొడుతూ ఉండేవాడిని. లేక ఏ అమ్మాయినో పెళ్లి చేసుకుని ఈ పాటికి నలుగురు పిల్లలనో కని ఉండేవాడిని. వాడు ఇంకా నా కళ్ళ ముందు మెదులుతూనే ఉన్నాడు.

* * *

బాల్యం.. బంగారు బాల్యం అందరికీ అద్భుతమైనదే.. నాకు కూడా...

"అబ్దుల్! అదిగోరా ఆ అమ్మాయి కొత్త పెన్ను తెచ్చుకుంది దాన్ని ఎలాగైనా దక్కించుకోవాలి".

"వద్దురా అభి ఒకవేళ మన బ్యాగులు చెక్ చేస్తే దొరికిపోతాం"..

"బ్యాగులో పెడితే దొరుకుతాం ఇంకెక్కడైనా దాచుదాం" అన్నాను.

ఎవరైనా కొత్తవి తెచ్చుకున్నా దక్కించుకోవడం మా అలవాటు. అబ్దుల్ నా మొదటి మిత్రుడు.. రోజూ సాయంత్రం గోదారి గట్టున కూర్చుని పిచ్చిక గూళ్లు కట్టుకోవడం.. మళ్లీ వాటిని కూలగొట్టడం మాకు అలవాటైన పని. అందరూ అంటుండటం ఏంటంటే నిద్రపోయేటప్పుడు తప్ప మేమిద్దరం ఎప్పుడూ కలిసి ఉంటామని...అప్పుడు కూడా ఇంటికి వెళ్లకపోతే ఏమనుకుంటారో అని మా భయం.

"ఒరేయ్ అభి రారా క్రికెట్ ఆడదాం" ఊరంతా వినపడేలా అరుస్తాడు అబ్దుల్.

"ఎక్కడా కరణంగారి పొలం ఖాళీగా లేదుగా?" అన్నాను.

"పర్లే సుబ్బయ్య ఇంటి పక్కన ఆడదాం".

ఎప్పుడూ మేం క్రికెట్ ఆడేది కరణంగారి పొలం. ఎవరికీ ఇబ్బంది లేని ప్రదేశం అప్పుడప్పుడూ పాములకు తప్ప.. అది కుదరకపోతే సుబ్బయ్య గారి ఇంటి ప్రక్కన..

కాకపోతే అది చాలా ప్రమాదకరం. క్రికెట్ కాదు, ఆ స్థలం...!

ఒకవేళ బంతి పొరపాటున అవతలిగట్టు దాటి సుబ్బయ్య ఇంట్లో పడిందా!! ఇంక అంతే సంగతులు బూతు పురాణం మొదలు. అవి మాకు అర్థం కానివి, కొత్తగా అనిపించేవి. ఇంకా అంతా అయ్యాక సందీప్ గాడి వెక్కిలి చేష్టలు సుబ్బయ్యను వెక్కిరిస్తూ... ఒక మొత్తకమ్మ తీస్కుని సుబ్బయ్య మా మీద యుద్ధానికి రావడం మేము పరుగులంకించటం పరిపాటి. క్రికెట్‌తో పాటు ఇవన్నీ ఆటలే........

"అభి! అభి! స్కూల్‌కి టైమైంది లేరా"

"ఊ..... లేస్తానమ్మా... అప్పుడేనా"

ఈ అమ్మ ఎప్పుడు లేస్తుంది! అసలు పడుకుంటుందా! అమ్మకన్నా త్వరగా లేద్దామని ఎన్నిసార్లు ప్రయత్నించినా అది నావల్ల కాని పని. కానీ ఎప్పటికైనా ఆ కోరికను జయించాలి.

అంతా రెడీ అయ్యాక అమ్మ పెట్టే రెండు చద్దన్నంముద్దలు తినడం, స్కూలుకి వెళ్లడం...

రోజూ చద్దన్నం, స్కూలూ రెండూ విసుగే... మాదో పెద్ద స్కూలు కాని బయట కాన్వెంటులో చదివే వాళ్ళందరూ దుంపల బడి అని ఎక్కిరిస్తుంటారు.

ఎప్పటి శనివారంలాగే నేను, అబ్దుల్ ఈసారి అసెంబ్లీని ఎగ్గొడదాం అనే కృతనిశ్చయంతో ఉన్నాం. కానీ మా చిన్న తెలుగు మాష్టారు అదో టైపు...

మొన్న ఎవరో అన్నారట 6వ తరగతి పిల్లలకి క్రమశిక్షణ లేదని అప్పటి నుంచి మమ్మల్ని ఊక దంపుడు దంపుతున్నాడు. అందుకని అసెంబ్లీకి వెళ్లక తప్పలేదు.

"అరేయ్ అబ్దుల్ మొదటి పీరియడ్ ఎవరురా??"

"ఎవరైతే మనకేంటి జాగ్రత్తగా మనం జారుకుందాం పద" అన్నాడు అబ్దుల్.

మేమిద్దరం ఇక ఎక్కడికి వెళ్లి ఆడుకోవాలో తెలియక పెదకాపు గారి పొలంలోని దయ్యాలశాలకి వెళ్లాం. దయ్యాలశాల అని అందరూ అంటూంటే వినడం తప్ప మేం రావడం కూడా ఇదే మొదటిసారి.

దెయ్యం సినిమాలో కోటలా ఉంది ఆ బంగ్లా... దాంట్లో ఇది వరకు పెదకాపు గారి తాతగారు వాళ్లు ఉండేవారని కానీ ఆయన చనిపోయాక ఆ ఇంట్లో వాళ్లందరూ మనశ్శాంతిగా ఉండలేక ఇంకో ఇంటికి మారారని మా తాత చెప్తే విన్నాను. "అయినా చనిపోవడమేమిటి????" ఇప్పటికీ నాకు అదో 10 మార్కులు ప్రశ్నే... ఎవరినైనా అడిగితే చిన్నపిల్లాడివి ఇవన్నీ నీకెందుకు అంటారు. అన్నీ చెప్పే మా తాత కూడా చనిపోవడమంటే దేవుడు దగ్గరకు వెళ్లి ఆడుకోవడమంటాడు.

అబ్దుల్‌గాడు కూడా భయపడుతూనే ఉన్నాడు. ఆ బంగ్లాలోకి వెళ్దామా వద్దా అనే సంశయంతోనే బయట గడిపేశాం.. సాయంత్రం అయ్యిందని ఇంటికి బయలుదేరాం.

"అభి మళ్ళీ కలుద్దాం. ఏదైనా తినేసి వస్తాను. నీకూ పట్టుకొస్తానులే"...

సరే అని చెప్పి నేను సరాసరి ఇంట్లోకి వెళ్లి డబ్బాలని వెతకడం మొదలుపెట్టాను. మొన్న అమ్మ చేసిన జంతికల ముక్కలు ఎక్కడైనా కనిపిస్తాయేమోనని. నేను రావడం గమనించని మా అమ్మ అప్పుడే కిందపడిన డబ్బా సౌండుకి నన్ను చూసింది. చూడగానే అదేమిటో మరి!! మొత్తకమ్మ తీసుకుని "వెధవ లంబ్డీకి స్కూలుకి వెళ్లకుండా వెధవ తిరుగుళ్లు తిరుగుతావా? నీకు ఇవ్వాళ బడితపూజే" అని మీదకు పరిగెట్టింది.

నేను పరిగెట్టడంలో ఫస్ట్, అమ్మ చితకబాదడంలో ఫస్ట్. ఎవరు గెలుస్తారో తెలియదు గానీ నేను మాత్రం పరుగు లంకించాను. కానీ రాత్రయినా ఇంటికి రాకపోతానా అని మా అమ్మ ఆశ. నేను తాయారమ్మ గారి పాకలో దాక్కోవడం మా అమ్మ చూడలేదు. పెద్దవాళ్లకు చీటికీ మాటికీ చిన్నపిల్లలను కొట్టడం సరదా అయిపోతోంది.

మొన్నటికి మొన్న మా ఇంగ్లీష్ మాష్టారు... తన సబ్జెక్టులో 60 వచ్చిందని... తెలుగులో 90 వచ్చిందని తిడుతూ మరీ కొట్టారు. ఆయన బాధ నాకర్థం కానిది. తెలుగులో 90 వచ్చినందుకు కొట్టారో?? లేక ఇంగ్లీష్‌లో 60 వచ్చినందుకు కొట్టారో?? ఏ సబ్జెక్టు పెద్దగా చదవకూడదని నిర్ణయాన్ని తీసుకున్నాను.

ఇంతలో అబ్దుల్‌గాడు కూడా జతకలిసాడు. వాడికి ఇంట్లో ఇప్పుడే పూజ అయిందట. రెండు మూడు వాతలు గట్టిగానే కనబడుతున్నాయి. ఇక అక్కడనుండి బయటపడి ఊరి చివర వెంకటేశ్వరస్వామి గుడికి పరిగెట్టాం. అదో ప్రశాంతమైన చోటు... చుట్టూ చేలతో కొబ్బరిచెట్లతో నిండి ఉంటుంది. గుడి దగ్గర పూజారి పెరుమాళ్లు గారు తప్ప ఇంకెవరూ ఉండరు.

ఆయన మమ్మల్ని చూసి "ఏరా ఏ వెధవ పనిచేసి ఇక్కడికి వచ్చారు" అని గంభీరంగా అరిచారు. ఈయన ఏ వెధవ పనిచేసి ఇక్కడికి వచ్చి ఉంటాడా అని ఆలోచించి నవ్వుకుని వెంటనే అక్కడనుండి తోటల్లోకి జారుకున్నాం.

"అసలే చీకటి పడుతుందిరా అబ్దుల్ ఇక్కడ నల్లత్రాచు తిరుగుతుందట మనం పోదాం" అన్నాను భయం నిండిన గొంతుతో.

"వెళ్దాంలే! అదిగో అబ్బయ్య గారి తోటకెళ్లి చిన్న ఉసిరికాయలు కోసుకుని వెళ్దాం తినడానికి రుచిగా వుంటుంది" అన్నాడు అసలు భయం లేకుండా...

అబ్దుల్‌గాడికి భయమే ఉండదా... వాడు మొండోడు అని తెలుసు కానీ ఇంత మొండోడు అని అనుకోలేదు. వాడి దగ్గర నుండి నాకు కొంచెం ధైర్యం వచ్చింది అనుకుంటా.

"అరే అబ్దుల్ ఎక్కవ వద్దురా కొన్నే కొయ్యి. జాగ్రత్త... ఆ పున్నయ్య చూసాడంటే మనిద్దరి పనీ అంతే" అన్నాను భయపడుతూ...

"ప్రతి దానికి భయపడతావేంట్రా... వాడు ఇప్పుడు ఎందుకొస్తాడు ఇక్కడికి... ఇంకా చీకటి పడలేదు కదా" అన్నాడు చాలా నమ్మకంగా.

పుట్నాల పున్నయ్య తోట కాపలా మనిషి. అబ్బయ్య గారి తోటలన్నీ వాడే చూస్తాడు.

గుబురైన మీసాలు, చేతిలో కర్ర, గల్ల లుంగీ తెల్ల తువ్వాలు చూడ్డానికి ఎన్టీవోడు సినిమాలో విలన్‌లా ఉంటాడు. వాడికో వందేళ్లు. వాడి గురించి తలచుకుంటున్నామో లేదో వాడే ప్రత్యక్షమయ్యాడు.

"ఎవర్రా అక్కడ" అనే గంభీరమైన అరుపుతో మేమిద్దరం ఉలిక్కిపడి మా పరుగు ప్రారంభించాం. అక్కడి నుండి తిన్నగా చిన్న చెరువు గట్టుకు వెళ్లి చిన్న ఉసిరికాయలు తిని ఇంటికి వెళ్ళాం. మా ఇంటి ముందు ఎద్దుల బండి ఆగి వుంది. "ఎవరు వచ్చి ఉంటారా??" అని ఆలోచించాను. ఈరోజు నాకు దెబ్బలు తప్పుతాయి అనుకున్నాను. ఎవరైనా చుట్టాలు, బయటవాళ్లు వచ్చినప్పుడు సాధారణంగా తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలను కొట్టరు. కానీ మా అమ్మ తన పెద్ద కళ్లతో ఎప్పుడు కొడదామా అనేంతలా చూస్తుంది వాళ్ల ముందు కూడా...కానీ కొట్టదు... ఇంతకీ వచ్చింది ఎవరో కాదు మావయ్య, అత్త, వాళ్ళ అమ్మాయి, నా మరదలు.

పక్క ఊర్లో మా అత్త మేనమామ కూతురు పెళ్లంటే వచ్చారంట.

మా మావయ్య వాళ్లది రాజమండ్రి దగ్గర బొబ్బర్లంక. ఊరు పేరు మాత్రమే తెలుసు, దారి తెలియదు.

ఇంట్లో విందు భోజనం అనుకుంటూనే ఉన్నాను. అలాగే వాసనలు కూడా చాలా బాగా వస్తున్నాయి. వంకాయ కొత్తిమీర కారం కూర అనుకుంటా. నాకిష్టమైనది.

"ఒరేయ్ అభి భోజనానికి రా మావయ్య వాళ్లతో పాటు తిందువు గాని" అంది అమ్మ కోపాన్ని మర్చిపోయి.

"వద్దమ్మా నువ్వు నోట్లో పెట్టు" అన్నాను.

అది విని పక పకా నవ్వుతుంది సహజ. సహజ మావయ్య కూతురు అందరూ దాన్ని నా పెళ్ళాం అని ఏడిపిస్తుంటారు. కానీ అదంటే నాకు భయం. మా అమ్మని చూసి నాన్న భయపడ్డట్టు...

ఆ నవ్వుకి కోపంతో కంచం వేసుకుని నేనే తినడం ప్రారంభించా. ప్రతి ఒక్కరికి ఇష్టమైన సమయం, పని ఇదే అనుకుంటా. చక్కగా కూర్చుని తినడం...

తినడం అయ్యాక రోజులాగే మా తాతగారి పక్కలో దూరిపోయాను.

"ఏరా అభి స్కూలుకి వెళ్లలేదా ఇవ్వాళ" అని అడిగాడు తాత. ఏం చెప్పాలో తెలియక మాట్లాడకుండానే ఉండిపోయా.

"సర్లే! ఆ రోజు కథ చెప్తాను విను".

"వద్దు తాత.... ఈరోజు మావయ్య వాళ్ళందరూ బయట కూర్చున్నారుగా నేనూ అక్కడ కూర్చుంటా అప్పుడే పడుకోను" అన్నాను గారంగా.

"సరే" అన్నాడు తాత.

అమ్మ, మావయ్య వాళ్లు ఏవేవో మాట్లాడుకుంటున్నారు. పెద్ద వాళ్ల మాటలు మాలాంటి చిన్న పిల్లలకు ఎప్పటికీ అర్థం కావు. అవి ఎప్పుడూ ఇంటి తగాదా గురించో, ఆస్తుల మధ్యో తిరుగుతూ ఉంటాయి. ఇవన్నీ మనకి అక్కర్లేని మాటలు అనుకుంటూ తాత పక్కన చేరాను. తాత చాలా మంచోడు... నాకే కాదు ఊర్లో వారందరికి కూడా... కొండుకుర్రులో మా తాత పేరు తెలియని వారు లేరు. మా తాత చక్కగా కథలు చెప్తాడు. అన్ని కథలు ఆయనకు కొట్టిన పిండి. ఊరి గురించి ఎన్నో విషయాలు చెప్తూ ఉంటాడు.

"ఇవన్నీ నీకు ఎలా తెలుసు తాతా??" అని నేనడిగితే "ఇవన్నీ నాకు మా తాత చెప్పాడు మా తాతకి వాళ్ల తాత చెప్పాడంట" అని అంటాడు.

"పొద్దున్నే బడికి వెళ్లాలి" అని మూలుగుతూనే పడుకున్నా.

పొద్దున్న లేచాక దేవుడు మొహమే చూడాలి. చేతి మీద 'ఓం' రాయాలి అని తాత చెప్పడం వల్ల అదే అలవాటయిపోయింది. రోజూ రోజూ స్కూలుకి వెళ్ళడమంటే చిరాకే... బహుశా అది చిరాకో, భయమో తెలీదు.

"అభి అభి!!" అబ్దుల్‌గాడి పిలుపు పొద్దు పొద్దునే... ఎప్పుడో పదింటికి స్కూలయితే వీడు సైకిలేసుకుంటూ 9.30కి రెడీ అయిపోతాడు. ఊర్లో ఉన్న స్కూలుకి ఎందుకు అంత కంగారో నాకు తెలియదు.

"వస్తున్నా" అని చెప్పి మావయ్య వాళ్ల దగ్గరికి వెళ్లి "స్కూలుకి వెళ్తున్నా మావయ్యా" అని కాళ్ల మీద పడ్డా. అదంతా వినయమని వాళ్ళందరి భ్రమ. ఇంతకీ మావయ్య ఇచ్చే ఐదుకో, పదికో నా నటన అని తెలియదు పాపం.

"బాగా చదువుకోరా" అని చేతిలో రూపాయి బిళ్ల పెట్టాడు.

మావయ్య ఎంత పిసినారోడు. కష్టపడి దణ్ణం పెడితే రూపాయి చేతిలో పెడతాడా అని అనుకున్నాను. పోనీ అనుకుని స్కూలుకి బయల్దేరా. ఎప్పటిలానే అసెంబ్లీ, తరువాత పీరియడ్లు... మొదటి పీరియడ్ చిన్న తెలుగు మాష్టారు..

నేను అన్నింటికల్లా బాగా చదివేది ఇదొక్కటే అనుకుంటా 'తెలుగు'. రెండో పీరియడ్ లెక్కలు. మాష్టారు వస్తూ రాగానే చెప్పడం మొదలుపెట్టాడు. ఆయన చెప్పడం మొదలు పెట్టాడో లేదో నాకు నిద్ర మొదలయ్యింది. పక్కన అబ్దుల్‌గాడు గిల్లుతూనే ఉన్నాడు. అయినా నిద్ర ఆగట్లేదు.

ఈయన మా అమ్మకంటే గొప్పవాడని అనుకున్నాను. మా అమ్మ నన్ను పడుకోబెట్టడానికి చాలా కష్టపడేదంట. ఈయన నాతో పాటూ ఇంకో పదిమంది పిల్లలను పడుకోబెడుతున్నాడు.

ఇన్ని జ్ఞాపకాలు కళ్లముందు కదులుతుండగానే దాని తెరదించుతున్నట్టు వినపడింది ఓ పిలుపు...

"మిమ్మల్ని అమ్మగారు అర్జంటుగా రమ్మన్నారయ్యా" అన్నాడు అబ్బులు.

"ఎందుకు?" అన్నాను సందేహంగా.

"రేపు మీ తాతయ్య గారి తద్దినం (వర్ధంతి) అంట కదండీ నన్ను బలుసుకూర తెమ్మన్నారు. మిమ్మల్ని సరుకులు తేవడానికి పిలిచారనుకుంటా"

"సరే!! నువ్వు వెళ్లు" అని ఇంటికి బయలుదేరాను. పొలంలోని చల్లగాలిని వదిలి వెళ్లాలనిపించడంలేదు. జ్ఞాపకాల దొంతర కూడా కదలనీయకుండా అడ్డుకుంటుంది. తప్పదు కదా... అనుకొని మెల్లగా అక్కడి నుండి కదిలాను. దారి పొడవునా అవే జ్ఞాపకాలు...

ఇంతలో సూరారపు సుబ్బయ్య గారి ఇంటి దగ్గర పెద్ద పెద్ద ఏడుపులు పెడబొబ్బలు విని జ్ఞాపకాల మైకం ఒక్కసారి వదిలింది. ఏంటా అని వెళ్లి చూస్తే సుబ్బయ్య గారి మనవడు ముక్కు పచ్చలారని పిల్లవాడిని పాము కరిచిందంటూ మంత్రవాది రావాలని ఎదురుచూస్తున్నారు. 21వ యుగంలో కూడా మంత్రవాది గురించి ఎదురు చూడడమేమిటి అనిపించింది. కానీ కొన్ని కొన్ని నమ్మక తప్పదేమో.. మంత్రవాది రానే వచ్చాడు. చూడడానికి మామూలుగానే ఉన్నాడు. గల్ల లుంగీ, పైన తువ్వాలు పాపం చాలా లేని వాడిలా ఉన్నాడు కూడా... పిల్లవాడికి కరిచిన చోట తాను

తెచ్చిన పసరు పూసాడు. అంతకు ముందే శరీరం మొత్తం విషం పాకకుండా కట్టిన కట్టు వల్ల ప్రమాదం తప్పిందని చెప్పాడు. కాసేపటికి పిల్లాడు మూలుగుతుండటంలో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇక అక్కడి నుండి బయలుదేరి ఇంటికి చేరుకున్నా. "ఏరా ఇంత లేటు కొంచెం త్వరగా రావచ్చు కదా... చాలా పనులున్నాయి" అంది అమ్మ.

"పొలం దగ్గర ప్రశాంతంగా ఉందని కూర్చున్నా అమ్మ. . ఇంతకీ రేపు తాత గారి వర్ధంతి అంట గదా.."

"అవునురా ఇది 14వ వర్ధంతి" అంది అమ్మ.

14 సం॥లు అయ్యింది తాతగారు చనిపోయి, నా అనుమానాలకి ఆలోచనలకి బీజం పడిన రోజు, సంవత్సరం అదే....... ఇలా ఆలోచనలు అన్నీ వర్తమానం నుంచి గతాన్ని స్పృశిస్తున్నాయి.

"ఒరేయ్ వినబడుతోందా" అన్న అమ్మ ఒక్క కేకతో ఒక్కసారి మళ్లీ మెలకువలోకి... నా పరధ్యానంతో అమ్మ చెప్పింది వినలేదు.

"మళ్ళీ ఒకసారి చెప్పమ్మా".. అన్నాను.

"నీ పరధ్యానంతో చచ్చిపోతున్నానురా. నోరు పడిపోతుంది. కాస్త వెంకడి కొట్టు దగ్గరికి వెళ్ళి సరుకులు తీసుకురా. మీ నాన్న లిస్ట్ ఇచ్చి వచ్చారు".

"సరే" అని నాన్నగారు ఎప్పుడూ పట్టుకెళ్ళే పెద్ద చేతి సంచిని పట్టుకుని బయలుదేరాను. ఎంత పనిలో పడ్డా అసలు ఆలోచనల వలయం నుంచి నా మనసు తప్పించుకోవడం లేదు. అవే జ్ఞాపకాలు నడుస్తున్నంత సేపు కూడా. ఇంతలో వెంకడి కొట్టు రానే వచ్చింది. అతను అప్పటికే అన్నీ సర్ది వుంచడంతో నా పని సులువైంది. ఏంటో ఇంట్లో ఎప్పుడూ పెద్దగా పనులు చేయని నేను ఆ సరుకులు తెచ్చినప్పటికి నీరసపడిపోయినట్టు నటించి పెరటి సావిట్లోకి వెళ్లిపోయా. ఇంకా ఏమైనా పనులు చెబుతారేమోనన్న భయంతో... పెరటి సావిట్లోని పడక కుర్చీలో వాలి కునుకు తీద్దామనుకుంటూనే ఆలోచనలో మునిగిపోయాను. చిన్నప్పుడు అవ్వతో గడిపిన నాలుగు రోజులు, బనగానపల్లి మునగానమ్మ తల్లి జాతర, అమ్మమ్మ ఇంట్లో సంక్రాంతి సంబరాలు అన్నీ మనసులో మెదులుతున్నాయి.

★ ★ ★

సంక్రాంతి సెలవులు దగ్గరకు వచ్చేస్తున్నాయి...

సెలవుల ముందు తరవాత స్కూలుకి వెళ్లడమంటే మహా చెడ్డ చిరాకు. కానీ సెలవులు ఇవ్వడానికి ఇంకా వారం రోజులు పైన సమయం ఉంది. కానీ తప్పదు స్కూలుకి వెళ్లాలి.

"అరేయ్ అభి!! ఆ ముసలావిడని చూడరా" అని చూపించాడు అబ్దుల్ స్కూలుకి వెళ్తుండగా.

ముసలావిడ కొంచెం ఒంగి నడుస్తోంది. చూడటానికి 90 ఏళ్ల పైనే ఉంటాయి. అయినా ఏవో కమ్మలు, దొలకలు మోసుకుంటూ వస్తోంది.

ఆవిడ బాధను చూడలేక "ఎక్కడికి తీసుకువెళ్లి పెట్టాలి అవ్వా... మేము సైకిల్ మీద తీసుకెళ్లి పెట్టేస్తాం" అన్నాం అవ్వతో.

"వద్దు బాబయ్యా" అంది చాలా జాలిగా.

"మీ ఇల్లు ఎక్కడ అవ్వా ఎప్పుడూ చూడలేదు నిన్ను ఈ ఊర్లో" అన్నాం కమ్మలను సైకిల్ మీద పెడుతూ.

"వెంకటేశ్వరస్వామి గుడి ప్రక్కన కొత్తగా గుడిస వేసారుగా బాబూ అక్కడ ఉంటున్నా"

"ఓహో ఆ గుడిసె నీదేనా... సరే ఎందుకు నీకింత కష్టం మీ అబ్బాయికో, మనవడికో చెప్పొచ్చుగా ఈ పనులన్నీ" అన్నాను.

"నాకు ఎవరూ లేరయ్యా ఏకాకిని. మా పెద్దబ్బాయీ, నేనూ హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. ఆడు కాస్తా మొన్న బస్సుకింద పడి సనిపోయాడు. నేనొక్కర్దాన్నే అయిపోయాను. ఆడుండలేక ఇదిగో మన ఊరు వచ్చేశాను. నా సిన్నప్పుడంతా ఇక్కడే గడిచింది." అంది కన్నీళ్లను తుడుచుకుంటూ.

"సరే అవ్వా! మేమిద్దరం నీ మనవళ్లాంటోళ్లం.. ఈరోజు నుంచీ అలా అనుకో" అన్నాడు అబ్దుల్.

"మా బాబే" అంది అవ్వ కళ్లల్లో ఆనందాన్ని నింపుకుంటూ.

కమ్మలన్నీ చిన్న పొయ్యి దగ్గర పెట్టాం. పాపం ఆవిన్ని చూస్తే జాలేసింది. ఒక్కర్తే ఉంటోంది. ఒక్కర్తే వండుకు తింటోంది. చూసేందుకు అమ్మా, నాన్నా

కూడా లేరంట. అంత పెద్దవారైతే అమ్మా, నాన్నా ఉండరని తెలిసింది కానీ ఎక్కడికి వెళ్ళిపోతారన్నదే..???

ఈవిడకు ఎలాగైనా సాయం చేయాలనిపించింది. స్కూలు అయిపోయాక రోజూ అవ్వ వాళ్లింటికి వెళ్లడం ఏదైనా పనులుంటే చేసి పెట్టడం ఈ రూపంలో మేమిద్దరం మా సాయాన్ని అందించాం. ఈ విషయంలో ఆ ఊర్లో ఉన్న పెద్దవాళ్ల కంటే మేమే నయం. ప్రపంచంలో ఇలాంటి పరిస్థితి వస్తే ఎలా బతుకుతారా అనిపించింది. అలా నాలుగు రోజులు గడిచాయి. ఇంకో మూడు రోజుల్లో సంక్రాంతి సెలవులు...

నేను అబ్దుల్‌గాడు అవ్వ వాళ్ల ఇంటికి బయల్దేరాం. కాకపోతే ఎప్పుడూ లేనిది ఆ గుడిసె ముందు చాలా మంది జనం పోగడ్డారు.

"ఏమైందిరా అబ్దుల్" అన్నాను అంతమంది జనాన్ని తోసుకుంటూ లోపలికి వెళ్లి చూసొచ్చిన అబ్దుల్‌గాడితో.

"అవ్వ చనిపోయిందంటరా" అన్నాడు ఏడుస్తూ.

"అంటే" అన్నాను అర్థం కాక.

"అంటే అవ్వ ఇకలేదు" అన్నాడు.

పాపం పిచ్చి అవ్వ మా ముగ్గురుది నాలుగు రోజుల బంధమే. అయితేనేం ఇట్టే కలిసిపోయాం. ఆ అవ్వను చూస్తే జాలి వేసింది. ఆ వయసులోనూ అన్ని పనులూ తానే చేసుకునేది. చేతికందిన కొడుకు పోయాడే అని మా దగ్గర ఏడ్చేది.

ఆ అవ్వను తీసుకెళ్లిపోతున్నారు. దూరం నుంచే ఇదంతా మేం గమనిస్తున్నాం. ఇద్దరి కంట్లోనూ కన్నీళ్లు ఆగట్లేదు. ఏ మాష్టారు కొట్టినా ఇంతలా ఏడ్వలేదనిపించింది. ఇద్దరం వెక్కి వెక్కి ఏడ్చాం. ప్రపంచంలో ఏ బంధాలూ శాశ్వతం కాదని మాకు తెలీలేదు. చిన్న పిల్లలకు బంధాలను పెంచుకోవడమే తప్ప తెంచుకోవడం తెలీదు. ఈ విషయమే తాతయ్యకు చెప్పి ఏడ్చేశాను. తను వాళ్లబ్బాయి దగ్గరికి వెళ్లిపోయింది అని చెప్పాడు. అవును నాలుగు రోజుల పరిచయానికి మా దగ్గర ఉండిపోవడం సరికాదనిపించింది.

ఇంతలో "ఒరేయ్ బనగానపల్లి వస్తావా" అంది అత్త.

"చిన్నత్తా వాళ్ల ఇంటికా వస్తాను" అన్నాను.

"అయితే వెళ్లి మీ అమ్మకు చెప్పి బట్టలు సర్దించుకో" అంది.

సెలవులకి మూడు రోజుల ముందే స్కూలు ఎగ్గొట్టడం చాలా ఆనందమనిపించింది. అదీ ఇంట్లో వాళ్ల పర్మిషన్‌తో... బనగానపల్లికి చేరుకున్నాం. దారిలో పడుకోవడం వల్ల అసలు ఎలా ఊరికి చేరుకున్నానో తెలీనేలేదు.

ఊరంతా సందడిగా కనిపిస్తుంది. ప్రతి ఇంటికి పచ్చని తోరణాలు కట్టి ఉన్నాయి. అదేంటో అందరి ఇంట్లోనూ పెళ్లా అనుకున్నాను. మా ఇంట్లో పెళ్లి అయితేనే తోరణాలు కడతారు. ఇదే విషయాన్ని పెద్దత్తకు చెప్తే "రేపు వీళ్ల ఊరి జాతరరా ఎల్లుండి తీర్థం" అంది. మునగానమ్మ తల్లి జాతరంట చుట్టు ప్రక్కల ఊర్ల నుంచీ కూడా చాలా మంది వస్తారని.. అసలు ఇసకేస్తే రాలని జనం ఉంటారని, జాగ్రత్తగా ఉండమని, లేకపోతే తప్పిపోతావని చెప్పింది చిన్నత్త. నేను తప్పిపోవడమా అనుకుని ఒక్కసారి నాకు నేను తప్పిపోకుండా కొన్ని గుర్తులను సిద్ధం చేసుకున్నాను.

అత్త వాళ్ల ఇంటి ఎదురుగా నరసింహస్వామి గుడి ఉంటుంది అని ఒక గుర్తు పెట్టుకున్నాను. ఇంకా నరసింహస్వామి గుడి ఎదురుగా అత్త వాళ్ల ఇల్లు ఉంటుంది అని ఇంకో గుర్తు పెట్టుకున్నాను. మొత్తానికి ఇలా గుర్తులు పెట్టుకుని తప్పిపోకూడదని నిశ్చయించుకున్నాను.

తెల్లారింది... ఎక్కడ చూసినా డప్పులతో మారు మ్రోగుతోంది ఊరంతా... అందరూ నైవేధ్యాలు సిద్ధం చేసుకుంటున్నారు. అందరింట్లో పిండి వంటల వాసనలు అదిరిపోతున్నాయి.

ఈ పండగల వల్ల ఇదే ఉపయోగం అనిపించింది. ఇష్టమైనవి వండుకొని తినడం. ఉండే కొద్దీ జనం ఎక్కువయ్యారు. ఊరంతా జనాలతో నిండిపోయింది. నిన్న సాయంత్రానికి చిన్నత్త వాళ్ల ఇంట్లోంచి గుడి స్పష్టంగా కనబడేది. కానీ ఇప్పుడు జనాలు తప్ప ఇంకెవరూ కనిపించట్లేదు.

అమ్మా, నేను, అత్త, వదిన అందరం రాంబాబు మావయ్య ఇంటికి వెళ్లాం. చిన్నత్త వాళ్ల ఇంటి దగ్గర నుంచి రెండడుగులు వేస్తే రాంబాబు మావయ్య వాళ్ల ఇల్లు. చూడటానికి చాలా పురాతన కట్టడంలా ఉంటుంది. ఆ ఇంటి ముందు కూడా జనం చాలా మంది ఉన్నారు. అసలు అర్థం కాని విషయం ఇదే... ఈ ఇంటి ముందే ఎందుకు ఇంతమంది జనం అనిపించింది.

రాంబాబు మావయ్య, ఆయన గురించి చెప్పాలంటే చిన్న పిల్లలందరం గడ్డం మావయ్య అని పిలుస్తాం. స్వామీజీ లాంటి పొడవాటి గడ్డం, నెత్తి మీద క్రికెట్ గ్రౌండ్ లాంటి బట్టతల. చూడటానికి గంభీరంగా కనిపించినా చాలా సరదా మనిషి. అంటే నాతో ఎప్పుడూ సరదాగా ఉంటాడు. రాంబాబు మావయ్య బిందెడు నీళ్లను బయట పెట్టాడు. అందరూ ఏవో పనుల్లో బిజీగా ఉన్నారు.

ఆ బిందెడు నీళ్లు ఏంటా అని చూసాను. అవి పసుపు నీళ్లు అసలెందుకు బయటకు తెచ్చారనేదే పెద్ద ప్రశ్న. ఇంతలో బుల్లోడు పెద్దమ్మ అంటే బుల్లోడు పెదనాన్న పెళ్లాం అన్నమాట. పెద్దమ్మను నలుగురు భుజాన వేసుకుని తీసుకు వస్తున్నారు. మామూలుగా పెద్దమ్మను ఇద్దరు మోస్తారు. కానీ ఇప్పుడు నలుగురు మోస్తున్నారు. అందులోనూ పెద్దమ్మ "ఊఊఊఊ" అని అరుస్తోంది. అలా ఎందుకు అరుస్తోందో నాకు అర్థం కాలేదు.

పెద్దమ్మను క్రింద కూర్చోపెట్టేటప్పటికి "దండాలు తల్లి దండాలు" అని కాళ్లకు మొక్కడం ఆరంభించారు అక్కడ వాళ్లంతా... మామూలుగా నాకు తెలిసినంత వరకు బుల్లోడు పెదనాన్న ఒక్కరే కాళ్లకు మొక్కడం చూసాను. అదీ వాళ్ల బెడ్‌రూంలో... ఆ రోజు పెద్దమ్మ, పెదనాన్న గొడవ పడ్డారు మరి...

అమ్మ నన్ను కొబ్బరికాయ పచ్చడి పట్టికెళ్లి ఇమ్మన్నప్పుడు నాకు ఈ సీన్ కనిపించింది. కానీ ఇంతమంది కాళ్ల మీద పడటం విచిత్రంగా తోచింది.

మా అమ్మ "మునగానమ్మ తల్లికి దణ్ణం పెట్టుకో" అని ఆవిడ కాళ్ల ముందుకు తోసింది. ఆవిడేంటి మునగానమ్మ తల్లి ఏంటి పెద్దమ్మ కాదా అనుకున్నాను. ఇంతలో ఆవిడ అంటే మునగానమ్మతల్లి నా భుజం మీద చేయి వేసి "ఊఊఊఊ" అంటోంది. మా అమ్మని అనాలి. అసలు అనవసరంగా ముందుకు తోసింది అనుకున్నాను.

"ఒరేయ్!! నాకు అంబలి కావాలి రా, అంబలి కావాలి" అని గట్టిగా అరిచింది. ఆ అరుపుకి నా గుండె ఆగినంత పనయ్యింది. అందులోనూ ఆవిడ కిందే నేనుండటం ఆవిడ చెయ్యి నా భుజం మీద ఉండటం వల్ల నాకు ఎటూ పాల్పోలేదు.

వెంటనే అంబలి ముంత ఇవ్వడంతో అది తీసుకునేందుకు చేయి తీయడంతో అక్కడి నుంచీ జారుకున్నాను.

"హమ్మయ్యా" అని ఊపిరి పీల్చుకుని. ఈ తంతు అస్సలు అర్థం కాక "ఇదంతా ఏంటి?" అని అడిగాను అక్కడున్న చిన్నత్తను.

"మునగానమ్మ తల్లి వాలిందిరా పెద్దమ్మ మీద... దణ్ణం పెట్టుకున్నావా" అంది.

"హా" అని చెప్పి పెద్దమ్మను గమనించాను. పెద్దమ్మ ఇదివరకట్లా లేదు. కళ్లు పెద్దవి చేసి చూస్తోంది. ఇంతలో అక్కడున్న ఒకతను "ఈ ఏడు మా పొలాలు ఎలా ఉంటాయి తల్లీ" అని అడిగాడు. "బాగుంటాయిరా" అని చెప్పింది గంభీరమైన స్వరంతో. కొంచెం సేపయ్యేటప్పటికి ఆవిడ మూలుగు రెట్టింపయ్యింది "ఊఊఊ" అని.

"శాంతించు తల్లీ" అని రాంబాబు మావయ్య బయట పెట్టిన బిందెడు పసుపు నీళ్లు ఆవిడ మీద పోసాడు. అందరూ హారతులివ్వడం మొదలుపెట్టారు. కొందరు తమ చేతి మీద కర్పూరాలను వెలిగించుకున్నారు. పళ్లాలు తెచ్చుకోవడం మరిచిపోవడం వల్ల చేతిలోనే వెలిగించుకున్నారు అని అనుకున్నాను.

కొంతమంది వేపాకులను పట్టుకుని ఊగిపోతున్నారు. కొంతమంది పొట్టేళ్లకు వేపాకులు కట్టి తీసుకు వచ్చారు. అవి బలివ్వడానికంట. అలా ఒక మూగ జంతువుని బలివ్వడం బాధనిపించింది. "ఇది తప్పు" అని చెప్పాలనిపించింది కానీ నేను చిన్న పిల్లాడినాయే... నా మాట ఎవరూ పట్టించుకోరు. ఎలాగైతేనేం ఆ రాత్రి జాతర గరగ నృత్యాలతో, డప్పులతో అద్భుతంగా ముగిసింది. తరవాత రోజు తీర్థం... అమ్మని ఏం కొనమన్నా అది బాగుండదు ఇది బాగుండదు అని చివరికి రూపాయి బుడగ కొని పెట్టింది. అది కాస్తా రెండు సార్లు ఆడేటప్పటికి పేలిపోయింది.

"ఒరేయ్ త్వరగా పడుకో సంక్రాంతికి అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్లాలి కదా" అంది అమ్మ బట్టలన్నీ సర్దేస్తూ... ఎప్పటిలాగే సంక్రాంతి సెలవులకు మా అమ్మమ్మ గారింటికి బయలుదేరాం.

మా అమ్మమ్మ గారి ఊరు మొదేకుర్రు. ఇంకా చెప్పాలంటే మా అమ్మమ్మగారిది గోదావరి అవతల... మాది ఇవతల... దాటాలంటే ఒక పంటి, రెండు రూపాయల టిక్కెట్. పడవదాటాక గుర్రపు జట్కాలు వరుసగా వుండేవి. రేవు నుంచి ఊర్లోకి వెళ్లడానికి 5రు. ఇచ్చుకునేవాడు. మా అమ్మ గీసి గీసి 4రు. ఇచ్చేది. అందులోను నాకు తెల్ల గుర్రపు జట్కా బండిమీద వెళ్ళడమంటే భలే ఇష్టం. ఏటుగట్టు మీద గతుకులకు అనుకుంటా గుర్రపు జట్కా ఎప్పుడు ఎక్కినా పైకి కిందకి ఊగుతూ వుంటాను.

అమ్మమ్మ ఇల్లు... పెద్ద మండువా, పెద్ద పెరడు... ఆ పెరడులో ఉండే పెద్ద ఉసిరి చెట్టు. ఎంత పెద్ద ఇల్లైనా సంక్రాంతి వచ్చిందంటే ఎవరికి సరిపోయేది కాదు.

పగలంతా కాలువ పక్కనా బంకమట్టిలో కుర్చీలు చేయడం, మంచాలు ఇంకా చాలా... ఇవి ఎప్పటికి ఉపయోగపడవు అని తెలిసినా అదో ఆనందం... పగలు రాత్రి తేడా లేకుండా పెద్దోలందరు పేకాట.. మేమంతా హౌసీలు... అదంతా ఒక క్లబ్‌లా మారిపోయేది.

'37' నాకు రావలసిన నంబరు. ఆ నంబరు వస్తే నాకు 10 రూపాయలు వస్తాయి. అంటే ఫుల్ హౌసి అన్నమాట... అసలు హౌసిలో మిడిల్ లైన్, ఫస్ట్‌లైన్, జల్డీ 5, లాస్ట్‌లైన్, తరువాత ఫుల్‌హౌసీ... ఇన్ని ఉన్న నాకు ఎప్పుడు ఒక్కటీ తగల్లేదు. బహుశా టిక్కెట్టు ఒక్కటే తీసుకోవడం వల్ల అని నేను అనుకుంటూ ఉండేవాడిని. టిక్కెట్టు అర్థ రూపాయి అయినా మా అమ్మ, అక్కా ఒక్క టిక్కెట్టు తీయమనేవారు. అందరు మూడేసి, నాలుగేసి తీసుకుంటుంటే...

అందరి డబ్బులు కూడా నాకు రావాలని కోరుకునేవాడిని. ఎంత స్వార్థం నాకు... "ముప్పయి ముప్పయి" అని సంతోష్ గాడు ఊరిస్తూన్నాడు... అప్పటికే చాలా మంది హౌసికి కాచుకుని కూర్చున్నారు. నాకున్న ఉత్కంఠే ప్రతి ఒక్కరికి ఉంది. కాని అందరిలా నేను ఆపుకోలేక హౌసి అని అరిచాను. నా ఆశలను అడియాశలు చేస్తూ "ముప్పయి నాలుగు" అన్నాడు. నా అదృష్టం కొద్ది ఎవరు పలకలేదు ఆ నంబరుకు. ఈసారి కాస్త ఓపిక పడదామని యేమి మాట్లడకుండా ఉన్నాను.

వాడు "ముప్పయి... ముప్పయి" అని అరుస్తూనే ఉన్నాడు. వాడు నన్ను ఊరిస్తున్నాడని నాకు తెలుసు. నేను మాత్రం నా ఉద్వేగాన్ని, ఉత్కంఠను లోపలే దాచుకున్నాను.

వాడు "ముప్పయి ఏడు" అనగానే నా మొహంలో కాంతి, నవ్వు... ఆ సమయంలో ప్రపంచాన్ని జయించినంత సంతోషం. పది రూపాయలు, 20 ఐస్ పుల్లలు, 40 ఆశ చాక్లెట్‌లు, రెండు కోకోకోలా డ్రింక్‌లు.

ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు ఆ పది రూపాయలు సంపాదించిన ఆనందంలో మా అమ్మకు తీసుకెళ్లి చూపించాను. ప్రక్కనే ఉన్న మా నాన్న చూసి ఒక్క రూపాయి ఇచ్చి "ఆ పది రూపాయలు దేవుడికి వేసెయ్" అన్నాడు. "నాన్న ఇది నేను కష్టపడి సంపాదించిన డబ్బులు" అన్నాను.

"అభి కష్టపడటం అంటే కూర్చుని జూదం ఆడి సంపాదించడం కాదురా... నువ్వు చిన్నపిల్లవాడివి నీకేం అర్థంకాదు" అన్నాడు.

నాకేం అర్థం కాదు. ఎంత అరిచానో నాన్నకేం తెలుసు అని మనసులో అనుకుని "సరే" అన్నాను. నాన్న మీద ఉన్న గౌరవం అనుకుంటా ఎదురుచెప్పలేదు. నిజంగా నాన్నంటే గౌరవం, గౌరవం అంటే భయం కూడాను... అంటే నాన్న ఎప్పుడు నన్ను కొట్టరు, కనీసం నన్ను తిట్టరు కూడా... అయినా నాకు నాన్నంటే భయం అదే గౌరవం. ఆయన మాటకు ఎదురు చెప్పడం నాకు ఎప్పటికి ఇష్టం ఉండదు. నాన్న చెప్పినట్టు ఒక రూపాయి తీసుకుని పది రూపాయలు చంద్రరావు కొట్టు దాటాక వచ్చే అంజనేయ స్వామి గుళ్ళో వేసేశాను.

ఇంక భోగిరోజు ముందు రాత్రి అయితే అందరం రెండు ఇంటిదాక హాసిలు ఆడటం, ఆ తరువాత పిల్లలు మొత్తం పెద్ద ఇంటిదగ్గర నుండి చిన్న ఇంటికి వెళ్ళడం, పెద్ద ఇల్లు అంటే అమ్మమ్మ వాళ్ళ ఇల్లు. చిన్న ఇల్లు అంటే చిన్న అత్త వాళ్ల ఇల్లు. అందులో చిన్న మావయ్య వాళ్ళు ఉంటారన్నమాట. అది డాబా ఇల్లు కూడాను. ఆ తరువాత దుంగలు పేర్చి భోగి మంటలు వేయడం ఆటలు, పాటలు, కేరింతలు ఇలా రాత్రంతా తిరిగినా, పడుకోక పోయినా ప్రొద్దున్న 7.30 అయ్యేటప్పటికి టంచనుగా అందరు లేవాల్సిందే. పెద్దవాళ్ల మీద భయంతోను లేక మన సంప్రదాయాల మీద గౌరవంతోను కాదు 'టిఫిన్ కోసం'

అవును 'టిఫిన్ కోసం'...

సాధు టిఫిన్... ఈ పేరును వినని వాడు ఆ ఊళ్ళో ఉండడు. అందులోను వాడి చట్నీకి మంచి గిరాకి ఎక్కువ. ఎంత అంటే ఒక రొట్టికి ఐదు గరెట్లంత... నాకైతే మరీ ఇష్టం. చట్నీని రొట్టెలో నంజుకుని తినేవాడ్ని. నా లాయాలాస చూడలేక "బాబు నీకు రెండు రొట్టెలు ఎగస్ట్రా పంపిస్తాను... నువ్వు చట్నీ తాగమాకయ్యా" అనేవాడు.

పిచ్చివాడు నేను చట్నీ తాగడమేంటి... తాగడం అంటే గ్లాసులో పోసుకుని త్రాగుతారు. కాని నేను అలా చేయట్లేదు. అయినా నేను ఊరికే తినట్లేదు కదా. రొట్టెకి డబ్బులు, చట్నీకి కాదు అని మనసులో అనుకున్నాను. టిఫిన్ అవ్వడమే సరి ఇక అందరం అటు నుంచి అటు శివాలయం వెనుక ఉన్న బాబూరావు గారి పొల్లాల్లోకి పరిగెత్తడం..

అక్కడ చాలా ప్రశాంతంగా ఉంటుంది... పచ్చని పైర్లు... కొబ్బరి చెట్లు... పంపుచేసే ఒక మోటరు ఇంజను... సన్నని కాలువ ఆ నీళ్లను పంపించడానికి...

అందులోను మంచుతెర సరిగ్గా తొలగకపోవడం వల్ల 8.30 అయినా సూర్యుడు ఇంకా బద్ధకంగానే ఉండటంవల్ల ఆ ప్రదేశం చాలా అందంగా కనిపిస్తోంది...

"ఒరేయ్ అభి! ఇదిగోరా బొండం. దీన్ని పగలుకొడితే కొబ్బరి నీళ్ళు త్రాగొచ్చు" అంది లావణ్య.

"పిచ్చి ముండ! బొండానికి, ఊటపుచ్చుకి అస్సలు తేడా తెలియదు. ఈ పట్నం వాళ్లు ఎలా బతుకుతారా??" అని మనసులో అనుకున్నాను. దానికి ఎంత చెప్పినా వినిపించుకోకుండా పగలుకొట్టి ఇమ్మంది.

లావణ్య మా మూడో మావయ్య పెద్ద కూతురు. అది హైదరాబాద్‌లో పెరుగుతుండటం వల్ల దానికి ఊటపుచ్చుకి, కొబ్బరి బొండానికీ తేడాయే తెలియట్లేదు. అది చెప్పిన ప్రకారం హైదరాబాద్‌లో బొండాలన్నీ ఈ సైజ్‌లోనే ఉంటాయట. రోడ్డు ప్రక్కన అమ్ముతారని చెప్పింది. దీన్ని బట్టి అక్కడ అసలు కొబ్బరి చెట్లు అనేవి ఉండవు అనుకున్నాను."మరి ఎంత తీసుకుంటాడు ఒక బొండం తాగడానికి" అని అడిగాను.

"5/-" అంది..

"ఐదు రూపాయలా! ఇదిగో ఇప్పుడే దీన్ని పగలగొట్టి ఇస్తాను. నువ్వు మీ నాన్నను అడిగి నాకో రూపాయివ్వు చాలు" అన్నాను.

మొదట కాదూ కూడదు అన్నా తర్వాత దాన్ని తాగాలనే కోరికతో "సరే" అంది. కోనసీమలో ఊటపుచ్చును రూపాయికి అమ్మిన ఘనత నాకే దక్కుతుందని మనసులో మురిసిపోయాను.

"బాగుంది బొండం.." అంది తాగాక.

"మరేమనుకున్నావు కోనసీమ బొండం అంటే" అన్నాను నవ్వుతూ.

పిచ్చిది... పొద్దున ఉన్న మంచుకి అది ఇంకా అలా చల్లగా ఉండొచ్చు... దానిని ఊటపుచ్చు అని అనలేం కాని కాస్తో కూస్తో తయారవుతున్న కాయ కాబట్టి కాస్త తియ్యగా ఉండవచ్చు అనుకుని మేం ఆగిపోయిన చోటు నుండి బయలుదేరాం. అందరూ దూరంగా ఉన్న నిమ్మతోటలో కనబడుతున్నారు. అమ్మ, అమ్మమ్మ, మావయ్యలు అందరూ అక్కడకు వెళ్లొద్దని వారిస్తూ ఉంటారు. కానీ కోతిమూక అక్కడే ఉంది. మాకు భయంగానే ఉన్నా వారందరూ ఉన్నారనే ధైర్యంతో అక్కడకు వెళ్లాం.

"ఇక్కడకు వెళ్లొద్దని అమ్మమ్మ, మావయ్య వాళ్లు అంటూంటారుగా" అని నా భయాన్ని పెద్దన్నయ్యతో చెప్పా.

పెద్దన్నయ్య అంటే మా అమ్మ పెద్దక్క పెద్దకొడుకన్నమాట. అందరు 'బుజ్జి' అని పిలుస్తారు.అన్ని పెద్దలు ఉన్నవాడిని బుజ్జి అని పిలవడమేంటి? నా బొంద...

"వాళ్ళు అలాగే చెప్తారు రా సొందు నీకేం తెలియదు. ఇందా ఈ మామిడికాయ ముక్క తిను" అన్నాడు బుజ్జి అన్న.

మామిడికాయ ముక్క చాలా బాగుంది కాని నన్ను సొందు అనడం అస్సలు బాలేదు. నన్ను అన్నయ్యలు అందరూ అలాగే పిలుస్తారు. "ఎందుకలా పిలుస్తారు" అంటే అందిరిలోకి నేను చిన్నవాడినట.

పేరుకి నిమ్మతోట కాని అసలు నిమ్మచెట్లు ఎక్కడా లేవు. ఒకప్పుడు ఉండేవి అని చిన్నబావ చెప్పాడు. ఎక్కడి నుంచి కొట్టుకొచ్చిందో జానకి పెద్ద నారింజకాయలను పట్టుకొచ్చింది. జానకి అంటే మా పెద్ద మావయ్య కూతురు. అందరు పుల్లలను తీసుకోని చిన్న చిన్న ముక్కలుగా చేశారు. ఎందుకో నాకర్థం కాలేదు.

ఇక అందరం నిమ్మతోట నుంచి ఇంటికి వెళ్ళి పురిదిమ్మ మీద మీటింగ్ వేశాం. నారింజకాయలను తినడానికి ఉప్పు, కారం కావాలని. కోయడానికి చాకు కావాలని తీర్మానించాం. చాకు దొంగిలించుకురావడానికి "నేను సిద్ధం" అని ప్రకటించా. అబ్దుల్‌గాడితో పెన్నులు దొంగిలించిన అనుభవంతో ఈ పని చాలా సులువుగా చేయగలనని నా అతి నమ్మకం. కాని అది అంత సులువు కాదని చెప్పాడు చిన బావ. ఎందుకంటే అమ్మమ్మ అక్కడే తచ్చాడుతూ ఉంటుంది. అమ్మమ్మకి వంటిల్లు తప్ప మరో ప్రపంచం లేదు. ఎలాగైనా అమ్మమ్మ కన్ను మరల్చాలి. ఆ పని తను చూసుకుంటానని వైష్ణవి చెప్పింది. అమ్మమ్మ ఎప్పటిలాగే ఏదో పనిలో ఉంది. కొబ్బరికాయ మామిడికాయ పచ్చడికి కావలసిన కొబ్బరిని తురుముతోంది. అక్కడున్న సామాన్ల ద్వారా కొబ్బరికాయ, మామిడికాయ పచ్చడి అని నేను అనుకున్నాను. అది నాకు చాలా ఇష్టమైన పచ్చడి. ఎంత ఇష్టం అంటే మా మావయ్య వాళ్ల అమ్మాయిని చేసుకోవడానికి దానంత బరువు గల పచ్చడి కావాలని చెప్పేసా.

అమ్మమ్మని కదపడానికి మా ప్రయత్నాలు సిద్ధంగా ఉన్నాయి. వైష్ణవి వంటిల్లు ముందు గదిలోకి వచ్చి "అమ్మమ్మా ఒకసారి ఇలా రా!" అంది. వంటిల్లుకు రెండు

తలుపులు ఒక్కటి ఇప్పుడు వైష్ణవి పిలిచింది. ఇంకోటి పెరటి వైపుకి దారి తీస్తొంది, నేను పెరటివైపు తలుపు దగ్గర కాచుకుని ఉన్నా.

అమ్మమ్మ అటు వెళ్ళగానే... నేను రెండో అరలో ఉన్న చాకు తీసుకుని బయటకు వచ్చేశా. చిన్న అమ్మమ్మ వంటగదిలోంచి ఉప్పుకారం తీసుకొచ్చింది అపర్ణ... వైష్ణవి మా మూడో మావయ్య రెండో కూతురు అయితే... అపర్ణ చింతలపల్లి పెద్దమ్మ కూతురు అంటే మా చింతాత గారి మనవరాలు అన్నమాట. సరంజామా మొత్తం సిద్ధమైంది.

అపర్ణ నారింజకాయలను కోస్తే, వైష్ణవి ఉప్పు కారం రాసి అందరికి ఇచ్చింది. ఇందాకటి పచ్చి ఈని పుల్లలు ఎందుకో ఇప్పుడు అర్థమైంది. పచ్చి ఈని పుల్లలో నారింజకాయ రసాన్ని తింటుంటే... ఉప్పు కారం రాయడంవల్ల పులుపుకి తోడు అవడంతో నాలికకు ఒక్క కొత్త రకమైన టేస్టు ఏర్పడింది. అంతా అయ్యాక మళ్ళీ ఒకసారి మీటింగు వేసుకొని... కాలవగట్టు స్నానాలకు బయలుదేరాం... అప్పటికే 12.30 అయిపోయింది. ఈత వచ్చినవాళ్ళు ఇవతల గట్టునుంచి అవతల గట్టుదాకా వెళ్ళేవారు. అందులోను మా పెదబావ అయితే మరీను, ఈతలోను రకాలున్నాయట. మునుగు ఈత, శవాసనం, చెంబు ఈత... నాకు అసలు ఈత రాకపోయినా శవం ఈత అంటే చాలా ఇష్టం... మనిషి ఊపిరి పీల్చుకోకుండా శవంలా అలా గోదారిలో తేలిపోతుంటాడు.

ఆ ఈతలో మా అమ్మ దిట్ట... మా అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో అందరికి ఈతవచ్చు. ఒకరకంగా చెప్పాలంటే గజ ఈతగాళ్ళన్న మాట.. అది ఉన్నమాట. కాని అందులో మా తరం వెనుకబడింది... మా పెదబావ, పెద్ద అన్నయ్య ఇలా వేళ్ళ మీద లెక్కించి చెప్పొచ్చు. వారికి తప్ప మిగతావారెవరికి ఈతరాదని... వారిలో నేను ఒక్కడిని.

“అరేయ్ పిల్లలూ!” అని చింతలపల్లి పెద్దమ్మ పిలుస్తోంది. పిలవడం కాదు అరుస్తోంది, అరవడానికి పిలవడానికి మా పెద్దమ్మ దృష్టిలో పెద్ద తేడా లేదు. “భోజనానికి రండ్రా! వేళయ్యింది” అని బతిమాలుతోంది. ఈ రోజుకింక చాలు అనుకుని అందరం భోజనానికి బయలుదేరాం. రకరకాల పిండివంటల వాసనలు పెరటి సావిడ దాకా వస్తున్నాయి. అందరం ఆకుల ముందర కూర్చుంటూనే లొట్టలు వేయడం ఆరంభించాం.

ముద్దపప్పు, ఆనపకాయ మజ్జిగపులుసు, వంకాయ కొత్తిమీర కారం కూర, మామిడల్లం పచ్చడిముక్కలు, కొబ్బరికాయ మామిడికాయ పచ్చడి, బొబ్బట్లు,

పులిహోర అన్నింటిని తినేద్దాం అనే ఆనందం నాది... పప్పులోకి మామిడల్లం పచ్చడి ముక్కలు నంచితే చాలా బాగుంటుందని మా రెండో మావయ్య అరచి మరి చెప్తున్నాడు. “అద్భుతం! నిజంగా చాలా బాగుంది” అని అనుకున్నాను.

అసలు ఈ ఆడవాళ్ళు ఇన్ని వంటలు ఎలా కనిపెట్టారా అనేది ఒక విచిత్రం అయితే...! మగవాళ్లు వాటిని ఎలా తినాలో చెప్పడం మరీ విచిత్రం. తిన్న వెంటనే ఎవరు కదలలేని స్థితిలో ఉన్నారు. అంత తిన్నాం మరీ. ఇక అందరం ఒక కునుకు వేద్దామని నిర్ణయించుకుని లోపం లేకుండా దానిని అమలు చేశాం.

“ఆరు అవుతోంది అసలు సంధ్యవేళ అందరు లేవండ్రా” అని మూడో మావయ్య గద్దిస్తున్నాడు. అప్పటికి లేచిన వాళ్ళందరు మిరపకాయ బజ్జీలను నములుతూ ఉన్నారు. నేను రెండు బజ్జీలను తిని నాలుగు గ్లాసులు మంచి నీళ్ళు త్రాగి, వీధి వాకిట్లో అందరూ కుర్చోవడంతో నేను అక్కడే సెటిలయ్యా.

అప్పటిదాకా అంతా బాగానే ఉంది. అందరూ మాట్లాడుతున్నారు, నవ్వుతున్నారు, కేరింతలు కొడుతున్నారు. అంతలో జానకి పిచ్చి పట్టినదానిలా ఏడ్వడం మొదలు పెట్టింది. ఒక్కసారి పిల్లలందరం భయపడ్డాం. ఎప్పుడూ లేనంతగా దాని కళ్ళు ఎర్రబడ్డాయి. ఇంతలో అక్కడున్న నాగులమ్మమ్మ దానిని చూసి పరిగెట్టుకుని వెళ్లి మా అమ్మమ్మను తీసుకొచ్చింది. అమ్మమ్మ వస్తూనే “లంజముండ నీ పేరేంటి చెప్పు?” అని జుట్టు పట్టుకుంది. ఈ తంతు అసలు అక్కడున్న మాకెవ్వరికి అర్థంకాలేదు. కాని భయం వేసింది.

జానకి గింజుకొంటోంది, అరుస్తోంది, ఏడుస్తోంది, ఏవేవో మాట్లాడుతోంది. అక్కడున్న పెద్దమావయ్య చెప్పు తీసుకునివచ్చి కొట్టడం ప్రారంభించాడు. చిన్న అమ్మమ్మ నిప్పులు పెట్టింది. అమ్మమ్మ అడుగుతూనే ఉంది.” చెప్పు.. పేరు చెప్పు ఎందుకొచ్చావ్??” అని..

ఇంతలో గాద్గదస్వరంతో ఒక వింత సమాధానం “నా పేరు స్వర్ణ” అంది జానకి. ఈ విషయం చూసిన మాకందరికీ గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రక్కనుంచి బుజ్జి అన్నయ్య “దెయ్యం అంట దెయ్యం” అని ఇంకా జడిపిస్తున్నాడు. నా ఉష్ణోగ్రతయితే 108కి చేరుకుంది.

"ఎందుకొచ్చావ్" అని ఏడుస్తున్న, అరుస్తున్న జానకిని అదే జానకిలో ఉన్న దయ్యాన్ని అడిగింది అమ్మమ్మ. తను నారింజ చెట్టు మీద ఉన్నానని నారింజకాయలు కోయడానికి వచ్చినప్పుడు జానకి వెంటే వచ్చానని తనికిప్పుడు డ్రింక్ తాగాలనే కోరికగా ఉందని చెప్పింది. వెంటనే మూడో మావయ్య చంద్రావు కొట్టు నుంచి ఐదు డ్రింక్‌లు తెచ్చాడు. ఆశ్చర్యం ఐదు డ్రింక్‌లు ఏక ఉదిటినా తాగినట్టు తాగి ఆ వెంటనే ఒక ప్రక్కకు వాలి అమ్మమ్మ ఒళ్లో పడుకుంది. కాసేపయ్యాక పెద మావయ్య లోపలికి తీసుకెళ్లాడు. ఆ రాత్రి జీవితంలో మరిచిపోలేనిది భయంకరమైనది.

భయంకరం అని చెప్పడం కన్నా దానిమీద కలిగిన ఆసక్తి అంతా ఇంతా కాదు. నాకే కాదు అందరి పిల్లలకు... ఇక ఒక్కొక్కరు కథలు కథలుగా చెప్పుకుంటూ వచ్చారు. కథ అంటే కథ కాదన్నమాట... అవన్నీ నిజమైన సంఘటనలు అంట. పెదబావ చెప్పడం మొదలుపెడుతూ..." స్వర్ణ అంటే మునసబుగారి మనవరాలు అప్పుడు వాడెవడో మోసం చేసాడని ఉరి వేసుకొని చనిపోయింది. తర్వాత అది ఆత్మగా తిరుగుతుంటే చాలా మంది చూశామని చెప్పారు ఇప్పుడు ఇలా" అన్నాడు.

"అసలు అది ఆత్మా? దెయ్యమా? ఇంతకూ వారెవరు?" అని భయం భయంగా అడిగాడు గణేష్ గాడు.

"దెయ్యం అంటే ఏదైనా కోరికలు తీరకపోతే అవుతారని అలాగే ఎవరి మీదైనా వాలి వారి కోరికలు తీర్చుకుంటారని నాకు మా ఫ్రెండ్ సుబ్బిగాడు చెప్తే విన్నాను" అన్నాడు పెదబావ.

"అవును అంతెందుకు మన ఈ వీథిలోనే ఒక దెయ్యం ఉందంటా" ఉన్న భయాన్ని ఇంకా పెంచేలా చెప్పాడు చినబావ.

"అవును!! కంచర్ల సుబ్బయ్యగారి కోడల్ని కిరసనాయిల్ పోసి చంపేసారుగా... అటువైపు రాత్రిపూట ఎవరైనా వెళితే ఏడుపులు వినిపిస్తాయట" అన్నాడు పెద బావ.

"అయితే దెయ్యాలు చంపేస్తాయా మనల్ని" అని అడిగాను.

దెయ్యం అనేది అర్థంకాని విషయం అయితే... చావడం అనేది అసలు అర్థంకాని విషయం. మొన్న మా ఊరి ప్రెసిడెంట్‌గారు చనిపోయారని తెలిసి మా తాత పరామర్శకు వెళితే... మా తాతను అడిగా...

"చనిపోవడమంటే ఏమిటి తాతా" అని అడిగితే "దేవుడి దగ్గరకి వెళ్ళిపోవడంరా" అన్నాడు మా తాత. కాని చనిపోయాక దెయ్యం కూడా అవుతారని ఇప్పుడే తెలిసింది. ఇదే మాట సంతోష్ గాడికి చెప్తే దేవుడు అంటే స్వర్గానికి వెళ్ళడం, దానికి చాలా పుణ్యం చేయాలని పాపాలు చేస్తే నరకానికి పోతారని చెప్పాడు. వాడు చెప్పినది వింటుంటే విచిత్రంగా అనిపించింది. స్వర్గం, నరకం అనే మాటలు వింతగా తోచాయి. ఈ సంగతి అక్కడితో అయిపోలేదు.

ఆ రాత్రంతా దెయ్యాల మీద కొత్త కొత్త విషయాలు కొనసాగాయి. ఒక్కొక్కరు ఒక్కో కథను తమకు జరిగిన అనుభవాలను చెప్పసాగారు. ముందుగా మొదలు పెట్టింది సంతోష్‌గాడు "మేకలమొర్రి... తలంతా మేకలా మిగతా శరీరం మొత్తం ఒక ఆడదాని శరీరం అని తెల్లని చీరతో దర్శనమిస్తుందని రాత్రిపూట తిరిగేదని" చెప్పాడు. ఇదంతా తనకు తెలిసిన ఫ్రెండ్ చెప్పాడంటా.

"అంతే కాదు పెద్దాపురంలో రాజావారి కోటకు దగ్గర నూతిలో విచిత్రమైన శబ్దాలు వినిపిస్తాయి. దాని వెనకాల చాలా పెద్ద కథ ఉంది" అని కొంతసేపు ఆగాడు సంతోష్. నా ఆత్రుత ఆపుకోలేక 'ఏంటా కథ' అని అడిగాను. అందరు శ్రద్ధగా వింటుండటంతో నిశ్శబ్దంగా ఉన్న స్థలంలో నా గొంతు గంభీరంగా పలికింది. "హా చెప్తాను" కంగారు పడకు అంటూ మొదలుపెట్టాడు.

"పూర్వం పెద్దాపురం రాజావారు ఊరేగింపుగా తిరుగుతూ ఉండగా ఒక అందమైన ఆవిడను మోహించి తన కోర్కెను తీర్చడానికి రమ్మన్నాడట. ఆవిడ మహా పతివ్రతురాలు, ఆస్థాన జ్యోతిష్కుని భార్య. కాని రాజును ధిక్కరించలేని ఆ జ్యోతిష్కుడు అయిష్టంతోనే తన భార్యకు ఈ విషయం చెప్పి ఒప్పించాడు. అయిష్టంగా వెళ్లిన ఆవిడ రాజు ఎదురుగా నగ్నంగా నిలబడి ఆ వంశాన్ని శపించి కోటకు దగ్గరగా ఉన్న నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందని... అప్పటినుండి ఆమె ఆత్మ అక్కడ తిరుగుతుందని, ఆ నూతినుంచి పెద్దపెద్ద శబ్దాలు వినబడుతూ ఉంటాయని అక్కడ ప్రజలు అంటూ ఉంటారు" అని ముగించాడు.

ఇంకా ఒక్కొక్కరు తమకు తెలిసిన సంగతులు చెప్పసాగారు... "మూల నక్షత్రం వారికి దెయ్యాలు ఎక్కువగా కనబడతాయి అని మా బామ్మ చెప్పింది" అన్నాడు కిరణ్. ఆ రోజు రాత్రంతా ఇలా ఉత్కంఠగాను, భయంగాను గడిచిపోయింది. అందరం లైట్‌లు ఆర్పకుండానే పడుకున్నాము.

తెల్లవారితే సంక్రాంతి... సంక్రాంతికి జరిగే కోడి పందాలకోసం మా మావయ్యను పట్టుబట్టి ఏసు చేత ఎద్దులబండి కట్టించుకున్నాము. కోడిపందాలు అల్లవరంలో జరుగుతున్నాయని తెలియడంతో అందరం బయలుదేరాం. కోడిపందాలు ఊరికి చాలా దూరంగా జరుగుతాయని, డబ్బులు బాగా ఖర్చుపెడతారని తెలిసింది. పోలీసులకు తెలియకుండా ఇదంతా జరుగుతుందని ఏసు చెప్పాడు. ఎంతమంది జనమో అసలు చూడడానికి వీలులేకుండా ఉంది. దగ్గరగా ఉన్నవాళ్ళని గుర్రపు కొరడాతో దూరం చేస్తున్నాడు ఒక మనిషి. చూడడానికి అక్కడ అంతా గందరగోళంగా ఉంది. ఎవరిచేతిలో చూసినా డబ్బులు... కొంతమంది చేతిలో బాగా బలిసిన కోళ్ళు, సరిగ్గా కనిపించడంలేదు కానీ కోళ్ళు ఎగిరెగిరి కొట్టుకుంటున్నాయి.

"ఒరేయ్ అభి అలా తిరిగి వద్దాం రా" అన్నాడు మా బావ.

కోడిపందాలకు కొంచెం దూరంగా ఒక టేబులు వేసుకుని ఎవడో పిక్కలను డబ్బాలో ఆడిస్తున్నాడు. 1,2,3,4,5,6 అని గడుల మీద రాసి ఉన్నాయి. టేబుల్ మీద అందరు తమ దగ్గర ఉన్న పది లేక వంద, ఐదువందలు అలా డబ్బులు ఏవో ఒక నంబరు మీద పడేస్తున్నారు. బావ పది రూపాయలు తీసి ఆరు మీద పడేసాడు. టేబుల్ దగ్గర కూర్చున్న మనిషి తోలు డబ్బాని గిలకరించి పెట్టాడు. కొందరు తాము వేసిన గడులలో నంబరులను మార్చుకున్నారు. వాడు మూత తీసిన వెంటనే రెండు ఆర్లు, రెండు నాలుగులు అని చదివాడు.

మా బావ నాతో "ఒరేయ్!! లాభం రా..." అన్నాడు. ఈ ఆట చాలా విచిత్రంగా ఉంది. దీన్నే గుండాట అంటారని చెప్పాడు. దీనివల్ల చాలా మంది చాలా డబ్బులు సంపాదించారని చెప్పాడు. కాని నాకు అక్కడ ఉన్నవాళ్ళందరు పోగొట్టుకున్నవారిలా కనిపిస్తున్నారు. నేను ఐస్ కొనమనడంతో మా బావ ఐస్ కొని ఇచ్చాడు. తాను ఈ ఆట ఆడుతున్నట్టు ఎవరికీ చెప్పొద్దని ఒట్టు కూడా వేయించుకున్నాడు. అసలు ఈ ఒట్టు అంటే ఏమిటో అది వేస్తే నిజం ఎందుకు చెప్పకూడదో అసలు అర్థంకాని విషయం.

అందరూ నీరసంగా ఎద్దుల బండి దగ్గరకు చేరుకున్నారు. ఎవరికి వారు ఎప్పుడు ఇంటికి వెల్దామా అన్న ఆత్రుతతో చూస్తున్నారు. అందరూ వచ్చారా లేదా అని చూసుకుని ఏసు బండి తీసాడు. వచ్చినప్పుడున్నంత ఉత్సాహం వెళ్ళేటప్పుడు ఎవరికీ లేదు. చచ్చిన శవంలా కూర్చున్నారు అంతా. ఇంటికి వెళ్ళిన వెంటనే కాళ్ళు కడుక్కోమని బాల్చి నీళ్ళు పెట్టింది సూరి మావయ్య అత్త. అందరం కాళ్ళు కడుక్కుని

స్నానాలు చేద్దామనే ఆలోచనలో ఉన్నాం. అయితే అప్పటికే ఆరు అవ్వడంతో కాలువకు వెళ్ళకుండా పెరట్లో నూతి నీళ్ళతో సరిపెట్టుకున్నాము.

బంగాళ దుంప వేపుడు, చారుతో రాత్రి భోజనం ముగించి ఎప్పటిలాగే హాస్కి ఆడేవాళ్ళు హాస్కి, పేకాట ఆడేవాళ్ళు పేకాట దగ్గర కూర్చున్నారు. తెల్లవారింది కనుమరోజు, లక్ష్మీపిన్ని కొడుక్కి భోగిపళ్ళు పోస్తారట. అందరు ఆ హడావిడిలో ఉన్నారు. సంక్రాంతి అంటే ఆ మూడు రోజులు ఆనందంగా ఇట్టే గడిచిపోతాయి. సాయంత్రం పేరంటంతో ఆరోజు ముగిసింది. మర్నాడు ప్రొద్దున్నే ఒక ప్రభ తెచ్చి దాన్ని అలంకరించమని చెప్పాడు నరసింహ తాత. ఇంకా అన్నయ్యలు, బావలు, నరసింహ తాత మనువలు అందరు ఆ పనిలో పడ్డారు. సాయంత్రమే ప్రభల తీర్థం మరి... ఇసకేస్తే రాలనంత జనం... ఎప్పుడు ఇంతే...

నా చిన్నప్పటినుంచి అంటే నా చిన్నప్పుడు నాకు సరిగా గుర్తు లేదు కాని జనం ఉండేవారు ఇప్పటిలాగే... అన్నింటికన్నా దేవర్లంక అంజనేయ స్వామి మెరుపుల బొమ్మ చాలా బాగుంటుంది. దానిని మోయడానికి ఒక ఆరుగురు ఉన్నారు. పెద్ద పెద్ద ఏనుగుల బొమ్మలు ఎంతసేపు చూసినా అలా వెళ్తూనే ఉన్నాయి. ఇంక అప్పటికే రాత్రి పది అవ్వడంతో నిద్ర ముంచుకు వస్తోంది. తెల్లారితే ఎవరింటికి వాళ్ళు....

★ ★ ★

ఇన్ని రోజులు తర్వాత మరల స్కూలుకి వెళ్ళడం అదో పెద్ద బాధ... అసలు ఇన్ని రోజులు స్కూలు లేకపోవడం, పదిరోజులు స్కూలుకి వెళ్ళకుండా తరువాత రోజు స్కూలుకి వెళ్ళడం అంటే నరకంతో సమానం. మా హెడ్‌మాష్టార్ ఒక తలతిక్కాయన. వాడికి ఏమీ రాదు. ఆఖరికి జనగణమన కూడా... వాడికన్నా గట్టిగా నేనే పాడతాను.

మళ్ళీ అన్ని పీరియడ్లు వాయింపుడు మొదలు... అబ్దుల్‌గాడు బుజ్జన్న గారి తోటకి పోదాం అంటే మొదటి రోజు కదా అని వద్దన్నాను. ఇంటికివచ్చే సమయానికి ఇళ్ళంతా హడావిడిగానూ, ఇంకా చెప్పాలంటే దీనంగాను ఉంది. ఎదురుగా ఉండే బాలకృష్ణ వాళ్ళ నాన్నగారు తాతకి ఏదో ఇంజక్షన్ చేస్తున్నారు. అలాగే ఒక బాటిల్ నీళ్లు తాత చెయ్యికి తగిలించబడింది.

"ఏమయ్యింది తాతకి" అని అత్తని అడిగాను. తాతకు జ్వరమొచ్చిందని చెప్పింది. కాని తాతకు చాలాసార్లు జ్వరమొచ్చినా ఇలా లేదు. అప్పటికి 8:30 అవుతోంది నేను తాత దగ్గరే ఉన్నాను. రోజూ ఈ సమయానికి తాత భోజనం చేస్తాడు.

కాని ఇప్పుడు అలా చేయట్లేదు. నాకు కథలు చెప్పే తాత అలా పడుకుండటంవల్ల చాలా ఏడుపు వచ్చింది. ఇంతలో కంగారుగా ఏడుస్తూ వచ్చిన అత్త తులసి నీళ్ళు పట్టుకురమ్మని పెద్దమ్మతో చెప్పింది. తాతగారిని గది లోపలి నుంచి ఇంటి బయట వరండాలో ఉంచారు. ఇంతకి బయటకు ఎందుకు తీసుకువచ్చారో, అంత చలిలో ఎందుకు పడుకోబెట్టారన్నదే నాకర్థం కానిది.

"నక్షత్రం ఇంట్లోనే పడింది" అని ఏడుస్తూ అంది మా అమ్మ. "అమ్మ! నక్షత్రాన్ని నేను చూస్తాను" అనేటప్పటికి "వెధవ ఇప్పుడు ఇవన్నీ నీకెందుకు పోయి పడుకో" అంది. అక్కడ అందరూ పెద్ద పెద్దగా ఏడుస్తున్నారు. కొందరి ఏడుపు చూస్తూంటే నవ్వు, ఇంకొందరి ఏడుపు చూస్తూంటే ఏడుపు వస్తోంది. అక్కడ వెక్కి వెక్కి ఏడుస్తున్న మా అక్కని తాత గారికి ఏమైంది అని అడిగాను. "తాతగారు చనిపోయారని" ఏడుస్తూనే చెప్పింది. నాకు ఏడుపు ఆగలేదు. చనిపోవడమంటే తాతగారు తిరిగిరారన్నమాట... అప్పటిదాక మాములుగా ఉన్న నాకు కన్నీళ్ళు ఆగలేదు. తాత చెప్పిన కథలు, ఊరి గురించి చెప్పిన సంగతులు కళ్ళలో తిరుగాడుతున్నాయి. నాకు అనుమానం పోలేదు. తాతగారు ఇంకా మనచుట్టూ ఉన్నారనే... ఇప్పుడు పడుకున్నా ప్రొద్దున్న లేస్తారనే భావనలోనే ఉన్నాను. మరోసారి బోరుమని ఏడుస్తున్న అత్తని "తాతకి ఏమైంది" అని అడిగా.

"తాతగారు చనిపోయారని" ఏడుస్తూనే చెప్పింది, నాకన్ని సందేహాలుగానే తోచాయి. తాత దేవుడి దగ్గరికి వెళ్ళడం ఏంటి??... అసలు చనిపోవటమంటే దేవుడి దగ్గరకి వెళ్ళడమా...?? ఏమో మా లెక్కలు మాష్టారు లెక్కలు చెప్తుంటే కలిగిన సందేహాల కన్నా ఇవే ఎక్కువ. ఏడుపు...... ఆ రాత్రి అలా ఏడుస్తూనే నిద్రలోకి జారుకున్నా.

మధ్యలో ఎన్నింటికో తెలీదు మెలుకువ వస్తే లేచి కూర్చున్న. అందరూ అప్పటికి టీలు తాగుతున్నారు. నాన్న కళ్ళు ఎర్ర జీరల్లా ఉన్నాయి. నాన్న కూడా ఏడుస్తాడని ఆ రాత్రే తెలిసింది నాకు. నానమ్మ, నాన్న, పెదనాన్న, ముగ్గురు అత్తలు, తాతగారి దగ్గర మౌనంగా కూర్చున్నారు. అప్పటికే వెలుగు కొంచెం వచ్చింది. సూర్యుడు అప్పుడప్పుడే నిద్రలేస్తున్నాడు. రాత్రి మంచు పడకుండా వెంకడు వేసిన టెంట్ గాలికి ఊగుతోంది.

అందరూ ఏడుస్తూనే ఉన్నారు. అందులో అత్తలు అయితే రాత్రంతా పడుకోలేదు. ఊర్లో కొందరు టీలు, కాఫీలు పంపిస్తున్నారు. చనిపోయిన ఇంట్లో

పొయ్యి వెలిగించకూడదంట. మా అత్త, అమ్మలు, చుట్టాలు వచ్చిన వాళ్ళ ఏడుపుతో ఇళ్ళంతా ప్రతిధ్వనిస్తోంది. వాళ్లని చూస్తుంటే నాకు ఏడుపు ఆగట్లేదు.

దీర్ఘంగా తాత మొహంకేసి చూసాను. చనిపోయిన తర్వాత ముక్కు, చెవులు, నోరు ఇవేవి ఉపయోగపడవని తెలిసింది. పంతులుగారు రావడంతో కర్మకాండ ప్రక్రియని మొదలు పెట్టారు. తాతగారి మీద బిందెడు నీళ్ళు పోసారు. అందరి ఏడుపులు ఆకాశాన్నంటుతున్నాయి. నేనైతే వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

తాత గారు ఇకలేరు.... అందరు వరసగా వచ్చి నోట్లో బియ్యం పోస్తున్నారు. ఎందుకు పోస్తున్నారు అనే ప్రశ్న? ఆ పచ్చి బియ్యం పొయ్యడమేమిటి అనుకున్నాను. నాకొచ్చిన సందేహమే ఎవరికో వచ్చినట్టుంది. పంతులు గారి వెనుక వచ్చిన శిష్యుడు చెప్పడం మొదలు పెట్టాడు.

"బియ్యం తర్వాత నల్ల నువ్వులు పోస్తారు ఇవన్నీ ఆత్మకి గ్రాసం అంటే శక్తి కోసం ఉపయోగపడతాయి" అని చెప్పాడు.

ఇవన్నీ నాకు కొంచెం భయంగా అనిపించాయి. ఆత్మ అనగానే మొన్న అమ్మమ్మ ఇంటి దగ్గర జరిగిన సంఘటనలన్ని గుర్తొచ్చాయి. అంటే తాత దెయ్యం అవుతాడా? లేదు లేదు సంతోష్ చెప్పిన ప్రకారం కోరికలన్ని తీరిపోతే అవ్వరని అన్నాడు కదా...

ఇంతలో పంతులుగారు ఒక పొడవాటి దర్భను తీసి తాత కాళ్ళ బొటనవేళ్ళను కట్టేసారు. ఒకవేళ తాత ఉండి ఉంటే అలా ఉండనిచ్చేవాడు కాదు. ఎప్పుడు కదులుతూ ఉంటాడు.

"ఒరేయ్ నిలువు రెండు కట్టాక అడ్డం ఏడు వేయాలి" అని అరుస్తున్నాడు రాంబాబు మావయ్య.

దాని మీద తాతగారిని ఉంచి శ్మశానానికి తీసుకెళ్తారంట. ఒక రెండు ఈల కర్రలను నిలువుగా ఉంచి ఏడు కర్రలను అడ్డంగా కడుతున్నారు. మనవాళ్ళు దాన్ని పాడె అంటారట. ఆ లెక్క ఎందుకో నాకు అర్థంకాలేదు. సుఖంగా ఇంకొన్ని వేస్తే తాతకు బాగుంటుంది కదా అనుకున్నాను.

తాతగారిని ఆ పాడె మీద పడుకోబెట్టారు. ఏడుపులు రెట్టింపయ్యాయి... నాకు కూడా...

నలుగురు పాడె మోస్తున్నారు. ఒకరు పెద్ద పెదనాన్న అయితే మిగతాది మావయ్యలిద్దరు, బాబయ్య మోస్తున్నారు. పెదనాన్న నిప్పు ఉన్న కుండని పట్టుకెళ్తున్నారు. నాన్న కూడా చాలా దీనంగా బాధగా ఉన్నారు. నాకు కూడా వెళ్లాలనిపించింది. కాని అందరూ తిట్టారు. "పర్లేదు" అని మా రెండో పెదనాన్న తీసుకువెళ్ళాడు.

అంత చిన్న వయసులో శ్మశానానికి వెళ్ళడం...

శ్మశానం అంటే శవాలను కాలుస్తారని అక్క చెప్పింది. అక్క రావడం లేదు. ఆడవాళ్ళు శ్మశానానికి రాకూడదంట. ఊరి చివర శ్మశానం. శ్మశానానికి వెళ్లే దారిలో మూడుచోట్ల అన్నం పెట్టారు. అలా పెట్టడం వల్ల దారిలో ఆత్మకి అలసట ఉండదని ఎవరో చెప్తే విన్నాను. చివరికి శ్మశానం చేరాక పంతులుగారు ఏవో మంత్రాలు చదువుతూ పెదనాన్న, నాన్న చేతుల్లో నీళ్ళు పోసి వదులుతున్నాడు.

"ఇక్కడితో రుణం తీరిపోయింది రా!" అని ఏడుస్తున్నాడు రాంబాబు మావయ్య.

అప్పటికే చితిని పేర్చి ఉంచిన కాటికాపరి "బాబుగారు శవాన్ని చితి మీద పెట్టమంటారా" అని అడిగాడు. పంతులుగారు మంత్రాలు చదువుతూనే "సరే" అని సంజ్ఞ చేయడంతో శవానికి బట్టలు మొత్తం ఆఖరికి మొలతాడుతో సహా తెంపేసి చితిమీద పడుకోబెట్టి పైన ఆకు పెట్టారు.

చూడటానికి ఇదంతా భయంకరంగా ఉన్నా నాలో ఇంకాస్త ఆసక్తి పెరిగింది. తర్వాత పెదనాన్న కుండతో శవం చుట్టూ ప్రదక్షణ చేస్తూంటే కాటికాపరి ఒక్కో ప్రదక్షణానికి ఒక్కో చిల్లు పెట్టాడు.

మొత్తానికి మూడు ప్రదక్షణాలు చేశాక కుండ పడేసి చితి పెట్టారు పెదనాన్న, నాన్న. దూరం నుంచి చూస్తున్న నాకు ఇవన్నీ... ఏడుపుకంటే అక్కడేదో జరుగుతోంది అన్న ఆసక్తిని లేపాయి. "కపాల మోక్షం అయ్యేదాకా ఉండాలి" అని గట్టిగా అరిచాడు పంతులు గారు అందరికి వినబడేటట్టు.

"కపాల మోక్షం ఏంటి మావయ్యా" అని అడిగాను.

"నీకెందుకురా ఇవన్నీ" అని కసిరాడు.

"చెప్పు మావయ్య" అని బతిమాలడంతో కాస్త మెత్తబడి ఇలా చెప్పాడు.

కపాలమోక్షం అంటే కాలుతున్న శవం మీద ఉన్న పుర్రె పేలాలని దానినే కపాలమోక్షం అంటారని.. ఇదే కాక మనిషి చనిపోతున్నప్పుడు నవ రంధ్రాలలో ఏదో ఒక రంధ్రం నుంచి ప్రాణం పోతుందని, ఒకవేళ తల పై భాగంలో ఉన్న బ్రహ్మ రంధ్రం నుంచి పోతే ముక్తి కలుగుతుందని చెప్పి తన బట్టతల మధ్యలో చూపెట్టి బ్రహ్మ రంధ్రం అన్నాడు.

బ్రహ్మరంధ్రం, కపాలమోక్షం అనేవి నాకు సరిగ్గా అర్థం కాకపోయినా నా మనసులో బాగా నాటుకుపోయాయి. ముఖ్యంగా బ్రహ్మ రంధ్రం అంటూ మా మావయ్య తన బట్టతలను చూపించడంవల్ల ఆ సమయంలో కూడా బాగా నవ్వొచ్చింది. నాన్న, పెదనాన్న అక్కడ చాలాసేపు ఉండి కపాలమోక్షం అయ్యాక "టప్" మని పెద్ద శబ్దం వచ్చాక బయలుదేరారు.వాళ్ళతోపాటూ అందరం బయలుదేరాం.

అందరూ గోదావరి దగ్గరకు వెళ్లి స్నానాలు చేస్తున్నారు. "నేను చేస్తాను" అంటే, వద్దు చిన్న పిల్లలు గోదావరిలోకి దిగకూడదు అని కసురుకున్నారంతా.

నాన్న, పెదనాన్న గోదావరిలోకి దిగొచ్చాక పంతులు గారు కూర్చోమని సంజ్ఞ చేసారు. కూర్చున్నాక తొడలు చరుచుకోమన్నాడు. ఒకసారి గాల్లో చప్పట్లు చరిచారు. ఇవన్నీ నాకు పిచ్చిచేష్టల్లా అనిపించాయి. గట్టిగా అంటే కొడతారని భయమేసింది. అంతే ఇక్కడ తతంగం అయ్యాక ఇంటికి బయలుదేరాం.

ఇల్లంతా సందడిగానూ, బాగా జనంతోనూ నిండి వుంది. మొన్న చినతాతగారి చినబాబు పెళ్లికి కూడా ఇంతమంది రాలేదు. పైగా వీళ్లు పది రోజులుంటారట. పెళ్ళి కంటే చావే పెద్దదని నాకనిపించింది. రెండో రోజు పంతులుగారు వచ్చి దర్భలతో, అరిటాకులతో పడవలు చేస్తున్నారు. అవి ఆయన తమ పిల్లవాడికి చేస్తున్నారేమో అనుకుని నాకు కావాలన్నాను. వెనుక నుంచి పెదనాన్న వచ్చి పిర్రమీద ఒక్కటిచ్చి "ఇక్కడి నుండి పో వెధవా" అని కసిరాడు. ఆఖరికి అర్థమయ్యింది అవి కూడా పూజా సామాగ్రి అని... సందు చాటు నుండీ చూస్తున్నా.... పంతులు గారు గట్టిగా అరుస్తూ అన్నాన్ని అరిటాకులలో ఉంచారు. తర్వాత అక్కడి నుండి అందరం కాలువ ఒడ్డుకి బయలుదేరాం..

పంతులు గారు, ఆయన శిష్యుడు మంత్రాలు చదువుతూ అన్నం ఉన్న ఆకుని గట్టుమీద పెట్టించారు. ఆశ్చర్యం ఏమిటంటే చుట్టూ అన్ని కాకులు ఉన్నా ఒకటీ తినడానికి రాకపోవడం. ఒకప్పుడు నేను చపాతి మా ఇంటి నుంచి ఎదురుగుండా

నాగలక్ష్మీ గారి ఇంటికి పట్టుకెళ్తుంటే ఒక కాకి చపాతీని అమాంతంగా ఎగరవేసుకుని వెళ్ళిపోయింది. అలాంటిది అక్కడ అన్ని కాకులు ఉన్నా అన్నంకేసి చూస్తూ ఉండడం నాకు ఆశ్చర్యం వేసింది. కాకులకు చపాతీలు నచ్చుతాయేమో అనుకున్నా..

కానీ అంతలో పెదనాన్న, పెద్దమ్మ, నాన్న, అమ్మ వాళ్లు మావి ఏవైనా తప్పులు ఉంటే క్షమించండి... అందరూ మీకోసం ఎదురు చూస్తున్నారు అని బోరున ఏడ్చారు. తాతగారికి ఎప్పుడూ అరటిపండు వలచి మజ్జిగలో వేసే అక్క ఇప్పుడు కూడా అలాగే వేసింది. ఆశ్చర్యంగా ఒక కాకి వచ్చి అన్నం తినడం మొదలు పెట్టింది. అందరూ "హమ్మయ్యా" మనవరాలంటే ఎంతప్రేమో అనుకుని వెళ్లిపోయారు. కానీ నేను మాత్రం అలాగే ఉండిపోయాను.

ఇప్పటిదాకా రాని కాకి ఇప్పుడెందుకు వచ్చింది? అసలు చుట్టూ ఇన్ని కాకులు ఉండగా ఇది ఒక్కటే రావడం ఏమిటి? అంటే అందరూ అన్నట్టు అది నిజంగానే తాతగారా అని అనుకొని భయమేసి ఇంటికి వెళ్లిపోయా..

ఇదంతా ఒక ఎత్తయితే ఇంటికి వెళ్లిన వెంటనే అమ్మ, అమ్మమ్మ, చిన అమ్మమ్మ, నానమ్మ, అత్తల ఏడుపులు ఒక ఎత్తు. ఏడుస్తున్నారో, ఏడుపు తెచ్చుకుని ఏడుస్తున్నారో అని... అంటే నిన్న అర్ధరాత్రి ఒకసారి, ఇవాళ్ల పొద్దున్న ఏడ్చిన ఏడుపును గుర్తు చేసుకున్నాను. చివరికి తెలిసిందేంటంటే నిజానికి అలా ఏడ్వాలంట. అప్పుడే ఆత్మకు శాంతట. ఇంతలో అత్త ఏదో పుస్తకాన్ని చదవడం, అందరూ శ్రద్ధగా వినడం గమనించాను. అక్కడికెళ్లి నేను కూడా వినడం ప్రారంభించాను. కానీ నాకు చాలా వరకు అర్థం కాలేదు. ఏదో నరకమని, పాపమని చెప్తోంది. అత్త "ఒక అధ్యాయం సమాప్తం" అని అనడంతో "అత్తా ఇదేంటి" అని అడిగాను.

"గరుడపురాణం... నరకం గురించి మొత్తం చెబుతుంది" అని చెప్పింది. వింటూ ఉంటే అది చదవాలన్న కోరిక ఉన్నా, భయంతో అక్కడే అప్పుడే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను. కానీ ఆ విషయాల గురించి ఎప్పటికైనా తెలుసుకోవాలనే తాపత్రయం అయితే ఉంది. ఆ పదిరోజులు కూడా అర్థం కాకపోయినా ఆ గరుడపురాణాన్ని, వాళ్ల ఏడుపులని వినడంతో గడిచిపోయింది. ఇక పదవరోజు చాలా మంది వచ్చారు. అందరికీ భోజనాలు పెట్టడంతో మొత్తం తంతు ముగిసింది. అందరూ ఎవరింటికి వాళ్లు వెళ్లిపోయారు. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించినట్టయింది. ఎప్పుడూ తాతగారి ప్రక్కన పడుకునేవాన్ని. ఈరోజు ఎవరి ప్రక్కన పడుకోను? అనే

ప్రశ్న వేసుకుంటూనే ఒక్కడినే పడుకున్నాను. అర్ధరాత్రి భయమేసినా మొండి ధైర్యంతో అలాగే ఉన్నా... ఆ రాత్రి నాకు అనిపించింది తాతగారు నా ప్రక్కన పడుకున్నట్టు. కానీ ఒకవేళ నిజంగా ఆయన నా ప్రక్కన పడుకున్నా ఆయన నన్ను ఏం చెయ్యరు అన్న ధైర్యంతో పడుకున్నాను. తెల్లారి చూసేటప్పటికి అంతా కలలా అనిపించింది.

పదిరోజుల పైన అయ్యింది స్కూలుకెళ్లి.. అబ్దుల్‌గాడిని చూసి..

"ఏరా మా ఇంటి వైపు రాలేదే" అని అడిగాను అబ్దుల్‌గాడిని.

వాడు మా తాత పోయాక అసలు మా ఇంటి వైపే రాలేదు. వాళ్ల నాన్న చూడటానికి వచ్చాడు కాని వీడు రాలేదు.

"మా అమ్మ ఆ పది రోజులు మీ ఇంటి వైపు వెళ్తే కాళ్లు విరగ్గొడతాను" అని చెప్పిందిరా అన్నాడు దీనంగా. సరే ఎవడి బాధలు వాడివి అనుకున్నాను. ఏదోలా ఆ సంవత్సరం ఆరవ తరగతి పాసయ్యి ఏడవ తరగతికి చేరుకున్నాం. జీవితం పరిగెడుతూనే ఉంది. ఏడవ తరగతి... మమ్మల్ని పగలు రాత్రి లేకుండా ఆడుకుంటున్నారు.

"ఒరేయ్ అభి రేపు ఆదివారం కదా క్రికెట్ ఆడదాం వస్తావా??" అన్నాడు అబ్దుల్.

"రేపు మా తాతగారి ఆరో మాసకం అంటరా ఎక్కడికీ వెళ్లొద్దన్నాడు మా నాన్న".

"మాసకం అంటే ఏంట్రా?" అని అడిగాడు అబ్దుల్.

"నాకు తెలియదు కాని మా నాన్న, పెదనాన్న ప్రతి నెల మాసకం అని చెప్తారు. ఆ రోజు మా ఇంట్లో హడావిడి ఎక్కువ."

"సరే రా" అని వాడు వెళ్ళిపోయాడు.

రేపు తాతగారి మాసకం వల్ల క్రికెట్ ఆడలేకపోతానన్న బాధతోను, కోపంతోను అసలు ఇవన్ని ఎందుకు అనిపించింది. సాయంత్రం ఎలాగో అలా వీలుచేసుకుని క్రికెట్ ఆడటానికి వెళ్ళాను.

ఆడటం అయ్యాక అందరూ చెరువుగట్టు దగ్గర వీరయ్య కొట్టులో బజ్జీ పప్పు తిందాం అనడంతో అందరూ పెద్ద కేకలతో రామంగారి తోట నుంచి బయలుదేరాం.

వీరయ్య బజ్జీపప్పు చాలా ఫేమస్. చుట్టుప్రక్కల ఊరివాళ్ళు వచ్చి తిని వెళ్తూ ఉంటారు. అంత ఫేమస్. అందరూ తింటున్నారు కాని నన్ను ఈ రోజు బయట తినవద్దు అన్న మా నాన్న మాటలు గుర్తొచ్చి ఆగిపోయాను.

కాలం చాలా త్వరగా గడుస్తోంది. అంతే త్వరగా మా పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఏడవ తరగతి పబ్లిక్ పరీక్షలేమో అసలు ఏ క్లాస్ ఎగ్గొట్టడానికి లేకుండా పోయింది. అసలు ఉన్న క్లాసులు ఎగ్గొట్టడం అటుంచితే ఎక్స్ట్రా క్లాసులకి వెళ్ళడం అదో పెద్ద బాధ. ఈసారి పబ్లిక్ వల్ల, తాతగారు చనిపోవడం వల్ల ఏ పండగా చేసుకోలేదు. ముఖ్యంగా దసరాకి అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళలేదు. ఇవన్నీ మిస్ అయినందుకు బాధపడి ఈ పరీక్షలు జీవితంలో ఎప్పుడు ఉపయోగపడతాయా అని అనుకున్నాను.

అమ్మ కూడా చదువు, చదువు అని పోరు పెడుతుంది. పరీక్షలు రానే వచ్చేసాయి. అందరూ ఏదో యుద్ధానికి సిద్ధమయినట్టు అయ్యారు. ఆఖరికి అబ్దుల్‌గాడితో సహా... ఈ పరీక్షలో మంచి మార్కులు తెచ్చుకుని తర్వాత కాన్వెంటు స్కూలులో ఫ్రీగా సీటు తెచ్చుకోవాలని కోరికంట. అది వాళ్ళ అమ్మకోరిక. దాని కోసం అంత కష్టపడుతున్నాడు. తప్పులేదు. అబ్దుల్ వాళ్ళ నాన్నది చిన్న సైకిల్ షాపు. వాళ్ళమ్మ గరాజీలు చేసి అమ్ముతుంది. గరాజి అంటే అదోరకమైన స్వీటు. దానిని మా ఇంటికి వచ్చిన ప్రతివారు పట్టుకెళ్ళకుండా ఉండరు. వాళ్ల అమ్మ నాన్నలకు వీడు కాన్వెంటులో చదివి ఇంకా పెద్ద పెద్ద చదువులు చదవాలని కోరిక.

ఒకసారి అబ్దుల్ వాళ్ళమ్మ నన్ను పిలిచి “ఒరేయ్! అభి మీరిద్దరు బాగా చదవి బాగా డబ్బులు సంపాదించి పదిమందికి భోజనం పెట్టాలి” అంది. అందుకు వాడు అంత కష్టపడుతున్నాడు. వాడితో పాటు నేను. కనీసం వాడిలా కాకపోయినా కొద్దిగా మార్కులు తెచ్చుకొని కాన్వెంట్‌లో చేరదామని వాడితో కలిపి.

మొదటి పరీక్ష తెలుగు. నాకు కొట్టిన పిండి అని నేను అనుకుంటూ ఉంటాను. నేను అబ్దుల్‌గాడు ఎప్పటిలాగే ఒకే సైకిల్ మీద వెళ్లాం. దారిలో అంజనేయ స్వామికి దణ్ణంపెట్టుకొని మేం కొన్న క్రొత్త పెన్నులను స్వామి పాదాల దగ్గర ఉంచి పూజ చేయించి పరీక్షా సెంటర్‌కు అరగంట ముందే చేరుకున్నాం. అదేమిటో అందరూ తమతో అమ్మనాన్నలను, మొహంలో ఒకింత భయాన్ని వెంటపెట్టుకొచ్చారు. నేను అబ్దుల్‌గాడు వాళ్ళ పరిస్థితి చూసి నవ్వుకున్నాం...

పరీక్ష మొదలైంది. పేపరు వచ్చిన తర్వాత చూసిన తర్వాత నాకున్నదొకటే స్పందన. వచ్చింది రాయడమే. ఇలా అన్ని పరీక్షలు బాగానే ముగిసాయి. అన్ని బాగానే రాసినా సైన్స్ మీదే ఒకింత భయం. తక్కువ మార్కులు వస్తాయేమో అని. అబ్దుల్‌గాడు కూడా అన్ని సబ్జెక్టులు బాగా రాశాడని చెప్పాడు. పరీక్షలు అయిపోయాయి మిగిలింది సెలవులే...

"ఒరేయ్ అభి ఈ రోజు సినిమాకెళ్దాంరా" అన్నాడు అబ్దుల్.

"సరేరా మరీ ఇంట్లో ఒప్పుకుంటారా?" అన్నా భయంతో. ఎందుకంటే ఎప్పుడు ఒంటరిగా ఊరు దాటలేదు. అలాంటిది పదిహేను కిలోమీటర్లు దాటి థియేటర్‌కు వెళ్ళాలి. అది ఫస్ట్ షో అంటే తిరిగి వచ్చేటప్పటికి కనీసం 10:30 దాటుతుంది.

నాన్నని భయంతోనే అడిగా "నాన్న! ఇవ్వాల నేను అబ్దుల్‌గాడు సినిమాకి వెళ్దాం అనుకుంటున్నాం".

"సరే వెళ్ళు" అని యాభై రూపాయలు చేతిలో పెట్టారు.

నాన్న ఎప్పుడు అంతే నా మీద నమ్మకమో లేక అసలు భయం లేకపోవడం వల్ల అలా ఒప్పుకుని ఉంటారని భావించా. అబ్దుల్‌గాడి ఇంట్లో కష్టపడి ఒప్పుకుని చేతిలో పది రూపాయలు మాత్రమే పెట్టారు. టిక్కెట్లు దొరుకుతాయో లేదో అన్న భయంతో గంటన్నర ముందే బయలుదేరాం అబ్దుల్‌గాడి సైకిల్‌మీద...

చిరంజీవి సినిమా జగదేకవీరుడు అతిలోక సుందరి లైన్‌లో పది రూపాయల టిక్కెట్టు కోసం నిలబడ్డాడు అబ్దుల్. పాత సినిమా ఎప్పటినుంచో ఆడుతుంది. అయినా సరే జనాలు నిండుగా వున్నారు. అప్పటికే బారెడంత ఉన్న లైన్లో టిక్కెట్టు దొరుకుతుందో లేదో తెలియదు. ఇంతలో మా అదృష్టం కొద్ది గుడిబాల పెదకాపుగారు కనిపించి "ఏరా అబ్బాయిలు... మీరే వచ్చారా? పెద్దోళ్లు ఎవరు రాలేదేంటిరా?..." అని అనడంతో అబ్దుల్‌గాడు "లేదండి" అని చెప్పాడు. మా ఇద్దరికి ఆయనే టిక్కెట్లు ఇప్పించారు.

పెదకాపుగారంటే బాగా పలుకుబడి ఉన్న వ్యక్తి అని తెలుసు... దీనివల్ల ఇంకా తెలిసిందేంటంటే ఆయన వల్ల సినిమా టిక్కెట్లు ఇంకా త్వరగా దొరుకుతాయని. హాలు అప్పటికే జనాలతో నిండిపోయింది. చివరికి తిరిగి తిరగక ఉండే ఫ్యాను దగ్గర ఇద్దరం కూర్చున్నాం. హీరో ఎంట్రన్స్‌తో హాలు మారు మ్రోగిపోయింది. తరువాత హిమాలయల్లో హీరోయిన్ శ్రీదేవి ఎంట్రన్స్ దేవకన్యలా రావడంతో హాలు ఈలలతో

ప్రతిధ్వనించింది. ఇక ఇంట్రవెల్‌లో ఐదు రూపాయల ఐస్‌క్రీమ్‌లు కొనుక్కుని తినడంతో ఆకలి వేయలేదు. రోజూ ఏడింటికల్లా భోజనం చేయటం అలవాటు. కానీ సినిమా చూస్తూ ఉండటంలో, అది అంతమంది జనాల మధ్యన ఈలలతో, గోలతో ఆకలే వేయలేదు. కొంచెం పెద్ద సినిమా అనుకుంటా. సినిమా అయ్యేటప్పటికి 9.30 పైనే అయ్యింది. సైకిల్ పెట్టినందుకు స్టాండు వాడికి ఒక రెండు రూపాయలు ఇచ్చి అక్కడ నుంచి కదిలాం. కల్కీపేట సెంటరు దాకా రద్దీగా ఉన్నా నగరం పొలిమేరకి వచ్చే సరికి అంతా నిర్మానుష్యంగా వుంది.

"ఒరేయ్ అబ్దుల్ నిజంగా ఆ సినిమాలో లాగా మనకీ ఒక మంత్రాల ఉంగరం ఉంటే ఎంత బాగుండు" అన్నాను.

వాడు సైకిల్ తొక్కుతుండటం వల్ల అనుకుంటా ఆయాసంతో కొంచెం ఆగి ఆగి మాట్లాడుతున్నాడు.

"అవునురా నిజంగా అలాంటిది ఉంటే ఎంత బావుండో" అని ఆపాడు.

కాసేపు ఇద్దరి మధ్య నిశ్శబ్దం...

కొండుకుదురు అంబేద్కర్ బొమ్మ దాటాం. ఆ రాత్రి పౌర్ణమి కావడంతో ఆ వెలుతురు మాకు వరమైంది. అది కాకుండా ఏదైనా మోటార్ సైకిల్ వస్తుంటే దాని లైటుతో కొంచెం దూరం వెళ్లడం తర్వాత మళ్లీ నెమ్మదించడం..

"ఒరేయ్!! అభి!! నిజంగా మంత్రాలు, దయ్యాలు ఉన్నాయంటావా" అంటూ మొదలుపెట్టాడు అబ్దుల్. వాడు అలా మొదలెట్టాడో లేదో నా గుండెలో దడ మొదలైంది.

"అరేయ్ ఇంత రాత్రి వేళ ఎందుకురా అవన్నీ" అని గట్టిగా కసిరాను.

వాడు ఆ విషయం ఎందుకు గుర్తుచేసాడో ఎటు చూసినా కొంచెం భయమేసింది. త్వరగా ఇంటికి చేరుకుంటే బాగుండును అనిపించింది. కానీ వీడి తొక్కుడికి అప్పుడే వెళ్లలేము.

"ఒరేయ్ అబ్దుల్ సైకిల్ ఆపరా! నేను తొక్కుతాను" అని అన్నాను.

"సరే రా నాక్కూడా ఆయాసంగా ఉంది" అని సైకిలిచ్చాడు.

బుల్లోడొంతెన దగ్గర ఇచ్చిన సైకిలు మా ఇంటికి వచ్చేదాకా ఆగకుండా తొక్కాను. మామూలుగా బుల్లోడి వంతెన దగ్గర నుంచి ఇంటికి కనీసం 15 నిముషాలైనా పడుతుంది. కానీ నేను భయంతో తొక్కడం వల్ల ఐదు నిముషాలలోనే

ఇంటికి చేరుకున్నాం. నాకోసం ఎదురు చూస్తున్న మా అమ్మ "ఏరా బాగుందా సినిమా" అని అంది. "బాగుందమ్మా" అని చెప్పి ఇంట్లోకెళ్లాను. అబ్దుల్‌గాడు కూడా వాడి ఇంటికి వెళ్లిపోయాడు.

అమ్మ భోజనం పెడుతూ "వైజాగ్ పెదనాన్న, పెద్దమ్మ సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు. మనం ఇంకో రెండు రోజుల్లో వైజాగ్ వెళ్తున్నాం" అంది.

"అంటే వైజాగ్ బీచ్, కైలాసగిరి అన్నీ చూడొచ్చన్న మాట" అన్నాను ఆత్రుతతో, ఆనందంతోనూ..

"ఆ సరే" అంది అమ్మ మజ్జిగ పోస్తూ... మజ్జిగన్నం తిని ఎప్పటిలాగే వీధి గదిలో మంచం ఎక్కి పడుకున్నాను. ఆత్మ, దెయ్యం అనే మాటలు నాకింకా గుర్తొస్తూనే ఉన్నాయి. భయంతోనే మెల్లగా కనులు మూసి నిద్రలోకి జారుకున్నాను. పొద్దున్నే పక్కనుంచి అబ్దుల్‌గాడి పిలుపు వినపడుతున్నాయి.

కలా, నిజమో తెలీదు...కళ్లు తెరిచి చూసేటప్పటికి నిజంగానే వాడి పిలుపు వినపడుతోంది వీధిలోంచి... ఇంకా ఏడు కూడా కాలేదు అప్పుడే లేచాడా వీడు అసలు రాత్రి పడుకున్నాడా అని నా డౌటు.

"అరేయ్ పొద్దున్నే ఈత పండ్లకి వెళ్దామని చెప్పా కదా"

"కానీ ఇంత పొద్దున్నేనా??" అన్నాను బద్ధకంగా.

"పద" అని మా ఇంటి వెనకాల ఉన్న తోటల్లోకి పరిగెట్టాం. కొంచెం కొత్తగా ఉన్న పండ్లను ఏరి చెంబులో వేసుకుని తీసుకొచ్చాం...

అది చూసిన పెదమామ "ఎక్కువ తినకండిరా వెదవల్లార పాసనాలు పట్టుకుంటాయి" అని గట్టిగా అరిచింది.

"కావాలంటే అడుగు ఇస్తాం అంతేగానీ పాసనాలు అవీ ఇవీ అనకు" అని చేతిలో నాలుగు పళ్లు పెట్టాం.

"ఓరి బడుద్దాయి" అని బుగ్గ గిల్లింది.

"ఒరేయ్ అబ్దుల్ నేను కొన్ని రోజులు ఊరెళ్తున్నానురా" అన్నాను.

"ఏ ఊరురా" అన్నాడు.

"వైజాగ్ పెదనాన్న వాళ్ల ఇంటికి"

"అయితే వైజాగ్ బీచ్ అవన్నీ తిరుగుతావన్న మాట"

"హా అమ్మ తీసుకెళ్తానందిరా. నువ్వు ఏ ఊరూ వెళ్లట్లేదా." అని అడిగాను.

"వెళ్తున్నానురా ఆకువీడు. రేపే నా ప్రయాణం"

"ఓహో ఇంతకీ మన రిజల్ట్స్ ఎప్పుడంట"

"వస్తాయిలేరా ఇంకో 45 రోజుల పైనే పడుతుందని హెడ్‌మాష్టార్ చెప్పారు".

"ఈ నెల రోజులూ అక్కడే ఉంటావా?"

"ఏమోరా మా అమ్మ ఇష్టం మరి. నువ్వు వైజాగ్‌లో ఎన్ని రోజులుంటావ్??"

"ఇదీ మా అమ్మ ఇష్టం రా" అన్నాను. అదేంటో ఎప్పుడూ పిల్లల ఇష్టాయిష్టాలు అమ్మల మీద ఎక్కువగా ఆధారపడతాయని అనుకున్నాను.

ఈ లోపల అమ్మ గట్టిగా పిలుస్తూ "ఒరేయ్ అభి ఈరోజు సాయంత్రమే వైజాగ్ బయలుదేరుతున్నాం. పెదనాన్న గారు ఫోన్ చేసారు. ఇప్పుడు అమలాపురం వెళ్తున్నాం త్వరగా రా" అంది.

"సరే వస్తున్నా అమ్మ. అబ్దుల్ వుంటాను రా. మళ్లీ కలుద్దాం" అని చెప్పి వెళ్లిపోయాను.

ఇంతలో త్వరత్వరగా స్నానం చేసి అబ్దుల్‌గాడి ఇంటికెళ్లాను. నేను రావడం చూసిన అబ్దుల్ వాళ్ల అమ్మ నానురొట్టెలో పంచదార వేసి తినమని ఇచ్చింది. నానురొట్టెలంటే అన్ని రొట్టెల్లాంటివి కావు. ఒక రొట్టెను అరగంట సేపు పీక్కుని తినాలి. కానీ చాలా బాగుంటుంది.

ఇంకా లేటు అయితే అమ్మ తిడుతుందని అబ్దుల్‌కి, వాళ్ల అమ్మ గారికి 'బాయ్' అని చెప్పి త్వరగా ఇంటికి వచ్చేసాను. నిజంగా అబ్దుల్‌గాడి ఇంటికి మా ఇంటికి పెద్ద దూరం అనేది ఉండదు. పరిగెడితే రెండు నిముషాలు నడిస్తే నాలుగు నిమిషాలు. కానీ అమ్మ మీద ఉన్న భయం నన్ను తొందర పెట్టింది.

ఎప్పటిలానే రేవు దాటి అక్కడ నుంచి అమలాపురానికి ఆటో ఎక్కాం.

"ఎస్.కె.బి.ఆర్ కాలేజ్ దగ్గర ఆపమ్మ" అంది అమ్మ ఆటో వాడితో. అట్లానే వాడు రోడ్డుకి వారగా ఒకచోట ఆపు చేసాడు. అమ్మ వాడికి ఐదు రూపాయలిచ్చి కాసేపు గొడవపడి ఇంకో రూపాయి ఇచ్చి పంపించేసింది. ఆటో దిగిన వైపు పెద్ద పెద్ద అక్షరాలతో "శ్రీ కోనసీమ బానోజీ రామర్స్ కాలేజీ" అని రాసి వుంది. అమ్మ కాలేజీని చూపించి "మీ చింతాతలు, మావయ్య, పెదనాన్నలు, అందరూ ఇక్కడే

చదివారు" అని చెప్పింది. రోడ్డు దాటాక ఎదురుగా ఉన్న సందులోకి వెళ్లాం. కొంచెం దాటాక వేపచెట్టు కింద మా రెండో మావయ్య పడక కుర్చీ వేసుకుని ముక్కు పొడుం పీలుస్తున్నాడు. మొన్నటిదాకా మావయ్య బోడసకుర్రులోనే ఉండేవాడు కాకపోతే బావ, వదినల స్కూలుకి దగ్గరగా ఉంటుందని అమలాపురం వచ్చేసాడు. అమ్మ ముందే వస్తామని చెప్పడం వల్ల అనుకుంటా అత్త "బస్సులోకి చపాతీలు పెడతాను" అంది.

బస్సు నెమ్మదిగా కదిలింది, నేనూ, అమ్మ అత్త, మావయ్య, బావ ఇలా ఐదుగురం వైజాగ్ బయల్దేరాం... బస్సు ఎక్కానో లేదో నిద్ర ముంచుకు వస్తోంది. మసక మసకగా బోర్డుమీద ముమ్మిడివరం అని కనిపిస్తుంది.

ఆ తర్వాత పూర్తి నిద్రావస్థలోకి జారుకున్నాను.

ఎవరో "అభి లేరా లే" అన్న పిలుస్తున్న శబ్దంతో ఉలిక్కిపడి లేచా... మావయ్య "వైజాగ్ వచ్చేసింది దిగాలి" అంటున్నాడు కంగారుగా పెట్టెలు దించుతూ.

"బాబు కొంచెం గురుద్వార్ దగ్గర ఆపమ్మా" అన్నాడు బస్సు డ్రైవర్‌తో.

మేము బస్సు దిగడంతోనే అక్కడ బుజ్జి అన్న, చిన్నన్న రెడీగా ఉన్నారు. మమ్మల్ని తీసుకువెళ్ళడానికి.

వైజాగ్... మా ఊరికంటే పెద్దది అని నేను విన్నాను. అక్కడ సందులలోని రోడ్లు కూడా చాలా విశాలంగా ఉన్నాయి. అంతే కాకుండా పెద్ద పెద్ద మేడలు చాలా ఉన్నాయి. మా ఊర్లో అయితే కరణం గారి మేడ, ఇంజవరపు అబ్బాయి గారి మేడ, ముదిరెడ్డోల్లది ఇలా వేళ్లమీద లెక్కపెట్టచ్చు. అంతే కాకుండా ఇక్కడ క్రికెట్ ఆడుకోడానికి, ప్రశాంతంగా గగ్గ వెళ్లేందుకు ఎక్కడా తోటలనేవి లేవు. వీళ్లందరూ ఎలా బతుకుతున్నారా అనిపించింది. పెదనాన్న గారు ఉంటున్నది రెండంతస్తుల మేడ. మొదటి అంతస్తు పెదనాన్న వాళ్ళ తమ్ముడు ఉంటాడట. చూడటానికి చిన్న ఇల్లులానే ఉంది. అన్నయ్య చెప్పడం బట్టి పట్నంలో ఇళ్లన్నీ కూడా ఇలానే ఉంటాయట. సత్యనారాయణ వ్రతం పూర్తయిన తర్వాత రోజు నుండి వైజాగ్ తిప్పుతానని మాట ఇచ్చాడు. మాట ప్రకారం సత్యనారాయణ వ్రతం అయ్యాక సాయంత్రం బీచ్‌కి తీసుకువెళ్లాడు. సముద్రాన్ని చూడటం అదే మొదటిసారి. సాయంత్రం ఐదు అయ్యిందేమో పిల్ల, పెద్దలతో బీచ్ మొత్తం కలకలలాడుతోంది. కొంతమంది ఒడ్డున

కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే, మరికొందరు సముద్రంలోకి దిగి కేరింతలు కొడుతున్నారు.

"ఏరా ఏమైనా తింటావా ఇక్కడ మోరిమిక్చర్ బాగుంటుంది" అన్నాడు బుట్టలో మరమరాలు ఒక కుండ వేసి కలుపుతున్న ఒకతన్ని చూపిస్తూ...

"వద్దులే అన్నయ్యా" అన్నాను.

గట్టు మీద కూర్చుని ప్రశాంతంగా అందరినీ గమనిస్తున్నాను. కొంతమంది అన్నయ్యలు ఒకరి మీద ఒకరు నీళ్ళు చల్లుకుంటూ ఇసుక చిమ్ముకుంటూ ఆడుకుంటున్నారు. ఇంతలో ప్రశాంతంగా ఉన్న సముద్రం కొంచెం కల్లోలంగా మారింది. చూస్తుండగానే ఒక పెద్ద కెరటం ఆ అన్నయ్యలలో ఒకరిని లాక్కుపోయింది. అంతా గందరగోళం, అరుపులు, కేకలు ఆ ప్రదేశంలో మిన్నంటాయి.

వెంటనే అన్నయ్య నన్ను తీసుకుని బయలుదేరిపోయాడు. కానీ నాకు మాత్రం అక్కడే ఉండాలనిపించింది. ఆ మనిషి ఏమైపోయాడా అనిపించింది? అప్పటిదాకా నవ్వుతూ ఉన్న మనిషి ఒక్క నిమిషంలో మాయం అయ్యాడు విచిత్రంగా.

ఇంటికి వెళ్లినా అది నా మనసులోంచి అంత తొందరగా పోలేదు. అమ్మ, పెద్దమ్మవాళ్లు ఏవో మాట్లాడుకుంటున్నారు. బీచ్‌లో ఇలా జరిగిందని తెలియగానే "జాగ్రత్త కావాలి నాయనా అందుకే పెద్దల మాట వినాలి" అని పెద్దమ్మ దగ్గరకు తీసుకుంది. ఆ తర్వాత రోజు సాయంత్రమే కైలాసగిరి కొండకు తీసుకెళ్లాడు పెద్దన్నయ్య. ప్రశాంతమైన వాతావరణం. అక్కడే ఉండిపోవాలనిపించింది.

కానీ కుదరదుగా. కాసేపున్నాక అన్నయ్య "వెళ్లిపోదాం! ఇప్పటికే చాలా ఆలస్యమైంది" అన్నాడు. ఇద్దరం ఇంటికి చేరాం. వైజాగ్‌లో రోజులు త్వరగానే గడిచిపోతున్నాయి. పొద్దున్న నుంచి సాయంత్రం దాకా రంగుల టి.వి. చూడటంతోనూ, సాయంత్రం బయట తిరగడాలతో వైజాగ్‌లో సెలవులు త్వరగానే గడిచిపోయాయి. అప్పుడే ఇంటికి వెళ్లాలని లేకపోయినా తప్పదని అమలాపురం బస్సు ఎక్కాం అమ్మా, నేను.

ఈ సారి సెలవులన్నీ త్వరగానే అయిపోయాయి. అబ్దుల్‌గాడు నాకన్నా రెండు రోజుల ముందే ఊర్లో దిగాడంట.. నేను ఆటో దిగగానే వాడే నాకు ఎదురు వచ్చి "ఇంకో రెండు రోజుల్లో మన పబ్లిక్ రిజల్ట్స్ వస్తాయంటరో" అన్నాడు.

"అవునా నాకు భయంగా వుంది. సర్లే ఇప్పటి నుంచి భయపడి ఏం చేస్తాం".

"మీ కబుర్లు తర్వాత ముందు ఇంట్లోకి పద" అని అమ్మ అనడంతో... "అరేయ్ ఇవాళ సబ్బ్యార్ ఇండియార్ ఆడదాం" అని లోపలికి వెళ్లిపోయాను.

సరిపెల్లోరి పిల్లలు, మేము మొత్తం ఇలా ఇరవై మంది పిల్లలు పోగయ్యాం. ఇప్పుడు ఇరవై మంది పంటలు వేసుకోవాలి దొంగ ఎవరో తేలడానికి... ఇది చాలా పెద్ద తలపోటు విషయం.

మొదట ఐదుగురు ఐదుగురుగా నాలుగు బ్యాచ్‌లు విడిపోయాం.. నాలుగు బ్యాచ్‌లలోంచి ఒక్కొక్కరుగా నలుగురు వచ్చి మళ్లీ పంటలు వేసుకోవాలి. చివరకు ఎవరు మిగులుతారో వారే దొంగ. అదేంటో ఆ నలుగురులో నేను అబ్దుల్‌గాడు మిగిలాం. మిగతా ఇద్దరు సందీప్ గాడు, అయ్యన్న. ముందుసారి వేసినప్పుడు అబ్దుల్‌గాడు బాగానే తప్పించుకున్నాడు. రెండోసారి సందీప్, అయ్యన్న, నేనే మిగిలాం.

ఈసారి ముగ్గురు చేతులను ఒకేలా వేయడంతో ఇంకోసారి వేయాల్సివచ్చింది. అయితే ఈసారి అయ్యన్న తప్పించుకున్నాడు. అంటే పంట అయినట్టన్నమాట. చివరికి మిగిలింది సందీప్, నేను. మా ఇద్దరిలో దొంగ ఎవరో తేల్చడానికి ఒక బుడంకాయ్ కావాలి. అబ్దుల్‌గాడు ముందుకు వచ్చి "నాలా ఎవరు వేస్తే వాళ్లు పంట మిగతావారు దొంగ" అన్నాడు. వాడు నాకు ఏదో చెప్తున్నాడు అనిపించింది. వెంటనే వాడి చేతులను చూసాను ఆ ప్రయత్నం ఫలించింది. నేను పంట, సందీప్‌గాడు దొంగ. ఒకటి నుండి వంద అంకెలు లెక్కపెట్టమన్నాం. ఈ లోపల ఎక్కడ దాక్కోవాలి అనుకుంటూనే ఇద్దరం అబ్బిగారి మేడ వెనకాల దగ్గరికి పోయాం.

నిజానికి మా ఇద్దరిని పట్టుకోవడమంటే చాలా కష్టమైన పని. అది అందరికి తెలుసు. మా ఇద్దరి వెనుక కొంతమంది వస్తాం అని పట్టుబట్టినా వాళ్లకి ఇక్కడో అక్కడో దాకోండి అని చెప్పి మేం ఇద్దరం జారుకున్నాం. నిజానికి ముందు ఎవరు దొరుకుతారో మళ్లా దఫా ఖాతా పెట్టాలన్న మాట. అది వాళ్ల భయం.

అప్పటికే చాలా సేపయ్యింది. అందరూ దొరికేసుంటారు అనుకున్నాం.

"అరేయ్ అబ్దుల్ మనం ఇక్కడి నుండి మా ఇంటి ప్రహరి గోడ వెనకాల దాక్కొని సబ్బ్యార్ కొడదాం" అన్నాను.

"సరే" అని ఇద్దరం ఇంటి ప్రహారి గోడ వెనకాల చేరాం. అప్పటికే అందరూ దొరికిపోయారు. మొదట అయ్యింది అయ్యన్న గాడంట..

అందరూ వాడిని గేలి చేస్తున్నారు. వాడి ముఖంలోనే విచారం ఎక్కువ కనబడుతోంది. ఇద్దరం ఒకేసారి ఉరికి సబ్యార్ కొడదాం అని నిర్ణయించుకున్నాం. ఎందుకంటే వాడు 'అభి ఇండియార్', 'అబ్దుల్ ఇండియార్' అని పలకాలి. వాడికి అంత వ్యవధి మేం ఇద్దామనుకోలేదు. వెంటనే ఇద్దరం వాడిమీదకు ఉరికి సబ్యార్ అన్నాం. అంతటితో వాడి ఆటకట్టు మళ్ళీ తిరిగి వాడే... కొన్ని సాయంత్రాలు ఇలా చక్కగా గడిచిపోతాయి.

మా దరిద్రమో, అదృష్టమో రిజల్ట్స్ అనుకున్న దానికన్నా ఒకరోజు ముందే వచ్చాయి. పదకొండు గంటలకి మంత్రి గారి చేతులమీదగా విడుదల అవుతాయట. అబ్దుల్‌గాడి మొహంలో భయం కనిపించట్లేదు కానీ కాస్త భయంగానే ఉన్నాడు అని నాకనిపిస్తోంది. నాకయితే ఇంకా భయం. అప్పుడే ఒకసారి దేవుణ్ణి తలచుకున్నా. ఒకసారి ఏంటి? చాలా సార్లు తలచుకున్నా. బహుశా ఇలాంటప్పుడే దేవుడు గుర్తుకువస్తాడనుకున్నాను.

ఇద్దరం ఈనాడు పేపరుని చేతిలో పెట్టుకుని మా బి.ఎస్.ఎన్.ఎల్ ల్యాండ్ లైన్లో వాడిచ్చిన నంబర్లుని కొడుతున్నాం. అన్నీ బిజీ అనో లేకపోతే "కూకూ" అని కూతపెడుతున్నాయి. ఆఖరికి ఫోను కలిసింది మా అక్క చేతిలో... అదేంటో అక్క కూడా మొదట అబ్దుల్‌గాడి నంబరునే టైప్ చేసింది. అక్క త్వరత్వరగా వాడి మార్కులు చెబుతోంది. అప్పటికే వాడు పెన్ను పేపరు పట్టుకుని రెడీగా ఉన్నాడు. "తెలుగు-90, హిందీ-95, సైన్సు-98, లెక్కలు-100, ఇంగ్లీష్-87, సోషల్-92 మొత్తం 562" అని ముగించింది. "దరిద్రుడు అన్ని మార్కులు ఏం చేసుకుంటాడు" అనుకున్నాను.

ఇక నా వంతు "తెలుగు-96, (ఆనందం వాడికన్నా ఎక్కువ వచ్చిందని) హిందీ-82, సైన్సు-86, లెక్కలు-90, ఇంగ్లీష్-81, సోషల్-86 మొత్తం 522". అదేంటి వాడూ నేను కలిసి చదివాం నాకు తక్కువ రావడమేమిటి అనే బాధ. అంతలోను లేదు వాడికొచ్చిన మార్కులకు ఫ్రీగా కాన్వెంటులో చేరచ్చనే ఆనందం.

నాకు ఎంతో కొంత ఫీజు తగ్గుతుంది.. వీధి అంతా స్వీట్లు పంచిపెట్టి మేం కొన్ని తినేసాం. అదేంటో వీధిలో అవేవో రోగాలంట. తింటే ముందే పోతారంట.. అందుకని వాళ్ల తరఫున కూడా తినేయమన్నారు. 'అంటే మేం పోయినా పర్లేదా?'

అనే సందేహం వచ్చింది.ఈ పెద్దోళ్లు అందులోనూ మా వీథిలో వాళ్లు ఎంతటి స్వార్థపరులు అనిపించింది.

"ఎలివెన్ ఇంగ్లీషు మీడియం కాన్వెంటు" అని ఇంగ్లీషులో పెద్ద పెద్ద అక్షరాలతో రాసి వుంది. దానిని చదవడానికే నా తల బొప్పి కట్టింది. ఇంక ఈ స్కూలులో చదవడం ఎలాగరా అనుకున్నాను. అనుకున్నట్టే నేనూ, అబ్దుల్‌గాడు కాన్వెంటు స్కూలులో చేరి బాగా చదవాలని, బాగా అల్లరి చేయాలని మంచి ముహూర్తం నిర్ణయించుకుని మరీ చేరాం...

అనుకున్నట్టే వాడికి ఫీజు లేకుండానూ, నాకు కొంచెం ఫీజుతో స్కూలులో చేర్పించుకున్నారు. మొదటి రోజు స్కూలు... ఈ కాన్వెంటు వాళ్లని ఎప్పుడూ మేం తిట్టుకుంటూ ఉంటాం. మమ్మల్ని మా స్కూలుని దుంపలబడి అంటూ ఉంటారని. అలాంటిది మేం ఈ స్కూలులో చదవడం చాలా చిత్రం అనిపించింది. మొదట తెలుగు పీరియడ్ వి.వి శాస్త్రి అంట మాస్టారు పేరు. చిత్రం ఏంటంటే మధ్య మధ్యలో వచ్చీరాని రెండు ఇంగ్లీష్ ముక్కలని ఆయన అక్కడక్కడ వాడుతున్నాడు. అది విని నేను, అబ్దుల్ నవ్వుతుంటే ఇవతల ప్రక్కనున్నవాడు 'డోంట్ లాఫ్ గాయ్స్' అని మెల్లగా చెప్పాడు.

మధ్యాహ్నం సమయానికి మేం ఇద్దరం ఒక నిర్ధారణకు వచ్చాం. ఇక్కడ ఇంగ్లీషే మాట్లాడాలంట. తెలుగు అసలు మాట్లాడకూడదంట. ఒకవేళ మాట్లాడితే మెడలో 'ఐయామ్ డాంకీ' అనే పలకని ఒక రోజు వేసుకుని స్కూలులో తిరగాలట.

ఎంతటి మూర్ఖత్వం ఈ స్కూలులో అమ్మని "అమ్మా" అని పిలవకూడదంట అని అనుకున్నాను మనసులో... కానీ ఏం చేస్తాం తప్పలేదు. ఆ పరిస్థితులకు ఇద్దరం అలవాటు పడాలి అనుకున్నాం. మాతో పాటూ కొంతమంది తెలుగు మీడియం పిల్లలున్నారు. వాళ్ళు మా తోటి చేరినవారే మేమంతా భోజనాలు తినేటప్పుడు... ఇంగ్లీషు పిశాచాలు లేనప్పుడు తెలుగు మాట్లాడేవాళ్లం. అదే దౌర్భాగ్యం అనుకుంటే ఇంట్లో పెద్దవారు ఇంగ్లీష్ మాట్లాడించుకుని ఆనందపడటం అదో పెద్ద దౌర్భాగ్యం.

రోజులు బాగానే గడిచిపోతున్నాయి. అది ఎనిమిదవ తరగతి ఫైనల్ పరీక్షలు... ఎప్పటిలాగే నేనూ, అబ్దుల్ సైకిల్ మీద బయలుదేరాం. ఎప్పుడూ 10:00కి పరీక్ష అయితే 9:30కల్లా స్కూలులో ఉండాలి.

మా దరిద్రానికి ఆ రోజు అబ్దుల్‌గాడి డొక్కు సైకిల్ ప్యాచీ పడింది. వాళ్ల నాన్న ప్యాచీ వేసేటప్పటికి 9:10 అయిపోయింది. ఇంకా 20ని॥లో స్కూలులో ఉండాలి. పన్నెండు కిలోమీటర్లు అదే కంగారు ఇద్దరిలోనూ... మా సైకిళ్లు రెండు చాలా పురాతనమైనవి. వాటితో తొక్కడం అంటే అంతే ఫాస్ట్‌గా రెండు రోజులు తిన్నది అరగటమే. మేం నగరం రోడ్డు మీద చాలా ఫాస్ట్‌గా తొక్కుతున్నాం. మామూలుగా వెళ్ళే స్కూలుకి వెళ్లడం కష్టమని 'ఎవరు ఫస్ట్ వెళ్తారో' అనే ఒక పోటీ పెట్టుకున్నాం. అబ్దుల్‌గాడు నా కన్నా ముందు పోతున్నాడు.

నగరం ఒ.ఎన్.జి.సి మొదటి గేటు దాటాం.. రెండవ గేటు దాటాక మా స్కూలు..

అబ్దుల్‌గాడు నాకంటే వంద అడుగుల దూరంలో ఉన్నాడు. నా సైకిలు అస్తమానూ ఊడిపోతూ ఉంటుంది. 'డొక్కు సైకిలు' అని తిట్టుకున్నాను. ఒ.ఎన్.జి.సి రెండవ గేటు దగ్గరకి వెళ్తున్నాడు వాడు. ఇంక 'వాడే ఫస్టు' అని నేను నిర్ణయించుకున్నాను. వాడు 'నేనే ఫస్ట్ అన్నట్టు వెనక్కితిరిగి ఒక నవ్వు విసిరాడు. అంతలో రెండవ గేటు నుంచి వస్తున్న ఒక లారి వాడిని ఎగరేసుకుపోయింది.

రోజు ఒకేలా గడవదు, విధి ఎప్పుడూ ఒకేలా ప్రవర్తించదు. అంతా క్షణాల్లో అయిపోయింది. జనాలు గుమిగూడారు. "పిల్లాడు స్పాట్‌డెడ్" అని అన్నాడు ఒకాయన. రోడ్డంతా రక్తపు మరకలతో నిండి వుంది. స్కూలుకి దగ్గరగా ఉండటంతో స్కూలు ప్రిన్సిపాల్ వాళ్లు వచ్చారు. నా కళ్లలోంచీ కన్నీళ్లు కూడా రావట్లేదు. వాడి క్యారేజీ బాక్సు ఒక మూలగా పడివుంది. వాడు నా కోసం తెచ్చిన నాన్ రొట్టెలు బయట పడి ఉన్నాయి. నా మీద ఎంత ప్రేమ వాడికి. ఏడుస్తున్నాను.... నాకు కూడా ఏదో అయ్యిందేమోనని అందరూ నన్ను చుట్టుముడుతున్నారు.

"పిల్లాడు భయపడ్డాడు. కొంచెం మంచినీళ్లు ఇవ్వండి" అన్నాడో వ్యక్తి. భయమా?? కాదు బాధ.. అబ్దుల్ వాళ్ల అమ్మ నాన్న వచ్చారు. వాళ్ల ఏడుపుకి అంతులేదు. వాళ్లని చూస్తే నాకు ఏడుపు ఆగలేదు. ఇంతలో మా అమ్మ, నాన్న వచ్చారు. అబ్దుల్ శవాన్ని ముల్కిపల్లిలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. నేను అమ్మ నాన్నలతో పాటూ వెళ్లాను. శవం అంటున్నారు అంటే అబ్దుల్ ఇక లేడు... ఏడుపు ఆగట్లేదు. ఏమైపోయాడు... వీడు ఇప్పటిదాకా నాతోనే ఉన్నాడు. వాడి చివరి చిరునవ్వు కూడా గుర్తుంది. అంతలోనే ఏమైపోయాడు. నాకు ఒక్కడికి మధ్యాహ్నం పెట్టారు పరీక్ష. పరీక్ష కూడా సరిగ్గా రాయలేదు. ఏదో పాసవుతానంతే.

అబ్దుల్ చనిపోయాడు. ఇంక నాకు స్కూలుకి తోడుగా వచ్చేవారు ఎవరూ లేరు. నాతో ఆడుకునే వారు లేరు అనే బాధ కన్నీళ్లలా వస్తుంది. వాడి చావును చూసినందుకో ఏమో నాకు జ్వరం వచ్చిందని... శరీరం కాలిపోతుందని అమ్మ అంటుంది. కానీ అది నాకేం తెలియట్లేదు. అబ్దుల్‌గాడు నా కళ్ల ముందే కదులుతున్నాడు. సాయంత్రం వాడి శవంతో పాటూ అందరం ఊరికి వచ్చేశాం. వాడింటి దగ్గర నుండి నాకు రావాలనిపించట్లేదు. కానీ అమ్మ బతిమలాడి "రేప్పొద్దున్న వద్దాం" అనేటప్పటికి ఇంటికి వెళ్లాం.

ఇంటికి వెళ్లి స్నానం చేసాక "నీకు జ్వరంగా వుంది పడుకో రేప్పొద్దున్నే అబ్దుల్ వాళ్ల ఇంటికి వెళ్దువు గాని" అంది. నాకు జ్వరం లేదు. వాడు పోయాడన్న బాధ. వాళ్ల అమ్మ నాన్న మొహాలు గుర్తొచ్చినప్పుడల్లా ఏడుపు రెట్టింపయ్యేది. వాడు వాళ్ల కోసం ఎంత కష్టపడ్డాడో... వాళ్ల నాన్న కోసం ఎంతలా చదివాడో...

వాడికి, వాళ్ల నాన్నకి లేనిదల్లా డబ్బు ఒక్కటే. ఊర్లో మంచితనం, ప్రేమ, పరువులకి, అబ్దుల్ వాళ్ల నాన్న ఎప్పటికీ తీసిపోడు. వాళ్ల నాన్న ఇప్పుడు ఏం చేస్తాడో అనిపించింది.

ఆ రాత్రంతా వాడితోనే గడిచింది. వాడితో మాట్లాడుతున్నట్టు.. ఆడుకుంటున్నట్టు... ఇక రేపటినుంచి వాడితో ఉండను అని తలచుకుంటూనే ఏడుపు ఆగలేకపోయింది. అక్కడికీ మా నాన్న నా దగ్గరే పడుకున్నాడు. ఆ రాత్రంతా అలాగే గడిచింది ఏడుపుతో.

పొద్దున్నే మొహం కూడా కడుక్కోకుండా అబ్దుల్‌గాడింటికి పరిగెట్టాను. అప్పటికే వాడిని తీసుకువెళ్లడానికి అందరూ సిద్ధంగా ఉన్నారు. ఎవరో పెద్దాయన పెద్ద గడ్డంతో ఉన్నాడు. అతనేవో గట్టిగా చదువుతున్నాడు. వాడిమీద పచ్చగా ఉన్న దుప్పటి కప్పారు. అందరూ బిగ్గరగా ఏడుస్తున్నారు. నేను కూడా...

వెనకాల ఎంతమంది తిడుతున్నా నేను ఆ శవంతో పాటే వెళ్లాను. ఊరిలో ఘోరీల దగ్గర వాడి శవాన్ని పాతిపెట్టారు. ఇక వాడు లేడు.. రాడు... అన్నీ ముగిసాయి. వాడు నాతో గడిపిన క్షణాలు ఆ క్షణంలో ఘోరీలో పూడ్చిపెట్టబడ్డాయి. చనిపోయాడు సరే ఏమైపోయాడు.....

"ఒరేయ్ అభి! అభి! అభి! నిన్నే వినిపిస్తోందా" అంటూ అమ్మ నన్ను కదుపుతోంది. ఇంత పరధ్యానం... జ్ఞాపకాలు ఇలాగే చేసేస్తాయి. ఎవరికీ పలకకుండా, అసలు ఈ ప్రపంచాన్ని పట్టించుకోకుండా...

"ఒరేయ్ వినిపిస్తోందా భోజనానికి రా" అంది అమ్మ.

"సరే అమ్మ నువ్వు వెళ్లు" అన్నాను. మొహం అమ్మకేసి తిప్పకుండానే చెప్పాను సమాధానం. కారణం మొహం మీద కన్నీళ్లు అమ్మకి కనబడతాయేమోనని భయం.. కళ్ళు తుడుచుకుని భోజనానికి వెళ్లాను.

"నాన్న భోజనం చేసారా..??"

"లేదు. రేపు తాత గారి తిథి అని చెప్పాను కదరా ఫలహారమే".

ఇవన్నీ వింతగా తోస్తాయి. కానీ జీవితంలో కొన్ని కొన్ని నమ్మాలి. మా నాన్నగారు ఇప్పటికీ పొద్దున్నే తాను తినే మొదటి ముద్ద కాకికి పెట్టడం కొంచెం వింతగానే అనిపిస్తుంది. ఆ ముద్దని పితృదేవతలు తింటారని.. అంతే కాకుండా ప్రతి ఆరు నెలలకు నువ్వులతో నీళ్లు వదిలిపెట్టడం.. ఇది పితృదేవతల దాహం తీర్చడానికంట ఇవన్నీ కొంచెం ఆశ్చర్యంగా ఉంటాయి. కానీ ఇవన్నీ నిజాలు. అవన్నీ నన్ను ఎలా కాపాడాయో నాకు తెలుసు. మనం చేసే నిత్య కర్మలకి, క్రియలకి ఒక కారణం రాసి పెట్టారు పెద్దవాళ్లు.

ఏంటో భోజనం కూడా సరిగ్గా తినలేకపోయాను. అబ్దుల్‌గాడు పదే పదే గుర్తొస్తున్నాడు.

"అరేయ్ భోజనం కూడా సరిగ్గా తినలేదు. పొద్దున్న భోజనాలు కూడా లేటవుతాయి. కాబట్టి చంద్రరావు హోటల్ టిఫిన్ తినెయ్ సరేనా" అంది అమ్మ.

"సరేమ్మా!" అని మంచం మీద వాలాను. పొద్దున్నే ఎప్పటిలాగే అన్ని పనులూ చేసుకుంటోంది అమ్మ. అత్తా, పెద్దమ్మ ఎవరి పనులలో వాళ్లు ఉన్నారు. నాన్న, పెదనాన్న స్నానాలు చేసి తడి తెల్ల పంచెలు కట్టుకుని పంతులు గారి కోసం ఎదురుచూస్తున్నారు. ఇదంతా ఎంత కష్టమైన పనో అనుకున్నాను. వదిన కాఫీ పెట్టి ఇవ్వడంతో 'హమ్మయ్య' అని అనుకొని స్నానం చేసి కూర్చున్నాను.

మళ్లీ పరామర్శల పర్వం మొదలు తద్దినంకొచ్చినవారితో....

మొదట గన్నవరం మామ "ఏరా అబ్బాయ్ ఆరోగ్యం ఎలావుంది" అని అడిగింది గట్టిగా. ఆవిడకు చెవుడు నాకు కాదు కదా అనుకున్నాను.

"బానే వుంది మామ" అన్నాను.

"త్వరగా పెళ్లి చేసుకోరా అబ్బాయ్ అప్పుడు ఎలాంటి రోగాలుండవు".

తద్దినంకి వచ్చిన ఈవిడకి నా పెళ్లి గోల ఏమిటా అనుకున్నాను. ఎక్కడికొచ్చినా వీళ్ల చాదస్తాలు మారవేమో అనుకున్నాను. గన్నవరం మామతో పాటూ సతీష్, స్వాతి సతీసమేతంగా వచ్చారు. స్వాతి చేతిలో పాప కూడా వుంది. వాడికి నేను రీసెర్చ్ సైకాలజీ మొదటి సంవత్సరంలో ఉండగా పెళ్లయింది. పెళ్లి పేరూరులో జరిగింది. పల్లకి ఊరేగింపు... బాణాసంచా కాల్పుడు కొంచెం ఘనంగానే జరిగింది.

"ఆరోగ్యం ఎలా వుంది అన్నయ్య" అంది స్వాతి.

"బాగానే వుందమ్మా" అన్నాను.

"ఏంటి బావా మరీ చిక్కిపోయావు" అన్నాడు వెటకారంగా సతీష్. ఈ మధ్య ఇంటి తిండివల్ల కొంచెం పొట్ట వచ్చింది అని నేను అనుకుంటుంటే...

"ఏం లేదు బావా నేను మా అమ్మ పెట్టింది తింటున్నాను. నువ్వు మీ ఆవిడ పెట్టింది తింటున్నావు. అది కావచ్చు తేడా" అన్నాను నేను కూడా వెటకారంగా..

"ఏ అన్నయ్యా సెటైరు మీ బావ వేస్తే నువ్వు నీ చెల్లెలు మీద వేస్తున్నావు" అంది నవ్వుతూ.. అంతలో స్వాతి చేతిలో పాప ఏడ్వడంతో బ్యాగులో ఉన్న పాల సీసా పాప నోట్లో పెట్టింది.

"పాప పేరేంటి" అని అడిగాను.

"శశి" అంది నవ్వుతూ..

కళ్ళు పెద్దవి చేస్తూ "శశా" అన్నాను.

"అవును అన్నయ్యా శశిరేఖ బాలేదా" అంది.

"ఆ పేరు ఎప్పటికీ బాగుంటుంది" అన్నా కొంచెం గొంతు తగ్గించి. శశి ఒకటికి పదిసార్లు వినపడుతుంది ఆ పేరు. భోజనాలు అయిపోయాయి. ఎవరికి వాళ్లు వెళ్లిపోయారు. ఎందుకో ఆ చిన్నపాపతో చాలాసేపు ఆడుకున్నాను. ఆ పేరు వల్ల ఏర్పడిన అనుబంధం వల్ల అనుకుంటా.

టీ తాగి పెరటి సావిట్లో గల కుర్చీలో వాలాను. శశి మళ్లీ అదే పేరు ప్రతిధ్వనిస్తుంది మనసులో.. జ్ఞాపకాలు అలాగే తరుముతున్నాయి.

"శశి ఎక్కడున్నావ్ స్వర్గంలోనా.. నరకంలోనా.. ఎక్కడున్నా సుఖంగా ఉండు" అనుకున్నా.

శశి... శశిరేఖ ఆ పేరు, గతం బొంగరంలా మదిలో తిరుగుతుంది. ఆ రోజులు ఆమెను చూసిన మొదటి క్షణాలు అన్నీ ఇప్పుడు జ్ఞాపకాలు.

జ్యేష్ఠ మాసం జూన్ పద్నాలుగు దశమి తిథి. స్కూలు అన్నీ తెరిచే రోజు.. అన్ని రోజుల సెలవుల తర్వాత పిల్లలు స్కూలుకెళ్లను అని ఏడ్చేరోజు... నాకు కాలేజీకి మొదటిరోజు. నాకు పదవ తరగతిలో వచ్చిన 520 మార్కులకు కాకినాడ ప్రిలిమ్స్ కాలేజీలో చేర్పించారు. అక్కడే ఆ కాలేజీలోనే హాస్టల్ వసతి వుంది.

ఒక పరుపు, ఒక బకెట్టు, రెండు సబ్బులు, ఒక బ్రష్, పేస్ట్. ఏదో కాపురం పెట్టినట్టే చేరాను హాస్టల్‌లో. నాన్న నన్ను దింపి ఫీజు కట్టి వెళ్లిపోయారు. కాస్త భయంగానూ, బాధగానూ ఉంది. ఇన్నాళ్లూ ఇంటి దగ్గర ఇక్కడ చెంబు తీసి అక్కడ పెట్టేవాడిని కాదు. అలాంటిది ఇప్పుడు అన్ని పనులు నేనే చేసుకోవాలి అనే బాధ. రూమ్‌లో ప్రస్తుతానికి నేనొక్కన్నే ఉన్నాను. నాకు తోడుగా ఇంకొకరిని వేస్తారంట. ప్రస్తుతానికి ఎవరినీ ఎలాట్ చేయలేదు. నేను ఈ రోజు ఒంటరిగా పడుకోవాలనే భయం.

ఇంతలో "అభిమన్యు" అని ఎవరో తలుపు తట్టారు.

"ఇంటి నుంచి ఫోన్. ఇంకో పది నిముషాలలో మళ్లీ ఫోన్ చేస్తారంట వెళ్లి కింద రిసెప్షన్ ఫోన్ దగ్గర ఉండు" అన్నాడు వార్డెన్.

"సరే సార్" అన్నాను. అప్పటికే రూమ్ సర్దడం అయిపోయింది. మా రూమ్ రెండో ఫ్లోర్‌లో వుంటుంది. దిగాలంటే పది మెట్లు. వెళ్లి ఫోన్ దగ్గర నిలబడ్డాను.

ఫోన్ మోగుతుంటే రిసప్షనిష్ట్ "అభిమన్యు అంటే నువ్వేనా??" అంది ఆవిడ.

"హా అవును" అని ఫోన్ తీసుకున్నాను.

"అభి! అభి! వినిపిస్తోందా" అని అరుస్తోంది అమ్మ ఎప్పుడూ ఉండే కంగారుతో...

"హా వినిపిస్తుంది చెప్పమ్మా"

"రేపు ఏకాదశి మంచిరోజు కాలేజీకి వెళ్లు. అలాగే రెండో రోజూ తప్పకుండా వెళ్లాలి. లేకపోతే ద్వితీయ విఘ్నం. అర్థమయ్యిందా" అని చెప్పింది.

"సరే అమ్మా" అన్నా విసుగ్గా...

"వేళకు తిను, కొత్త ఆవకాయ అయిపోతే చెప్పు వచ్చేటప్పుడు నాన్న చేత పంపిస్తాను" అంది.

"సరే" అని పెట్టేసా ఫోను. ఈ పెద్దోళ్లకెందుకింత చాదస్తం. ఎందుకో ద్వితీయ విఘ్నాలు, ఎదురు రావడాలు ఇవన్నీ చాలా పెద్ద మూర్ఖత్వపు పనుల్లా అనిపిస్తాయి. అయినా ఇవ్వాళే కదా వచ్చింది. అప్పుడే ఆవకాయ అయిపోవడమేమిటి పిచ్చి కాకపోతే అని అనుకున్నాను. రూమ్ అంతా బాగా సర్దుకున్నాను అని మురిసిపోయి... పరుపు ఇనుప మంచం మీద వేసాను.

సాయంత్రం ఐదు అవుతోంది. ఒక కునుకు తీసి పడుకుందామనుకునేటప్పటికి ఏవేవో భయాలు... ఒంటరితనం మనుషుల్ని పిచ్చోళ్లని చేస్తుందనుకుంటా. ఎలాగోలాగ కుదురుచేసుకుని పడుకున్నాను. భోజనానికి అని తలుపు తట్టారు. అది వార్డెన్ గొంతు....

"వస్తున్నాను సార్" అని తలుపు తీసాను.

"రోజూ వచ్చి ఎవరూ పిలవరు. 7.30కల్లా భోజనానికి మెస్‌లో ఉండాలి. సాయంత్రం ఐదింటికి స్నాక్స్. పొద్దున్న ఏడింటికి టిఫిన్ అర్థమయ్యిందా" అన్నాడు.

"సరే సార్" అన్నాను.

మెస్ మా హాస్టల్‌కి కొంచెం దూరం. దూరం అంటే మరీ దూరం కాదు. అంటే కాలేజీ దగ్గరన్నమాట. పక్కనున్న రూమ్‌లో దిగిన స్వామికి ఇవన్నీ తెలుసని తనతో రమ్మన్నాడు. మెస్ కాలేజీ దగ్గర చూపించింది తనే.

ఈ రోజు కాలేజీకి కూడా వెళ్లాడంట. తాను మొన్నే కాలేజీలో చేరానని చెప్పాడు. మొదటి రోజు భోజనం బాగానే ఉంది.. బంగాళదుంప కూర ముక్క ఉడకలేదు. సాంబారు కొంచెం రుచి అనిపించింది. ఇంక అక్కడకు ఆవకాయ డబ్బాను పట్టుకువెళ్లడం కొంచెం సిగ్గుగా అనిపించి తీసుకెళ్లలేదు.

స్వామి నాతో పాటే మా రూమ్‌కి వచ్చి కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు. తనది కాకినాడ ప్రక్కనే తాళ్ళరేవని, గ్రూప్ బై.పి.సి అని, కష్టపడి చదివి డాక్టర్ అవ్వడమే లక్ష్యమని చెప్పాడు.

"నీది ఏ గ్రూప్" అని అడిగాడు.

"హమ్మయ్య నాకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చాడు" అనుకున్నాను మనసులో.

"ఎమ్.పి.సి" అన్నాను.

"ఇంజినీర్ అవుదామనా" అని అడిగాడు.

"లేదు"..

"మరీ"...

"మా అన్నయ్యలు చేరమంటే చేరాను అంతే" ఇలా చెప్పడానికి సిగ్గుగా అనిపించింది.

ఎందుకంటే నా భవిష్యత్తు ఏంటో నేను ఆలోచించలేకపోయినందుకు.

"సరే రేప్పొద్దున్న కలుద్దాం.. రేపు లేటుగా లేవచ్చు. అది కొన్ని రోజులే తర్వాత నుంచీ పొద్దున్న ఆరింటికే లేవాలంట" అని తను వెళ్లిపోయాడు.

ఇందాక ఒక కునుకు తీసానేమో నిద్రరావట్లేదు. స్వామిని ఉండమందామనుకుంటే తన రూమ్‌లో వేరే ఒకరున్నారంట. ఏవేవో ఆలోచనలు... పొద్దున్నే కాలేజీకి వెళ్లాలి. ఇంటర్‌లో ఎమ్.పి.సి అంటే అక్కర్లేకపోయినా తోముతారట. అందులోనూ ఎమ్.సెట్ అనీ, AIEEE అనీ పగలు రాత్రి తేడా లేకుండా అదే పనిగా చదివిస్తారని విన్నాను. ఇప్పటిదికా నేను కష్టపడి చదివింది లేదు... ఇలా ఆలోచిస్తూనే కునుకు తీసాను.

పొద్దున్నే ఎవరో తలుపు కొట్టిన శబ్దం అయితే చూసాను. స్వామి నన్ను లేపడానికి వచ్చాడు.

"పొద్దున్న 7.30 దాటితే టిఫిన్ పెట్టరు. అంతే కాదు బాత్‌రూమ్ ముందు పెద్ద క్యూ ఉంటుంది ఇప్పుడు.. త్వరగా రా" అన్నాడు.

టైమ్ పావు తక్కువ ఆరయ్యింది. ఇంత పొద్దున్నే నన్ను లేపడం కొంచెం చిరాకు అనిపించినా వాడు చెప్పిందే నిజమనిపించింది. బాత్‌రూమ్స్ పది ఉన్నా ఆ

పదింటి దగ్గరా ఒకరో ఇద్దరో వెయిట్ చేస్తూ ఉన్నారు. అందులోనూ సీనియర్స్‌కి ఫస్ట్ ప్రిపరెన్స్ ఇవ్వాలంట. ఇది నాకు నవ్వు తెప్పించిన విషయం. బాత్‌రూంకి వెళ్లడంలో ఫస్ట్ ప్రిపరెన్స్ ఏమిటసలు.. పిచ్చి కాకపోతే ఎవడికి అర్జెంటయితే వాడు వెళ్తాడు అనుకున్నాను.

ఇంక అంతా అయ్యాక... అమ్మ ముందు గానే చిన్న పొట్లంలో ఇచ్చిన పసుపు కుట్టించుకున్న కొత్త యూనిఫాంకి పెట్టాను.

కొత్త బట్టలు వేసుకుని ఒకసారి అద్దంలో చూసుకుని మురిసిపోయాను. 7.15 అయ్యింది రెడీ అయ్యేటప్పటికి అనుకున్న దానికన్నా పావుగంట ముందే రెడీ అయ్యా అనుకున్నా.

ఇంతలో స్వామి వాళ్ల రూమ్‌మేట్ ప్రసాద్‌ని తీసుకుని వచ్చి "అభిమన్యు టిఫిన్‌కి వెళదామా" అన్నాడు.

"నేను ఎప్పుడో రెడీ" అన్నాను.

"ఇతను ప్రసాద్ మా రూమ్‌మేట్" అన్నాడు ప్రక్కనే ఉన్న అబ్బాయిని పరిచయం చేస్తూ...

"చెప్పావ్ కదా నిన్న రాత్రి.. హాయ్ దిసీజ్ అభిమన్యు" అన్నాను. ఈ పలకరింపులు అయ్యేలోపే మెస్ కి చేరుకున్నాం.

టిఫిన్ చపాతీ.. సాగదీస్తే ఎంతైనా సాగుతుంది. రోజుకో టిఫిన్ పెడతారంట. కానీ ప్రతిరోజూ టిఫిన్ ఇలాగే వుంటే కష్టమని భావించా. సోమవారం ఇడ్లీ, మంగళవారం చపాతీ, బుధవారం బజ్జీ, గురువారం దోశ, శుక్రవారం ఉప్మా. శనివారం పూరీ, ఇక ఆదివారమయితే గారె. ఇలా వుంది మెనూ. ఏదేమైనా కష్టమే వచ్చి పడింది అనుకున్నా. కాలేజీ 8.30 అయితే మేం పావుగంట ముందే చేరుకున్నాం.

మొదటి రోజు కావడం వల్ల రూమ్ వెతుక్కునేటప్పటికి కాస్త సమయం పట్టింది. క్లాసులో అప్పటికే కొంతమంది కూర్చొని పరిచయాలు చేసుకుంటున్నారు. మొదటి బెంచి అచ్చురాదని రెండవ బెంచీలో కూర్చున్నాను. అంతకుముందు కూర్చొన్న అబ్బాయిని పరిచయం చేసుకుంటూ "నా పేరు అభి.. అభిమన్యు.." అన్నాను.

అంతలో వాడు "నా పేరు వెర్రియ్య" అన్నాడు.

వీడు నా స్టైల్లో చెప్పి ఉంటే ఎలా చెప్పేవాడో అనుకుని వస్తున్న నవ్వుని ఆపుకొని "మీ తాత గారి పేరా??" అని అడిగా.

"అవును నీకు నవ్వొచ్చింది కదా" అని అడిగాడు.

"లేదు నవ్వు రాలేదు" అన్నాను మళ్ళా వస్తున్న నవ్వుని ఆపుకుంటూ..

"లేదు ఇప్పుడు కూడా..." అన్నాడు కోపంగా.

"అంటే ఇందాక నేను అభి! అభిమన్యు! అని చెప్పాను కదా. అదే స్టైల్లో నువ్వు చెప్పుంటే వెర్రి! వెర్రియ్య!! అనేవాడివేమో అది గుర్తొచ్చి నవ్వుతున్నాను. క్షమించు" అన్నాను.

"సర్లే ఈ పేరు నేను పెట్టుకున్నది కాదుగా" అన్నాడు.

ఇంతలో బెంచీకి ఇంకో ఇద్దరు చేరారు. ఒకరు నరేంద్ర, నవీన్. పరిచయాలు అయ్యాయి అందరివీ. చూస్తుండగానే క్లాసు మొత్తం నిండింది. క్లాస్ అంతా గోలగా ఉంది. అందులో అమ్మాయిలు అయితే మరీను... ఇంతలో పొట్టిగా, లావుగా, నల్లగా వుండి జీన్స్ ప్యాంట్, తెల్లరంగు చొక్కాతో ఇన్‌షర్ట్ చేసుకున్న వ్యక్తి వచ్చి "సైలెన్స్ సైలెన్స్" అని గట్టిగా అరిచాడు. క్లాస్ మొత్తం అంతా ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది.

"సో మై నేమ్ ఈజ్ జి.వి.రావ్. అందరూ ఫిజిక్స్ జి.వి.ఆర్ అని పిలుస్తారు. సో అందరికీ అర్థమైందనుకుంటా నేనేం చేస్తానో" అన్నారు. అందరూ ముక్త కంఠంతో "యస్ సార్" అన్నాం.

"సరే ఇప్పుడు ఒక్కొక్కరిగా మీ పేర్లను చెప్పండి. ముందుగా ఫస్ట్ బెంచీ నుండి..." అని మొదటి బెంచీ వారి వైపు చూపించారు. మొదటి బెంచ్ అయిపోయింది. ఇక మా వంతు.. నా వంతు ఎలాగో అలా పేరు ఊరు చెప్పి హాస్టల్‌లో ఉంటున్నాను అని చెప్పాను. అబ్బాయిలు అయిపోయాక ఇక అమ్మాయిల వంతు... మొదటి బెంచి.. రెండవ బెంచి అయిపోయింది. మూడో బెంచీలో ఒక తియ్యటి గొంతు వినిపించింది. తియ్యటి గొంతు నాకు మాత్రమే అలా వినిపించిందో 'శశిరేఖ' అందా గొంతు.

ఒక్కసారి ఆ అమ్మాయి కేసి చూసాను. పొడవాటి జుట్టు, కాటుక పెట్టుకున్న కళ్ళు, తెల్లటి పిల్ల ముట్టుకుంటే మాసిపోయేంత, పట్టుకుంటే కందిపోయేంతలా ఉంది ఆ అమ్మాయి.

ఏ అమ్మాయీ తన పేర్లను చెబుతున్నా పెద్దగా పట్టించుకోలేదు. ఆ అమ్మాయి పేరు చెప్పగానే ఆమె వైపు చూడటానికి ఒక కారణం వుంది. అది ఆమె పేరే. చాలామంది నన్ను ఏడిపించేవారు అభిమన్యు పెళ్లాం శశిరేఖ అని.. అభిమన్యుడు శశిరేఖ కోసం ఎంతలా పరితపించాడో మాయాబజార్‌లో చూపించారు కూడా... దాన్ని పట్టుకుని ఆపేరు పెట్టుకున్న నన్ను ఏడిపించడం అందరికీ పరిపాటి. అందుకే ఆ అమ్మాయిని అలా చూడటం జరిగింది. నేను అభిమన్యు అని చెప్పినప్పుడు ఆ అమ్మాయి కూడా అలాగే నన్ను చూసిందేమో అనుకున్నాను.

ఫిజిక్స్ అయ్యాక సంస్కృతం సార్.. అందరిదీ ఇదే పద్ధతి.. పేరూ, ఊరు అడగడం.

చివరికి రోజు చివరన మొత్తం 63మంది అని తెలుసుకున్నాను. ఇంకా మా అదృష్టం ఏంటంటే 33మంది అమ్మాయిలు. మిగతా కాలేజీల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఒకే క్లాసులో కలిపి కూర్చోబెట్టరంట.. అది కో-ఎడ్యుకేషన్ అయినా సరే. కానీ ప్రతి కాలేజీలో మాలాంటి సెక్షన్ ఒకటి ఉంటుందని దానిని ఎఫ్.టి.బి అంటారని పూర్తిగా చెప్పాలంటే ఫాస్ట్ ట్రాక్ బ్యాచ్ అంటారని తెలిసింది.

మాది కూడా ఎస్.స్టార్ అని పెట్టారు బోర్డు. అంతేకాదు వచ్చిన ప్రతి సారూ "మీరు స్టార్ బ్యాచ్ మీ మీద కాలేజీకి చాలా పెద్ద హోప్స్ ఉన్నాయి" అనడం మొదలుపెట్టారు. దీనిబట్టి మా మీద అమ్మనాన్నలే కాకుండా ఈ దరిద్రపు కాలేజీ వాళ్లు కూడా ఆశలు పెట్టుకున్నారన్నమాట అని అనుకున్నాను. కాలేజీ 5.30కి ముగిసింది. ముందుగా అమ్మాయిలు వెళ్లిపోతారు. వాళ్లు వెళ్లిన పదినిముషాలకి మేము వెళ్లాలి.

'శశిరేఖ' ఆ అమ్మాయి వైపే చూస్తున్నాను. నేనే కాదు అందరు అబ్బాయిలు కూడా.. అంత అందమైన అమ్మాయి ఇలాంటి కాలేజీలో చేరడమేమిటి అనుకున్నాను. అమ్మాయి వెళ్తున్నప్పుడు నన్ను చూస్తూందేమోనన్న ఆశ. చూసిందో లేదో వెళ్తూ వెళ్తూ ప్రక్క అమ్మాయితో మాట్లాడుతున్నప్పుడు తన నల్లని గుడ్లను ఇటువైపు ఒక్క సెకను తిప్పింది.

"లేదు నేను అలా అనుకున్నానేమో".. అంతే ఈ వయసులో భ్రమలే ఎక్కువగా పుడతాయి. మనకిష్టమైన అమ్మాయితో మాట్లాడుతున్నట్టో, ఐస్‌క్రీమ్ తింటున్నట్టో, ఆమె మనల్ని చూస్తున్నట్టో ఇలాంటివి ఎన్నో... ఇదంతా వయసు ప్రభావం కావచ్చు.

కానీ ఇదే ఫీలింగులు అమ్మాయిలలో కూడా కలుగుతాయా అనే సందేహం. ఒకవేళ ఉన్నా అంత తొందరగా దొరకరు. తొందరగా ఏంటి.. అస్సలు దొరకరు. ఎలాగైతేనేం ఒక పదహారేళ్ల కుర్రాడిలో నూతనుత్తేజం నింపుతుంది ఒక అమ్మాయి చూపు. మొదటిరోజు కాలేజీ ముగిసింది.

రూమ్ తలుపులు తెరిచే ఉన్నాయి. అంటే నా పార్ట్‌నర్ వచ్చేసాడన్నమాట అని అనుకున్నాను. లోపలికి వెళ్లేటప్పటికి ఒక ముసలాయన, కుర్రాడు సామాన్లు సర్దుతున్నారు. వార్డెన్ రూమ్‌కి ఒక పక్కగా నిల్చుని ఉన్నాడు. అతను నాకోసమే చూస్తున్నాడని నాకర్థమైంది.

"ఈ అబ్బాయే నీ రూమ్‌మేట్. పేరు అభిమన్యు" అంటూ నాకేసి చూపించాడు.

"హాయ్ నా పేరు శశాంక్" అని షేక్ హ్యాండ్ ఇచ్చాడు.

ప్రక్కనే ఉన్న తాత "జాగ్రత్తగా ఉండండి బాబు" అన్నాడు. చూడటానికి చాలా కష్టజీవిలా ఉన్నాడు. బక్కపల్చని శరీరం, తెల్లని పంచ, లాల్చీ, దానిపై కండువా అరవై ఐదు ఏళ్లు పైబడి వుంటాయి అతనికి.

"సరే తాతగారు" అన్నాను.

"మా హాస్టల్ చాలా స్ట్రిక్ట్ అండి ఎటువంటి చెడు అలవాట్లకు తావు ఉండదు. అంతేకాదు రోజూ స్టడీ అవర్స్ అన్నీ వుంటాయి" అని సొంత డబ్బా కొట్టాడు వార్డెన్.

"చదువు గురించి భయం లేదులెండి బాబయ్య.. మా వాడికి అన్నీ తెలుసు" అని పిల్లాడి మొహంకేసి చూశాడు ఒకింత నమ్మకంతో.

"ఇక ఉంటాను బాబయ్యా" అని వార్డెనుకి నమస్కరించి కదిలాడు.

"తాతయ్యా" అన్నాడు శశాంక్. అతని కళ్ళలో బాధ కన్నీళ్ళ రూపంలో స్పష్టంగా కనిపిస్తుంది. తాతయ్య మీద ఇంత ప్రేమ ఏమిటా అని నేను అనుకున్నాను. ఒకళ్లనొకళ్లు కావలించుకుంటున్నారు. ఇలాంటి సీన్లు సినిమాలో చూసి చాలాసార్లు ఏడ్చాను. ఇప్పుడు కూడా ఒక్కసారి కళ్ళు తడి అయ్యాయి.

వాళ్ల తాత "జాగ్రత్తగా ఉండు నాయనా" అని ఒకటికి పదిసార్లు చెప్పి వెళ్లిపోయాడు. ఇంతకీ తెలిసిందేంటంటే శశాంక్ వాళ్లు చాలా లేని కుటుంబం. కుటుంబం అంటే పెద్ద కుటుంబం ఏమీ కాదంట. వాళ్ల తాత, మామ ఇంకా వీడు. చిన్నప్పుడే అమ్మ నాన్న చనిపోయారంట. ఇవన్నీ వాడు చెప్పినవే. తాను జిల్లా

ఫస్ట్ రావడం వల్ల, ఈ కాలేజీలో అన్నీ ఫ్రీ ఇవ్వడం వల్ల చేరానని చెప్పాడు. తను కూడా ఎమ్.పి.సియేనని చెప్పాడు. నాకు చదువు చెప్పేందుకు ఒకడు దొరికాడని చాలా ఆనందపడ్డాను. నిన్న స్వామి నాకు మెస్ చూపించినట్లు నేను శశాంక్‌కి చూపించాను. ఈసారి 7.30కి మేమే రెడి అయ్యి వెళ్ళాం. భోజనం చేసి వచ్చాక వార్డెన్ మా అందరికీ... అంటే మా ఫస్ట్ ఇయర్ అందరికీ మీటింగ్ పెట్టాడు. హాస్టల్ మొత్తానికి ఫస్ట్ ఇయర్స్ కలిపి అందరం ఒక 150మంది ఉన్నాం. మా రూమ్‌లు చిన్నవి కాబట్టి రూమ్‌కొచ్చి ఇద్దరినే వేసారు. అదే కొంతమంది రూమ్స్‌లో నలుగురు దాకా ఉంటున్నారంట.

"రేపటినుంచి అందరికీ స్టడీ అవర్స్ మొదలవుతాయి. 8 టు 9 స్టడీ అవర్. రోజులు పెరిగే కొద్దీ స్టడీ అవర్స్ టైమ్ కూడా పెరుగుతుంది" అన్నాడు గట్టిగా అరుస్తూ.. రేపట్నుంచి రుద్దుడు ప్రారంభం అని అనుకుని అందరం లోపలకు వెళ్లిపోయాం.

"అసలు మీ అమ్మ నాన్న ఎలా చనిపోయారు. సారి! నిన్ను అడగడం బాధిస్తే" అని అన్నాను.

"లేదు బాధ ఎప్పుడూ కలగదు. అలా బాధపడినంత మాత్రాన వారు రారు కదా.."

"నువ్వు చాలా పెద్ద వాడిలా మాట్లాడుతున్నావే.."

"పరిస్థితులు మనల్ని పెద్దవాళ్ళని చేస్తాయి అభి" అన్నాడు. ముఖంలో బాధ, విచారం కొట్టొచ్చినట్లు కనిపించాయి.

"అమ్మ, నాన్న చిన్నప్పుడే చనిపోయారు. ఇక పెంచింది తాతయ్య, మామ. తాతకి రెండెకరాల పొలం, రెక్కాడితే గానీ డొక్కాడదు. ఇప్పుడూ అదే పొలం మాకు ఆధారం. ఈ వయసులో కూడా మా తాత కష్టపడటం చూసి బాధేస్తుంది."

"నువ్వు మీ అమ్మ, నాన్నలను ఫొటోలలో తప్ప నిజంగా ఎప్పుడూ చూడలేదా??."

"నిజంగా చూడలేదుగానీ రెండు మూడు సార్లు చూసా."

"అదేంటి" అని అడిగా. ఏదో ఆసక్తికరమైన విషయం వినబోతున్నట్టు నాకర్థమైంది. శశాంక్ మౌనంగానే ఉన్నాడు. వాడి కళ్ళలో కన్నీళ్లు కనబడుతున్నాయి.

"అంటే ఆత్మలుగా కనబడ్డారా" అన్నాను నా ఉత్సుకత ఆపుకోలేక.

"అవును" అన్నాడు కన్నీళ్లను తుడుచుకుంటూ..

"సరే ఇవన్నీ మరలా ఎప్పుడైనా మాట్లాడుకుందాం.. పడుకో" అన్నాడు.

అనవసరంగా వాడి మనసును బాధపెట్టానేమో అనుకుని కునుకు తీసాను.

అభిమన్యు 'ఎయిటీన్' అంటూ అరిచాడు కెమిస్ట్రి చలపతి.శశాంక్ ఇరవైకి ఇరవై మొదటి వీకెండ్‌టెస్ట్ మార్కులివి.. శశిరేఖ 'పద్దెనిమిది'... 'హమ్మయ్య' అనుకున్నాను. ఎందుకంటే అమ్మాయికి నా కన్నా ఎక్కువ వస్తే ఫోజు కొడుతుందని... బేసిక్‌గా అమ్మాయిలందరూ అంతేనని నా అభిప్రాయం.

"శశిరేఖతో ఎలాగైనా మాట్లాడాలి" అన్నా శశాంక్ గాడితో...

"నేను మాత్రం పక్కన ఉండను" అన్నాడు ఎప్పుడూ ఉండే భయం ప్రకటిస్తూ..

మధ్యాహ్నం లంచ్ బెల్ మోగింది. అప్పటికే సగం సబ్జెక్ట్‌ల వీకెండ్ మార్కులు ఇచ్చేశారు. అన్నీ బాగానే వచ్చాయి. నేను శశాంక్ త్వరగా భోజనం చేసి వచ్చి క్లాసులో కూర్చున్నాం. అప్పటికి ఇంకా అందరూ భోజనాలు చేస్తున్నారు. కాసేపు కూర్చుని ఏదో రాసుకుంటున్నట్టు ఏక్ట్ చేశాం ఇద్దరం...

అందరూ మమ్మల్ని వింతగా చూసారు. కొద్దిసేపటికి అందరి భోజనాలు అయిపోయి కూర్చున్నారు. క్లాస్‌లు మొదలవడానికి ఇంకా అరగంట టైముంది.

"శశిరేఖ" అని పిలిచాను తన ప్రక్కబెంచీ దగ్గర కూర్చుని. శశాంక్ గాడు చెవిలో ఏదో గొణుకుతున్నాడు. ఆ మాటలేవీ నాకు వినిపించట్లేదు. కలువల్లాంటి కళ్లు నాకేసి తిరిగాయి.

"ఏంటి" అని అడిగింది.

"ఏం లేదు''అన్నాను.. నిజానికి ఏదో ఉందని, చెబుదామనే తాపత్రయం. కానీ అంత అందమైన అమ్మాయి కళ్ల ముందు కదలాడుతుంటే మాటలు రావట్లేదు. ఇది నాకే కాదు ప్రతి అబ్బాయికి ఎదురయ్యే సమస్యే.

"మరి ఎందుకు పిలిచావ్" అంది.

"ఏ కూరో అడుగుదామని" అన్నాను ఇంకేమడగాలో తెలియక. ఈ ప్రపంచంలో తనకు కావలసిన అమ్మాయితో ఇంత చెత్తగా మొదటి సారి ఎవరూ మాట్లాడి వుండరు.

నేను అడిగినదానికి శశాంక్ గాడితో పాటూ, శశిరేఖ ఫ్రెండ్స్ కూడా నవ్వుకున్నారు.

"ఆలు ఫ్రై" అంది ఆ నవ్వుతోనే...

"ఓ నాకు చాలా ఇష్టం" అన్నాను.

"ఓహో అలాగా" అంది.

"మనిద్దరం ఈ రోజు నుండి ఫ్రెండ్స్ ఓకేనా" అన్నాను.

"అదేంటి ఇక్కడ నాకు అందరూ ఫ్రెండ్సే.. అందరూ నాకు క్లాస్‌మేట్సే కదా" అంది. తెలివిగా మాట్లాడటంలో అమ్మాయిలను మించిన వారు వుండరు. ఇది నగ్నసత్యం. మరోసారి ఋజువయ్యింది.

ఇలా మెలిక పెట్టిందా అనుకుని "సరే అయితే మనిద్దరం ఫ్రెండ్స్ అయిపోయామన్నమాట" అన్నాను.

"హా అఫ్‌కోర్స్" అంది..

"సరే మీది కాకినాడేనా"..

"ఇవన్నీ నీకెందుకు??" అంది మొహం చిట్లించి.

"ఏదో ఫ్రెండ్స్‌షిప్ కొద్దీ...." అన్నాను నవ్వుతూ..

"మనది ఇంకా అంత లోతైన ఫ్రెండ్స్‌షిప్ కాదేమో" అంది నవ్వుతూ..

ఆ నవ్వు చూడడం కోసం ఇంకా కాసేపు ఉండాలనిపించింది. కానీ ప్రక్కన శశాంక్ గాడు పోరుతూనే ఉన్నాడు టైం అవుతుందని.. వాడి గోల తట్టుకోలేక మరలా మా బెంచీలోకి చేరాము.

భోజనం అయిన తర్వాత నిద్ర రావడం చాలా సహజం. నాకైతే మరీనూ.. కానీ శశాంక్‌గాడు అలా కాదు. వాడు ఎప్పుడూ నిద్రపోడు. అంతసేపు క్లాసులు ఎలా వింటాడా!!! అనిపించింది.

ఈ ఫస్ట్ వీకెండ్ టెస్ట్‌లో మార్కులు బాగానే వచ్చాయి. కానీ చాలామందికి 20 కి 15 వచ్చినా తిట్టారు. అసలు వీళ్లకి కావాల్సిందేమిటో నాకర్థం కాలేదు. కాలం త్వరగా గడుస్తోంది. అంతే త్వరగా ఆమెతో నా స్నేహం బలపడుతోంది. వారానికి రెండు సార్లు అయినా ఏదో ఒంక పెట్టుకుని శశితో మాట్లాడేవాన్ని. మొదట అది

ఈ వయసులో కలిగే ఆకర్షణ అనుకున్నాను. కానీ పరిచయం పెరిగే కొద్దీ స్నేహం బలపడి ఇంకేదో ఫీలింగ్స్‌కు దారి తీస్తుంది. తరువాతే తెలిసింది అది ఆరాధన అని. ఆరాధన చాల పెద్ద మాటేమో ఈ వయసులో.. కాని ఆమెను ఆరాధించడానికి కారణాలు వెతకాలనిపించలేదు.

ఏమో కొన్ని పరిచయాలు ఎప్పుడో దేవుడి దగ్గరే నిశ్చయింపబడతాయట. బహుశా శశిరేఖ పరిచయం అంతే అనుకుంటా..

ఫస్ట్ ఇయర్ ఫైనల్ పరీక్ష.. తర్వాత రోజు నుండి సెలవులు. ఇంక రేపట్నుంచి శశిరేఖతో మాట్లాడటం కుదరదు. పరీక్షలు బాగానే రాస్తున్నాను అన్న సంతోషం కన్నా రేపట్నుంచి శశిరేఖతో మాట్లాడటం కుదరదు అనే బాధే ఎక్కువగా వుంది. ఎలాగైతేనేం కెమిస్ట్రీ ఎగ్జామ్ బాగానే రాసి వచ్చాం. చివరి పరీక్ష కావడంతో రాయాలన్న కోరిక కన్నా ఎప్పుడు ఇంటికి వెళదామన్న ఆలోచనే ఉంది.

అందరిలో "శశి" అని పిలిచాను. అయిపోయిన పరీక్ష గురించి అరిచి మరి కొట్టుకుంటున్న శశిరేఖ, రోహిణి లను చూసి.

"ఏంటి కొత్తపిలుపు" అంది శశిరేఖ.. పక్కనున్న రోహిణి నాకేసి నవ్వుతూ చూసింది.

"ఏం లేదు బాగుంది కదా అలా పిలవడానికి" అన్నాను.

"హా! వాళ్ళ ఇంట్లో వాళ్లు కూడా అలా పిలుస్తారు" కొంచెం కొంటెగా అంది రోహిణి.

"అంటే నీకు కావాల్సిన వాళ్లు అలాగే పిలుస్తారన్న మాట" అన్నాను కొంచెం గొంతు తగ్గించి.

"సర్లే ఇంతకీ అన్నీ బాగానే రాసినట్టు కదా" అంది కళ్ళలో ఒకింత నవ్వును ఒలకపోస్తూ శశి...

ఆడవాళ్ళు ఇష్టమైన వ్యవహారాలను మాట్లాడలేనప్పుడు, అస్సలు ఇష్టంలేని టాపిక్స్ ఎత్తినప్పుడు ఇంకో టాపిక్‌లోకి చాలా సులువుగా డైవర్ట్ చేస్తారనిపించింది.

"హ! బానే రాశా రిజల్ట్స్ వచ్చాక తెలుస్తుంది.. నా జాతకం" అన్నాను.

"అలాగే పాపం" అంది.

"సరే రేపట్నుంచి నీతో మాట్లాడటం ఎలా???" అన్నాను..

"మాట్లాడటం ఎందుకు??" అంది పెదాల మీద వస్తున్న చిన్న నవ్వు ఆపుకుంటూ.

అన్నీ తెలిసినా తెలీనట్టే ఉంటారు. అమ్మాయిలెప్పుడూ తమ ఉద్దేశాలను అంత త్వరగా బయటకు వ్యక్తపరచరు. ఒకవేళ వ్యక్తపరిస్తే చిన్న చిరునవ్వుతో తమ అంగీకారాలను తెలుపుతారు.

"మనమిద్దరం స్నేహితులం కదా!!." అన్నాను.

"అయితే రోజూ మాట్లాడాలని రూల్ లేదు కదా" అంది.

"సరే అయితే ఉంటాను" అన్నాను కోపంతో...

నా కోపానికి భయపడి అనుకుంటా "నా దగ్గర ఫోన్ లేదు" అంది.

"నా దగ్గర ఉందేంటి మా అమ్మ ఫోన్ వాడతాను" అన్నాను.

"సరే నీ నంబరు అదే ఆంటీ నంబరు ఇవ్వు.." అంది.

"4045966616" అని చెప్పా చాలా ఫాస్ట్‌గా..

"నీదేమైనా ఫ్యాన్సీ నంబరా అంత ఫాస్ట్‌గా చెబుతున్నావ్ కాస్త రాసుకోనీ" అంది.

"మరి నీ నంబరు...." అని అడిగా తనకి నా నంబర్ చెప్పాక...

"వద్దు నేను నీకు మెసేజ్ చేస్తాను" అంది.

"సరే" అన్నాను. అమ్మాయిలకు ఇంత భయమేమిటో అనుకున్నాను. ఒక అమ్మాయిని అబ్బాయి నెంబరు అడగడం చాలా కష్టమైన పని. ఒకవేళ అడిగినా ఆ అమ్మాయి ఏమనుకుంటుందో ఇంతకముందు ఉన్న రిలేషన్‌షిప్ చెడిపోతుందేమో అన్న భయంతో ఆ అబ్బాయి జంకుతాడు. ఇంక అమ్మాయి ఒకింత గర్వంతో ఉంటుంది. అబ్బాయి తనను నంబరు అడిగాడనే గర్వం. కానీ ఇవ్వాలంటే వంద రకాలుగా ఆలోచిస్తుంది. ఎప్పుడూ ఉండే తన జాగ్రత్తలను ఆలోచిస్తూ.. పొసెసివ్‌నెస్ అన్నమాట.

సెలవులకని అందరూ ఇంటికి బయల్దేరుతున్నారు. నేను శశాంక్ కూడా... ఈసారి కాలేజి ఫస్ట్ వాడేనని నేను అనుకున్నాను. ఇంటికి వెళ్లేటప్పటికి సాయంత్రం 4.30 అయ్యింది. ఊర్లో అందరూ బయటకు వచ్చే టైమ్ అది. ఊర్లోకి దిగగానే

అందరూ ముందుగా అడిగే ప్రశ్న 'పరీక్షలు బాగా రాసావా' అని. ఒక కుర్రాడికి అత్యంత చిరాకు కల్గించే ప్రశ్న అది. 'బాగున్నావా' అని కూడా అడగరు. వీధి మొత్తం ఇంతే.. ఒకవేళ ఒకరికి బాగా రాయలేదు అని చెప్పినా అది ఊరు మొత్తం పాకేస్తుంది చాలా ఫాస్ట్‌గా.. పల్లెటూర్లలో ఇవన్నీ సహజం.

"అమ్మా నీ ఫోను ఇవ్వే అన్నా" ఇంటికి వెళ్లానో లేదో..

"ఎందుకు" అంది.

"నాకు కావాలి" అన్నాను ఎటువంటి భయం లేకుండా..

"అక్కడ మొదటి గదిలో చార్జింగ్ పెట్టాను తీస్కో" అంది.

ఇంత డొక్కులో ఫోన్‌కి అంత ఫోజు ఎందుకో అనుకున్నాను. శశి మెసేజ్ కోసం ఫోన్ కోసం ఎదురుచూపులు ఇవన్నీ.. ఆ అమ్మాయి అసలు ఫోన్ చేస్తుందంటావా అనే భయం. ఫోన్ ఎలాగా తీసాను కదా అని శశాంక్‌గాడికి ఫోన్ చేసాను.

"హలో శశాంక్"

"హలో ఎవరు?? హలో......." అనే అరుపు. ఆ అరుపు బట్టి వాళ్ల తాతయ్య అని నాకర్థమైంది. ఈ పెద్దవాళ్లు ఫోన్ ఎత్తాక ఒకటికి పదిసార్లు హలో హలో అనటం అలవాటు. ఇక్కడా అదే సీన్ రిపీటయ్యింది. ఆఖరికి శశాంక్ గాడు ఫోన్ తీసుకోవడంతో ప్రాణం లేచొచ్చినట్టయ్యింది.

"హలో ఎవరు" అన్నాడు నా గొంతు వినకుండానే...

"నేనేరా" అన్నాను.

"హా అభి చెప్పరా" అన్నాడు. ఇది మిత్రులకే సాధ్యం అనుకుంటా. మనం ఎవరో చెప్పకుండానే మనల్ని కేవలం గొంతుతో గుర్తుపట్టే టెక్నిక్.

"ఏం చేస్తున్నావ్...??"

"ఏం లేదురా ఇప్పుడే పొలం వెళ్లి వచ్చాను. ఏం మామూలుగానే ఫోన్ చేసావా.." అన్నాడు.

"హా అవునురా శశి ఫోన్ కోసం వెయిటింగ్".

"ఓహో మరింకెందుకు లేటు. ఆ అమ్మాయి నీకు ఫోన్ చేసినప్పుడు బిజీ వస్తేనో.."

ఆ మాట విన్నానో లేదో ఫోన్ కట్ చేసాను. ఆ అమ్మాయి ఇప్పటికే నాకు ఫోన్ చేసే ఉద్దేశంలో ఉండి ఉంటుందని అనుకున్నాను. చాలా సేపైంది బయట వరండాలో కూర్చొనే ఉన్నాను. లోపలికి వెళ్తే సిగ్నల్ రాదేమో అని...

నా ఎదురుచూపులు ఫలించాయి. ఒక అన్‌నౌన్ నంబరు నుంచి మెసేజ్ "హాయ్" అని..

అవును అది శశియే లేకపోతే ఇంకెవరు పంపుతారు అనుకున్నాను. అమ్మాయిలెప్పుడు మొదటగా ఫోన్లో పలకరించడానికి జంకుతారని అర్థమైంది.

కాస్త భయంతో "హూ ఈజ్ దిస్.." అని పంపాను.

"శశి" అని రిప్లై....

పట్టరాని సంతోషం. ఇష్టమైన అమ్మాయ్ మెసేజ్ మొదటిసారి ఫోన్‌లో చూసిన సంతోషమిది. "అయితే ఇప్పుడు నిన్ను శశి అని పిలవచ్చన్నమాట" అని రిప్లై పంపాను.

"హామ్" అని వచ్చింది. అవునందో కాదందో అసలు అర్థం కాలేదు. ఏం చెప్పాలో తెలియని సందిగ్ధంలో ఉన్నప్పుడు అమ్మాయిలు ఇలాంటి మెసేజ్‌లు పెడతారని అనుకున్నాను.

"సర్లే ఏం చేస్తున్నావు ఈ ఫోన్ నీదేనా" అన్నాను మెసేజ్‌లోనే..

"ఏం లేదు టివి చూస్తున్నా. అమ్మది ఈ ఫోన్ నీకు తెలుసుగా" అంది.

"ఓహో అలాగా నాదీ మా అమ్మ ఫోన్" అన్నాను.

నాకు ఈ విషయం తెలిసినా ఇంకేం మాట్లాడాలో తెలియక అడిగాను. అమ్మలు ఫోన్ వాడటం అనేది పిల్లలకు చాలా ఉపయోగకరమని అనుకున్నాను. అక్కడినుంచి ఇంకా ఏం రిప్లై రాలేదు. నాకు కూడా ఏం మెసేజ్ పెట్టాలో తెలియలేదు.

ఇంక తప్పదని "తిన్నావా" అని మెసేజ్ పెట్టా. అప్పటికి ఇంకా టైమ్ 6.30 దాటలేదు.

"అప్పుడేనా ఇంకా లేదు నువ్వేం చేస్తున్నావ్" అంది. నీ గురించి ఆలోచిస్తున్నా అని చెప్పాలనిపించింది.

"ఏం లేదు బయట కూర్చున్నా.. ఫోన్ చేయొచ్చా".

ఏం రిప్లై వస్తుందా అని ఆలోచించా.. అమ్మాయిలు అంత త్వరగా ఫోన్‌లో మాట్లాడడానికి ఇష్టపడరు. అది ఎంత ఇష్టమైనవారైనా సరే. తల్లితండ్రుల భయం కావచ్చు. అంతసేపు ఫోన్‌లో ఎవరితో మాట్లాడావు అంటే సమాధానం చెప్పలేక కావచ్చు.

అనుకున్నట్టే "కుదరదు" అని మెసేజ్ వచ్చింది.

"సరే" అన్నాను.

"అమ్మ వాళ్లు ఏమైనా అనుకుంటారు" అంది. ఇలాంటి మేసేజ్ అబ్బాయిలో ఉద్రేకాన్ని పెంచుతుంది.

"సరే నో ప్రోబ్లమ్" అన్నా..

"సరే ఉంటాను కాసేపున్నాక మెసేజ్ చేస్తాను" అంది.

అమ్మాయిలు ఇంత త్వరగా చాట్ చేయడం ఆపేస్తారెందుకో. అప్పటికప్పుడు నడిసంద్రంలో వొదిలేస్తారు మగవాళ్ళని అని అనుకున్నాను. టెక్నాలజీ పెరిగాక ఈ మెసేజ్‌లతో ఉపయోగమేమిటంటే ఒకరి ఇష్టాలను ఇంకొకరు సులభంగా తెలుసుకోవచ్చు. అవి మరింకెవరికీ తెలియకుండా...

పూర్వం ప్రేమ లేఖలుండేవట. ఇప్పుడూ అవే ఉంటే ప్రేమికులు ఎంత కష్టపడేవారో.. ఆ ఉత్తరం ఎవరు చదువుతారో తెలీదు వాళ్ల నాన్న చదవచ్చు, అమ్మ చదవచ్చు లేదా ఇద్దరూ కలిపి చదవచ్చు. ప్రపంచంలో సెల్‌ఫోన్‌లు ఉండడం చాలా మంచిదనిపించింది.

రిజల్ట్ వచ్చేరోజు... ఎప్పుడూ ఉండే ఉత్కంఠ ఈ లోపల శశాంక్‌గాడు ఫోన్ చేసాడు. కాలేజీ ఫస్ట్ వచ్చే క్యాండిడేట్‌కి ఇంత టెన్షన్ ఎందుకో అనుకున్నాను.

"ఒరేయ్ ఇవాళ రిజల్ట్ అంట" హలో కూడా అనకుండా.

"ముందే తెలుసు కదరా. అందులో పెద్ద వింతేముంది" అన్నాను.

"ఆ నీకు భయంగా లేదా" అన్నాడు.

"ఎందుకురా భయం. వచ్చేది ఎలాగా రాక మానదు" అన్నాను చాలా ధైర్యవంతుడిలా..

"ఇంతకీ శశికి ఫోన్ చేసావా??" అని అడిగాడు.

"ఆమెకి నేనెప్పుడూ ఫోన్ చెయ్యలేదు మెసేజ్‌లతో గడుస్తోంది అంతా..." నా బాధను వెళ్లగక్కుకుంటూ...

'ఓహో అలాగా పాపం" అన్నాడు.

"సరే రిజల్ట్స్ తెలిసాక ఫోన్ చేస్తా ఉంటా" అని ఫోన్ పెట్టేసా..

రిజల్ట్స్ టైమ్ ఆల్‌దిబెస్ట్ అని మెసేజ్ పంపా శశికి. ఒకసారిగా ఫోన్ రింగ్ అయ్యింది. శశి దగ్గర నుండి ఫోన్..... సిగ్గుపడాలో, భయపడాలో, అసలు ఏం మాట్లాడాలో తెలియని పరిస్థితి. ఫోన్ మోగుతూనే ఉంది. ఇంక ధైర్యం చేసి ఎత్తాను.

"ఇంతసేపా ఫోన్ ఎత్తడానికి" అంది.

"ఏం లేదు సైలెంట్‌లో ఉంది మొబైల్" అన్నాను. మొదటి మాటే అబద్ధంతో మొదలైంది.

"సరే ఇవ్వాళ రిజల్ట్స్ కదా" అంది.

"హ" గొంతులో ఏ మార్పూ లేదు కొంచెం వణుకుతుంది అంతే..

"నీకు భయం లేదా?" అంది.

"భయం ఎందుకు? మార్కులు తక్కువస్తే చంపేస్తారా??" అన్నాను.

'సర్లే నిన్న రాత్రి నువ్వు మెసేజ్ చేసే టైమ్‌కి పడుకున్నాను" అంది.

"అలాగా"

"అప్పటికే 9.30 అయ్యింది. నిన్న నాకు కొంచెం తలపోటు అనిపించింది. అందుకే త్వరగా పడుకున్నా".

"అయ్యో ఇప్పుడెలావుంది శశి.." అన్నాను.

"కంగారు పడొద్దు బానే ఉందిలే" (వస్తున్నాను అమ్మా) అని అంటోంది ఫోన్‌లోనే.

"సరే ఉంటాను అభి అమ్మ పిలుస్తోంది. టేక్ కేర్. రిజల్ట్స్ వచ్చాక మెసేజ్ చేస్తా" అని ఫోన్ పెట్టేసింది.

ఇంకా కాసేపు మాట్లాడితే బావుంటుందనిపించింది. ఆ తియ్యటి గొంతు విని ఎన్నాళ్లయ్యింది.. ఎంతసేపు మాట్లాడినా అలా మాట్లాడాలనిపించింది. టైమ్

పదకొండయ్యింది.. రిజల్ట్స్ రానే వచ్చాయి. నాకు 421, శశాంక్ గాడికి 464 మార్కులు. . వాడే కాలేజీ ఫస్ట్. కాలేజీయే కాదు.. వాడు కాలేజీ లెవల్‌ని దాటిపోయి ఉంటాడు అనుకున్నాను.

శశికి 427.. దగ్గర దగ్గరగా మా ఇద్దరికీ ఒకేలా వచ్చాయి. కాకపోతే నాకు ఫిజిక్స్, కెమిస్ట్రీలలో మార్కులు తగ్గితే తనకు మ్యాథ్స్‌లో తగ్గాయి అంతే..

"మళ్లీ బెటర్‌మెంట్ రాయాలి" అన్నాను శశాంక్ గాడు ఫోన్ చేసినప్పుడు.

"డౌట్స్ ఏమైనా ఉంటే నే చెప్తాలే ఫిజిక్స్, కెమిస్ట్రీయే కదా''

"హు!" అన్నాను.

"సరే జాగ్రత్త ఉంటాను" అన్నాడు.

శశాంక్ గాడు ఫోన్ పెట్టిన వెంటనే మరో ఫోన్ శశి దగ్గర నుంచి.. ఈ ఫోన్ కోసమే ఇంతసేపు ఎదురుచూస్తుంట.

"నీకెంత" అంది ఆ గొంతు..

"నీకు తెలీదా" అన్నాను.

"హు! తెలుసు ఏదో ఫార్మాలిటీకి అడిగాను" అంది.

"బెటర్‌మెంట్ రాయాలేమో" అన్నాను

"మరి రాయాలికదా!! అంటే బెటర్‌మెంట్ క్లాసులకి నువ్వు వస్తావా" అంది.

"హు! వస్తాను మరి నువ్వో''

"చెప్పలేను" అంది.

"ఎందుకు" అని అడిగాను ఒకింత నిరాశను గొంతులో నింపుకుని.

"అంటే ఎండలు.. అదే కాకుండా ఇంట్లో పెళ్లి కూడా వుంది. ఒకవేళ వచ్చినా క్లాసులు మొదలైన పది రోజులకి వస్తాను" అంది.

"అలా అని క్లాసులు మొత్తానికి రాను అని చెప్పకు" అన్నా కోపంతో,....

"సరే ఆంటీ ఏం చేస్తున్నారు??" అని అడిగింది.

"ఏం చేస్తారు నా కోసం కారాలు, మిరియాలు రెడీ చేస్తున్నాను" అన్నాను.

"హహ ఎందుకని మార్కులకా.."

"అవును మా పక్కింటి అబ్బాయికి 458 మార్కులు వచ్చాయంట అదీ గోల.. అయినా అది ఎప్పుడూ ఉండే గోలే"

"సరే ఉంటాను" అంది.

"అప్పుడేనా కాసేపు మాట్లాడొచ్చు కదా" అన్నాను.

"ఏం మాట్లాడాలి మనమిద్దరం స్నేహితులమే కదా.." అంది. ఇలాంటి హింట్‌లు అమ్మాయిలు కావలసి ఇస్తారో లేక అప్రయత్నంగా వస్తాయో తెలియదు.

"ఎక్కువ సేపు మాట్లాడరని రూల్ లేదు కదా" అన్నాను.

"కానీ ఇప్పుడు అమ్మ పిలుస్తోంది తప్పదు ఉంటాను జాగ్రత్త." అని పెట్టేసింది.

ఈ అమ్మాయిలందరూ ఇలాగే ఉంటారు. తమకు కావల్సిందేదో తేల్చుకోలేరు అనుకున్నాను. అప్పుడే ఊర్లో వాళ్లందరూ అంటే వీధిలో వాళ్లందరూ అడగడం మొదలుపెట్టారు. మార్కులు ఎంతని.. ఇంకో పెద్ద విషయం ఏమిటంటే పక్కనున్న అఖిల్‌గాడు 458 మార్కులు వచ్చాయని అందరికీ స్వీట్లు పంచిపెట్టడం మొదలుపెట్టాడు. వాడికి శుభాకాంక్షలు చెప్పినవారంతా నీకెంతని నన్ను అడగటం మొదలుపెట్టారు. 421 అని చెప్పగానే "ఆ షావుకారు గారి అబ్బాయికి 458 అంట తెలుసా" అని నా దగ్గరే అనేవారు. బాధనిపించింది. బాధకాదు కానీ కోపం ప్రపంచం మీద కోపం.

470కి 421 అంటే తక్కువ మార్కులేం కాదు. కానీ వాడికి నా కన్నా ఎక్కువ మార్కులొచ్చాయి అంతే. నా కింద చాలామంది తక్కువ మార్కులొచ్చిన వారు ఉన్నారు. వాళ్లు కూడా ఇలాగే బాధపడుతూ ఉంటారేమో అనిపించింది. ఇంక మార్కులతోనే అంతా ముడిపడి ఉంటుదన్న మూర్ఖత్వాలని ఎలా మార్చాలో ఎప్పటికీ అర్థం కాదు అనిపించింది.

బెటర్‌మెంట్ రాస్తానని... వాడికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటానని చెప్పాను. ఇది చాలా చెత్త విషయం మళ్లీ చదువుతానని చెప్పడం వాడికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటానని అనడం.

రిజల్ట్స్ వచ్చిన రెండు రోజులకే బెటర్‌మెంట్ క్లాసులు మొదలయ్యాయని కాలేజీ నుండి ఫోన్.. ఈ కాలేజీ వాళ్లకి పనీ పాటా లేదేమో.. వాళ్లకి మమ్మల్ని బాగుచేయటంకన్నా...మా పేరు చెప్పుకుని బాగుపడడమే ఎక్కువ. ఇందుకు ఏ కాలేజీ

అతీతం కాదు. ముఖ్యంగా ఈ మధ్య ఇది చాలా ఎక్కువైంది. ఇక శశాంక్‌గాడు ఫోటోకి ఎన్ని ఫోజులు ఇవ్వాలో అనుకున్నాను. వాడో చిన్న సైజ్ రోల్‌మోడల్ అయిపోతాడని, వాడి ఫోటోలు కాలేజీవాళ్లు బాగా వాడుకుంటారని అనిపించింది.

కాకినాడ బస్టాండ్‌లో దిగిన వెంటనే ఎప్పుడూ ఉండే చందనబ్రదర్స్ హోర్డింగ్ లేకుండా మా కాలేజీ హోర్డింగ్ కనబడింది.

'ప్రిలిమ్స్ ప్రభంజనం స్టేట్ ఫస్ట్' అని చెప్పి శశాంక్ గాడు విక్టరీ సింబల్ చూపిస్తూ నిలబడ్డాడు. ఈ రెండు రోజుల్లో వాడి ఫోటో ఎలా సంపాదించారబ్బా అనుకున్నాను. ఆ తర్వాత 400 పైబడ్డ వాళ్ల ఫోటోలందరివీ వేశారు. అందులో నా ఫోటో కూడా వుంది. మా ఫోటోలు మరీ జిడ్డుగా ఉన్నాయి. అవి కాలేజీ అప్లికేషన్ ఫాంల కోసం ఇచ్చిన ఫొటోలు. అంతటి చిన్న ఫొటోలోనూ శశిరేఖ ఫొటో చాలా అందంగా కనిపించింది.

హాస్టల్ నీట్‌గా సర్ది వుంది. అంటే రిజల్ట్స్ వచ్చాక శశాంక్ గాడు రూమ్‌కి వచ్చాడని అర్థమైంది. అయితే వాడికి మళ్లీ బెటర్‌మెంట్ రాయవలసిన అవసరం లేదు. ఆ హోర్డింగ్ ఫోటో తీయించుకోవడానికి వచ్చాడేమో అనుకున్నాను. రూమ్‌లో నేనొక్కడినే ఉండాలా అని అనుకున్నాను.

ఈసారి క్లాస్‌లు 6.30కి కాకుండా 9.30కి మొదలయ్యాయి. చెప్పినట్టే శశి రాలేదు. చదివిందే మళ్లీ చదవడం చాలా చిరాకనిపించింది. ఒకవేళ శశి వస్తే ఆమెకేసే చూస్తూ ఉండేవాడినేమో. రోజులు చప్పగా గడుస్తున్నాయి ఆమె లేకుండా... 'ఎప్పుడొస్తావ్ శశి' నాలో నేనే పిచ్చివాడిలా మాట్లాడుకుంటున్నాను. ఆమెకు మెసేజ్ చెయ్యడానికి ఇప్పుడు నా దగ్గర సెల్‌ఫోన్ కూడా లేదు. ఏదో మొక్కుబడిగా చదువుతున్నాను అంతే....

మోడుబారిన చెట్లకు వసంతం వచ్చినట్లు ఆమె వచ్చింది. తెల్లని సల్వార్ కమీజ్, మేచింగ్ గాజులు, దుద్దులు... నల్లటి ఉంగరాల్లాంటి జుట్టు ఆమె నుదుటిపై పడుతుంది. ఈ బెటర్‌మెంట్ క్లాసుల్లో యూనిఫామ్ కోడ్ లేకపోవడం ఆనందం అనిపించింది. ఆమె నా వైపు చూస్తుందా లేదా అనిపించింది. చూసింది.. చూడటమే కాదు ఒక నవ్వు విసిరింది. ఆ నవ్వు చాలు జీవితానికి ప్రపంచంలో ఏదైనా సాధించవచ్చు ఈ అమ్మాయి కోసం అన్న తపన పెరిగిన క్షణం. లంచ్ బెల్ అయ్యిందో లేదో ఆమె ప్రక్క బెంచ్‌కి చేరాను.

"నమస్తే మేడమ్ గారు"

"హా నమస్తే సార్ ఎలా ఉన్నారు బాగా చిక్కిపోయినట్టున్నారు."

నీ మీద బెంగతో చిక్కిపోయాను అని చెప్పాలనిపించింది. కానీ ఏమనుకుంటాదో అనే భయం.

"హా అవును హాస్టల్ ఫుడ్ కదా" అన్నాను.

"సరేలే పోయి తిను లేటవుతుంది."

"హా తింటాను రోజూ తినేదే. నీదేం కూర.."

"పులిహోర తింటావా"

"వద్దు ఇక వెళ్తాను." అన్నాను.

నిన్ను పస్తులు పెట్టి నేను తింటానా?? అని మనసులో అనుకున్నాను. భోజనం రుచించలేదు. కనీసం ఆమె బాక్సులో ఒక ముద్దైనా తినాల్సిందే అని బాధ పడ్డాను.

బెటర్‌మెంట్ ఎగ్జామ్స్ కూడా అయిపోయాయి. సెలవులు ఐదు రోజులే ఇచ్చారు. ఇంటి దగ్గర ఐదు రోజులు ప్రశాంతంగా గడుపుదామనుకున్నా..

"ఒరేయ్ అభి పెళ్లికి వెళ్దాం వస్తావా" అంది అమ్మ.

"ఎవరిది పెళ్లి" అని అడిగాను.

"మీ అమ్మమ్మ వాళ్ల అన్నయ్య మనవడిది" అని చెప్పింది. ఇంత పెద్ద రిలేషన్స్ ఎప్పటికీ అర్థం కావు.

"అంటే నాకు ఏమవుతాడు" అన్నాను.

"అన్నయ్య"

"హా సరే వస్తాను. ఏ ఊరు వెళ్లాలి."

"కాకినాడ" అంది. ఇందాకటి ఉత్సాహం కాస్త రెట్టింపయింది.

"ఎప్పుడు వెళ్తున్నాం" అన్నాను ఆత్రుత ఆపుకోలేక..

"ఈ రోజు సాయంత్రమే అంది."

"నిన్నే కదా వచ్చింది నువ్వు అలా చెప్పి ఉంటే కాకినాడలోనే ఉండిపోదును కదా.."

"నాకు అంత ఆలోచన లేదురా సరేలే ఇప్పుడు ఏమయ్యిందని." అని కసిరింది అమ్మ.

ఎందుకో శశికి ఫోన్ చేయాలనిపించింది. కాకినాడ పెళ్లికి వస్తున్నానని చెప్పాలనిపించింది. కానీ ఒకవేళ వాళ్ల అమ్మ ఫోన్ ఎత్తితే.. అదే భయంతో ఆగిపోయాను.

"ఐయామ్ కమింగ్ టు కాకినాడ ఫర్ మ్యారేజ్" అని మెసేజ్ పెట్టాను.

"అవునా పెళ్లి ఎక్కడ కాకినాడలో" అని రిప్లై వచ్చింది.

"తెలీదు, కాకినాడ వచ్చాక మెసేజ్ చేస్తానులే."

"సరే నేను బయటికి వెళ్లాలి ఉంటాను" అంది.

కాకినాడ బస్టాండ్‌కు ముందు వచ్చే గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర దిగిపోయాం. నేనూ అమ్మ. అక్కడి నుంచి చీడిగకు ఆటో ఎక్కాం.

"అమ్మా పెళ్లి ఎక్కడ చీడిగలోనా" అని అడిగాను.

"కాదు చీడిగ పెదబాబు మావయ్య వాళ్లింటికి."

"అయితే పెళ్లెక్కడ" అన్నాను.

"ఎందుకంత కంగారు ఎలాగా వెళ్తాం కదా"

"అవును ఇంతకూ చీడిగకు ఎందుకు?? మనం డైరెక్ట్ పెళ్లి మండపానికి వెళ్లొచ్చు కదా.."

"కొంచెంసేపు మాట్లాడకుండా ఉంటావా..."

"ఉఫ్ సరే" అని శశిరేఖకు మెసేజ్ చెయ్యడం మొదలుపెట్టాను "ఐయామ్ ఇన్ చీడిగ" అని...

చాలాసేపు ఎదురుచూసా. రిప్లై రాలేదు. ఫోన్ వాళ్ల అమ్మ దగ్గర ఉండి వుంటుంది అనుకున్నాను. ఒకవేళ వాళ్ల అమ్మ మెసేజ్ చూస్తేనో... మా అమ్మ శశి మెసేజ్‌లు రెండు మూడు సార్లు చూసింది. కాకపోతే శశి అని పేరు ఉండటంతో శశాంక్ అని చెప్పి తప్పించుకున్నా. శశి తన ఫోన్‌లో నా పేరు ఎలా ఫీడ్ చేసుకుందో అని ఆలోచించుకున్నాను.

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి తమ పేర్లను సెల్‌లో ఎప్పుడూ పూర్తిగా ఫీడ్ చేసుకోలేరు. మారు పేర్లతోనో లేక అమ్మాయి ఇంకో అమ్మాయి పేరుతోనో, అబ్బాయి ఇంకో అబ్బాయి పేరుతోనో ఫోన్ నెంబర్లు సేవ్ చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల అమ్మానాన్నలకి, మిత్రులకు దొరకరని వాళ్ల ఆశ.

చీడిగ పెదమావయ్య వాళ్ల ఇంటికి చేరుకున్నాం. వీళ్లు మా నానమ్మ తరపువాళ్లంట. అంటే మా నానమ్మ వాళ్ల అన్నయ్య కొడుకు. దేశంలో ఇంతమంది చుట్టాలుండటం చాలా మంచిదనిపించింది. ప్రతి ఊర్లోనూ ఒక చుట్టం ఉంటే దాని కన్నా సుఖం ఉండదేమో అనుకున్నాను. పెదమావయ్య ఫ్యామిలీ, మేమూ కలిసి టి.టి.డి. కళ్యాణ మండపానికి చేరుకున్నాం.

ఇది నాకు తెలియని ప్రదేశం ఏం కాదు. ఎందుకంటే హాస్టల్ ఔటింగ్ ఇచ్చినప్పుడు ఇక్కడకు మేం వచ్చేవాళ్లం. ప్రక్కనే అప్సర హాలులో సినిమాలు చూసి పానీపూరీ తిని వెళ్లేవాళ్లం. ఇవన్నీ అమ్మకు చెపుదామనిపించింది. కానీ అమ్మ, అత్త నగలు గురించి చీరలు గురించి మాట్లాడుకోవడంలో బిజీగా ఉన్నారు. నేను, మావయ్య వెర్రి మొహాలు వేసుకుని నడుస్తున్నాం. ప్రపంచంలో మగవాళ్లందరి పరిస్థితీ ఇంతే అనిపించింది. ఇద్దరు ఆడవాళ్లు ఎప్పుడు మాట్లాడుకున్నా వీటి చుట్టూ తిరుగుతూనే ఉంటాయి. నగలు, చీరలు, ఇంకా లేకపోతే ఆవిడ ఈ వంట చేసింది ఆవి, ఇవి... ఇదంతా అక్కర్లేని సోది.. ఆడవాళ్ళ కన్నా మగవాళ్లు చాలా అమాయకులు అనిపించింది. ఆడవారితో పోలిస్తే... నేను మగవాడిని అయ్యి ఉండటం వల్ల నాకు అలా అనిపించి ఉండవచ్చు అనుకున్నాను.

కళ్యాణ మండపం చాలా అందంగా అలంకరించి ఉంది. "వడ్లమాని వారి పెండ్లి పిలుపు రాజేష్ వెడ్స్ సుమ" అని రాసి ఉంది మెరుపుల అక్షరాలతో...

అమ్మ, అత్త, పెదమావయ్య అందరినీ పలకరించి ఒకచోట కూర్చున్నారు.

నేను కూడా ఒకసారి శశిరేఖకు మెసేజ్ చేద్దాం అనిపించింది. కానీ ఇందాకటి మెసేజ్‌కే రిప్లై రాలేదు కదా అని ఊరుకున్నాను. ఇంతలో ఒక విచిత్రం లంగా, ఓణీ కట్టుకున్న ఒక అందమైన అమ్మాయి కళ్లముందు కదిలింది. అచ్చం శశిలాగే వుంది ఆ అమ్మాయి కూడా... ఇదంతా భ్రమా లేక నిజమా... నాకు లంగా ఓణీ అంటే చాలా ఇష్టం. శశిని అలా ఊహించుకుని వుంటున్నానేమో అనిపించింది...

కానీ శశి తియ్యటి గొంతు... "హాయ్ అభి నువ్వు ఇక్కడ......!!!!" అంది.

"శశి నిజంగా నువ్వే??? నిజమేనా ఇది?"

"హహ ఆగు అయితే" అని తన సుతారమైన చేతులతో భుజం మీద గిల్లింది. కాస్త నొప్పిగా అనిపించినా ఆమె చేయి మొదటిసారిగా తాకిన ఆనందం.

"శశి నువ్వేనా ఇక్కడ..."

"హ ఇది మా పెద్దనాన్న గారి అమ్మాయి పెళ్లి."

"హో ఇది మా అన్నయ్య పెళ్లి" అన్నాను ఒకింత ఆనందంతో...

"మంచిది" అంది.

"అయితే మనిద్దరం బంధువులమన్నమాట. వరసకు నువ్వు నాకేమవుతావు." తన నోటితో ఒక అద్భుతమైన మాటను రప్పించాలని.

"ఏమో నాకీ వరుసలు ఏమీ తెలియవు" అని చెప్పింది చాలా సుతారంగా.... అమ్మాయిలు ఎప్పుడూ ఇంతేనేమో అనుకున్నాను.

"నేను బావను అవుతాను అనుకుంటా" అన్నాను.

"ఏమో అవునా" అంది.

ఇదంతా ప్రక్క నుండి మా అమ్మ గమనిస్తూ వుంది. పరిచయం చెయ్యకపోతే బాగుండదని అమ్మ దగ్గరకు తీసుకువెళ్లాను. కానీ పరిచయం చేయడం ఎలా అనిపించింది.

అమ్మా! ఈ అమ్మాయి పేరు శశిరేఖ. నాకిష్టమైన అమ్మాయి. పేర్లు కూడా కలిసాయి అని చెప్పాలనుంది. కానీ అంత వయసు లేదు నాకు...

"అమ్మా ఈ అమ్మాయి శశిరేఖ, నా క్లాస్‌మేట్" అన్నాను సిగ్గును లోలోపలే దాచుకుంటూ..

"అవునా!! మీ ఇంటి పేరేంటమ్మా?? ఎవరి అమ్మాయివి??" అంది. నాకు లోలోపలే భయం పట్టుకుంది. ఇవన్నీ ఎందుకు కాకపోతే...

"వల్లమాని వారు ఆంటీ. మా నాన్న గారి పేరు రామ్మూర్తి.."

"రామ్మూర్తి ఆ!!! ఎవరు చూపించు ఇక్కడ ఉన్నారా."

"హా అదిగో" అని ఒక నల్లని ఫ్యాంటు వైట్ షర్ట్ వేసుకుని హడావుడిగా తిరుగుతున్న ఒక పెద్దాయన్ని చూపించింది.

"నువ్వు రామం అన్నయ్య కూతురువా అలా చెప్పవేం. రామ్మూర్తి, గీమూర్తి అని అంటావ్."

చుట్టాలనే వారు బీరకాయ పీచులాంటి వారు... ఎక్కడో అక్కడ అలా కలుసుకుంటారనిపించింది.

"శశి ఇవ్వాళ చాలా బాగున్నావ్" అన్నాను.

"ఆహా బిస్కెట్లు వద్దు అభి.."

"నిజం, సర్లే ఇప్పుడు మనం చుట్టాలమన్నమాట. అయినా అది ఉన్న మాటే"

"హా సరే మహాప్రభో" అంది దణ్ణం పెడుతూ. ఆమెను అలాగే చూస్తూ ఉండాలనిపించింది.

"జీవితం మొత్తం ఇలాగే గడిస్తే ఎంత బాగుంటుందో" అన్నాను.

"ఇలాగే అంటే.."

"ఇలాగే అంటే నీతో......" అన్నాను ఒకింత గొంతు తగ్గించి.

"మనిద్దరి మధ్య స్నేహం మాత్రమే... అయినా ఈ వయసులో నాకు అలాంటివి ఇష్టం లేదు" అంది నా మనసులో గాలి తీసేస్తూ...

ఇప్పుడు ఏమీ తనను ప్రేమిస్తున్నాను అని చెప్పలేదే.. కాని తనెందుకలా అనుకుంది. సరే ఈ వయసులో ఇష్టం లేదంటోంది సెటిలయ్యాక ఓకేనేమో... అప్పుడు చూద్దాం అనుకున్నాను.

"మనం స్నేహితులుగానే ఉందాం సరే" అన్నాను. అమ్మాయిలు కచ్చితంగా ఉంటారు. అది ఏ విషయంలోనైనా.... మనసులో బాధ అలానే ఉంది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండాలని లేదు. మనసు కూడా అంతే. ఏదైతేనేం తన ప్రేమ కోసం అలాంటి అమ్మాయిని పొందడం కొన్నాళ్లు ఆగడంలో తప్పు లేదు అనిపించింది. ప్రపంచం మనకి తెలియకుండానే పరిగెడుతుంది. చివరకు అంతా అయిపోయాక అయ్యో అయిపోయిందా అని బాధపడుతూ ఉంటాం.

మా ఇంటర్ సెకండ్ ఇయర్ కూడా అంతే. ఇక మిగిలిందల్లా ఎమ్. సెట్, ఎఐఇఇఇ.. అది కూడా ఈ కాలేజీలో వుండి కోచింగ్ తీసుకోవడమా లేక

పేరున్న కోచింగ్ సెంటర్‌లో చేరడమా అని. శశాంక్‌గాడైతే ఇక్కడే ఉండి కోచింగ్ తీసుకుంటానన్నాడు. వాడికేం చదువుల బిడ్డ ఎక్కడున్నా చదివేస్తాడు అనుకున్నా. ఇంకా శశిరేఖ కూడా ఇదే కాలేజ్‌లో కోచింగ్ తీసుకుంటానని చెప్పింది.

"నాకు కూడా ఇక్కడే ఉండాలనిపిస్తుందిరా" అన్నాను శశాంక్‌గాడితో.

"మరేం"

"కానీ మా ఇంట్లో ఒప్పుకోవడం లేదు. నాకసలు ఇంజినీరింగు చదవాలనే లేదు."

"మరేం చేద్దామనుకుంటున్నావ్??".

"డిగ్రీ.."

"డిగ్రీ ఆ????.." అన్నాడు ఆశ్చర్యంగా.

"హా అవును".

"డిగ్రీ చేసి??".

"సైకాలజీలో మాస్టర్ చేద్దామనుకుంటున్నా".

"మంచి ఆలోచనే.. కానీ దీని గురించి నాకేం తెలీదు" అన్నాడు.

"నాకు చాలా ఇంట్రస్ట్ రా, సర్లే ఇంట్లో పోరు వల్ల కోచింగ్ తీసుకోవడం తప్పట్లేదు."

"కోచింగ్ ఇక్కడే కదా" అన్నాడు.

"లేదు విజయవాడలో అంట అదే ఇప్పుడు వచ్చిన పెద్దబాధ" అన్నాను దిగులుగా మొహం పెట్టి..

"సరే ఏదైతే అది అయ్యింది విజయవాడ వెళ్లు. మిగితాది తరువాత చూసుకోవచ్చు. మరి శశి?? తను ఇక్కడే కోచింగ్ అన్నావ్ కదా."

"హ అవును" అన్నాను.

ఈ విషయం శశికి చెప్పాలనుకున్నాను. ఇప్పుడు మా మధ్య ఉన్నది స్నేహం మాత్రేమే. నాకు ప్రేమ ఉన్నా తను మాత్రం స్నేహం అనుకుంటుంది.

ఇంటికి చేరుకున్నా. ఇక మళ్లీ ప్రిలిమ్స్‌తో పనిలేదు. శశికి ఫోన్ చేయాలనిపించింది. ఇంకా నేను విజయవాడ కోచింగ్ సెంటర్లో చేరుతున్నట్టు చెప్పలేదు. ఫోన్ కన్నా మెసేజ్ బెస్ట్ అనిపించింది.

"హాయ్ శశి".. పది నిమిషాలు దాటిపోయింది. ఇంకా రిప్లై రాలేదు. కాసేపు చూసీ చూసీ సెల్ ప్రక్కన పెట్టేశా.

"ఒరేయ్ రేపే కదా ప్రయాణం బట్టలు అన్నీ సర్దుకున్నావా'' అంది అమ్మ.

"హ అమ్మ" అన్నాను.

అప్పుడే ఆఫీస్ నుంచి వచ్చిన నాన్న ఒక కవరు నా ముందు ఉంచి "ఇదిగో క్రొత్త సెల్లు జాగ్రత్త'' అన్నారు.

"సరే నాన్నగారు" అన్నా ఒకింత గౌరవంతో...

"రేపొద్దున్న నాల్గింటికి లేవాలి త్వరగా పడుకో" అంది.

"సరే" అని చెప్పి చివరిసారిగా అమ్మ సెల్ చూసాను.

"హాయ్ అభి" అని మెసేజ్ వచ్చింది. ఈ సారి అమ్మ సెల్‌లోంచి కాకుండా నా కొత్త సెల్ లోనుంచి మెసేజ్ పెట్టాను.

"దిస్ ఈజ్ అభి. ఇది నా కొత్త నంబర్ నా కొత్త సెల్"

"వావ్!!!!! కంగ్రాట్స్ మాష్టారు" అని శశి రిప్లై. ఎంత ప్రేమగా పిలుస్తోందో అనుకున్నాను.

"రేపు విజయవాడ ప్రయాణం కొత్త కోచింగ్ సెంటర్"

"ఓ అవును శశాంక్ చెప్పాడు''

"సరే ఉంటాను పొద్దున్నే లేవాలి. ఇక నుంచి ఈ నెంబర్ నుండే మెసేజ్ చేస్తాను. బాయ్ టేక్‌కేర్" అన్నాను.

"సరే బాయ్. అభి టేక్‌కేర్"

పొద్దున్నే ఆరింటికి పాలకొల్లులో ట్రైన్ పట్టుకోవడంతో విజయవాడ 10.15కే చేరుకున్నాం నేను, నాన్న... ఈసారి హాస్టల్‌లో ఉండదలచుకోలేదు. లబ్బీపేటలో మా కోచింగ్ సెంటర్. అక్కడే సి.ఎ కోచింగ్ తీసుకుంటున్న మా ఊరి షావుకారు అబ్బాయితో కలిసి రూంలో ఉందామని డిసైడ్ అయ్యాను. దీనికి నాన్న కూడా సరే అనడంతో ఇంటి దగ్గర పచ్చళ్లు తీసుకుని రూమ్‌లో దిగాను. నన్ను దింపి, నా రూమ్ సర్ది నాన్న వెళ్లిపోయారు. అప్పటికింకా కుమార్ రూమ్‌లో లేడు. తను క్లాసుకు వెళ్లాడని

అర్థమైంది. రూమ్ మొత్తం చాలా చిందరవందరగా వుంది. సర్ధడానికి చాలాసేపే పట్టింది. పొద్దున్నే ట్రైన్‌లో టిఫిన్ తినడంతో అంత త్వరగా ఆకలి వేయలేదు. రెండవుతోందనగా బయటకు వెళ్ళి హోటల్ కోసం వెతికాను. రోడ్డుకిరువైపులా పెద్ద హోర్డింగులతో ఏదో ఒక కోచింగ్ అని రాసి వుంది. ఈ లబ్బీపేట రోడ్ మొత్తం కోచింగ్ సెంటర్‌లే ఉంటాయని విన్నాను. ఇప్పుడు చూస్తున్నాను. కాస్త దూరం నడిచేటప్పటికి ఒక బడ్డీ దగ్గర రొట్టెలు వేస్తూ ఉండటం చూసి అది తిని సరిపెట్టుకున్నాను. తిన్నాక నిద్ర రావడం సహజం...

రేపట్నుంచి ఇలా పడుకోవడం కుదరదు అనుకొని కునుకుతీసాను...

రాత్రి ఏడు అయ్యింది ఇంకా వాడు రాలేదు... రాత్రి భోజనం కూడా ఒంటరిగా చేయలేమో అనుకున్నాను. పొద్దున్న వెళ్లిన బడ్డీ దగ్గరికే వెళ్లి ఇంకో రెండు రొట్టెలు తిని వచ్చి రూమ్‌లో కూర్చున్నాను. ఈ ఊరిలో భోజనమే దొరకదా అని తిట్టుకున్నాను.

రాత్రి 9.15 అయ్యేసరికి కుమార్ వచ్చాడు.

“హాయ్ అభి వెల్‌కమ్ టు ది గ్రేట్ కోచింగ్ వరల్డ్” అన్నాడు నవ్వుతూ..

“ఏం కోచింగ్ వరల్డో ఏమో పొద్దున్న నుంచి భోజనమే లేదు రొట్టె తప్ప” అన్నాను బాధను చెప్పుకుంటూ..

“అయ్యో మన రూం ప్రక్కనే కదా మెస్ ఇలా రా” అని మా రూమ్ ప్రక్కనున్న పొడవాటి సందులోని ఒక షాపుని చూపిస్తూ...

“ఓ అలాగా నేను చూడలేదు అవును రోజూ ఇదే టైమ్‌కి వస్తావా”

“హా అవును నేనే కాదు నీకు కూడా రేపట్నుంచి రమారమి ఇదే టైమ్ అవుతుంది” అని బాంబు పేల్చాడు.

“ఓరి నాయనో అంత సేపు చదవాలా???”

“ఇది లబ్బీపేట... ఇక్కడన్నీ కోచింగ్ సెంటర్లే. పొద్దున్న నువ్వు ఎంత త్వరగా వెళితే అంత ముందర కూర్చోవచ్చు. ఇక్కడ నువ్వు చదివావా చదవలేదా అని ఎవడూ పట్టించుకోడు. ఇక్కడున్న సి.ఎ కోచింగ్ సెంటర్లైనా, ఎం.సెట్ కోచింగ్ సెంటర్లైనా, ఎం.బి.ఎ, ఏ కోర్సయినా ఇదే రూల్ ఫాలో అవుతుంది.ఎం.సెట్ వాళ్లు అయితే పర్లేదు. ఇక్కడున్న సి.ఎ వాళ్లైతే దండయాత్రలు చేస్తూనే ఉంటారు నాలాగా” అన్నాడు.

"అవునా అయితే పొద్దున్న ఆరింటికి వెళ్లాలా కోచింగ్ సెంటర్‌కి.. నాది చైతన్య కోచింగ్ సెంటర్"

"నాకు తెలిసి నువ్వు ఐదింటికి వెళ్లాలి. ఎందుకంటే నువ్వు చెప్పినది ఎమ్. సెట్‌లో పేరున్న కోచింగ్ సెంటర్"

"మరి మధ్యాహ్నం భోజనం" అన్నాను నా తిండి గోల ఆపుకోలేక.

"హహహ ఓ అరగంట టైమ్ ఇస్తారులే"

"మరి ఎలా???"

"ఆ ప్రక్కనే ఒక కేంటీన్ వుంది. చైతన్య కోచింగ్ సెంటరే కదా"

"హా అవును"

"అలా అయితే అక్కడ రెండు మెస్‌లు ఉంటాయి. అక్కడికి వెళ్లాక నీకు తెలుస్తాదిలే" అన్నాడు.

"సరే థ్యాంక్స్ ఫర్ ది ఇన్ఫో" అన్నాను.

"ఒక ఊరివాళ్లం దీనికే" అన్నాడు.

"సరే నువ్వు ఏ కోచింగ్ సెంటర్ సి.ఎ అంట కదా".

"హ! సి.పి.టి అయ్యింది.అది బొటా బొటీగా.. రెండేళ్ల నుండి గ్రూప్స్‌కి ట్రై చేస్తున్నా. అది చాలా కష్టం గురూ" అన్నాడు.

"ఒహో"అన్నాను ఒకింత ఆశ్చర్యంతో. అస్సలు పాసవ్వను అనుకున్నప్పుడు చదవడం అవసరమా అనుకున్నాను.

"సరే బయటికి వెళదామా" అన్నాడు.

"ఇప్పుడా టైమ్ 11.15 అవుతోంది."

"కమాన్ మేన్ ఇక్కడి విద్యార్థులకి తిరిగే టైమ్ ఇదే" అన్నాడు నవ్వుతూ..

ఇద్దరం ఒక జ్యూస్ షాపు దగ్గరికి చేరుకున్నాం. ఆశ్చర్యం ఏమిటంటే రోడ్డంతా విద్యార్థులే ఉన్నారు. షాపులు కూడా తెరిచే ఉన్నాయి. విచిత్రం ఏమిటంటే పొద్దున్న కన్నా రద్దీ ఎక్కువగా ఉంది.

"ఇంత రద్దీయా?" అని అడిగాను నా ఆశ్చర్యాన్ని తట్టుకోలేక.

"అవును బ్రదర్ వీళ్లందరూ ప్రొద్దున్నే ఉదయం ఆరు గంటలకి వెళ్లి సాయంత్రం 9.30కి వచ్చేవారే". ఎందుకో ఇంత కష్టపడటం అనుకున్నాను.

శశాంక్‌గాడు అన్నట్టు చదివేవాడు, చదవగలిగిన వాడు ఎక్కడైనా చదువుతాడు. టైమ్ 12.30 అవుతుంది. ఇంకా అందరూ రోడ్లమీదే ఉన్నారు. అసలు వీళ్లు ఎప్పుడు పడుకుంటారు, ఎప్పుడు లేస్తారా అనిపించింది.

ఈ పాటికి కాకినాడలో ఉంటే ఏదో ఒక ప్రశ్న మీద శశాంక్‌గాడితో చర్చ జరిగేదని అనుకున్నా. 'పొద్దున్నే త్వరగా లేవాలి' అనుకుంటూనే నాల్గింటికి అల్లారం పెట్టాను.

"నువ్వు లేపు ఒకవేళ నువ్వు ముందర లేస్తే" అన్నాను.

"సరే" అన్నాడు. ఈ రోజు అసలు శశికి మెసేజ్ చెయ్యలేదు అనుకున్నాను.

పొద్దున్నే అల్లారం మోగుతున్నా కట్టేసి పడుకున్నాను.

"అభి అభి" అని కుమార్ లేపాడు. అప్పటికే 4.30 అయ్యింది. త్వరగా బ్రష్ చేసి, స్నానం చేసి రెడీ అయ్యాను.

"ఇదిగో ఇదే నీ కోచింగ్ సెంటర్" అన్నాడు ఒక ఎత్తైన ఐదు అంతస్తుల బిల్డింగ్‌ని చూపెడుతూ.. "ఇందులో మూడో అంతస్తులో అనుకుంటా మీ క్లాసులు. ఇదిగో మెస్‌లు గ్రౌండ్‌ఫ్లోర్ లోపలుంటాయి వెతుక్కోకు" అన్నాడు.

టైం ఐదుంపావయ్యింది. ఈ టైమ్‌కి ఎవడుంటాడులే అనుకున్నాను. నా అంచనా తప్పయింది. అప్పటికే 40మంది విద్యార్థులు ముందు వరుసలో కూర్చుని ఉన్నారు. వీళ్లకి చదువు మీద ఇంతటి శ్రద్ధా అనుకున్నాను. నేను చదవను అని నిశ్చయించుకున్నదానికి ఇంతలా కష్టపడడం నా మూర్ఖత్వం అనిపించింది. ఇప్పుడే నాన్నకు ఫోన్ చేసి ఇవన్నీ చదవడం ఇష్టం లేదు అని చెప్పాలని వుంది. కానీ వాళ్లను బాధ పెట్టడం ఇష్టంలేక నేను బాధపడుతున్నాను. ఇక్కడ నాలాంటి విద్యార్థులు ఎంతోమంది వుంటారనిపించింది.

రోజులు అన్నీ ఇలాగే గడుస్తున్నాయి. పొద్దున్నే కోచింగ్ సెంటర్‌కు వెళ్లడం రాత్రి వచ్చి పడుకోవడం. శశికి కూడా మెసేజ్ చేసి చాలా రోజులయ్యింది. ఇంక విసుగొచ్చి ఒకరోజు క్లాస్ ఎగ్గొడదాం అని నిశ్చయించుకున్నాను. షార్ట్‌టెర్మ్ కోచింగ్‌లో ఒక రోజు ఎగ్గొట్టడం అంటే మాటలు కాదు. కానీ నాకు క్లాసులో ఉన్నా

ఉపయోగం లేదు అనిపించింది. క్లాసులో ఉన్నప్పుడు పరిచయమైన లక్ష్మణ్ తన రూంకి తీసుకెళ్తానన్నాడు. తను ఎప్పుడూ క్లాస్ చివరి రోలోనే కూర్చుంటాడు. అతను క్లాస్‌కి రావడమే గ్రేట్. తనకు ఈ ఇంజినీరింగ్ మీద అసలు ఇంట్రస్ట్ లేదని అందుకే ఇలా ప్రవర్తిస్తున్నానని చెప్పాడు.

"ఎలాగో మానేద్దామని నిశ్చయించుకున్నాం కాబట్టి మా రూమ్‌కి వెళదాం పద" అన్నాడు లక్ష్మణ్.

చేసేదేమీ లేక "సరే" అన్నాను.

మా రూమ్ దాటిన కిలోమీటరు దూరంలో వాడి రూము... రూము అంటే రూము కాదు. ఒక చిన్న సైజ్ ఫ్లాటు. కానీ అంత శుభ్రంగా లేదు. మూలగా బీరు సీసాలు, సిగరెట్ పీకలు ఉండటం గమనించాను. మాలాంటి వాళ్లకు తప్ప ఇలాంటివి ఏ బ్యాచిలర్‌కి బీర్లు, సిగరెట్లు తప్పవేమో అనుకున్నాను. ముఖ్యంగా ఇక్కడ కోచింగ్ సెంటర్లో చదివే కుర్రాళ్లకైతే మరీనూ.

ఇంతలో స్నానం చేసి బయటకు వచ్చిన ఒక వ్యక్తి "హాయ్ డ్యూడ్" అని పలకరించాడు.

"నేను నీకు తెలుసా??" అని అడిగాను ఒకింత ఆశ్చర్యంతో.

"ప్రపంచం చాలా పెద్దది డ్యూడ్ పరిచయాలు చేసుకోవాలంతే. నా పేరు బాలు సి.ఎల్‌లో సి.పి.టి కూడా పాస్ అవ్వకుండా రెండు సంవత్సరాల నుంచి విజయవాడను పట్టుకుని తిరుగుతున్న అనామకున్ని" అన్నాడు. ఏదో రెండు మూడు ఊర్లను జయించినట్టు చెప్పాడు.

"అలా చెప్పడానికి బాధగా లేదూ" అన్నాను.

"ఎందుకు బాధపడాలి టెన్త్ ఫెయిలయినవాడే ఎలాగో అలా బతుకుతున్నాడు. నేనెందుకు బాధపడాలి. ఇంటర్ పాసయ్యాను కదా" అన్నాడు మొహంలో ఇసుమంతైనా భయం లేకుండా..

జీవితాన్ని ఎంత సింపుల్‌గా తీసుకుంటున్నాడో అనుకున్నాను. ఇంతలో వాళ్ల రూమ్‌లో ఉన్న ఫ్రిజ్ లోంచి ఒక థమ్సప్ బాటిల్ బయటకు తీసాడు. లక్ష్మణ్ మూడు గ్లాసులు తీసి బయట పెట్టాడు.

మూడు గ్లాసుల్లోనూ థమ్సప్ బాటిల్‌లోని డ్రింక్‌ను కొద్ది కొద్దిగా నింపాడు. అంత కొద్దిగా నింపడమనేది ఎందుకో నాకర్థం కాలేదు.

తాగాక చేదనిపించి "ఏంటిది" అని అడిగాను.

"విస్కీ మేన్! హేవిట్" అన్నాడు లక్ష్మణ్.

"నాకు అలవాటు లేదు" అని అన్నాను.

"మాకు మొదట అలవాటు లేదు కానీ తరవాత అలవాటయింది. ఈ బాధలకు జవాబుగా" అన్నాడు బాలు.

"సరే ఇలాంటివి నాకిష్టంలేదు" అని చెప్పి అక్కడినుంచి బయలుదేరి రూమ్‌కెళ్లి సెల్ తీసాను.

శశికి మెసేజ్ చేసి చాలా రోజులయ్యింది. నిజానికి తాను రెండు మూడు సార్లు మెసేజ్ చేసినా రాత్రి మెసేజ్ చూడడం లేట్ కావడంతో సరిగ్గా చాట్ చేయలేకపోయాను. ఇప్పుడు కాలేజీకి వెళ్లుంటుందేమో అన్న అనుమానం ఉన్నా మనసు మెసేజ్ చెయ్యమంది.

ఇంక ఉండపట్టలేక 'హాయ్ శశి' అని మెసేజ్ చేసాను. ఐదు నిమిషాల తర్వాత రిప్లై వచ్చింది.

"హాయ్ సార్ చాలా రోజుల తర్వాత గుర్తొచ్చాను" అంది ఒక బుంగమూతీ స్మైలీ పంపి.

"ఫోన్ చేయొచ్చా నీతో చాలా మాట్లాడాలి" అన్నాను.

"సరే" అంది.

"హమ్మయ్యా" అనుకుని డయల్ చేసాను.

"శశి" అన్నాను కొంచెం ఆర్ద్రత నిండిన గొంతుతో..

"అభి ఎలా ఉన్నావ్" అంది. నిన్ను చూడకుండా బాగాలేను అని చెప్పాలనిపించింది. కానీ అలా చెప్పలేను... 'పర్లేదు' అని చెప్పి ఇక్కడ జరిగిన పరిస్థితులు అన్నీ వివరించాను.

"అక్కడ ఎలా ఉంది తోముడు" అని అడిగాను.

"ఆ!!! నేనేం పెద్దగా చదవడం లేదు" అంది.

"ఓహో" అన్నాను

"సరే ఇంకేంటి" అంది. ఒక అమ్మాయి ఇంకేంటి అన్నప్పుడు అక్కడ ఇంకేమీ లేదని అర్థం. అలాంటప్పుడు నువ్వు కొత్త విషయాన్ని ఏదో ఒకటి చెప్పాలనో, ఉన్న విషయాన్నే సాగదీయాలనో అమ్మాయిల అభిమతం.

"సర్లే శశి ఉంటాను" అన్నాను ఎక్కువసేపు మాట్లాడలేక..

"లవ్‌యు" అని చెప్పాలనుంది. కానీ నువ్వు ఏమనుకుంటావో అనలేదు శశి. నాలో నేను మాట్లాడుకోవడం విచిత్రమనిపించింది.

★ ★ ★

తర్వాత కొన్ని రోజులకి లంచ్ సమయంలో లక్ష్మణ్ కనపడతాడేమోనని చూసాను. ఈ రోజు కూడా తను క్లాసుకి రాలేదు. తను చాలా రోజులుగా క్లాసుకు రావడంలేదు. రోజులాగే క్లాస్‌లన్నీ మరీ బోర్‌గా అనిపించాయి. అందులోనూ సగం క్లాసులు ఆర్గానిక్ కెమిస్ట్రి, ట్రిగ్‌నామెట్రిక్ క్లాసులు కావడంతో క్లాసులు వినడమే కష్టమైంది. ఎందుకో మనసు పీక్కుపోతోంది. అపశకునం తోస్తోంది. ఒక్కసారి లక్ష్మణ్ రూం కి వెళ్లాలనిపించింది.

రూమ్ తాళం వేసి గవర్నమెంట్ సీల్ వేసి వుంది. అక్కడ అంతా సినిమాలో చూపించే పోలీస్ తాళ్లు కట్టి ఉంచారు.

"ఏమయ్యింది" అని కింద షాపతన్ని అడిగితే "పైన బాలు అనే కుర్రాడు ఆత్మహత్య చేసుకున్నాడని" చెప్పాడు. ఒక్కసారిగా అదో పెద్ద షాక్ లా తగిలింది. ఒక్క రోజు పరిచయం అయినా అతని చావు కొంచెం బాధగానే అనిపించింది. మొన్నే కదా మాట్లాడింది తనతో నవ్వుతూ ఉన్నాడు అనుకున్నాను.

"మరి లక్ష్మణ్ గురించి ఏమైనా తెలుసా???" అని అడిగాను షాప్ అతన్ని.

"ఆ అబ్బాయికి ఇంటి దగ్గర నుంచి ఫోన్ వస్తే వెళ్లాడు. ఇంతలో కుర్రాడు ఈ రోజు మధ్యాహ్నం ఫ్యానుకి ఉరేసుకున్నాడు. మంచినీళ్ల టిన్ను పైన పెడదామని వెళ్లిన కుర్రోడు ఇదంతా చూసి పోలీస్‌లకు ఫోన్ చేసాడు. ఇప్పుడే పోలీసుల హడావుడి అయ్యింది" అన్నాడు.

అప్పటికే రాత్రి 10.15 అయిపోయింది. ఆ రూమ్ కేసి ఒకసారి చూసాను. బాలు నాకేసి చూస్తున్నట్టు అనిపించింది. 'ఇంత పెద్ద ప్రపంచంలో నేనేమీ

చేయలేకపోయానే' అన్న నిరాశా, నిస్పృహ అతని మొహంలో కొట్టొచ్చినట్లు కనిపించింది. ఎందుకో భయమనిపించలేదు.. అతని మొహంకేసి చూస్తున్నప్పుడు అది భ్రమో నిజమో... ఏదో ఆలోచిస్తూ రూమ్‌కి చేరుకున్నాను.

"జీవితం చాలా చిత్రమైనది. ఈ క్షణం ఉన్న వాడు మరుక్షణం ఉంటాడో లేదో తెలీదు" అన్నాను దీర్ఘంగా కుమార్‌తో.

"ఏవేవో మాట్లాడుతున్నావ్ ఏమైంది."

"బాలు చనిపోయాడు"

"అయ్యో మొన్న చెప్పిన ఆ మందు బాబా..!!! ఎలా???"ఒకింత ఒనుకుతున్న స్వరంతో..

"ఫ్యానుకి ఉరి వేసుకుని"

"ఎందుకో పాపం"

"నాకిక్కడ ఉండాలని లేదు" అన్నాను కన్నీళ్లను కారుస్తూ......

"ఈ చిన్న విషయానికి ఇంతలా డీలాపడటం ఏం బాలేదు" అన్నాడు ధైర్యం చెబుదామన్న ఉద్దేశంతో.. "నేను బాలూని చూసాను. చనిపోయినా కూడా.."

"అంటే శవాన్ని చూసావా??" అన్నాడు భయం, ఆశ్చర్యం నిండిన గొంతుతో...

"లేదు ఆత్మని" అన్నాను.

"ఆత్మనా??" అన్నాడు. మొహంలో భయం స్పష్టంగా కనబడుతోంది.

ఇతను నాకన్నా పిరికివాడిలా ఉన్నాడే అనుకున్నాను.

"అవును ఆత్మే నాకేసి నవ్వుతూ చూసింది."

"ఎప్పుడు, ఎక్కడ??" ఒకింత ఆసక్తిని కనబరుస్తూ..

"వాళ్ల రూమ్ దగ్గర ఇప్పుడే"

వెంటనే తాను లేచి ఆంజనేయ స్వామి కుంకాన్ని తాను పెట్టుకుని నాకు పెట్టాడు.

"ఇవన్నీ సహజం" అన్నాడు.

"ఏవన్నీ సహజం" అన్నాను మొహం చిట్లించి.

"చనిపోయిన తరువాత మనిషి ఆత్మవుతాడు. మరలా తన శరీరంలోకి తాను వెళ్లిపోదామని ప్రయత్నిస్తాడంట కూడా. అంతేకాకా కొన్నాళ్లు ప్రేతయోగం అనుభవించాలంట అంటే దెయ్యం అన్న మాట" అన్నాడు.

"ఇవన్నీ నీకెలా తెలుసు" అన్నాను ఆశ్చర్యంతో..

"నాకు మా బామ్మ చెప్పింది. ఇవే కాదు ఇంకా చాలా విషయాలు చెప్పింది" అన్నాడు.

ఈ ముసలోల్లకి పనేమీ ఉండదేమో.. లేని పోని విషయాలన్నీ పట్టుకొచ్చి ముఖ్యంగా భయం కల్గించే విషయాలు మాకు చెప్తూ ఉంటారు. ఇంకా వీడు ఎన్ని చెబుతాడో, ఎంత భయపడాల్సి వస్తుందో అన్న భయంతో "చాలా విషయాలా, వద్దులే" ఇప్పటికే భయం వేస్తుందన్నాను.

"సరే ఆంజనేయస్వామి బొట్టు పెట్టుకున్నాం కదా ఇంకేం భయపడక్కర్లేదు" అన్నాడు తింగరి మొహం వేసుకుని వీడికేదో ఆంజనేయస్వామి బావమరిది అయ్యినట్టు.

పొద్దున్నే మరలా క్లాసుకి వెళ్లాలా అనుకుంటూనే పడుకున్నాను. ఎందుకో శశికి ఫోన్ చేయాలనిపించింది. బాలు చనిపోయాడని తిరిగి కనిపించాడని చెప్పాలనిపించింది. కానీ అప్పటికే చాలా లేటయ్యింది. ఒకమ్మాయికి ఇంత రాత్రి పూట ఫోన్ చేయటం భావ్యం కాదనిపించింది. నిజానికి అదంతా వాళ్ల అమ్మో, నాన్నో ఎత్తుతారన్న భయం. నిద్ర అయితే పట్లేదు కానీ బాలూ మొహం స్పష్టంగా కనిపిస్తోంది కలలో.. ఈ సారి ఆంజనేయస్వామి బొట్టుని ఒళ్లంతా పూసుకుని పడుకున్నాను.

ఎప్పటిలాగే పొద్దున్న క్లాసుకి వెళ్లాను. ఈ సారి మాక్‌టెస్ట్ కండక్ట్ చేసారు. ఏదో నచ్చినట్టు పెట్టేశా.. అలాంటి టెస్టుల్లో నెగిటివ్ మార్కింగ్ లేకపోవడం అదృష్టం అనుకున్నా. ఇంకా ఎంసెట్‌కి ఇరవైరోజులే టైముంది. అందుకేనేమో అన్ని టెస్ట్‌లు ఈ టెస్ట్‌లో మంచి మార్కులు వచ్చిన వాళ్ళని ఇంకా బాగా రుద్దుతారన్నారు. ఈ టెస్ట్‌ల వల్ల ఉపయోగం ఏంటి అంటే టెస్ట్‌లు అయిన వెంటనే మమ్మల్ని విడిచిపెడతారు. అంటే 5:30 టైమ్‌కి టెస్ట్ అవుతుంది. అందువల్ల టెస్ట్‌లు అంటే మరీ ఇష్టం. అందులోను మూడు గంటల టెసస్ట్‌లో మే జవాబులు పెట్టేది గంటే. మిగతా రెండు గంటలు పడుకోవడంతోను లేక ప్రక్క అమ్మాయిలను చూడటంతోను సరిపోతుంది. చాలా

రోజుల తర్వాత రూమ్‌కి త్వరగా వెళ్తున్నా అనుకొని అదే కంగారుతో, ఆనందంతో ఆరింటికల్లా రూమ్‌కి చేరుకున్నా.

ఇప్పుడు శశితో చాలా సేపు శశితో మాట్లాడాలి అనుకొని ఫోన్ తీశాను. అప్పటికే 15 మిస్డ్‌కాల్స్... ఇన్ని సార్లు ఎవరు ఫోన్ చేసి ఉంటారా అని చూస్తే 'నాన్న'... ఆయన కారణం లేనిదే ఎప్పుడు ఫోన్ చేయరు. అలాంటిది ఇన్ని మిస్డ్‌కాల్స్ ఉండటం చూసి వెంటనే ఫోన్ చేశాను మరొక షాకింగ్ న్యూస్.

"అమ్మమ్మ చనిపోయిందిరా" అని ఏడుస్తూ మొదలెట్టింది అక్క నా ఫోన్ ఎత్తిన వెంటనే...

"ఎప్పుడు, నేనిప్పుడే బయలుదేరుతాను" అన్నాను బాధతో. అంతకుమించిన మాటలేవి రాలేదు ఆ సమయంలో..

"హ త్వరగా బయలుదేరు" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

వెంటనే విజయవాడ టు అమలాపురం బస్సు పట్టుకొని ఎక్కాను. అప్పటికే సమయం ఎనిమిది అయ్యింది. అంటే పొద్దున తెల్లారకట్లకి అమలాపురం చేరుకుంటాను.

అమ్మమ్మ... కొంచెం లావుపాటి శరీరం... నడివనివ్వని బోదకాలు.... అందరికి అన్నం పెట్టే చెయ్యి. ఎంతమందికైనా ఇట్టే వండిపెడుతుంది. ఊర్లో దేవుడి పెళ్ళికి అయితే ఏకంగా 50 మందికి పైగా బాజాల వాళ్ళు వచ్చేవారు. అదికాక ఇళ్ళంతా చుట్టాలు. వాళ్ళందరికి అమ్మమ్మ ఒక్క చేత్తో చేసి పెట్టేది అమ్మమ్మ వెళ్ళిపోయింది. ఈ మధ్య ఏంటో చావుని చూడటం అలావాటైపోతోంది అనుకున్నాను. కన్నీరు కారుస్తున్నా. ఆ అందరు ఎప్పుడో అప్పుడు వెళ్ళిపోవాల్సిందే అన్న వేదాంతం గుర్తుకువచ్చింది. ఆ రాత్రి ప్రయాణం అమ్మమ్మని గుర్తు తెచ్చుకోవడంతో సరిపోయింది. ఇంకా చెప్పాలంటే బస్సులో కన్నీళ్ళను నెమ్మదిగా కార్చడంతో సరిపోయింది. ఎందుకంటే బస్సులో బోరుమని ఏడ్వలేము. అది ఒక మగాడు అలా ఏడ్వకూడదని సమాజం అంటుంది. అందుకని ఆ రాత్రంతా అలా మౌనంగానే గుర్తుతెచ్చుకొని ఏడ్చాను.

చావు ఒక మనిషిని పూర్తిగా నిద్రపుచ్చేది అనుకుంటూ నేను ఒక కునుకు తీశాను. ఎక్కడా నిద్ర పట్టలేదు. అమ్మమ్మ గుర్తుకు వస్తూనే ఉంది. పొద్దున్నే ఐదింటికల్లా బస్సువాడు అమలాపురానికి చేర్చాడు. అక్కడి నుంచి బోడసుకుర్రు వెళ్ళడం ఒక పెద్ద

సమస్య. ఎలాగో అలా అక్కడికి చేరుకున్నాను. ఎప్పుడు సంతోషంగా ఉండే అమ్మమ్మ ఇల్లు చాలా విచారంగా ఉంది. ఇంటి ముందు చాలా మంది జనం ఉన్నారు. అప్పుడే పెద్దమావయ్య వైజాగ్ నుంచి వచ్చాడంట. లేకపోతే శవాన్ని నిన్నే ఎత్తే సేవారని చెప్పింది అక్క. ఎటువంటి జబ్బులేదని, నిన్న రాత్రే రాజమ్మ జాతరకు వచ్చిన బాజాల వాళ్ళకి, బాకాల వాళ్ళకి భోజనం పెట్టిందట. అంతలోనే ఇలా జరిగిందని చాలా మంది మాట్లాడుకుంటున్నారు.

అప్పటికే పాడెను సిద్ధం చేస్తున్నారు. పెద్ద మావయ్య వచ్చేయడంతో తంతును ప్రారంభించారు. పాడెలో ఏడు కర్రలు, రెండు నిలువు కర్రలు వేయడం ఎప్పుడూ సందేహం.... అసలు ఎందుకిదంతా ఎవరినైనా అడగాలనిపించింది. కాని అందరూ బాధలో ఉన్నారు నాతోపాటే.... ఎవరిని అడగాలనిపించలేదు.

తాతగారు మళ్ళీ ఒక్కసారి గుర్తొచ్చారు. అక్కడ జరిగిన కార్యక్రమాలన్ని గుర్తొచ్చాయి. ఇక్కడే కొంచెం తేడా. ఎప్పుడూ మగవారికి, ఆడవారికి చూపించే తేడాయే అది....అమ్మమ్మని శ్మశానానికి తీసుకువెళ్తున్నారు. ఈ సారి జనం చాలా మంది ఉన్నారు. అది ఆవిడ చేయి ప్రభావం అనుకున్నాను. నేను కూడా శ్మశానానికి వెళ్ళాను.

ముగ్గురు మావయ్యలు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. మావయ్యతో పాటు చాలామంది... వీళ్ళది రక్త సంబంధం... వాళ్ళది అన్న సంబంధం అనిపించింది.

శ్మశానంలో ఏం జరుగుతుందా అని చూస్తున్నా. అమ్మమ్మని కూడా నగ్నంగా కాల్చేశారు. కపాల మోక్షం అయ్యేవరకు ఉండాలి. ఇవేమి నాకు కొత్త అనిపించలేదు. అప్పటి సందేహాలే. అటుగా ఒక చెట్టు కింద చుట్ట త్రాగుతున్న కాటికాపరి పక్కన్న కూర్చొని చితిమంటనే చూస్తున్నా. కళ్ళలో కన్నీళ్ళు, ప్రశ్నలు అలాగే కదులుతున్నాయి.

"ఏం బాబు ఆవిడ నీకు ఏమవుతారు" అన్నాడు గుప్పు గుప్పుమని చుట్ట పొగని వదులుతూ...

"అమ్మమ్మ" అన్నాను.

"సానా గొప్పావిడయ్యా! పై నుంచి పోయింది ప్రాణం"

"ఇవన్నీ నీకు తెలుసా? ఎలా పోతారు? ఈ కార్యక్రమాలన్ని ఎందుకు?" అని అడిగాను.

"ఎన్ని సూసాను బాబు, ఇది మా వృత్తి ధర్మం, పొద్దున్న చావుతో మొదలెడుతుంది మా జీవితం" అన్నాడు.

"అయితే నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను చెప్తావా"

"అడగండి బాబయ్య, నాకు తెలిసినవి అయితే సెప్తాను"

"అసలు చనిపోయిన వాళ్ళని ఎవరినైనా చూశావా"

"చూశాను బాబయ్య ఇప్పుడు కూడా మీ అమ్మమ్మగారిని సూతన్న"

అతని మాటల్లో ఏవో మర్మం కనబడింది. అది ప్రపంచానికి అందనిది.

"అవునా ఏం చేస్తోంది ఆవిడ ఇపుడు"

"ఏముంటాదయ్యా ప్రతి జీవిలాగే కొట్టాడుతోంది."

"మరి మాకెందుకు కనిపించడంలేదు" అన్నాను.

"ఇది మాకు వంశపారపర్యంగా వచ్చిన దరిద్రం అయ్యా!! మాకు జీవుల అంటే ఆ ఆత్మలు కనిపిస్తాయి"

"మరి నీకు భయం వేయదా"

"భయం ఉండదు. జాలి వేస్తుందయ్యా వాళ్ళ ఏడుపు చూస్తుంటే"

"అంటే ఇప్పుడు మా అమ్మమ్మ కూడా ఏడుస్తోందా" అన్నాను.

"అందరు ఏడుత్తారు అయ్యా...ఇంకా చెప్పాలంటే మీ అమ్మమ్మగారు మహనుభావురాలు ఊర్ధ్వం నుంచి పానం పోయింది" అన్నాడు.

ఆ సమయంలో అతనొక జ్ఞానిలా అనిపించాడు.

"ఊర్ధ్వం నుంచి ప్రాణం పోవడమంటే" అని అడిగాను ఆసక్తితో మఠం వేసుకొని..

"మనకి తలపైన సహస్రార సక్రం అనేది ఒకటి ఉంటాదయ్య. అక్కడే బ్రహ్మ రంధ్రం ఒకటి ఉంటాది. ఆడ నుంచి పానం పోతే ముక్తి. పైన కళ్ళు, చెవులు, ముక్కు నోరు నుంచి పోయినా మంచిదే. ఎటుపోయ కింద రంధ్రాలలోంచి పోతే పాపం"

"అలాగా, అవునూ,!!! మా పెద్ద మావయ్య అమ్మమ్మ శవం చుట్టూ కుండ పట్టుకొని తిరుగుతుంటే నువ్వు ఒక్కొ రౌండుకి కత్తితో చిల్లు పెట్టావ్. అంతే కాకుండా మా పెద్దమావయ్యని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోమన్నావ్ ఎందుకు ఇదంతా"

"అదా అయ్యా, ఇది గమనించావో లేదో మొత్తం తిరిగింది మూడు తిరుగుళ్ళు.... అంటే బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం... చివరలో కుండను పడేస్తారు. అంటే అక్కడతో అవన్ని అయిపోయాయి అని.

ఇంక మీ మావయ్యగారిని వెనక్కి తిరిగి సూడకుండా పొమ్మన్నాను. అంటే మీయమ్మ గారిది అయిపోయింది. ఇంక నీకు ముందు సానా జీవితం ఉంది. వెనక్కి తిరిగి సూడకు అని అర్థం" అని చెప్పాడు.

"ఇవన్ని నీకెలా తెలుసు" అని అడిగాను

"మా తాత సెప్పాడయ్యా"

"మరి రెండు నిలువు, ఏడు అడ్డ కర్రలకి అర్థం ఏంటి"

"అదా మనిషి ఇశ్వంలో ఏడు లోకాలయ్య అతల, కుతల, వితల, సుతల, రసాతల, మహతల, పాతాళ లోకాలు.... ఇయన్ని కాకుండా ముక్తికి వెళ్ళిపో అన్న అర్థంతో ఏడు కర్రలు వేస్తాము" అన్నాడు.

"సరే మనిషి చనిపోయాక ఏమవుతాడు"

"అదో పెద్ద రగస్యం అయ్య..... నాకు పెద్దాగా తెలీదు కాకపోతే నరకం అనేది ఉంటాదని, అది అనుభవించాకే ఇంకో జన్మ ఏర్పడతాదని ఇన్నాను".

ఈ లోపల టప్‌మని పెద్ద శబ్దం వినబడటంతో కాలుస్తున్న చుట్టను ప్రక్కన పడేసి లేచాడు.

"ఎళ్ళొస్తాను అబ్బాయ కపాల మోచ్చం అయ్యింది" అన్నాడు.

ఇవ్వాల చాలా విషయాలు తెలుసుకున్నాను. కాని ఈ వయసులో ఇవన్ని ఎందుకనిపించింది. అందరితో పాటే ఇంటికి వెళ్ళాను. ఈ సారి పదిరోజులు చాలా త్వరగా గడిచింది. ఇంకా పదిరోజుల్లోనే ఎమ్‌సెట్ ఎగ్జామ్. ఎందుకో శశికి ఫోన్ చేయాలనిపించింది. తాను ఈ పదిరోజుల్లో రెండు మూడు సార్లు మెసేజ్ చేసినా రిప్లై ఇవ్వలేకపోయాను. ఆ పదిరోజులు అమ్మమ్మని తలుచుకోవడంతో సరిపోయింది. అమ్మమ్మ తాను చనిపోతానని పది రోజుల కిందటే చెప్పిందంట పెద్దమ్మతో. కాని పెద్దమ్మ అమ్మమ్మని తిట్టి "అవేం మాటలు" అని ఊరుకుంది. కాని అది నిజం అవుతుందని అనుకోలేదట. అంతే కాకుండా తాను (అమ్మమ్మ) పుడి మీద కూర్చున్నట్టు కనిపించిందంట.

ఆ పది రోజులు ఇవే మాటలతో గడిచింది. ఇంక నేను, నాన్న ఇంటికి చేరుకున్నాం. అమ్మ మాత్రం ఇంకొన్ని రోజులు ఉంటుందంట. ఎలాగైనా ఈ రోజు శశితో మాట్లాడాలి అని అనుకొని మెసేజ్ చేశా 'హయ్ శశి" అని....

రిప్లై లేదుకాని మిస్డ్‌కాల్ వచ్చింది. ఎందుకో ఫోన్ చేయాడానికి భయం వేసినా చేశాను.

"హలో" అంది ఆడ గొంతు. అది శశి గొంతు చాలా రోజులైంది ఆమెతో మాట్లాడి...

'శశి ఎలా ఉన్నావ్" అన్నాను.

"ఎలా ఉంటాను... ఎంసెట్ ప్రిపరేషన్స్‌తో చచ్చిపోతున్నాను"

"ఓహో అలాగా" అన్నాను. నేనసలు బుక్ ముట్టుకోలేదు అని చెప్పాలనిపించింది.

"మీ అమ్మమ్మ గారు పోవడం చాలా బాధాకరం, మా అమ్మ చెప్పింది".

"హుఁమ్! అవును" ఇంకేం మాట్లాడాలో తెలీలేదు.

"నీ గొంతు విని చాలా రోజులైంది" అన్నాను.

"హ! అవును నేను కూడా"

అయితే నేను నిన్ను మిస్సైనట్టే నువ్వు నన్ను మిస్సవుతున్నావా అని అడగాలనిపించింది.

"ఇంకేంటి అయితే...ఇంజినీరింగా??" అని అడిగాను.

"హ అవును".

"సరే! నేను డిగ్రీ అనుకుంటున్నా"

"మంచిది! నువ్వు ఎందులో ఉన్నా గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అంది.

"థ్యాంక్యు శశి"

"సరే చదవాలి ఇంక ఉంటాను జాగ్రత్త" అని ఫోన్ పెట్టేసింది.

ఇంక ఈ పదిరోజులు ఎంసెట్ ప్రిపేర్ అవుదామని అనిపించింది. కనీసం నాన్న ఖర్చుపెట్టిన డబ్బుకి ఏదో ర్యాంకు తేవాలనే ఉద్దేశంతో.

★ ★ ★

ఎంసెట్ పరీక్ష అయిపోయింది. ఏదో మొక్కుబడిగా రాశాను అంతే.

ఎంసెట్ పరీక్ష నెలరోజులు కాలీ టైమ్. ఇంజినీరింగ్‌లో చేరేవాళ్ళకి కనీసం రెండునెలలు పైనే సెలవులు దొరికాయి..

ఒక నెల తర్వాత రిజల్ట్స్. ఇంకో నెల కౌన్సిలింగ్‌కు సరిపోతుంది. ఇంజినీరింగు ఒక లెక్క అయితే డిగ్రీ ఇంకో లెక్క....

ప్రస్తుతంలో రెండిటికీ తేడా లేకుండా పోయింది. నా చిన్నప్పుడు ఇంజినీరు పాసవ్వడమంటే చాలా గొప్ప. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చవకబారు ఇంజినీరింగు కాలేజీలు ఎక్కువైపోవడంతో దాని విలువ కూడా పడిపోయింది.

చాలా మంది ఇంజినీరింగ్ కుర్రాళ్ళు జిరాక్స్ సెంటర్లో పనిచేస్తున్నారని ఎవరో అంటే విన్నాను. ఇన్నీ ఉన్నా అందరూ ఇంజినీరింగే చదవాలని దాని కోసం ఒక పనికిమాలిన పరీక్ష రాయమనడం, నేనో పనికిమాలినవాడిలా రాయడం విచిత్రం అనిపించింది. ఏదైతేనేం పరీక్ష రాశాను. ఫలితాలు గురించి ఎదురుచూడటమే మిగిలింది. శశి ఎలాగా ఇంజినీరింగు చేరాతానంటోంది. అది కాకినాడలోనే.

నేను ఫలితాలతో సంబంధం లేకుండా డిగ్రీ అని నిశ్చయించుకున్నాను.

ఇదే విషయం నాన్నకు చెప్పాలనిపించింది. ఇప్పుడు కూడా చెప్పకపోతే నాకు ఇంజినీరింగే గతి అనిపించింది. అప్పుడే వచ్చిన నాన్నతో చెప్పాలా వద్దా అన్న డౌటుతో చెప్పేశాను.

"నాన్న నేను ఇంజినీరింగు చదవను" అన్నాను తక్కువ గొంతుతో.

ఏం మాట్లాడలేదు.. వచ్చిన వెంటనే స్నానం చేయకుండా లోపలకి వెళ్ళరు నాన్న...

ఇప్పుడు కూడా నూతి దగ్గర స్నానం చేస్తున్నారు మౌనంగా.

"నాన్న నేను ఇంజినీరింగు చదవను" అన్నాను కొంచెం గొంతు పెంచి.

"మరి ఏం చేద్దామని"

"నేను డిగ్రీ చదువుదామనుకుంటున్నా".

"తర్వాత???..... తెలుసుకదా ఇప్పుడు డిగ్రీ ఎందుకు పనికి రానిది అది తెలుసా"

“హ తర్వాత సంగతి తర్వాత చూస్తాను''

“సరే నీ ఇష్టం తీసుకున్న కోచింగు అంతా వేస్తా! ఇంతకీ పరీక్ష బానే రాశావా''

“బానే రాశాను... కాని నాకు ఇంజినీరింగులో చేరాలని లేదు అంతే''

“అయితే ఈ సెలవుల్లో టైపు అది ఎందుకైన ఉపయోగపడుతుంది.”

“అంటే ఈ సెలవులకి ఎక్కడికి వెళ్ళద్దా??”

“హా!” అన్నారు కోపంగా

“సరే టైపు నేర్చుకుంటాను” అన్నాను.

ఒకటి కావలంటే ఇంకొటి వదులుకోవాలి. లేదా ఒక దరిద్రాన్ని వదులుకోవాలంటే ఇంకో దరిద్రాన్ని కొని తెచ్చుకోవాలన్న మాట అనుకున్నాను మనసులో.

“రేపు వైకుంఠంగారికి చెప్తాను. అక్కడే టైపు నేర్చుకోవడం “

“అంటే రోజు కొండుకుదురు వెళ్ళాలా “

“హ అవును ఏం?” అన్నారు కోపంగా

“ఏం లేదు నాన్న, వెళ్తాను సైకిలు మీదే కదా''

“విమానం కావాలా” అన్నారు వెటకారంగా.

ఈ పెద్దవాళ్ళు తమకి ఇష్టం లేని పనులు చేసినప్పుడు ఇలాంటి ఏదో కష్టతరమైన కండిషన్లు పెడతూ ఉంటారు.

ఇక రేపట్నుంచి మరో రుద్దుడు ప్రారంభం అనుకున్నాను.

టైపింగ్‌లో మొదట లోవర్ నేర్పుతానన్నారు. వేళ్ళు ఎలా ఉంచాలో. ఇంక ఏ అక్షరాలు నొక్కాలో ఒక షీట్ ఇచ్చి వెళ్ళారు. అక్కడ టైపింగ్ ఒక్కటే కాకుండా ఒక ఇరువై కంప్యూటర్లు కూడా ఉన్నాయి. అది నెట్ సెంటర్ కూడాను.

రోజు టైప్ అయ్యాక ఒక అరగంట నెట్ ఓపెన్ చేసేవాడ్ని. అప్పుడే శశాంక్‌గాడు చెప్పినట్టు ఫేస్‌బుక్ మొదలుపెట్టాను.

శశి చేత మొదలుపెట్టించాను.

శశికి ఇంట్లో ఇంటర్నెట్ ఉండటం ఇంకా సులువైంది.

టైపు సంగతి ఎలా ఉన్నా ఇంటర్నెట్‌లో చాలా విషయాలు బయటపడ్డాయి. అంతే కాకుండా దూరంగా ఉన్న చుట్టాలను కలుసుకోవడము జరిగింది. దీని ద్వారా వీడియో చాటింగ్ చేసుకోవడం చూశాను.

ఇలా శశితో మాట్లాడాలనిపించింది. కాకపోతే అదే నెట్ సెంటర్లో మాట్లాడితే బాగుండదనిపించింది.

ఇప్పటికే రోజుకి అరగంటో, గంటో ఇంటర్నెట్ ఫ్రీగా వాడుతున్నాను.

అలాంటిది మళ్ళీ ఇలా వీడియో చాటింగ్‌లు అంటే ఏడుస్తాడేమో అన్న ఉద్దేశంతో ఈ సారి టైప్ అయ్యిన వెంటనే ఇంకో నెట్ సెంటర్‌కు దారి తీశాను.

గంటకు 20 రూపాయలు అని రాసి ఉంది. జేబులో నలభై రూపాయలు ఉన్నాయి. ఒక అరగంట మాత్రమే చాట్ చేయాలని నిశ్చయించుకుని శశికి ఆన్‌లైన్‌కి రమ్మని మెసెజ్ చేశాను.

"సరే" అని మెసేజ్ రావడంతో చాలా ఉత్సాహంగా ఫేస్‌బుక్ తెరిచాను.

శశిరేఖ : ఏంటి అంత అర్జంటుగా రమ్మన్నావ్? అయినా రోజు ఆన్‌లైన్ కి వచ్చే టైమ్ కదా.

అభిమన్యు : అవును కాని ఇవాళ స్పెషల్.

శశిరేఖ : స్పెషల్ అంటే?

అభిమన్యు : నీకు వీడియో కాలింగ్ ఉందా???

శశిరేఖ : హ ఉంది కొంపదీసి ఆన్ చేయాలా??

☹ ☺

రెండు స్మైలీలు అర్థంకానివి ఒకటి విచారంగాను, ఇంకోటి సంతోషం. అంటే ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉందని అభిప్రాయపడ్డాను.

అభిమన్యు : ☹ ☹ ☹ (విచారంగా ఉన్నట్టు)

శశిరేఖ : అంతలా ఫీల్ అయిపోకులే! ఆన్ చేయి వీడియో చాట్.

అభిమన్యు :

ఈ సారి నా సంతోషాన్ని ఎక్కువ స్మైలీలు పెట్టి వీడియో చాట్ ఆన్ చేశాను.

స్క్రీన్ మీద ఆమె ముఖం అస్పష్టంగానే కనిపిస్తోంది. కాని చాలా అందంగా వుంది. అది శశికే సాధ్యమనుకున్నా.

"చాలా రోజులైంది నిన్ను చూసి" అన్నాను

తను కూడా నాలాగే చెవిలో హియర్ ఫోన్స్ మరియు తన పెదాల దగ్గర మైకు ఉంచుకుంది.

"నేను కూడా" అంది

"ఏం చేస్తున్నావ్" అన్నాను. ఆ అమ్మాయిని చూసిన ఆనందంలో అనుకుంటా ఇకేం మాట్లాడాలో తెలీలేదు.

"పిచ్చి ప్రశ్న... నీతో మాట్లాడుతున్నాగా అంది".

ఆమె మాట నన్ను త్వరగా చేరుకుంటోంది. కాని పెదాలు చాలా లేటుగా కదులుతున్నాయి.

అది ఇంటర్నెట్ ప్రాబ్లమ్ అనుకొని ఆమెను అలాగే చూస్తున్నా.

"ఏంటి చూడటం ఆపి మాట్లాడతావా" అంది.

"శశి అబద్ధం" అన్నాను ఆమెను చూస్తూ.

"ఏంటి అబద్ధం?? ఏంటా అబద్ధం??"

"నిన్న నువ్వు అందంగా వుంటావని చెప్పిన నిన్నటి నిజం ఈ రోజు అబద్ధం"

"మరి ఈ రోజు నిజం ఏమిటో"

"నువ్వు ఒక దేవకన్యవు శశి"

"ఇది మాత్రం నిజంగా అబద్ధం.. ఇవ్వాల్టికి కాకపోయిన రేపటికి అవుతుంది నిన్నట్లా"

"అబద్దాలు చెబితే ఆడపిల్లలు పుడతారు"

"నీలాంటి ఆడపిల్లలు వందమంది అయినా ఫరవాలేదు"

"నీతో వాదించడం కష్టం అభి''

"ఓ! ఇంతకి ఎవరెవరు ఉన్నారు నీతో ఇప్పుడు" అన్నా.

"ప్రస్తుతానికి ఎవరు లేరు" అని కెమెరాని రూమ్ మొత్తం తిప్పింది.

"సరే! ఇంకేంటి అయితే ఇంజినీరు గారు'' అన్నాను.

"కొత్త పిలుపా! సరే సార్"

ఈ లోపల తన పక్కన ఎవరో కూర్చున్నట్టు అనిపించింది.

"ప్రక్కన ఎవరు?" అని అడిగాను

"మా బావ" అంది.

నా గుండెల్లో రాయి పడ్డట్టయ్యింది. ఇది ప్రతి అబ్బాయికి ఉండే భయమే.

ఇంకా ఏదో అడగాలని అనిపించింది. కాని ప్రక్కనే వాళ్ళ బావ ఉండటంతో ఏం మాట్లాడలేదు. ఆనందకర విషయం ఏమిటంటే వాళ్ళ బావ మాట స్పష్టంగా వినిపిస్తోంది. తను శశిని ఏడిపిస్తున్నాడు. "బాయ్‌ఫ్రెండా?" అని. శశి సిగ్గుపడుతోంది. "ష్ ష్" అని వారిస్తోంది. ఇంకా గంట అవ్వడానికి ఐదు నిమిషాలే ఉండటంతో శశితో "బాయ్" అని చెప్పాను.

"సరే మెసెజ్ చేస్తాను టేక్ కేర్'' అంది.

సమయం తెలీలేదు. గంట త్వరగానే గడిచింది.

నెట్‌లోంచి వచ్చిన తర్వాత శశీకి మళ్ళా మెసేజ్ చేశాను.

"హాయ్ శశి" అని.

"హాయ్ సార్! ఏంటి ఇప్పుడే కదా నెట్ ఆఫ్ చేసింది అప్పుడే గుర్తొచ్చానా"

"ఏం మెసేజ్ చెయ్యద్దంటావా" అన్నాను.

"అలా అనేం లేదు. ఏదో మాములుగా అన్నా".

"సరే! ఫోన్ చెయ్యచ్చా''

"చెయ్" అంది.

ఒక అమ్మాయి ఫోన్ చెయ్యచ్చా అన్నప్పుడు "ఎస్" అంటే అంతకన్న ఆ అబ్బాయికి అదృష్టం ఉండదు.

"హలో శశి"..

"ఏం చేస్తున్నావు" ఆ సమయంలో ఇంతకు మించిన ప్రశ్నలేవి దొరకవు.

"నీతో మాట్లాడుతున్నాను మహాప్రభో!" అంది.

"హ హ!! సరే... ఇందాక మీ బావ ఏదో అంటున్నాడు" నెమ్మదిగా అసలైన టాపిక్‌లోకి దింపుతూ...

"నీకు వినిపించిందా కొంపతీసి" అంది నవ్వుతూ.

"హ" అన్నాను.

"వాడో పిచ్చి వెధవ ఎప్పుడూ అంతే.. మనిద్దరం మంచి ఫ్రెండ్స్ అని చెప్పానులే అంది"

శశి ఎప్పటికీ అర్థంకాదు. శశే కాదు అందరూ అమ్మాయిలు ఇలాగే ఉంటారేమో అనిపించింది.

"సరే ఉంటాను" అన్నాను టైరులోని గాలి మొత్తం తీసేశాక ఇంక నడపలేమని.

"హుంమ్! సరే జాగ్రత్త" అని ఫోన్ పెట్టేసింది.

ఇది అర్థంకాని పరిస్థితి. ఆ అమ్మాయినే తలుచుకుంటున్నాను. మెసేజ్ చేస్తున్నాను. మాట్లాడుతున్నాను. సినిమాల్లో చూపించినట్టు ఇళయరాజా మ్యూజిక్ ప్లే అవట్లేదు కాని నేను ఊహించుకుంటున్నాను. వర్షం పడుతున్నట్టు, చినుకులు పువ్వుల్లా రాలుతున్నట్టు..ఇదంతా పైత్యం వల్ల అనుకుంటా......

* * *

ఎంసెట్ రిజల్ట్స్ వచ్చేసాయి...

ఊర్లోనే ఉన్న త్రినాథ్ ఈ సేవ దగ్గర కూర్చుని కంప్యూటర్లో నా హాల్ టికెట్ నెంబరు టైపు చేశాను.

"72640" స్క్రీన్ మీద కనిపించింది.

"అబ్బే" అన్నాడు త్రినాథ్. వాడికీ చదువు గురించి అన్ని తెలిసినట్టు.

వాడికి తెలిసిందల్లా అంకె ఎంత తక్కువ వస్తే అంత ఎక్కువ మంచిదని అంతవరుకే. రాసింది రెండు లక్షల మంది నా కింద లక్షా ముప్పైవేళ మంది ఉన్నారా అని ఆలోచించాను.

ఇదంతా ఎందుకు ఆలోచిస్తున్నాను. అసలు ఇంజినీరింగులో చేరను అని అనుకున్నప్పుడు ఇదంతా ఎందుని. కాని నా నిశ్చయాలు, అభిప్రాయాలు ఎవరికి కావాలి.

నాకో పనికిమాలిన ర్యాంకు వచ్చింది. కాబట్టే ఇంజినీరింగులో చేరలేదనుకుంటారు.

ఇవన్నీ బుర్రని తిప్పేస్తున్నాయి. నాన్నకి ఫోన్ చేసి వచ్చిన ర్యాంకు గురించి చెప్పాను.

"ఎంత వచ్చినా ప్రయోజనం ఏముంది? నువ్వు చేరనన్నావ్ కదా మనసు మారిందా??" అన్నారు.

"లేదు! మాములుగా చెబుతామని ఫోన్ చేశాను" అన్నాను.

"సరే" అన్నారు.

ఇంక శశి ఎంత వచ్చిందో తెలుసుకోవాలని ఫోన్ చేశాను.

"హలో శశి నాకు 72640" అన్నాను దీనంగా.

"మంచిది! నాకు 32000" అంది.

"ఓహో! అయితే నువ్వు అనుకున్న కాలేజీలో సీటు వస్తుంది అన్నమాట"

"హ! వియస్ లక్ష్మిలో వస్తుంది"

"అది విమెన్స్ కాలేజీ కదా" అన్నాను.

"హ అవును" అంది.

"మరి నువ్వు" అని అడిగింది.

"నేను కాకినాడ ఆదిత్యలో చేరదామనుకుంటున్నాను" అన్నాను.

"మంచి ఆలోచన!" అంది.

"ఇంకేంటి" అన్నాను

"సరే ఉంటాను అమ్మ పిలుస్తోంది. జాగ్రత్త" అని ఫోన్ పెట్టేసింది.

తను కూడా నా కాలేజిలో చేరితే బాగుండు అనిపించింది. కాని ఎవరి దారులు వాళ్ళకున్నాయి. ఎవరి లక్ష్యాలు వారివి అనుకున్నాను.

కాకినాడ ఆదిత్యలో డిగ్రీ... శశీ వాళ్ళ ఇంటికి దగ్గరలోనే రూమ్ తీసుకున్నా. ఇంత కంటే ఎక్కువ ఏం కోరుకోలేదు. నేను డిగ్రీ కావడంతో ఇంజినీరింగు వాళ్ళ కన్నా నెలరోజుల ముందే క్లాసులు స్టార్ట్ అయ్యాయి. వాళ్ళకి ఇంకా కౌన్సిలింగే మొదలుకాలేదు. అందరూ బి.యస్‌సి తీసుకోమంటున్న నేను బి.ఏ తీసుకున్నాను. అదొక పనికిమాలిన డిగ్రీ అని ప్రపంచం యొక్క అభిప్రాయం.

మతానికి ఎదురు, ప్రపంచానికి విరుద్ధం అని ఎంతమంది అనుకున్నా పట్టించుకోలేదు.

ప్రపంచంలో ఏదీ పనికిమాలినది కాదు. మనకు ఉపయోగించడం రాక, ఉపయోగించుకోవడం చేతకాక మనం దాన్ని పట్టించుకోం. పనికిరాదని ప్రక్కన పెట్టేస్తాం.

★ ★ ★

"కాలేజి చాలా బాగుంది సీనియర్లు ర్యాంగింగ్ చేశారు" అని చెప్పాను శశితో.

"ఓహో! ఏం చేయమన్నారు''

"బవ్ బవ్ టేబుల్ చెప్పమన్నారు" అన్నాను.

"ఓహో! మరి నాకోసం ఇప్పుడు చెప్పు అయితే" అంది.

"ఇలా ఫోన్‌లో కాదు... నిజంగా వస్తే చెబుతాను" అన్నాను.

"సరే!! రేపు కలుద్దాం" అంది.

"ఎక్కడ??" అన్నాను. మనసులో ఆనందం పరుగులుపెట్టింది.

"హుఁమ్!! మన వీధిలోని శివాలయంలో" అంది.

"సరే! 4:30 ఓకే" అన్నాను.

"సరే" అంది.

ఆ రోజు సంతోషానికి అవధులుల్లేవు... ఇదే విషయం రూమ్‌మేట్ ప్రశాంత్‌తో చెప్పాను. తాను చాలా మంచివాడు, అమాయకుడు. ఇంకా చెప్పాలంటే చాలా సిన్సియర్. తన చదువేదో తనది.ఎప్పుడు భవిష్యత్తు కోసం తాపత్రయపడుతుంటాడు. కష్టపడుతుంటాడు. మా కాలేజిలోనే బి.యస్‌సి కంప్యూటర్స్ చదువుతున్నాడు.

కాకపోతే కాస్త మందబుద్ధి. నాకు తోడుగా ప్రశాంత్‌ని గుడికి తీసుకువెళ్ళాను. పసుపురంగు సల్వార్ కమీజ్, కళ్ళకు నల్లని కాటుక, పోని టేల్.. ఇంత అందమైన అమ్మాయితోనా రోజు నేను మాట్లాడుతుంది అని అనిపించింది.

"నమస్తే మాష్టారు" అంది.

"నమస్తే...నువ్వొక్కద్దానివే వచ్చావా"

"తోడుగా నువ్వున్నావని ఎవరిని తీసుకు రాలే" అంది తన చేయిని సరదాగా భుజం మీద కొట్టింది.

ఒక అమ్మాయితో ఇంత చనువుగా ఎప్పుడూ ఇలా ఉండలేదు. నిజానికి చనువుగా ఉంది శశి. నేను కాదు అనుకున్నాను.

"హ సర్లే ఇదిగో ఇతను నా ఫ్రెండ్ ప్రశాంత్" అని పరిచయం చేశాను.

"ఓహో! నువ్వు మాత్రం తోడు తీసుకొచ్చావా. హయ్ అన్నయ్య! నా పేరు తెలుసనుకుంటా"

"హ! తెలుసమ్మా నీ పేరు రోజుకి వందసార్లు పలుకుతాడు" అన్నాడు వాడు.

"ఓహో! ఇది టూ మచ్" అంది.

"ఎప్పుడు నిజం నమ్మావ్ గనక" అన్నాను మధ్యలో కలగజేసుకుని..

"సరే మహాప్రభో! నమ్మాను. ఎక్కడైనా కూర్చొని మాట్లాడుకుందామా" అంది. నమ్మాను అంది కాని ఎందుకు అన్ని సార్లు నా పేరు జపించడం అని అడగలేదు.

ముగ్గురం గుడి దగ్గరగా ఉన్న చెరువు ప్రక్క బల్ల మీద కుర్చున్నాం.

ముగ్గురం కూర్చున్నాం అదే పెద్ద బాధ... నేను శశితో ఏకాంతంగా మాట్లాడదామనుకున్నాను. కాని ఈ మట్టిబుర్ర ప్రశాంతగాడికి ఎలా చెప్పాలో తోచలేదు. కాని ఎలాగో అలా పంపించాలి.

"ఒరేయ్ ప్రశాంత్ నువ్వు కర్రీలు తీసుకొని రూమ్‌కు వెళ్ళిపో నేను 5 నిమిషాలలో వచ్చేస్తాను" అన్నాను.

"సరే రా" అని మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. వాడికి పరిస్థితి అర్థమైంది అనుకున్నాను.

"ఏంటి!! ఇంకో ఐదు నిమిషాలలో వెళ్ళిపోతావా" అంది శశి.

"లేదు! వెళ్ళను. వాడు వెళ్తాడని అలా అన్నాను"

"తను ఉండటం వల్ల ఇబ్బంది ఏం లేదు కదా" అంది.

ఇలాంటి ప్రశ్నలు అడగటం అమ్మాయిలకే సాధ్యం. మగాడి నోటి నుంచి నిజం చెప్పించాలనో, నిజం చెప్పాక నో చెబుదామనే ఉద్దేశంతోనో గుచ్చి గుచ్చి అడుగుతుంటారు.

"ఇబ్బంది ఏం లేదు కాని రూమ్‌లో పనులుంటాయి. ఇద్దరం ఇక్కడే ఉంటే రాత్రి భోజనం?? నీకైతే ఇంటికి వెళ్ళేటప్పటికి మీ అమ్మ వండిపెడుతుంది"

"సరే సరే! వదిలెయ్" అంది.

ఇది కూడా వాళ్ళకి బాగా వచ్చినది తప్పించుకోవడం అనుకున్నాను.

"నువ్వు చాలా బాగున్నావ్ శశి" అన్నాను.

"ఎన్ని సార్లు చెప్తావ్... చూసినప్పుడల్లా ఇదే మాట"

"నువ్వు చూసినప్పుడల్లా బాగుంటే నన్నేం చేయమంటావ్"

"సరేలే! ఇక్కడ చాలా ప్రశాంతంగా ఉంది" అంది తన నుదురుపై పడుతున్న జుట్టును సరిచేసుకుంటూ.

"అవును!! రోజు కలుసుకోవడానికి ఈ ప్లేస్ బాగుంటుంది" అన్నాను.

"రోజు కలుసుకోవడం దేనికి" అంది ఒకింత ఓరగా చూస్తూ..

"మనిద్దరం ఫ్రెండ్స్ కదా" అన్నాను.

"ఓహో సరే, మరి నాకు ట్రీట్ ఇవ్వవా??" అంది.

"ఏం కావాలి" అన్నాను.

"యతి రెస్టారెంట్ బిర్యాని. కాకినాడ ఫేమస్ కదా"

"ఇప్పుడు వెళ్దామా" అన్నాను ఉత్సాహాన్ని, ఆనందాన్ని మనసులోను, మొహంలోను తెలియజేస్తూ..

"ఇప్పుడొద్దులే" అంది.

"హమయ్య బతికిపోయాను" అనుకున్నాను మనసులో. జేబులో రూపాయి లేకుండా ధైర్యంగా "సరే" అన్నాను సంతోషంలో. కానీ తర్వాత పరిస్థితే

దయనీయంగా ఉండేదేమో... ఒకవేళ తీసుకువెళ్ళమన్నా డబ్బులు ప్రశాంత్‌కి ఫోన్ చేసి రప్పించేవాడిని. మనసులోనే 'గాడ్ ఈజ్ గ్రేట్' అనుకొన్నాను.

"మరి ఎప్పుడు వెళ్దాం" అన్నాను

"వెళ్దాంలే ఇద్దరం కాకినాడలోనే వుంటాం కదా! తరుచూ కలుస్తూనే వుంటాం కంగారెందుకు."

'తరచు కలుద్దాం' అన్నమాట నా గుండెల్లో వెయ్యి వోల్టుల కరెంటుని, కళ్ళల్లో కాంతిని నింపింది.

"సరే! లేటవుతుంది నేను వెళ్తాను" అని వెళ్ళిపోయింది. తనతో పాటు నా మనసుని కూడా తీసుకువెళ్ళిపోయింది.

★ ★ ★

సంవత్సరం తర్వాత...

డిగ్రీ రెండవ సంవత్సరం ఫలితాలు వచ్చినరోజు నేను ఫస్ట్‌క్లాసులో పాసైన రోజు...

కాల చక్రం ఎంత ఫాస్ట్‌గా తిరుగుతోందో అంతే బలంగా మా ఇద్దరి బంధం బలపడుతోంది. ఒక రకంగా చెప్పాలంటే పేరుకు తగిన జంట శశి అభిమన్యుల బంధం గట్టిపడుతున్న సమయం... ఇప్పటికి తన నోటి నుంచి మనిద్దరం మంచి మిత్రులు అన్న మాట తప్ప ఇంకేం రావట్లేదు. అసలు తనకు నా మీద ప్రేమ అనేది ఉందా?? ఎప్పటికి అర్థం కాని ప్రశ్న.

అమ్మాయిలు ఎప్పుడు అంత త్వరగా బయటపడరు. ఎంత ఇష్టం ఉన్న కళ్ళలోనే కప్పేస్తారు. కేవలం అది అమ్మాయిలకే సాధ్యమైన అద్భుతం... అయినా ఈ రోజుల్లో మామూలు అమ్మాయిలే ఫోజులు కొడుతున్నప్పుడు శశి లాంటి అందమైన అమ్మాయి అలా చేయడంలో తప్పులేదనిపించింది.

శశికి ఫోన్ చేశాను. తనకి ఫోన్ చేయడానికి భయపడట్లేదు ఇప్పుడు. తను పర్సనల్ ఫోన్ వాడుతోంది. ఇంజినీరింగులో మొదటి సంవత్సరం 80 పర్సంట్ వచ్చిన తర్వాత వాళ్ళ బాబాయ్ కొనిచ్చిన ఫోన్ అది.. శశికి ఫోన్ వచ్చిన తర్వాత తనతో చాలా సులువుగా మాట్లాడగల్గుతున్నా.

"హలో శశి"

"చెప్పండి సార్... ఇవ్వాళే కదా రిజల్ట్స్... పార్టీ ఎక్కడ ఇస్తున్నారు?" అంది.

అన్ని తనకు ఎలా తెలుస్తాయో అర్థంకాదు. నా రిజల్ట్స్, నా స్నేహితుల పుట్టిన రోజులు...నిజానికి అబ్బాయిలు ఇవేమీ పెద్దగా పట్టించుకోరు. కానీ అమ్మాయిలు అలా కాదు. ఆ పక్కింటి విషయాలు ఈ పక్కింటి విషయాలు అన్ని కావాలి. కానీ ఒకటి మాత్రం నిజం. కొన్ని సార్లు అది మగవాళ్ళకి చాలా మేలుచేస్తుంది కూడా....

"హ! పార్టీ నువ్వెక్కడ అంటే అక్కడ" అన్నాను.

"నాకే కాదు ప్రశాంత్‌కి కూడా ఫస్ట్ క్లాసే"

"సరే! అన్నయ్యకి కూడా కంగ్రాట్స్" అని గట్టిగా అరచింది.

"సరే సరే అరవకు ఎక్కడికి వెళ్దాం"

"యతి రెస్టారెంట్‌కి వెళ్దాం......" అంది

"ఈవినింగ్ షార్ప్ 5:30 ఓకే" అన్నాను

యతి రెస్టారెంట్‌కి రావడం ఇది రెండోసారి. కాకినాడలో ఎక్కడ లేని రద్దీ సాయంత్రం అయితే ఇక్కడ ఉంటుంది. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం సుబ్బారావు హోటల్ దగ్గర, సాయంత్రం యతి రెస్టారెంట్ దగ్గర ఈగల్లా ఉంటారు జనాలు. ప్రశాంత్‌గాడు ముందే ఒక టేబుల్ బుక్ చేయడంతో సరిపోయింది. లేకపోతే అందరిలాగే తింటున్న వాళ్ళని చూస్తూ టేబుల్ ఎప్పుడు ఖాళీ అవుతుందా అని ఎదురుచూడటం అయ్యేది. ప్రపంచంలో ఇంతకన్నా దరిద్రం ఏముందదనిపించింది. డబ్బులిచ్చి మరి బిర్యాని బాబు అని అడుక్కోవడం.

లాస్ట్ టైమ్ కూర్చున్న టేబుల్ దగ్గరే ముగ్గురం కూర్చున్నాం...

"ఒక వెజ్ బిర్యాని, ఒక ఎగ్ ఫ్రైడ్‌రైస్, వెజ్ మంచురియా, టమాట క్యాషు కర్రీ" అని ఆర్డరిచ్చింది శశి.

"హుఁమ్ ఆర్డర్ ఓకే కదా" అని మాకేసి చూసింది.

"మీరిచ్చికా మేం మాట్లాడగలమా" అన్నాను నవ్వుతూ.

అవును ఎక్కడైనా వారిదేగా పెత్తనం. కేవలం వాళ్ళ నవ్వుతో ప్రపంచాన్ని పడగొడతారు. ఈ రోజు తనతో ఎలాగైనా నా ప్రేమను గురించి చెప్పాలి అని నిశ్చయించుకున్నాను.

కాని ఎలా?? ఒక అబ్బాయికి ఇంత కన్నా క్లిష్టమైన పరిస్థితి ఉండదనుకుంటా. ఒక అబ్బాయికి ఇదే కఠిన పరీక్ష. అప్పటిదాకా రాసిన చదువు పరీక్షలు వేరు ఇది వేరు. కానీ ఒక కుర్రాడికి ఆ పరీక్షలో ఫెయిలు అయినా పర్లేదు. ప్రేమ పరీక్షలో ఫెయిలు అవ్వకూడదనుకుంటాడు. అసలు ఒక అబ్బాయి అమ్మాయికి ఎలా ప్రపోస్ చెయ్యాలి అనేది యే కుర్రానికి అర్థంకాని ప్రశ్న. ఒకవేళ అర్థం అయినా ఆ అమ్మాయి పాస్‌చేస్తుందా... ఫెయిలు చేస్తుందా అని భయం.

రూమ్‌లో ఇదే విషయం ప్రశాంత్‌ని అడిగితే "నేనేమైనా రోజుకి పదిమంది అమ్మాయిలకి ఐలవ్‌యూ చెప్తున్నానా" అని నా మీద కసురుకున్నాడు. కాని ఒక అమ్మాయికి ఇష్టాన్ని ఎలా తెలియాజేయాలి. కవిత చెప్పాలా? పువ్వులు ఇవ్వాలా? లేకపోతే రింగ్ ఇవ్వాలా?...

ఒక అమ్మాయికి ప్రపోజ్ చేయాలనుకున్నప్పుడు అబ్బాయి మదిలో మెదిలే ఆలోచనలు ఇవన్నీ. కాని నిజాయితీని కళ్ళలో నింపుకుని ప్రేమతో చెబితే సరిపోతుందనిపించింది. ప్రశాంత్‌గాడు అనుకున్నట్టే డ్రింక్స్ కూడా చెప్పి వస్తాను అని వెళ్ళిపోయాడు.

"శశి నీకోటి చెప్పాలి"

గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. అంత ఏ.సి లోను చెమట్లు పడుతున్నాయి.

"ఏంటి నేను అందంగా ఉన్నాను అంతేనా"

"లేదు! అంతకు మించినది"....

"అంతకు మించినదా ఏంటి??"

"నువ్వంటే నాకు ఇష్టం." అన్నాను తల వంచుకుని టేబుల్ పై ఉన్న ఖాళీ గాజు గ్లాసును పట్టుకొని తిప్పుతున్నాను. ఆమె ఏం మాట్లాడలేదు.

"నువ్వు నాకంటే ఇష్టం అంటే ప్రేమ" అన్నాను తన కళ్ళలోకి చూస్తూ.

తప్పు చేస్తున్నానని నాకనిపించలేదు.

"ప్రేమా????" అంది.

"అవును ఐ లవ్ యూ" అన్నాను. ప్రతి అబ్బాయి ప్రేమించిన అమ్మాయికి చెప్పే సాధారణమైన మాట అది. కాని ఆ అబ్బాయికి తెలుసు ఆ మాట విలువ ఏంటో.

ఏం మాట్లాడలేదు. ఇద్దరి మధ్య నిశ్శబ్దం.

తను కాదు అని చెప్పలేదు. అవును అని చెప్పలేదు. ఇప్పుడు నేనేం మాట్లాడాలి అనే సంశయం.

"నా ఇష్టాన్ని నేను చెప్పాను. తరువాత నీ ఇష్టం అన్నాను"

"నేనిప్పుడేం చెప్పలేను. అయినా మనం ఇలా ఫ్రెండ్స్‌గానే ఉందాం"

ఫ్రెండ్స్‌గానే ఎన్నాళ్ళు?? ఒకరి ఇష్టాలు ఒకరికి తెలుసు... ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకుంటాం... అలాంటప్పుడు ప్రేమించుకోవడం తప్పు కాదేమో...మనం చిన్నపిల్లలం కూడా కాదు. ఇది ఆకర్షణ అంతకంటే కాదు" అన్నాను నమ్మకమైన గొంతుతో..

"ఇప్పుడు ఆ టాపిక్ వదిలెయ్ అభి!! కొన్నాళ్ళు మనం మిత్రులుగానే సాగుదాం. ఇంకా మన చదువులు అవ్వాలి. సెటిల్ అవ్వాలి. నా ఇంజినీరింగ్ కంప్లీట్ అవ్వడానికి ఇంకా రెండేళ్ళూ ఉంది" అంది ఖాళీ గ్లాసులో నీళ్ళు పోస్తూ.

"నా డిగ్రీ అవ్వడానికి ఇంకా ఒక సంవత్సరం ఉంది. తరువాత సైకాలజీలో పిజీ చేద్దామని అనుకుంటున్నా అదో రెండేళ్ళు. అప్పటిదాకా ఇలాగే ఉందామా" అన్నాను.

"ఇలాగే అంటే ఇప్పుడు బానే ఉన్నాం కదా".

"బానే ఉన్నాం ప్రేమ కూడా ఉంది కదా??".

"ప్రేమా?? ఏమో నాకు తెలీదు" అంది గ్లాసులోని నీళ్ళను తాగుతూ.

"సరేలే!! ప్రశాంత్‌గాడు వస్తున్నాడు. నీతో వాదించాలనుకోవడం లేదు" అన్నాను.

"నేనేం వాదించట్లేదు. సరే వదిలెయ్" అంది.

ప్రశాంత్‌గాడు మూడు థమ్సప్‌లు తెచ్చాడు. ఆర్డర్ కూడా రావడంతో ఆ రోజు డిన్నర్ అలా ముగిసింది.

ఈ రాత్రి మరిచిపోలేనిది. ఇంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందా అనుకున్నాను.

★ ★ ★

మూడో సంవత్సరం పరీక్షలు మొదలయ్యాయి. డిగ్రీ మూడు సంవత్సరాలు చాలా త్వరగా గడిచింది. కాకపోతే డిగ్రీలో కాలేజికి వెళ్ళింది చాలా తక్కువ కావడంతో పెద్ద ఫీల్ ఏం రాలేదు. డిగ్రీలో అటిండెన్స్ పర్సంటేజి 75 ఉంటే సరిపోతుంది. అంతకు మించి ఎంత ఉన్నా అది వేస్ట్. కాకపోతే రోజు పాఠాలు వినేవాళ్ళు, అవి విని ఏవో సాధిద్దామనుకునేవాళ్ళు కాలేజీ రెగ్యులారిటీ మెయింటెన్ చేస్తూ ఉంటారు.

కాని మేం అలా కాదు. నాది ప్రశాంత్‌ది ఇదే పరిస్థితి. ఇక పరీక్ష ముందు రోజు చదవడం మూడు సంవత్సరాల నుంచి జరుగుతున్న తంతు ఇదే.

ఈ సారి కూడా అంతే.

ఎప్పుడు చివరి ఎగ్జామ్ అయిపోతుందా.. ఎప్పుడు పుస్తకాలను గిరాటు వేద్దామా అన్న ఉత్సాహం అందరిది. ఇంకా చెప్పాలంటే నాకు, ప్రశాంత్‌గాడికి పట్టలేని ఆనందం. కారణం డిగ్రీ ఫస్ట్ క్లాసులో అయిపోతూ ఉండటమే. అదే కాకుండా మేమిద్దరం మా కాలేజిలో క్యాంపస్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అవ్వడం. ఈ మూడేళ్ళు చాలా ఆనందంగా గడిచిందని ఇద్దరం అనుకున్నాం.

చివరి ఎగ్జామ్ జరిగే రోజు వచ్చేసింది.

ఈ రోజుతో డిగ్రీ అయిపోతుందన్న ఆనందం, ఇక ఈ పాడు పుస్తకాలతో పనిలేదన్న సంతోషంతో బయలుదేరాం.

కాలేజికి వెళ్ళాక తెలిసింది ప్రశాంత్‌గాడు హాల్ టికెట్ మర్చిపోయాడని.

"అరేయ్ ఇంకా గంటే ఉంది ఎగ్జామ్‌కి.. పోని భద్రంగాడి బైక్‌ని తీసుకెళ్ళు".

"అదే చెయ్యాలి. రూమ్ కీస్ ఇవ్వు" వినాయకుడి కీచైన్ ఉన్న తాళాలను వాడి చేతిలో పెట్టాను.

"నా గురించి చూడకురోయ్ బాగా రాయి ఎగ్జామ్" అని బయలుదేరాడు.

ఎగ్జామ్ హాల్‌కి వెళ్ళిపోయే ముందు అనుకున్నాను వీడు వచ్చాడా లేదా అని.. వాడిది కింది ఫ్లోర్‌లో ఎగ్జామ్ రూమ్. నాది రెండతుస్తుల పైన...

ఇంక అంత టైమ్ లేదని ఎగ్జామ్ హాల్‌కి వెళ్ళిపోయాను. ఎగ్జామ్ రాస్తున్నప్పుడు "అభి ఎగ్జామ్ అయిపోయాక నిన్ను ఆఫీస్ రూమ్‌కి రమ్మన్నారు ప్రిన్సిపాల్ సార్" అని అరిచాడు అటెండర్ శివ. ప్రిన్సిపాల్ ఏం పెంట పెడతాడా అనిపించింది. ఎగ్జామ్ అయిన వెంటనే ఆఫీస్ రూం దగ్గరికి వెళ్ళాను.

నన్ను చూసిన వెంటనే రిసెప్షనిస్ట్ "నిన్ను ప్రిన్సిపాల్ సార్ ఏరియా హాస్పిటల్ దగ్గరకి రమ్మన్నారు. శివ బండి మీద తీసుకువెళ్తాడు" అంది.

"హాస్పిటల్‌కా ఎందుకు? ఎవరికి ఏమైంది" అడిగాను కంగారుతో.

"నీ రూమ్‌మేట్ ప్రశాంత్ చనిపోయాడు" అంది విచార వదనంతో.

"అబద్ధం... పొద్దున్నే వాడు నేను కలిసి వచ్చాం.. హాల్‌టికెట్ తెచ్చుకోవడానికి రూమ్‌కి వెళ్ళాడు" అన్నాను వస్తున్న కన్నీరును ఆపుకుంటూ...

లేదు వాడు చావలేదు అనుకుంటూ ఉన్నాను మనసులో.

శివ ఏరియా హాస్పిటల్ దగ్గర దింపాడు. ప్రిన్సిపాల్ చాలా విచారంగా ఉన్నారు.

అప్పటికే ప్రశాంత్ వాళ్ళ నాన్నగారు హాస్పిటల్‌కి చేరుకున్నారు.

"ఎప్పుడు జరిగింది ఇదంతా" అన్నాను ఏడుస్తూ శివతో.

"పొద్దున్న ఎగ్జామ్ కొచ్చే కంగారులో బస్సును ఒవర్‌టేక్ చేస్తుండగా సైకిల్ అడ్డు వచ్చింది. ఫ్రంట్ బ్రేక్ వేయగా స్కిడ్ అయ్యి బస్సు వెనకాల టైర్ కింద పడ్డాడంట. టైర్ తల మీద ఎక్కడంతో స్పాట్ డెడ్" అన్నాడు ఏడుస్తూ.

వాళ్ళ నాన్నగారి మొహం చూస్తుంటే ఏడుపు రెట్టింపయ్యింది. చేతికి అందివచ్చిన కొడుకు పోయాడు. ఇంకో నెల ఉంటే మొదటి నెల జీతాన్ని వాళ్ళ నాన్న చేతిలో పెట్టేవాడే అనిపించింది.

ఏడుపు ఆగట్లేదు.. ఎందుకిలా చనిపోవడం దారుణం అనిపించింది.

శశికి ఫోన్ చేసి విషయం చెప్పాను... తను వాళ్ళ నాన్న గారితో వచ్చింది.

శశిని చూశాక ఏడుపు రెట్టింపయ్యింది. మేం ముగ్గురం గడిపిన క్షణాలు గుర్తొచ్చాయి.

"శశి! ప్రశాంత్ ఇక లేడు" అన్నాను. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఏడుపు ఆగట్లేదు. తను నన్ను ఓదార్చడానికి ఎంతో ప్రయత్నించింది. తనవల్ల కాలేదు. తనకు తెలుసు ప్రశాంత్‌కు నాకు మధ్య ఉన్న స్నేహం.

"పోస్ట్‌మార్టం పూర్తయ్యింది, శవాన్ని ఇంటికి తీసుకెళ్ళచ్చు" అన్నాడు డాక్టర్.

ప్రశాంత్ వాళ్ళది చించినాడ ప్రక్కనున్న దిండి. కాకినాడ నుంచి తొంబై కిలోమీటర్లు...ఇంటికెళ్ళే దాకా శవం పాడవకుండా ఫ్రీజర్‌లో పెట్టారు.

వాడు నిశ్చలంగా పడుకున్నాడు. ఈ ప్రపంచంతో సంబంధం లేదు వాడికి.

"నువ్వు వెళ్ళిపో శశి. నేను అంకుల్‌తో వాళ్ళ ఊరు వెళ్తాను" అన్నాను..

శశీ కూడా చాలా ఏడుస్తోంది. వాళ్ళ నాన్నగారు ఆమెను ఓదారుస్తున్నారు.

నేను, ప్రశాంత్ వాళ్ళ నాన్నగారు ఆయనతో పాటు వచ్చిన ఇద్దరు కారులో బయలుదేరాం. వెనకాల అంబులెన్స్‌లో ప్రశాంత్‌గాడు ఉన్నాడు. లేదు ప్రశాంత్ శవం ఉంది అనడానికి మనసు ఒప్పట్లేదు.

మురమళ్ళ దాటాక ప్రశాంత్ నాన్నగారు కారు ఆపమని ప్రశాంత్ ఉన్న అంబులెన్స్‌లో ఎక్కారు. ఆయన బాధ వర్ణనాతీతం. నాకే ఏడుపు ఆగట్లేదు అలాంటిది 20 ఏళ్ళ బంధం ఆయనది.. కారు కదులుతోంది. అలాగే వాడి జ్ఞాపకాలు.

ఇంటికి చేరుకున్నాక వాళ్ళమ్మగారిని చూసి మరోసారి బోరుమన్నాను... తిరిగిరాడని తెలిసినా అందరం అలాగే ఏడుస్తున్నాం. మేం చేరుకునే సరికి సాయంత్రం కావడంతో దహన కార్యక్రమాలు పొద్దున్నే పెట్టుకున్నారు.

అయిపోయింది... ప్రశాంత్‌గాడిని తీసుకువెళ్ళిపోతున్నారు. మూడేళ్ళు కలిసి ఉన్న ప్రయాణం ఈ రోజుతో రుణం తీరిపోయింది అనుకున్నా.

వాడి శవం కాలుతుండగా చూస్తున్నప్పుడు నీళ్ళు ఆగలేదు. ఇన్నాళ్ళు నా ప్రక్కనే ఉన్నవాడు చితి మంటల మీద కాలిపోతున్నాడు.

★ ★ ★

ప్రశాంత్ మరణంతో మెదడులో ఒక నిశ్శబ్దం ఏర్పడింది. జాబ్ వచ్చినా వెళ్ళాలనిపించలేదు. ఇంక ఏదో చేయాలనిపించింది.

"నేను సైకాలజీలో పీజీ చేయాలనుకుంటున్నా నాన్న" అన్నాను భోజనం తింటున్న నాన్నతో.

"సరే నీ ఇష్టం" అన్నారు.

వెంటనే ఆంధ్రాయూనివర్సిటిలో అప్లై చేశాను. జీవితంలో మనకేం రాసి పెట్టి ఉందో అదే జరుగుతుంది అనుకున్నా.

సీటు వచ్చింది.

విశాఖపట్టణానికి మకాం...

యూనివర్సిటిలోనే హాస్టల్ రూమ్‌లో నాతో పాటు ఇంకో అబ్బాయి ఉంటాడంట.

తను మా రూమ్‌లో కన్నా ప్రక్క రూమ్‌లో ఎక్కువ ఉంటాడనే విషయం తెలిసింది.

తనతో పెద్దగా ఇబ్బంది ఏం ఉండదనిపించింది. రూమ్ బానే ఉంది. ఏటాచ్‌డ్ బాత్‌రూం ఉండటం ఇంకా నయం అనిపించింది.

"రూమ్ బానే ఉంది నాన్న, రేపట్నించి క్లాసులు" అన్నాను అప్పుడే ఫోన్ చేసిన నాన్నతో.

"సరే జాగ్రత్త, డబ్బులు ఏమైనా కావలిస్తే ఫోన్ చెయ్, అలాగే ఒకసారి వైజాగ్ పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళు" అని ఫోన్ పెట్టేశారు.

సాయంత్రం చల్లబడ్డాకా పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్దాంలే అని కునుకు తీశాను.

లేచి చూసేటప్పటికి సాయంత్రం 4:15 అవుతోంది. ఈ లోపల నా రూమ్ మేట్ వచ్చాడు.

"హయ్ మీరు అభిమన్యు కదా!! ఇప్పుడే రూమ్ ఎలాట్ మెంట్ బోర్డులో చూశాను. అండ్ దిస్ ఇజ్ సుందర్ యమ్.టెక్ ఫస్ట్ ఇయర్" అన్నాడు.

"ఓహో నైస్, నేనిప్పుడు బైటికి వెళ్తున్నాను" అన్నాను.

"ఎక్కడికి బాస్! ఇప్ యు డోంట్ మైన్డ్ నాకు చెప్పచ్చు. పార్టీలకు, పబ్బులకు అయితే నేను ఎవర్ రెడీ"

"హ హ కాదులే!! మా పెద్దమ్మ వాళ్ళ ఇంటికి"

"ఓ నైస్! ఎక్కడ???"

"సీతమ్మధార, గురుద్వార్ దగ్గర.."

"నేను ఇప్పుడు అటే వెళ్తున్నా. ఐ కెన్ డ్రాప్ యు" అన్నాడు.

"వద్దు, నేను వెళ్తాను. నీకు ఇబ్బంది ఎందుకు"

"నువ్వు మరీ బాస్, ఒకే రూమ్‌లో ఉంటున్నాం! జస్ట్ 2మినిట్స్" అని ఒక చిన్న నిక్కరు, స్లీవ్ లెస్ టీషర్టు వేసుకుని "పద వెళ్దాం" అన్నాడు.

"ఇలాగే??" అన్నాను ఆశ్చర్యంతో.

"కూల్ మామ్ ఐయామ్ గోయింగ్ ఫర్ టెన్నిస్ ప్రాక్టీస్.. సో ఇలాగే వెళ్ళాలి" అని ఒక మూలన పెట్టి ఉంచిన బ్యాగ్‌ని తీశాడు.

"కమాన్ మేన్, రెడీయేకదా నువ్వు. పద వెళ్దాం" అని తన పల్సర్ బైక్‌ని తీశాడు.

అంతటి రద్దీలోను చాలా పాస్ట్‌గా పోనిచ్చాడు. స్లో వెళ్ళు అని చెబుదామనిపించింది. కాని పిరికివాడు అని అనుకుంటాడేమో అని ఏం మాట్లాడలేదు.

ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అలాగే కూర్చున్నాను.

గురుద్వార దగ్గరకి వచ్చాక ఎలా వెళ్ళాలో దారి చూపించాను.

తన టెన్నిస్ కోర్టుకి, పెద్దమ్మ వాళ్ళ ఇంటికి పెద్ద దూరమే లేదు.

"ఓహో ఇదేనా??? సరే నీ పని అయ్యాక ఆ టెన్నిస్ కోర్టులోనే ఉంటాను ఇదిగో నెంబర్ ఫోన్ చెయ్యి" అన్నాడు.

"సరే జాగ్రత్త" అని చెప్పి లోపలికి వెళ్ళాను.

పెద్దమ్మ చూసిన వెంటనే "ఏరా ప్రొద్దున్న ఇక్కడే దిగచ్చు కదా. అంత కాని వాళ్ళం అయిపోయామా" అంది.

నేను వెళ్ళేటప్పటికి పెదనాన్న, పెద్దమ్మ టీ తాగుతున్నారు. అన్నయ్యలు ఇద్దరూ ఇప్పుడు వైజాగ్‌లో ఉండట్లేదు. పెద్దన్నయ్య జాబ్ మీద ఢిల్లీలో సెటిల్ అవ్వగా... ఇంకో అన్నయ్య హైదరాబాద్‌లో ఉంటున్నారు.

"ఎప్పుడొచ్చావ్ రా అభి" అని అడిగారు పెదనాన్నగారు ఎప్పుడూ ఉండే గంభీరమైన గొంతుతో.

"ఇవ్వాళే పెదనాన్నగారు" అన్నాను.

"వీళ్ళమ్మ నిన్నే ఫోన్ చేసింది. అభిగాడు వైజాగ్ వస్తున్నాడు అని....అసలు మన ఇంట్లోనే ఉండమన్నాను. ఆ వెధవ హాస్టల్‌లో ఎందుకని?? కాని వీడు వినిపించుకోడుగా" అంది పెదనాన్నగారికేసి చూసి.

"ఇక్కడుంటే వాడి ఆటలు సాగవని భయం అంతేనేరా" అని నాకేసి నవ్వుతూ.

"అదేం కాదు పెదనాన్నగారు క్యాంపస్‌లోనే ఉంటే చదువుకోవడానికి ఈజీగా ఉంటుంది. లైబ్రేరీ కూడా అందుబాటులో ఉంటుంది. అందులోను నాదీ సైకాలజీ కదా" అన్నాను.

"సరే! ఈ సాయంత్రం భోజనం చేసి వెళ్ళు" అంది పెద్దమ్మ.

నాకిష్టమైన బంగాళదుంప వేపుడు, టమాట మజ్జిగ పచ్చడి చేసింది. ఈ వయసులో కూడా ఈ బంధాల మీద, బంధుత్వాల మీద ఎంతటి ప్రేమో అనుకున్నాను.

"ఏడింటికే భోజనం తిని చాలా రోజులైంది. అది మా చిన్నప్పుడు కుదిరింది. ఇప్పుడు నీ వల్ల పెద్దమ్మ" అన్నాను.

"హ మరి నువ్వు త్వరగా వెళిపోతానంటున్నావ్ కదరా మరి" అంది మజ్జిగపోస్తూ...

భోజనం తినడం అయిపోయిన వెంటనే ఇంక లేట్ చేయకుండా "బయలుదేరుతాను" అని చెప్పాను.

"అప్పుడేనా" అంది పెద్దమ్మ.

"లేదు పెద్దమ్మ, వెళ్ళాలి ఇక్కడే వీధి ప్రక్కన టెన్నిస్ కోర్టులో మా ఫ్రెండ్ వెయిట్ చేస్తున్నాడు" అన్నాను.

"సరే అప్పుడప్పుడు వస్తూ ఉండు. బాగా చదువుకో, మొహంలో పెళ్ళి కళ ఉట్టిపడుతోంది" అంది.

"ఊరుకో పెద్దమ్మ, ఇంకా రెండేళ్ళు చదువుంది. సర్లే వెళ్ళొస్తాను పెద్దమ్మ, పెదనాన్న" అని బయలుదేరాను.

ప్రక్క వీధి టెన్నిస్ కోర్టుకి చేరుకున్నాను.

సుందర్ ఇంకా టెన్నిస్ ఆడుతున్నాడు..

నన్ను చూసి "వెయిట్ మ్యాన్, ఫైవ్ మినిట్స్" అన్నాడు.

"ఓకే" అని ఆలోచనల్లో మునిగిపోయాను. అసలు ఈ విశాఖపట్టణం రావడం, సైకాలజీ చదవడం వింతగా అనిపించింది. ప్రశాంత్ గాడు చనిపోయాడంటే ఇప్పటికి నమ్మలేని పరిస్థితి. శశీతో మాట్లాడాలనిపించింది. వెనకాల జేబులో ఉన్న ఫోన్ తీశాను. శశి నుంచి రెండు మిస్డ్‌కాల్స్. పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళేటప్పుడు సెల్ సైలెంట్‌లో పెట్టడం వల్ల తెలీలేదు. రూమ్‌కి వెళ్ళాక చెయ్యొచ్చులే అని ఊరుకున్నాను. రూమ్‌కి వెళ్ళేటప్పటికి తొమ్మిది అయ్యింది...

శశీకి ఫోన్ చేశాను...

"నీ ఫోన్ కోసమే చూస్తున్నాను" అంది ఫోన్ ఎత్తగానే.

"హుం! పెద్దమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళా"

"సర్లే! ఏంటి వైజాగ్ కబుర్లు.... తిన్నావా"

"హుం తిన్నాను నువ్వు??"

"తిన్నాను.... ఇంకేంటి??" అంది.

"ఐ లవ్ యూ" అని తడుముకోకుండా చెప్పాను. రెండు సంవత్సరాల నుంచి చెప్తునే ఉన్నా పట్టనంటే ఉంటుంది.

"అబ్బా" అంది.

"ఏమైంది... ఇంక నీ చదువు ఒక సంవత్సరమే మిగిలింది" అన్నాను.

ఇలాంటి విషయాలలో అమ్మాయిలు చాలా ఆలోచిస్తారనిపించింది.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావ్ శశి... ఆ విషయం నీకు తెలుసు. నేనంత పిచ్చివాడినేం కాదు. సైకాలజీ చదువుతున్నా తెలుసుగా" అన్నాను.

"ఇంకా క్లాసులే మొదలవ్వలేదనుకుంటా" అంది నవ్వుతూ.

"జోకులు వేసుకునేంత సమయం లేదు. ఇది జీవితం" అని పెట్టేశాను.

ఇలా ప్రయత్నిస్తే మనసులోని మాటను బయటపెడుతుందేమో అని చిన్న ఆశ..

ప్రయత్నం ఫలించింది శశి తిరిగి ఫోన్ చేసింది.

"ప్రేమ ఏమో తెలీదు కానీ... నీతో జీవితాంతం ఉండాలనిపిస్తోంది" అని మనసులోని మాటను బయటపెట్టింది. ఆ మాట విన్న ఆ క్షణం నాకిష్టమైన ఇళయరాజా సంగీతాన్ని లైవ్‌లో విన్నట్టుంది. లేదు అంతకు మించింది ఇది.

"ఈ మాటకోసం ఇన్ని సంవత్సరాలు ఎదురుచూశాను" అన్నాను.

"కానీ నువ్వు ఇంకా సెటిల్ అవ్వాలికదా, అదే భయంగా ఉంది". ప్రతి అమ్మాయికి వుండే నీచమైన భయం ఇది.

"నీ చదువు అయిన సంవత్సరానికి నా చదువు అవుతుంది. చదువు అయిన వెంటనే కౌన్సిలింగ్ సెంటర్" అన్నాను కొంచెం గట్టిగా నా నమ్మకం తనకు అర్థమయ్యేటట్టు.

"హు సరే మహాప్రభో! నాకు రేపు ఇంటర్నెల్ ఉంది"

"సరే చదువుకో జాగ్రత్త" అని ఫోన్ పెట్టేశాను.

రేపట్నించి క్లాసులు ప్రారంభం. సైకాలజీలో సబ్జెక్టులకన్నా మనసులను ఎక్కువ చదవాలి. ఇది అన్నికంటే కష్టమైన పని.

క్లాసులోకి మొదట నేనే వెళ్ళాను...

నా తర్వాత ఒక్కొక్కరుగా వచ్చారు. మొత్తానికి క్లాసు మొదలయ్యే సరికి 30 మంది అయ్యాం. అందులో పదిహేడుమంది అమ్మాయిలు, పదమూడుమంది అబ్బాయిలు. అందరు ఒకరునొకరు పరిచయాలు చేసుకుని, ఫేస్‌బుక్ ఐడిలు తీసుకుంటున్నారు. యూనివర్సిటీలో క్లాసులకు సార్‌లు రావడం చాలా అరుదు.

క్లాసులకి వెళ్ళినా ఆ సమయం ప్రక్క వాళ్ళతో మాట్లాడి టైంపాస్ చేయడానికి సరిపోయింది.

మా బెంచ్‌లో కూర్చున్న మిగతా ముగ్గురు తెగ మాట్లాడుకుంటున్నారు. నేనొక్కడినే మౌనంగా కూర్చున్నాను.

అంతమందిలోనూ ఎవ్వరికి పరిచయం చేసుకోనిది నేనే.

ఇంతలో నేను మూడిగా ఉండటం చూసినా ప్రక్కన వ్యక్తి "హాయ్ దిస్ ఈజ్ అనిరుధ్. వీళ్ళు మా బ్యాచ్ అజయ్, లక్ష్మణ్. మీ ప్రక్కబెంచ్ కోతి త్రిపుర, గాయత్రి" అన్నాడు.

"హు అందరూ కూడబలుక్కుని చేరాం. ఇక్కడ ఏదో ఊడబొడిచేద్దామని"

"ఓహో" అని ఏం మాట్లాడలేదు.

"సరే అభిమన్యు క్యాంటీన్‌కు వెళ్దామా" అని నన్ను భుజం తట్టాడు అనిరుధ్.

"ఒసేయ్ కోతి! క్యాంటీన్‌కి పదండి పందిల్లా మెక్కడానికి" అన్నాడు త్రిపురతో.

"ఓయ్! ఎప్పుడు పందిలా తినేది నువ్వురా సరే పదా" అంది త్రిపుర.

"అభి దా! అన్నాడు" అనిరుధ్.

తనతో పాటు వంత పాడారు మిగతా ఇద్దరు కూడా..

"రండి బాస్! మేమేం మిమ్మల్ని తినములే" అంది గాయత్రి.

ఇంక వెళ్ళక తప్పలేదు... ఇంత మంది చేత బతిమాలించుకోవడం చిరాకనిపించింది.

"ఎందుకు మాష్టారు! అంత మూడీ మొదటి రోజే, మా బ్యాచ్‌ని చూశావా ఎంత హ్యాపీగా ఉన్నామో అంది త్రిపుర.

"హుఁమ్! అవును" అన్నాను అన్నాన్ని కెలుకుతూ...

"ఏంటి నేను చాలా ఫాస్ట్ అనుకుంటున్నావా. నేనో వాగుడుకాయని ఇట్టే కలిసిపోతాను. కావలిస్తే వీళ్ళని అడుగు" అంది.

"అవును! దీన్ని డిగ్రీ మూడేళ్ళు చాలా కష్టంగా భరించాం. దీన్ని ఎవడు కట్టుకుంటాడో గాని రాళ్ళతో పూజలు చేస్తూ ఉంటాడు" అన్నాడు అనిరుధ్ నవ్వుతూ.

"పోరా! ఏడ్చావులే" అంది.

వీళ్ళంతా ఎంత సంతోషంగా ఉన్నారా అనిపించింది.

కాంటీన్నుంచి అందరం కూడా క్లాసుకి వెళ్ళాం.

క్లాసు మొత్తం గోలగోలగా ఉంది. ఎక్కడి వారు అక్కడ కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ ఉన్నారు. ఇంతలో టీషర్టు, బ్లూ జీన్స్ వేసుకున్న ఒకాయన క్లాసు లోపలికి వచ్చాడు. వస్తూనే సిలబస్ రాసుకోండి. పేపర్ 1 సిస్టమ్స్ అండ్ థీరిస్.. అందరిలోనూ ఆశ్చర్యం మామూలుగా యూనివర్సిటీలో ప్రొఫెసర్లు అంత త్వరగా క్లాసుకి రారు వస్తే మన బుర్రతినకుండా ఉండరు.

కానీ ఈయనే ఎవడో కుర్రాడిలా ఉన్నాడు. ఇంకా రానేలేదు సిలబస్ అని చెప్పడం మొదలెట్టాడు.

"రాసుకుంటున్నారా. ఎవడురా వీడు వచ్చాడో లేదో కనీసం పేరు కూడా చెప్పకుండా మొదలెట్టాడు అనుకుంటున్నారా. నేను ఈ రోజు సిలబస్ మాత్రమే చెప్తాను. దానికి సంబంధించినవన్నీ మీరే చూసుకోవాలి. అర్థం అయ్యిందా" అన్నాడు.

బోర్డుమీద ఏదో పిచ్చి గీతలు పెట్టినట్టు 'సిస్టం అండ్ థీరిస్' అని హెడ్డింగ్ పెట్టి వదిలాడు. ఇక్కడి ప్రొఫెసర్లకి హెడ్డింగు పెట్టడానికి కూడా ఇంత బద్ధకమా అనిపించింది.

కొత్త వాతావరణం. మొదటిరోజు అందరు తలలు ఊపడం తప్ప ఏం చెయ్యలేకపోయారు.

"ఏమైనా డౌట్లు ఉంటే... డౌట్లు అంటే పెద్ద పెద్ద డౌట్లు అన్న మాట. చిన్న వాటికి మన విశాలమైన లైబ్రరీని ఉపయోగించుకోవచ్చు" అన్నాడాయన.

ఆయన ఇంత క్లారిటీగా మీ చావు మీరు చావండి అనడంతో మాకు అసలు యునివర్సిటీలలో చదువులు ఎలా ఉంటాయో అర్థం అయ్యింది.

కాని ఇక్కడ ప్రొఫెసర్లు ల్యాబ్స్‌లో ఇష్టం వచ్చినట్లు ఆడుకుంటారని తెలిసింది. ప్రపంచంలో కొన్ని సబ్జెక్టని అంత త్వరగా అర్థంచేసుకోలేం.

అందులో క్వాంటమ్ ఫిజిక్స్, థెర్మోడైనమిక్స్‌లాంటి-ఫిజిక్స్ సబ్జెక్ట్‌ల తరువాత కష్టమైనదిగా సైకాలజీని విన్నాను. కానీ మనుషుల మనసుల వెనుక ఏముందో కనుక్కోవాలన్న నా తాపనకి అది కష్టం కాదనిపించింది....

మొదటి రోజు ముగిసింది ఎలాగో అలా....

రూమ్‌కి వెళ్లి కూర్చొన్నాను. మనసునిండా ఒకటే ఆలోచనలు... శశి నా ప్రేమను ఒప్పుకుంది.. ఇది చాలు అనిపించింది జీవితానికి. కాని అంతకన్నా పెద్ద పని ఉంది. అదే వాళ్ళ ఇంట్లో ఒప్పించడం... ఏ అబ్బాయికైన ఇదొక అగ్నిపరీక్షలాంటిది. అమ్మాయివాళ్ళ ఇంట్లో వాళ్ళ అమ్మ నాన్నలని ఒప్పించి పెళ్లిచేసుకోవడం.

ఇక్కడ వచ్చిన చిక్కల్లా అమ్మాయికి వాళ్ళ ఇంట్లో చెప్పడానికి ఉండే భయం. ఏ కవో అన్నట్టు అదేంటో అమ్మాయిలకు ప్రేమించేటప్పుడు ఉన్న ధైర్యం, నేను ప్రేమించినవాడిని పెళ్లి చేసుకుంటాను అనడానికి ఎందుకురాదో ఎప్పటికి అర్థంకాదు..ఇప్పుడు ఆ అమ్మాయి తండ్రికి తానో పనికిమాలినవాడిని కాదు అని నిరూపించుకోవాలి.

ప్రస్తుతం ఉన్న ప్రపంచంలో అమ్మాయిల తండ్రులకి కావాల్సింది యే సాఫ్ట్‌వేర్ ఇంజినీరు తప్ప మిగిలినవాళ్లందరు పనికిమాలిన వెధవల్లా కనిపిస్తారు...

ఇంతలో శశి ఫోన్ చేసింది. తన ఇష్టాన్ని చెప్పిన తర్వాత మొదటిసారి ఫోన్చెయ్యడం...

"హలో శశి" అన్నాను.

"శశి కాకుండా ఇంకెవరు చేస్తారేంటి" శశి ఫోన్లోంచి.

"సరేలేద్దు ఏదో వచ్చింది నోట్లోంచి. ఇంతకీ ఎలా రాశావ్ ఇంటర్నల్"

"సర్లే... ఈ సంవత్సరంతో చదువు అయిపోతోంది. తర్వాత పెళ్లి అంటారేమో ఇంట్లో"

"అంటారు.. అన్నప్పుడు నువ్వేమంటావ్"

"అదే ఆలోచిస్తున్నా"

"ఆలోచిస్తున్నావా??? ఏం మాట్లాడుతున్నావ్?? ప్రేమని ఎందుకు చెప్పావ్ అలాంటప్పుడు" కోపంతో అరిచాను.

"అబ్బా చెప్పింది వింటావా... కారణం ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్న అని చెప్తున్నా... సరిగ్గా వినకుండా అరుస్తావెందుకు?"

"ఓహో అలాగా" అన్నాను.

"అలాగే.. ఎందుకో అంత కోపం"

"కోపం కాదు ప్రేమ... నిన్ను వదులుకోలేనంత ప్రేమ"

"అర్థమవుతోంది... ఎలా ఉంది మొదటిరోజు కాలేజి.. అమ్మాయిలు బాగున్నారా" అంది వెటకారంగా...

అమ్మాయిలకి ఉన్న చాలా చాకచక్యమైన మాటతీరు ఇది. ఒకవేళ అమ్మాయి బాగుంది అని చెప్తే నాకన్నా బాగుందా అని మొదలెడతారు. బాగులేదని చెప్తే అది అంతా అబద్ధమని ఎవరో ఒకరు బాగానే ఉండి ఉంటారని వాదిస్తారు.

ఏం చెప్పిన ఒక తంటా అని చెప్పి "ఎవరు బాగాలేరు" అని చెప్పా.

"అంటే ప్రతి అమ్మాయిని పట్టి పట్టి చూసావన్నమాట... సరే ఉంటాను" అంది.

"లేదు చూడలేదు కాబట్టి ఏం చెప్పాలో తెలీక బాలేరు అన్నా... అయినా ఏ అమ్మాయి నీకన్నా అందంగా ఉండదు కదా"

ఇలా అనాలి...... రోజుకి ఒకసారైనా మనం ప్రేమించే అమ్మాయికి, ఆ అమ్మాయి తప్ప ఇంకే అమ్మాయి బాలేదని చెప్పాలి. అప్పుడే ఆ అమ్మాయి శాంతిస్తుంది.

"హుఁమ్ అది నా అభి అంటే..."

"సరే మరి కాంటీన్‌కి వెళ్తున్న.. వచ్చాక మెసేజ్‌చేస్తాను" అని ఫోన్ కట్‌చేసా.

అమ్మాయితో ఫోనులో మాట్లాడటంకన్నా మెసేజ్ చెయ్యడమే ఉత్తమం అనిపించింది.

ఎందుకంటే చాలా మెసేజీలు 'హుంమ్' అనో 'ఇంకా చెప్పు' అనో కూల్‌గా సాగిపోతాయి. నిజానికి మనం ఆ అమ్మాయి మీద చిరాకుగా ఉన్నా, కోపంగా ఉన్నా సరే ఒక నవ్వే స్మైలీ పడేసి ఊరుకోవచ్చు.

జీవితం సంతోషంగా ఉన్నప్పుడు ఎప్పుడు సాఫీగా సాగిపోతుంది. ఒంటరిగా ఉన్నామనికాదు. ఏ ఊర్లో ఉన్నామని కాదు. సంతోషంగా ఉన్నప్పుడు అవేమి గుర్తుకురావు. కాలం వేగంగా సాగుతోంది. రైలులా కాకపోయినా ఆర్టీసి బస్సులా అయినా సాగుతుంది.

* * *

సైకాలజి అత్యంత క్లిష్టమైన సబ్జెక్టు... నాకు అత్యంత ప్రీతికరమైన సబ్జెక్టు. ఎందుకంటే మనుషుల మనసులను అర్థం చేసుకోవడమే ఇక్కడున్న పెద్ద సమస్య. మొదటి సెం మొదటి ప్రాక్టికల్స్. ప్రొఫెస్సర్లు విద్యార్థులను గురిచూసి కొట్టేది ఇక్కడే. అందులోను యునివర్సిటీ ప్రొఫెసర్స్ అయితే మరీను. ఎందుకంటే వీళ్ళు క్లాసులకి రారు. కాబట్టి వీరికి ఉన్న కాలక్షేపం ఇదొక్కటే... ప్రాక్టికల్స్‌లో విద్యార్థులను ఆడుకోవడం. అందులోను వారంతా మొహాన్ని చూసి మనిషి ఎలాంటివాడో చెప్పేవారే. లోలోపల భయం ఉన్నా ధైర్యంగా ఉన్నట్టు నటించాను.

నిజానికి ఇక్కడ కావాల్సింది అదే నటించడం. నీకు వచ్చినా రాకపోయినా అన్ని వచ్చినట్టు నటించడం... ఇక్కడే నటించి పాస్ అయ్యేవాళ్ళు ఎన్టీఆర్, ఎఎన్ఆర్, చిరంజీవికన్నా గొప్పోళ్లు.

ఎందుకంటే ఇక్కడ అతి సహజంగా నటించడం కావాలి. టేకులుండవు, రీటేకులుండవు అంతా సింగిల్‌షాట్. అందులోను సైకాలజీ ప్రొఫెసర్లముందు నటించి గెలవడం అంటే ఆస్కార్ అవార్డ్ రావడమే. నిజానికి ఈ ప్రపంచంలో తెలివైన వాళ్ళని బురిడి కొట్టించే వాళ్ళే గొప్ప వాళ్లు.

నీకేమి రాకపోయినా, కొంచెం వచ్చినా సరే ప్రపంచాన్ని మేనేజ్ చెయ్యడంలోనే ఉంది అంతా. ప్రాక్టికల్ రూం నుండి వచ్చాక అలాగే మేనేజ్ చేసాను అని అనుకున్నాను. అనుకోవడమేమిటి మేనేజ్ చేసాను కూడా.

అందరికి వైవా అయిన సందర్భంగా అందరం కాంటీన్లో మీట్ అయ్యాం. అనిరుధ్, గాయత్రీ, త్రిపుర, లక్ష్మన్ అందరూ చాలా దగ్గరయ్యారు ఈ సెమ్‌లో. ఎన్ని బాధలు ఉన్న అందరం ఒక్కచోట ఉన్నప్పుడు అన్నీ మర్చిపోతాం.

"ఈ రోజు సినిమాకి వెళ్దామా" అన్నాడు అనిరుధ్.

"బాబోయ్! ఇంట్లో ఒప్పుకోరు" అంది గాయత్రి

"ఎప్పుడు ఒప్పుకున్నారు గనక మీ ఇంట్లో. నే ఒప్పిస్తాలే" అంది త్రిపుర.

"ఆగండి! అసలు వ్యక్తి మాట్లాడట్లేదు" అన్నాడు లక్ష్మణ్.

"ఓకే వస్తాను" అన్నాను.

"అయితే ఇవాళ పవన్ కళ్యాణ్ సినిమా అన్నమాట... హుర్రే" అంది త్రిపుర.

"టికెట్లు మీ బాబు సంపాదిస్తాడా" అన్నాడు అనిరుధ్.

"మీరేం మొగాళ్ళు ఆ మాత్రం టికెట్లు సంపాదించలేరా సినిమా మూడో రోజు కూడాను"

"హ!! అది పవన్ కళ్యాణ్ సినిమా అమ్మా" అన్నాడు అనిరుధ్.

"మాకు తెలీదు! ఇవ్వాళ సాయంత్రం సినిమాకి వెళ్తున్నాం. అది పవన్ కళ్యాణ్ సినిమాకి అంతే" అంది త్రిపుర.

"సర్లే ఏదోటి ఏడుస్తాం మేం" అన్నాడు లక్ష్మణ్.

"యూనివర్సిటీ హస్టల్ బ్లాక్-బికి వచ్చి ఎవరో ఒకరు పికప్ చేసుకోండి" అన్నాను.

"ఓకే సాయంత్రం షార్ప్ 5కి నిన్ను త్రిపుర పికప్ చేసుకుంటుంది, మీరిద్దరు జగదాంబకి వచ్చేయండి" అన్నాడు అనిరుధ్. మధ్యాహ్నం క్లాసులు ఉండవు. వాళ్ళతో కబుర్లు చెప్తూ కేంటీన్‌లో గడిపేసరికి మూడయ్యింది. సాయంత్రం పావు తక్కువ ఐదవుతోంది. ఇంతలో ఒక అన్‌నోన్ నంబరు నుంచి ఫోన్ ఎవరా అని ఫోన్ తీశాను.

ఒక అడ గొంతు...

"హలో ఎవరు అన్నాను"

"నేను త్రిపురాని మాష్టారు..."

"నా ఫోన్ నెంబరు నీ దగ్గరికి"..

"అవును మరి.. అది ఎనిమిదో ప్రపంచవింత... మీ బాయ్స్ హాస్టల్ దగ్గరికి నే రావడం కుదరుదు కాని 'సి' రోడ్డు గేటు దగ్గరికి రా" అంది.

"సరే" అని ఫోన్ పెట్టేశా.

మోడ్రన్ అమ్మాయికి ఉన్న లక్షణాలన్నీ త్రిపురలో ఉన్నాయి. కళ్ళలో ఆత్మ విశ్వాసం, బెరుకు లేనితనం దేనికి జంకదనిపించింది. అప్పుడే మనుషుల మనసులు చదవడం వచ్చేసిందనుకున్నాను.

"కంఫర్ట్‌బుల్‌గా కూర్చోండి మాష్టారు... మీ గర్ల్ ఫ్రెండ్‌ది కొంపదీసి ఈ ఊరా??" అంది.

"కాదు" అన్నాను.

"ఓహో! గర్ల్‌ఫ్రెండ్ ఉందన్నమాట. చూశావా ఎలా కనిపెట్టేశానో.. పేరు ఏంటో??"

"శశీ... శశిరేఖ" అన్నాను కాస్త నాలో నేను సిగ్గుపడుతూనే.

"అభిమన్యు శశిరేఖ... ఏంటి పేర్లు చూసి ప్రేమించుకున్నారా అభి"

"హుఁమ్! అలాంటిదే అనుకో"

మొత్తానికి హాల్‌కి చేరుకున్నాం.

చాలా రష్‌గా ఉంది. వీళ్ళు టికెట్లు సంపాదించారా అన్నది మా ఇద్దరి డౌట్.

"ఒరేయ్! ఇక్కడ" అని పిలిచాడు అనిరుధ్.

"ఇంకా గాయత్రి రావాలి. ప్రక్కనే ఇల్లు అయినా దీనికి బద్ధకం" అంది త్రిపుర.

"ఇంతకి టికెట్లు దొరికాయ్ కదా" అన్నాను.

"దొరికాయ్, అదిగో గాయత్రి కూడా వచ్చేసింది పదండి" అన్నాడు అరవింద్.

మొత్తానికి సినిమా అయ్యింది. ఈ బ్యాచ్‌తో కాలేజి లైఫ్ బానే గడిచిపోతుందనిపించింది.

★ ★ ★

ఫస్ట్ సెమ్ అయిపోయింది. సెమిస్టర్ విధానం కొత్తగా ఉన్నా బాగా రాశాను.. నిజానికి బాగా చదివాను.. ఈ చదువు గొడవలో శశితో మాట్లాడటం తగ్గించాను. అప్పుడప్పుడు సుందర్ లేప్‌టాప్ నుంచి వీడియోచాట్ చేసినా అది చాలా తక్కువ సేపే. వాళ్ళమ్మ పిలవడమో లేక వాళ్ళ తమ్ముడు రావడమో జరిగేది. ఎందుకో శశిని కలవాలనిపించింది.

సెమిస్టర్ హాలిడేస్‌కని ఊరు వెళ్ళాక వచ్చిన రెండో రోజే "కాకినాడ వెళ్తానమ్మా పని ఉంది" అన్నాను.

"వచ్చి ఒక రోజు కూడా కాలేదు ఇంకో రెండు రోజుల తర్వాత వెళ్దూగాని" అంది.

అది నిజమే రెండో రోజే వెళితే అంత అర్జంటు పనా అని ఆరా తీయడం మొదలెడతారు. అందుకని వెంటనే విరమించుకున్నాను. శశికి ఫోన్ చేశాను. ఈ ఇంజినీరింగ్ కాలేజీల టైమింగ్ అస్సలు సెట్ అవ్వట్లేదు శశితో మాట్లాడానికి.. పోని సాయంత్రాలలో మాట్లాడదామా అంటే ప్రాజెక్ట్ వర్క్ అనో, ఎస్సైన్‌మెంట్ అనో ఏడిపిస్తున్నారంటా శశిని. పాపం అనుకున్నాను. అక్కడికి ఎంత చెప్పినా వినిపించుకోకుండా ఇంజినీరింగులో చేరింది అనుకున్నాను.

పూర్వం అసలు ఫోన్లు ఉండేవేకావు. అలాంటప్పుడు ప్రేమికులు ఎలా మాట్లాడుకునే వారో. ముద్దులుగట్రా ఎలా తెలియచేసుకునేవారో అన్న సందేహం. అవన్నీ తలచుకుంటే ఒక్కసారి నవ్వొచ్చింది.

"శశి" అన్నాను ప్రేమను మాటల్లోనే చూపిస్తూ.

"అభి ఇంటి దగ్గర ఉన్నావా"

"హ! అంతేకదా! ఎంత దాకా వచ్చింది మీ ప్రాజెక్ట్ వర్క్".

"ఏదో అవుతుందిలే రివ్యూస్ అవుతున్నాయి"

"ఓహో ఈ సెమిస్టర్‌తో నీకు బి.టెక్ అయిపోతుందన్నమాట... ఇంజినీరు గారు"

"ఆ సర్లే ఇంట్లో పెళ్ళి సంబంధాలు చూస్తారేమో అన్న భయంగా ఉంది"

"హుప్! జాబ్ చేస్తానని చెప్పు. ఇంకొక్క సెమిస్టర్, తర్వాత ప్రాజెక్ట్ వర్క్ అంతే అయిపోతుంది నాది"

"నిన్ను చూడాలని ఉంది అభి"

"నాకు కూడా శశి. . ఈ ఆదివారం వస్తాను"

'హుఁమ్! సరే, అమ్మ పిలుస్తోంది ఉంటాను మెసేజ్ చేస్తానులే"

"మరి నాకు అది ఇవ్వు అప్పుడే ఫోన్ పెట్టేస్తా అన్నాను"

'ఏది.. నీకు సిగ్గు లేదు అసలు"

"సరే లేదు ఇవ్వు"

"హుఁమ్!" అని ఫోన్ లోనే ముద్దు పెట్టింది.

జీవితంలో ఇలాంటి రోమాంటిక్ ఫోన్ టాకింగ్‌లు ఉండాలనిపించింది.

ప్రేమికులు అంతసేపు ఫోన్‌లో ఏం మాట్లాకుంటారా అని అందరి ప్రశ్న... కాని అది మాట్లాడుకోవడం కాదు అర్థం చేసుకోవడం అని తెలీదు ప్రపంచానికి... కాకినాడ ఫ్రెండ్‌ని కలవాడానికి అని చెప్పి బయలుదేరాను.

ఒకింత ఉత్సాహం... చాలా కాలం తర్వాత శశిని కలుస్తున్నాను అన్న సంతోషం అది.

ఎప్పుడూ కలుసుకునే చోటు శివాలయం దగ్గరకి వచ్చేయమన్నాను. ఒక్కసారి ప్రశాంత్‌గాడు గుర్తొచ్చాడు. వాడు, నేను, శశి యతి రెస్టారెంట్ బిర్యానీలు తిన్న రోజులు శివాలయం చెరువు దగ్గర బెంచ్‌పై గడిపిన క్షణాలు అన్ని గుర్తొస్తున్నాయి.

కళ్ళలో వస్తున్న కన్నీళ్ళను ఆపుకొని శశికి ఫోన్ చేశాను. కాకినాడలో దిగాను అని చెప్పడానికి. అప్పటికే టైం పదవుతోంది..

ఎప్పటిలాగే శివాలయం చెరువు ప్రక్కన బెంచ్ మీద కూర్చున్నాం.

"చాలా రోజులైంది" శశి అని చేతిని ముద్దు పెట్టుకొన్నాను.

"ఉఫ్" అంది నవ్వుతూ ఆ నవ్వు కోసం సప్తసముద్రాలు దాటచ్చు. అలాంటిది నేను కేవలం 50 కిలోమీటర్లు బస్సులో శ్రమపడి రావడం తప్పులేదనిపించింది.

"నేను చాలా అదృష్టవంతుడిని శశీ"

"ఎందుకో?" అంది.

"నీలాంటి అమ్మాయిని నేను పొందగల్గుతున్నాను"

"అబ్బా ఆపు నీ కోతలు"

"నిజం శశీ! సరే ఏదైనా సినిమాకి వెళ్దామా, ప్రైవసీ ఉంటుంది".

"హుఁమ్! సరే"

"ఇంతకీ అత్తయ్యకి ఏం చెప్పావ్??"

ప్రాజెక్ట్ వర్క్ పని మీద మౌనిక వాళ్ళ దగ్గరికి వెళ్తున్నా అని చెప్పా.

"ఓహో! కిలాడీ"...

ఇద్దరం ఒక ఫ్లాపు సినిమా హాలుకి చేరుకున్నాం.

మా లాంటి వాళ్ళ కోసమే ఇలాంటి వాళ్ళు ఉన్నది అనుకున్నాను.

"శశి! జీవితాంతం నీతో ఇలా గడిచిపోతే చాలు"

"హుఁమ్! నాకు కూడా" అని బుగ్గపై ముద్దు పెట్టింది.

"ఇంకో సంవత్సరం తర్వాత పెళ్ళి, తర్వాత పిల్లోడు, ఒక బంగ్లా, కారు" అన్నాను.

"అత్త, మావయ్యలను కూడా బాగా చూసుకోవాలి" అంది.

"నేను మర్చిపోయినా...నువ్వున్నావ్ కదా! వాళ్ళని బాగా చూసుకుంటావ్ అన్న నమ్మకం నాకు ఉంది" అన్నాను భుజం మీద వాలిన శశి తలను నిమురుతూ.

"శశి, శశి.."

"హుఁమ్ చెప్పు ఇక్కడే ఉన్నాను..."

"మనద్దరి ప్రేమను పెద్దవాళ్ళకు ఎలా చెప్పాలన్నదే భయంగా ఉంది"

"మగపిల్లోడివి నువ్వే అలా అంటే ఎలా చెప్పు"

"ఎప్పుడు ఆడవాళ్ళు ఫస్ట్ కదా"

"అది కొన్నిటిలోనే వర్తిస్తుంది. అన్నిటిలోను కాదు" అంది బుగ్గగిల్లుతూ.

"ఓహో అంతేనంటావా!! ముంచడానికి ముందు ఉంటారు. మునగడానికి వెనకుంటారన్నమాట మీ అమ్మాయిలు"

"ఆపవోయ్, పోదామా ఇంట్రవెల్ అనుకుంటా" అంది.

"ఎక్కడికి"

"మా ఇంటికి"

"నిజమా, ఈ సినిమాకి నీ మతి పోలేదు కదా" అన్నాను నవ్వుతూ.

"అవును ఇంటికే.. నువ్వేం పరాయివాడివి కాదేం. ఎప్పటికైనా రావల్సినవాడివి. దగ్గరి చుట్టానివి"

"ఓహో సరే పద".. అన్నాను.

శశి ఇంటికి చేరుకున్నాం. తన ఇంటిని బయటనుంచే చూడటం తప్ప లోపలికి వెళ్ళి ఎరగను. కాని మొదటిసారి లోపలికి అడుగుపెట్టబోతున్నాను.

ఇంట్లోకి అడుగుపెడుతూనే వింతగా చూసింది వాళ్ళమ్మ "ఈ అబ్బాయిని ఎక్కడో చూసినట్టు ఉందే" అంది ఏరిపారచూస్తూ.

"లక్ష్మత్తయ్య కొడుకమ్మ. కొండుకుర్రు" అంది శశి.

"ఓరి!! నువ్వా పెద్దోడివి అయిపోయావు. ఎక్కడ కలిసారిద్దరు??"

ఏం చెప్పాలో తెలియలేదు. నేను, నీ కూతురు సినిమా హాల్‌లో రొమాన్స్ చేశామని చెప్పాలా అనిపించింది.

"ఇక్కడే మన చిన్న గుడి దగ్గర అమ్మ. కళ్ళు తిరిగి పడిపోయాడు. నేనే గుర్తుపట్టి ఇంటికి తీసుకువచ్చాను"

"మా తల్లే అన్ని నా పోలికలే" అంది వాళ్ళ నానమ్మ పక్క నుంచి. ఒక్కసారి ఆవిడకేసి మొహం తిప్పాను.

అమ్మాయిలు అబద్ధం చెప్పినా ఇట్టే అతికినట్టు ఉంటుంది. ఆ అబద్ధాలలో కూడా వాళ్ళని ఎలివేట్ చేసుకోవడం మానరు.

"అయ్యో! నీకేం పర్లేదబ్బాయ్... నీకు కాస్త కుదుటపడ్డాక వెళ్ళు.. మీరిద్దరు ఇంటర్ క్లాస్‌మేట్స్ కదరా"

"అవును అత్తయ్య" అన్నాను. అత్తయ్య అనే మాటను పలకాలా వద్దా అని పదిసార్లు ఆలోచించి పలికాను.

మేమిద్దరం ప్రేమికులం అని కూడా చెప్పాలనిపించింది.

"సరేలే! ఏమేవ్ ఫ్రిజ్‌లోని ఆ డ్రింక్ బాటిల్ పట్రా" అని గట్టిగా కేకలేసింది వాళ్ళమ్మ.

శశి డ్రింక్ బాటిల్ ఇచ్చింది. అలా తన చేత నేను ఎప్పుడు పని చేయిస్తానా అనిపించింది.

"సరే అత్త! నేను వెళ్తాను" అని లేచాను.

"అదేవిట్రా! ఇంటికొచ్చి భోజనం చేయకుండా వెళ్తానంటావ్"

"లేదు నేను వెళ్ళాలి" అన్నాను మొహమాటాన్ని నటిస్తూ.

"నువ్వు తినే వెళ్ళాలిరా అబ్బాయ్.. లేకపోతే నా మీద ఒట్టే" అంది ప్రక్కనున్న ముసలావిడ. శశి వాళ్ళ నాన్నమ్మ.. ఈవిడ శశి కన్నా శాడిస్టులా ఉంది. ఆఖరికి భోజనం అయ్యింది.

శశి తన రూమ్ చూపించింది. ల్యాప్‌టాప్‌లో హిడెన్‌లో పెట్టిన నా ఫోటోలను చూపించింది.

"ఈ రోజు ఇలా గడుస్తుంది అనుకోలేదు" అన్నాను శశితో

"హుఁమ్ సర్లే ఫోన్‌లో మాట్లాడదాం. ఇంక వెళ్ళు లేకపోతే అనుమానం వస్తుంది."

"వెళ్ళొస్తాను" అని చెప్పి బయలుదేరాను. కాని శశి ఎందుకో వీధి చివర రామాలయం దగ్గర ఆగమంది. పావుగంట తర్వాత వచ్చి చేతిలో ఒక పుస్తకం పెట్టింది.

"ఏంటిది??" అన్నాను.

"ప్రేమలేఖలు చాలా బాగుంటుంది రెండు మూడు సార్లు చదివితేనే కాని అర్థం కాదు" అంది.

"రెండు మూడు సార్లా??"

"హ! చాలా బాగుంటుంది. ఇదే నా గిఫ్ట్ అంది".

"లవ్‌యూ శశి" అన్నాను గాఢత నిండిన గొంతుతో.

"లవ్ యూ టు. సర్లే ఉంటాను జాగ్రత్త"

ఈ రోజు ఎప్పటికి మరిచిపోలేని రోజు అనుకున్నాను మనసులో... శశిని పెళ్ళి చేసుకుంటే ప్రతి రోజు ఇలాగే ఉంటుంది కదా అనుకున్నాను.

త్రిపుర నుంచి ఫోన్.

"మన రిజల్ట్స్ వచ్చాయి మాష్టారు"...

"అవునా" అన్నాను నిరాశక్తతతో...

"మీరు యూనివర్సటీ టాప్"...

"ఓహో! అలాగా" అన్నాను.

"అలాగానా! చాలా సింపుల్‌గా అన్నావ్ అభి. మన బ్యాచ్‌కి పార్టీ కావాలి"

"సరే! అక్కడికి వస్తాగా ఇస్తానులే" అని ఫోన్ కట్ చేశాను.

ప్రస్తుతానికి మెదడులో ఒకే ఆలోచన ఉంది. శశి విషయం అమ్మ నాన్నలకు ఎలా చెప్పాలి అని. ఎందుకంటే శశి వాళ్ళ ఇంట్లో పెళ్ళి సంబంధాలు చూస్తున్నారుట... ఇంతలో ఒక అద్భుతమైన ఆలోచన వచ్చింది.

"నాన్న, నేను యూనివర్సిటీ టాప్ వచ్చాను"

"ఒహో! కంగ్రాట్స్"

"ఇంకో విషయం కూడా చెప్పాలి నాన్న మీతో"

"చెప్పరా! ఈ సమయంలో నువ్వు ఏమన్నా కాదనను"

"నేనొక అమ్మాయిని ప్రేమించాను.. ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకుంటాను"

"చాలా పెద్దోడివి అయిపోయావ్. ఇంతకి ఎవరు ఆ అమ్మాయి" అన్నారు నిట్టూరుస్తూ.

"వడ్లమాని రాంబాబుగారి అమ్మాయి. మనకు దూరపు బంధువులే" అన్నాను.

"మన కులం వాళ్ళే అన్నమాట. మంచిది నేనే వాళ్ళ నాన్నతో మాట్లాడతాను"

నాన్న ఇంత త్వరగా ఒప్పుకుంటారని అస్సలు అనుకోలేదు. అంతా బానే ఉంది. కాని కులప్రస్తావనే నాకు నచ్చలేదు. ఈ 21 శతాబ్దంలో కూడా కులమతాల భేదాలు ఉన్నాయంటే సిగ్గుగాతోచింది. అందరూ మనుషులే కదా అనుకున్నాను. వెంటనే శశికి ఫోన్ చేశాను.

"శశి... ఇది నిశ్చయం

ఈ రోజే, ఈ క్షణమే

మన ప్రేమ...

మూడుముళ్ళ బంధం..

ఏడడుగుల జీవితం" అన్నాను.

"చలం ప్రేమలేఖలు బాగా వంటపట్టింది. విషయం చెప్పు" అంది.

"మా నాన్న మన పెళ్ళికి ఒప్పుకున్నారు. నేను యూనివర్సిటీ టాప్ చేశాను" అన్నాను సంతోషంతో.

"ఆల్ హ్యాపీస్... కాకపోతే మా ఇంట్లో ఒప్పుకోవాలిగా" అంది లేనిపోని డౌట్లను లేవనెత్తుతూ..

"మా నాన్నగారు మాట్లాడతానన్నారు. ఈ లోపల నువ్వు చెప్పేయ్. అదే మంచిది" అన్నాను.

"భయంగా ఉంది"

"రేపే మంచి రోజు... నువ్వు చెప్తున్నావ్ అంతే" అన్నాను కచ్చితంగా.

"సరే సరే" అని ఫోన్ పెట్టేసింది.

ఆ తరువాతి రోజు సాయంత్రం శశి దగ్గరి నుంచి ఫోన్...

"అభి ఘోరం జరిగిపోయింది" అంది గొంతులో సీరియెస్‌నెస్‌తో.

"ఏంటి మీ అమ్మ నాన్న మన ప్రేమను ఒప్పుకోలేదా" అన్నాను.

ప్రతి కథలోను విలన్ ఉంటారు కదా. ఈ సారి వీళ్ళ అమ్మనాన్న ఏమో అన్న ఉద్దేశంతో..

"లేదు! వాళ్ళు కూడా ఒప్పేసుకున్నారు" అని గట్టిగా అరిచింది.

ఇద్దరం ఫోన్‌లోనే గట్టిగా అరుచుకున్నాం. ప్రేమించుకున్నవాళ్ళకి ఇంతకంటే ఏం అక్కర్లేదనుకుంటా. తల్లితండ్రుల యిష్టప్రకారమే అంతా... ఈ సారి ప్రేమకథలో విలన్‌లు ఎవరు లేరనిపించింది.

★ ★ ★

"సైకాలజీ డిపార్ట్‌మెంట్ యూనివర్సిటీ టాప్ అభిమన్యు ప్లీజ్ కమాన్ టు ద డయాస్"

జీవితంలో అంతకన్నా ఆనంద క్షణాలు ఉండవనిపించింది. అమ్మ, నాన్న, అత్తయ్య, మావయ్య, అందరి కన్నా ముఖ్యంగా శశి ఎదురుగుండా గోల్డ్‌మెడల్ అందుకోవడం. వెనక్కి తిరిగి చూసుకుంటే ఎప్పుడూ ఇలా జరుగుతుందని ఊహించలేదు. జరిగిపోయింది అంతే.

"ఎవరికి వారు ఆర్డరు ఇచ్చుకోండి. నాకు, శశికి ఒక వెజ్ ఫ్రైడ్‌రైస్ విత్ మంచురియా, పాలక్ పన్నీర్ కర్రీ" అన్నాను.

బ్యాచ్ మొత్తానికి ట్రీట్. త్రిపుర, అనిరుధ్, అర్జున్, గాయత్రి, లక్ష్మణ్, చివరిగా నేను, శశి. అందరం తైకూన్‌కి వచ్చాం.

వైజాగ్‌లో కల్లా డిఫరెంట్ రెస్టారంట్... చూడటానికి చైనీస్ ఆర్కిటెక్చర్‌ను ప్రతిబింబిస్తుంది.

మేమందరం ఒక ఫ్యామిలీ టేబుల్‌ని బుక్ చేసుకున్నాం...

అందరూ ఎవరికి కావలసినవి వారు ఆర్డరు ఇచ్చుకున్నారు.

"ఎంత కావాలంటే అంత తినండి, అన్నిటికి ఇదే. మా ఎంగేజ్‌మెంట్, గోల్డ్‌మెడల్ పార్టీ ఇదే" అన్నాను గట్టిగా చెప్తు.

"ఇదా వుయ్ వాంట్ బ్యాచులర్ పార్టీ మాన్" అన్నాడు అనిరుధ్.

"బ్యాచిలర్ పార్టీ ఆ! సరే! కాని నేను తాగను" అన్నాను.

"ఉఫ్! పార్టీ నీదయ్యా.. నువ్వు తాగకపోతే ఎలా. చెల్లమ్మా నీ పర్మిషన్ కావాలేమో" అన్నాడు లక్ష్మణ్.

"ఏం పర్లే గో ఎహెడ్! బట్ ఎక్కువ వద్దు అండ్ ఓన్లీ బీర్" అంది శశి.

"నువ్వు చాలా అదృష్టవంతుడివిరా అభి. అర్థం చేసుకొనే భార్య దొరుకుతోంది" అన్నాడు అర్జున్.

"అది నాకు తెలుసు కాని వీళ్ళను దింపి రావాలి కదా" అన్నాను.

"శశి, నేను, గాయత్రి, బైక్ మీద వెళ్ళిపోతాం. నోప్రాబ్లమ్, యు గాయ్స్ ఎంజాయ్" అంది త్రిపుర.

వాళ్ళు బైక్ మీద వెళ్ళిపోయారు. మేం కారులో బీచ్ ప్రక్కనే ఉన్న గ్రీన్‌లాండ్ బార్ అండ్ రెస్టారెంట్‌కి చేరుకున్నాం. నలుగురు నీట్‌గా ఉన్న టేబుల్ చూసి కూర్చున్నాం. నిజానికి అక్కడా అంతా నీట్‌గానే ఉంది. అంతమంది తాగుబోతుల మధ్య ఆ నీట్‌నెస్ ఎలా మెయింటెన్ చేయగల్గుతున్నారా అనిపించింది.

"రెండు విస్కి, రెండు బీర్స్ విత్ చికెన్ కబాబ్ (రోస్ట్)" అని ఆర్డర్ ఇచ్చాడు అనిరుధ్. నేను రెండు పెగ్గులు వేశాక ఊరుకున్నాను. మిగతా ముగ్గురు మాత్రం ముందు చెప్పిన ఆర్డరు తర్వాత మళ్ళీ ఆర్డరు చేశారు. వీళ్ళ ముగ్గురుని మోసుకెళ్ళాలేమో అని భయమేసింది.

దేవుడి దయతో ఆ పరిస్థితి రాలేదు.

"కారు డ్రైవ్ చేయరా అభి" అని కీస్ నాకిచ్చాడు అనిరుధ్. బతికించాడు, ఇంకా వాడు డ్రైవ్ చేస్తాడెమో అని భయపడ్డాను.

అందరం త్రిపుర వాళ్ళ టెర్రస్ పైన పడుకున్నాం. వచ్చినట్టు ఎవరికీ తెలీదు. నేను క్షేమంగా చేరానా లేదా అని శశి ఒంటిగంటైనా ఫోన్ చేసింది. "చేరాను" అని చెప్పగానే "హమ్మయ్య" అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

జీవితం చాలా బాగుంది అనుకున్నాను... భవిష్యత్తు మీద ఎన్నో కలలు... ఆమెతో పెళ్ళి, జీవితం.

చిన్నప్పుడు ఎప్పుడు మనం మన భవిష్యత్తుని ఊహించుకోం... ఏదో నోటికి వచ్చినట్లు నేను ఇంజినీర్ అవుతా... డాక్టర్ అవుతా అని చెప్పడం తప్ప... పెళ్లి అనగానే సిగ్గుపడటం, అసలు చేసుకోనని చెప్పడం. కాని జీవితం గడిచే కొద్ది మనకు తెలియకుండా అన్ని జరిగిపోతాయి ప్రేమ, పెళ్ళి, పిల్లలు... సుఖపడటం, కష్టపడటం అన్ని కూడా.

★ ★ ★

"అరేయ్! అరకు వెళ్దాం రా అభి అందరం" అన్నాడు అనిరుధ్.

"శశిని వదిలేసి రాలేను రా" అన్నాను.

"ఎవడొదిలెయ్‌మన్నాడు. శశిని కూడా తీసుకురా. తోడుగా త్రిపుర వాళ్ళు కూడా ఉంటారు కదా" అన్నాడు లక్ష్మణ్.

"కాని తను వాళ్ళ పెద్దమ్మ వాళ్ళ ఇంటి దగ్గర ఉంటోంది రా''

"అయితే ఏముంది, నీ కాబోయే భార్యా రా భయపడతావేంటి" అన్నాడు గట్టిగా. .

"సరే అడుగుతాను. తరువాత తన ఇష్టం" అన్నాను.

అరకులో లక్ష్మణ్‌గాడు మొత్తం మూడు రూమ్‌లు బుక్ చేయించాడు. ప్రయాణానికి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. శశిని ఒప్పించడానికి తల ప్రాణం తోకకు వచ్చింది.

వైజాగ్ మొత్తం ఒక లెక్క అయితే వైజాగ్ నుంచి అరకు వెళ్ళడం ఇంకో లెక్క. అందులోను ఎవరు ట్రైన్‌లో కూర్చోరు. కిటికిల దగ్గర లేక ట్రైన్ తలుపుల దగ్గర వేళ్ళాడతారు. అరకు అందాలను చూడటానికి వచ్చిన పాట్లు అవి. మేమంతా అయితే కిటికీల దగ్గర సెటిల్ అయ్యాం. అంత అందమైన అందాలను చూస్తూ, అంతకంటే అందమైన అమ్మాయిని ప్రక్కన పెట్టుకుని ప్రయాణించడం గొప్ప అనుభూతి. ఈ జన్మకు ఇది చాలు అనుకున్నాను..అంత తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం అయ్యింది.

"మీరిద్దరు ఒక రూమ్ తీసుకోండి. త్రిపుర, గాయత్రి ఒక రూమ్‌లో ఉంటారు. మేం ఒక రూమ్‌లో ఉంటాం''

"వద్దు నేను త్రిపుర వాళ్ళతో ఉంటాను" అంది శశి.

"నాతో ఉండటం ఇష్టం లేదేమో" అన్నాను కాస్త జాలిగా మొహం పెట్టి.

"ఇంకో రెండు నెలల్లో పెళ్ళి పెట్టుకుని ఏమిటి ఇదంతా ఎంజాయ్ ద మ్యాజిక్ మూమెంట్స్ బిఫోర్ మ్యారేజ్" అంది త్రిపుర.

త్రిపుర మాటలు బాగా పనిచేశాయి శశి మీద... ఇద్దరం ఒక రూమ్‌కి చేరుకున్నాం.

"ఇవ్వాళ నాకు స్పెషల్ అన్నమాట" అన్నాను నవ్వుతూ శశితో.

"ఆశ దోశ అప్పడం వడ" అని టీవి ఆన్ చేసింది.

"ఏయ్ గీతాంజలి సినిమా''

"షటప్.. ఇక్కడ ఒక ప్రేమకథ ఆల్‌రెడీ రన్ అవుతోంది కదా! మళ్ళీ ఇంకోటి కావాలా''అన్నాను మంచం మీద వాలుతూ.

"ఆపవోయ్ ఈ సినిమా లవ్లీగా వుంటుంది" అంది తన పోనిటెయిల్‌ని ముడి చేసుకుంటూ.

'సర్లే! నీతో వాదించడం చాలా కష్టం"

"చానల్ మార్చకు.. నేను స్నానం చేసి వస్తాను".

"తోడు నేను రావచ్చా శశి"

"చంపేస్తాను.. వెదవ వేషాలు వేయకు" అంది నవ్వుతూ.

"హహ! హఁ సరే వెళ్ళిరా" అన్నాను. మంచానికి కుడివైపున ఉన్న కిటికి తీశాను. చల్లని గాలి మెల్లగా కిటికిలోంచి వస్తోంది... ఎంత రొమాంటిక్ నైట్...

ఎవరో తలుపు కొట్టినట్టు అనిపించింది. వెళ్ళిచూస్తే సర్వర్ "సార్! డిన్నర్ ఆర్డర్ ప్లీజ్"...

"నో థ్యాంక్స్" అన్నాను. ఎందుకంటే ఇంతకు ముందే అందరం భోజనం చేశాం.

'ఐ లవ్ యూ.. ఐ లవ్ యూ..' అంటూ ఇళయరాజ్ సాంగ్. అంతలోనే శశి బయటికి వచ్చింది. ఎంత అందంగా ఉంది తను... నిజంగా చాలా... నా కన్నా అదృష్టవంతుడు లేడు అనిపించింది. ఎన్ని సార్లు అనుకుంటాను ఈ మాట. ఇదంతా నా పిచ్చి అనిపించింది.

"సూపర్ సాంగ్ కదా! నువ్వు కూడా స్నానానికి, వెళ్ళు" అని టవల్ చేతిలో పెట్టింది.

"స్నానం ఉఫ్" అంటూ బద్ధకంగా లేచాను...

సబ్బుని అరిగేదాకా తోమాను.

స్నానం చేసి వచ్చాక నెమ్మదిగా మంచం మీద వాలాను. శశి ఇంకా సర్దుకోవడంలోనే మునిగిపోయింది. ఈ అమ్మాయిలతో ఇదే ఇబ్బంది. నిమిషం పనిని అరగంట చేస్తారనిపించింది.

అంతా సర్దాక శశి కూడా మంచం మీద కూర్చుంది.

"శశి ఇదంతా వింతగా లేదా" అన్నాను.

"ఏమిటి వింత??" అంది తన అందమైన మొహాన్ని నాకేసి తిప్పి.

"ఇలా ఒక రాత్రి, రొమాంటిక్ నైట్, రొమాంటిక్ సినిమా చూస్తూ గడపడం వింతగా లేదు''

"చాల్లే అపు నీ కోతలు" అని భుజం మీద తట్టింది తన చెయ్యితో.

భుజం మీద చెయ్యి తియ్యలేదు. మెల్లగా చెయ్యి స్థానంలో తన తల చేరింది.

"నిద్రవస్తోంది అభి" అంది శశి.

"అప్పుడేనా?? గీతాంజలి ఇంకా అవ్వలేదు" అన్నాను శశి తల నిమురుతూ.

ఓం నమహ అంటూ గీతాంజలిలో పాట.. నాగార్జున, పెదాలు కలుస్తున్నాయి.

"ఎంత రొమాంటిక్ సాంగ్ ఇది" అన్నాను శశితో ఇద్దరం కన్నార్పకుండా చూస్తున్నాం.

"శశి నిన్ను అలా ముద్దుపెట్టుకోవాలని ఉంది" అన్నాను.

శశి మాట్లాడలేదు.. మెల్లగా మొహాన్ని శశికి దగ్గరగా ఉంచాను. మా పెదాలు కూడా కలిసాయి. తను వద్దని అనలేదు. పాటతో సంబంధం లేదు. ఒకరి పెదాలు మరొకరికి గాఢంగా హత్తుకుంటున్నాయి.

"ఇక చాలు మనం హద్దులు దాటుతున్నాం అభి" అంది నన్ను ప్రక్కకు తోస్తూ..

"ఇందులో తప్పేముంది త్వరలో పెళ్ళి చేసుకుబోతున్న వాళ్ళం" అన్నాను.

"ఇవన్ని ఇప్పుడు వద్దు... మాట్లాడకుండా పడుకో అభి''

'హుఫ్! నువ్వెప్పుడు ఇంతే" అని పడుకున్నాను. లేదు పడుకున్నట్టు నటించాను.

శశి నా నుదురు మీద ముద్దు పెట్టింది. నా మీద ఎంతటి ప్రేమో అనుకున్నాను. ఈ బంధం ఇప్పటిది కాదేమో అనుకున్నాను.

★ ★ ★

ఆరింటికే అల్లారం మోగడంతో ఇద్దరం లేచి ఫ్రెష్ అయ్యి ఎనిమిదింటికల్లా బయటకి వచ్చాం. శశి త్రిపుర వాళ్ళ రూమ్‌కి వెళ్ళింది. నేను అనిరుధ్‌గాడి రూమ్‌కి దారి తీశాను.. ఇంకా వాళ్ళెవరు రెడీ అవ్వలేదు.

"ఏరా!! నైట్ అవుటా?" అన్నాడు అనిరుధ్‌గాడు నన్ను చూస్తూనే...

"పోరా! అంత సీన్ లేదు. అన్ని పద్ధతి ప్రకారం పెళ్ళి తర్వాతే"

"ఓహో! ఎంత అమాయకుడివిరా నువ్వు. వాళ్ళు అలాగే అంటారు"

"సర్లే పో! స్నానం చేయి నువ్వు" అన్నాను టవల్ విసురుతూ.

"అరేయ్ లక్ష్మణ్, అర్జున్ లేవండ్రా. పడుకోవడానికి రాలేదు ఇక్కడికి" అన్నాను వాళ్ళని తన్నుతూ.

అందరూ రెడీ అయ్యేటప్పటికి 9:30 అయ్యింది. పదింటికల్లా టిఫిన్లు చేసి అరకు అందాలను చూడటానికి బయలుదేరాం.

"అరేయ్ ఈ బస్సు ఎక్కుదాం నడిచే పని ఉండదు. అరకు మొత్తం చూపెడుతుంది" అన్నాను అనిరుధ్‌గాడితో.

"మాకంత ఓపిక లేదు. మేం అదిగో ఆ చెట్టుకిందే ఉంటాం మీరు చూసి రండి.. అందులోను కాబోయే జంట" అన్నాడు వాడు.

"అవునవును!! కాస్త రొమాంటిక్‌గా స్పెండ్ చేయండి మాస్టారు మా శశితో" అంది గాయత్రి. ఇద్దరమే బస్సు ఎక్కాం..

"పొద్దున్నే నాన్న వాళ్ళు ఫోన్ చేశారు శశి" అన్నాను.

"ఏంటట"

"మీ డాడీ అదే మావయ్య వైజాగ్‌లో బిల్డింగ్ కొందామనుకుంటున్నారట. నా కౌన్సిలింగ్ సెంటర్ కోసం" అన్నాను.

"మంచిదే"..

"మా నాన్న వద్దని చెప్పారట"

"ఎందుకని"

"ఎందుకని ఏమిటి?? నేను ముందే చెప్పాను కదా కట్నాలు ఏమి వద్దని... నిన్ను ఇస్తున్నారు చాలదా??"

"చో ఛ్వీట్" అని బుగ్గ గిల్లింది.

"ఎందుకో ఎడం కన్ను అదురుతోంది శశి"

"హ హ సర్లే అభి ఈ ఘాట్ రోడ్డులో శరీరాలే అంత ఎత్తున్న కదులుతున్నాయి. ఇంక కన్ను ఓ లెక్క. ఈ ప్రకృతిని చూడు ఎంత బాగుందో"

"సర్లే నీకన్నీ వేళాకోళమే".. అని ఊరుకున్నాను.

కాని మనసు ఎందుకో కీడు శంకిస్తోంది. ఇంతలో ఏమయ్యిందో ఏమో బస్సు వంకర టింకరగా పోతోంది. బస్సులో జనాలందరు అరుస్తున్నారు నాతో సహా... కళ్ళు తెరచి మూసే లోపు బస్సు చాలా చిన్న లోయలోకి పడబోతోంది. అందరూ ప్రాణభయంతో హహకారాలు చేస్తున్నారు. అంత రెప్పపాటు క్షణం...ఆ ప్రమాదం.

★ ★ ★

శశి అన్న అరుపు నన్ను కళ్ళు తెరుచుకునేలా చేసింది. కళ్ళు మెల్లగా తెరుచుకున్నాయి. ఎదురుకుండా తెల్లని కోటు వేసుకున్నతను మాట్లాడసాగడు.

"ఆర్ యు ఆల్‌రైట్ అభిమన్యు"

"శశి, శశి, శశి ఎక్కడ ఉంది" లేనిశక్తిని గొంతులోకి తీసుకొని అడుగుతున్నాను.

"షి ఈజ్ ఆల్‌రైట్, జనరల్ వార్డులో ఉంది, మీరు స్ట్రైన్ అవ్వకండి" అన్నాడతను.

"లేదు నేను శశిని చూడాలి" అని గట్టిగా అరిచాను.

తలకి చెంపలకి దెబ్బలు తగలడం వల్ల అనుకుంటా నరాలు నెప్పనిపించాయి.

"నర్స్, వీళ్ళ పేరింట్స్‌ని పిలవండి" అన్నాడతను.

"శశిని చూపించండి నాకు" అన్నాను లేవడానికి ప్రయత్నిస్తూ... లేచెందుకు శక్తి లేదని తెలుసు.

శశిని చూడటానికి తాపత్రయం అది.

"శశి శశి ప్రాణాలు పోతున్నా అదే పేరు పలవరిస్తున్నా. నా ప్రాణానికి మించిన ప్రాణం ఆ పేరు కదా!

"శశి ఏది?"

నాకర్థమయ్యింది శశి ఇక లేదని... కంట్లోంచి నీళ్ళు ధారాపాతంలా వస్తున్నాయి. అవి గుండెల్లో గుచ్చుకుంటున్నాయి...

ఎవరో పట్టుకుని అధః పాతళంలో తొక్కేస్తున్నట్లు అనిపించింది. తట్టుకోలేకపోయాను.

"శశి శశి ఎక్కడున్నావ్" అని పిచ్చివాడిలా రోదిస్తూ అరిచాను.

శశి నిజంగా లేదు. నమ్మలేని నిజం... నిజమా కాదా అని ఒక్కసారి నాకు పెట్టిన సెలైన్ సూదిని తీసాను... నొప్పి ఉంది నిజం. కాని శశిముందు ఇదేం పెద్దనొప్పి అనిపించలేదు...

ఆ నవ్వు, ఆమె చూపు, ప్రేమ అన్ని ఇప్పుడూ జ్ఞాపకాలే.. ఎంతగా వేధిస్తున్నావో, నీకోసం ఇంతలా తపన పడాలా..

ఎక్కడి నుంచి వస్తున్నాయి ఈ కనీళ్ళు... ఎందుకీ ఈ జీవితం అనిపిస్తుంది.

ఎక్కడికి వెళ్ళిపోయావు శశి? నిన్ను కావాలనుకున్న దేవుడు.. నన్ను కూడా తోడుగా తీసుకువెళ్ళచ్చుగా.. డాక్టర్లు చెప్తూనే ఉన్నారు ఎక్కువ స్ట్రైన్ అవ్వద్దని.

వాళ్ళకేం తెలుసు నా బాధ. . నా ప్రాణం అయిన నువ్వే లేకపోగా... ఇప్పుడు నా ప్రాణం గురించి భయం, బాధ అంతకంటే లేదు. రోదన.. చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నాను. అంతా నా వల్ల జరిగింది. అసలు శశిని నేనే రమ్మన్నాను. బస్సు నేనే ఎక్కమన్నాను. ఆ ప్రమాదంలో నేను పోయినా బాగుండనిపించింది.

"కనీసం శశి శవాన్ని అయినా చూపించండి" అని ఏడుస్తూ అర్థించాను డాక్టర్స్‌ని.

"వద్దురా అభి! నువ్వు చూడలేవు. మొహం గుర్తుపట్టలేకుండా ఉంది" అన్నారు నాన్న ఏడుస్తూ.

"పర్లేదు! నేను చూస్తాను" అన్నాను ఎక్కడలేని ధైర్యాన్ని నటిస్తూ, కన్నీళ్ళను ఆపుకుంటూ..

"సరే! నర్స్.. వీల్ చైర్‌లో తీసుకువెళ్ళు ఈయన్ని... మార్చురీ బ్లాక్ డి, నెం.104, పోస్ట్‌మార్టం అయిపోయింది కదా ఆ బాడీ" అన్నాడు డాక్టర్.

"మీరిక్కడే ఉండండి. ఎలాగా శవాన్ని మీకే అప్పగించాలి" అని నాన్నతో చెప్పి లోపలికి తీసుకువెళ్ళింది. బయట అత్తయ్య బోరున ఏడుస్తోంది.

మావయ్య కళ్ళలో కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి. ఆయన ఒకచోట కూలబడి ఉన్నారు. ఇంతలో ఒక శవాన్ని స్ట్రెచ్చర్ మీద తీసుకువచ్చారు ఇద్దరు మనుషులు.

"సార్! పోస్ట్‌మార్టం కూడా అయిపోయింది. ఇక మీరు తీసుకెళ్ళచ్చు" అంది ఆమె. కన్నీళ్ళు ఆగట్లేదు..

"ఒక్కసారి మొహం మీద గుడ్డని తొలగించండి" అన్నాను.

నర్సు వద్దు వద్దు అంటూనే తీసింది...

"శశి శశి" అని హాస్పిటల్ మొత్తం ప్రతిధ్వనించింది.

ఎంతటి అందమైన మొహం.. ఒకసారి ఆ మాంసపు ముద్దనే ముద్దు పెట్టుకున్నాను.

"తీసుకెళ్ళి ఫ్రీజర్‌లో పెట్టి అంబులెన్స్‌లో పెట్టండి" అన్నాడొకతను.

"ఇంటికి వెళ్దాం బావగారు, కార్యక్రమాలు చూడాలిగా" అన్నారు మావయ్య నాన్నతో.

"నేను వస్తాను" అన్నాను ఆ ఏడుపుతోనే.

"నిన్ను డిశ్చార్జ్ చేయడానికి ఇంకా రెండు రోజులు పడుతుంది అంట, అప్పటిదాకా కదలడానికి లేదు" అన్నారు నాన్న....

"లేదు నేను వస్తాను" అన్నాను.

ఇంతలో వెనక నుంచి ఎవరో మెడ మీద గ్రుచ్చినట్టయ్యింది. కళ్ళు నెమ్మదిగా మూతబడ్డాయి. పెదాలు 'శశి శశి' అన్న మాటనే పలుకుతున్నాయి.

★ ★ ★

కళ్ళు తెరచి చూసేటప్పటికి ఇంటి దగ్గర గదిలో పడుకుని ఉన్నాను.

మా అమ్మ నేను ఎప్పుడు లేస్తానా అని ఎదురు చూస్తోందనుకుంటా.

"నన్ను ఎవరు తీసుకొచ్చారు ఇక్కడికి? నేను వెళ్ళాలి శశి దగ్గరికి" అని మంచం దిగాను.

వెంటనే నాన్న పరిగెత్తుకు వచ్చి "లేదు రా శశి ఇంక లేదు. కార్యక్రమాలన్ని అయిపోయాయి". ఇప్పటికి నమ్మలేని పరిస్థితి. శశి ప్రక్కనే ఉన్నట్టు అనిపించింది. ఆమెతో గడిపిన క్షణాలు. ఇప్పుడన్ని జ్ఞాపకాలుగానే మిగిలిపోనున్నాయి. వెంటనే మంచం దిగి నడవడం మొదలెట్టాను.

"ఎక్కడికి??" అన్నారు..

"చావడానికి కాదులెండి" అన్నాను కోపంగా.

బాధ, బాధను ఎలా ఆపుకోవాలి. ఎటు చూసినా ఆమె జ్ఞాపకాలే.

ఊర్లో నడుస్తున్నాననే సంగతే మర్చిపోయాను. ఎంతదూరం నడిచానో, నడిచినంత దూరంలో ఎన్ని జ్ఞాపకాలు నెమరేసుకున్నానో... ఎన్ని సార్లు ఆమె పేరును తలుచుకున్నానో...

ఇంతలో బాబు వైన్స్ కనబడింది. జేబులో డబ్బులు లేవు. మర్చిపోవాలంటే తాగాలి.

నన్ను చూసిన వెంటనే "ఆరోగ్యం కుదుటపడిందా బాబు అన్నాడు" షాపులో బాబు.

"రెండు విస్కి ఇవ్వు. ప్రస్తుతానికి నా దగ్గర డబ్బులేవు. ఇంటికొచ్చి తీసుకో" అన్నాను.

"సరే బాబు" అని రెండు బాటిళ్ళు ఇచ్చాడు. వాటరు పాకెట్లు ఇవ్వబోయాడు.

"వద్దని" సైగ చేశాను.

అవి పట్టుకొని ఎక్కడికి వెళ్ళాలో తెలీక ప్రక్కనే ఉన్న తోటల్లోకి వెళ్ళాను.

శశి ఎందుకు ఒంటరిని చేశావు. ఒంటరిని చేశావ్ సరే ఎందుకు పదే పదే గుర్తొస్తావ్. శశి అని బాటిల్‌ని తీశాను.

"ఎక్కువ తాగద్దు" అన్న శశి మాటలు గుర్తొచ్చాయి. అక్కడికక్కడే బాటిల్‌ను పగులకొట్టి చేతిని కోసుకున్నాను. బాధ, అంతకు మించిన బాధ గుండెలను కోస్తోంది. నాకు తెలీకుండానే నన్ను ఫాలో అవుతున్న రాజా అన్న అక్కడికి వచ్చి" ఏమిటి పిచ్చి పని అసలు" అని ఒక్క చెంప దెబ్బ కొట్టి ఇంటికి లాక్కు వెళ్ళాడు.

రక్తం కారిపోతున్న చేయిని చూస్తూ "ఏమయ్యిందిరా" అంది అమ్మ ఏడుస్తూ.

నాకు సమాధానం చెప్పాలనిపించలేదు. ఇదంతా శశి కోసం అనుకున్నాను.

"అక్కడ తోటల్లో వైన్ బాటిల్‌తో చేయి కోసుకున్నాడు. నేను రావడం లేటయితే.." అని ఆపేశాడు రాజా అన్నయ్య.

"ఈ పాటికి శశి దగ్గర ఉందును" అన్నా నవ్వుతూ.

నాన్న తీసుకువచ్చిన డాక్టర్‌గారు కట్టు కట్టడం ప్రారంభించారు.

"నొప్పిగా ఉందా" అన్నాడు కట్లు కడుతూ ఆర్.ఎమ్.పి.

"అవును" అన్నాను.

"మరి అలాంటప్పుడు ఎందుకు ఈ పిచ్చి పని" అన్నాడు.

"నొప్పి గుండెల్లో" అన్నాను.

"మీరు కొంచెం బయటకి వెళ్తారా" అని అమ్మనాన్నకి చెప్పాడు ఆ డాక్టర్.

వాళ్ళు వెళ్ళాక ఆయన తలుపేసి నా దగ్గరగా జరుపుకున్నాడు కుర్చీ...

"ఇప్పుడు చెప్పు అభిమన్యు... ఏమిటి మీ ప్రాబ్లెమ్"

"ఏమిటి నా ప్రాబ్లమ్ ఆং? మీకు తెలియదా??"

"ఓహో నువ్వు ప్రేమించి పెళ్ళి చేసుకుందామనుకున్న అమ్మాయి చనిపోయింది అంతేనా??"

"అంతేనా? అవును.. పోయింది నా శశి... మీకేంటి బాధ... నాకుంటుంది... చచ్చిపోవాలని ఉంది"

"ఆ అమ్మాయి కోసం చచ్చిపోతావ్ అన్న మాట.. మరి నిన్ను ఇన్నేళ్ళు పెంచిన మీ అమ్మ నాన్న"

నిశ్శబ్దం. ఏం మాట్లాడాలో అర్థంకాలేదు... అర్థం కాలేకపోవడంకాదు... ఆ ప్రశ్నకి సమాధానం లేదు.

"నేను చెప్పేదాక నీకు వాళ్ళు గుర్తుకురాలేదు కదా...!"

నేను ఏం మాట్లాడలేదు... మాటరాలేదు...

"నేనొక కథ చెప్తాను. ఇది పాతికేళ్ళ కిందటిమాట... నాకో మిత్రుడు ఉన్నాడు... వాడు కూడా నీలాగే ఒక అమ్మాయిని ప్రాణంగా ప్రేమించాడు... ప్రేమించడమే కాదు పెళ్లిచేసుకున్నాడు కూడా.. ఆ రోజుల్లో ప్రేమించిన అమ్మాయిని పెళ్లిచేసుకోవడం చాలా పెద్ద విషయం. జీవితం చాలా అందంగా, ఆనందంగా గడిచిపోతోంది అనుకున్నాడు. ఆరునెల్లయ్యింది పెళ్ళి అయ్యి.. వారిని చూసిన ప్రతి ఒక్కరు కూడా ఈర్షపడేవారు. అందుకు తగ్గట్టుగానే వాళ్ళు ఉండేవారు.

కొత్తగా రిలీజ్ అయిన సినిమా, కొత్త దంపతులు, కొత్తగా కొనుక్కున్న చేతక్ బండిపై సినిమాకు వెళ్దామనుకున్నారు... వెళ్లారు కాని..."

"కాని ఏమయ్యింది" అని అడిగాను.

"తెలుసుగా జీవితం ఎప్పుడు ఒకేలా ఉండదు. ఆవిడకి బండిమీద సరిగ్గా కూర్చోవడం రాలేదు. భారతదేశపురోడ్లు. ఒక గతుకుకి ఆమె కిందపడింది. ఆయన బండితోపాటు పక్కకుపడ్డాడు. క్షణంలో వెనుక వస్తున్న లారీ ఆమె మీదకు ఎక్కింది. కన్ను మూసి తెరచేలోగా అంతా అయిపోయింది..."

"అంటే ఆమె ఇకలేదా...."

"కాలం ఎప్పుడు ఒకేలా ఉండదు అభి... మనం కాలాన్ని ఎదురించాలి... పోరాడాలి... బాధపడాలి, ఆనందపడాలి. జీవితంలో అన్ని అనుభవించాలి. ఒక్కోసారి మనకు చాలా దగ్గరయిన వాళ్ళు దూరం అవుతారు, చనిపోతారు. అంత మాత్రాన అక్కడితోనే ఆగిపోవడం మూర్ఖత్వం అవుతుంది''

"అవును... ఇంతకి ఆయన బతికే ఉన్నాడా... ఎక్కడున్నాడు''

"బతికి ఉన్నాడా? హహ... చెప్పాగా ఒక జీవితం అయిపోయింది అంతే. ఇంకో కొత్త జీవితం మొదలుపెట్టాడు..."

"ఎక్కడ ఉన్నాడు ఆయన..."

"నీ ముందే... తనలాంటి ఓ కుర్రాడికి జీవితం గురించి చెప్తున్నాడు. మనిషంటే తనను తాను ప్రశ్నవేసుకోవడం, తనని తానూ కనుక్కోవడం, ఒకరికోసం జీవితాన్ని వదిలేసుకోవడం కాదు." అని కళ్ళుతుడుచుకుని లేచి వెళ్ళిపోయాడు.

ఒక్కసారిగా నా మనసు నిండా నిశ్శబ్దం... ఆయన చెప్తున్నంత సేపు ఆయన కళ్ళల్లో ప్రేమను గమనించలేదు.

కాని చివరికి ఆయన కన్నీళ్ళలో చూసాను.

ఆయన వెళ్ళిన తర్వాత అమ్మ దగ్గరగా వచ్చింది. ఆయన గురించి అడిగాను. పక్క ఊరు డాక్టర్ అని, పాపం పెళ్లి అయిన ఆరునెలలకే పెళ్ళాం చనిపోయింది, అప్పటి నుంచి ఆవిడ పేరు మీద ఆసుపత్రిపెట్టి అందరికి ఉచితంగా వైద్యం చేస్తూ ఉంటారు అని చెప్పింది.

ఆ డాక్టర్ చెప్పింది నిజమనిపించింది. శశి జ్ఞాపకాల్లోంచి బయటకు రావాలి. కాని ఎలా...

అవే ఆలోచనలు. ఒక్కసారి శశి ఇచ్చిన ప్రేమ లేఖలు బుక్ తీశాను. ఒక్కసారి కాదు, రెండుసార్లు కాదు చదవుతూనే ఉన్నాను.. బుక్‌ని పట్టుకొని వెక్కి వెక్కి

ఏడుస్తున్నాను. పగలు రాత్రి లేదు. ఆకలి దప్పికలు లేవు. శశి ఒక్కటే ప్రతిధ్వనిస్తోంది శరీరం నిండా.

నా బాధను చూసి మా నాన్నగారు "ఇలా అయితే నువ్వు ఇక్కడ ఉండద్దు ఎక్కడికైనా వెళ్ళిపోరా" అన్నారు ఏడుస్తూ...

"అదేంటండి" అంది అమ్మ ఏడుస్తూ...

"అవునే ఇలా రోజూ వీడిని చూస్తూ బాధ పడటం మన వల్ల కాదు"

"ఒకరు చనిపోతేనే జీవితం అయిపోయింది అనుకోకురా" అన్నారు. అప్పుడే భోజనానికి కూర్చొంటున్నారు నాన్న..

"అమ్మా నాకు వడ్డించు...."అన్నాను

అమ్మ మొహం వెలిగిపోయింది... చాలా రోజుల తర్వాత అలా అన్నందుకు...

"నాన్న, నేను కాశీకి వెళ్తాను" అని అన్నాను.

"మంచిది, ఒకేచోట ఉంటే మనసు అదేపనిగా పిచ్చిగా ఆలోచిస్తుంది వెళ్ళు" అన్నారు నాన్న.

మనసు అసలు ప్రశాంతంగా లేదు. అసలు ఈ చనిపోవడంఏమిటి?? చనిపోతే దూరమవుతారు. అంటే నేను కూడా ఎప్పుడో అప్పుడు చనిపోతాను... చనిపోయిన తర్వాత ఏమవుతాను.

ఇవన్ని ప్రశ్నలే... అబ్దుల్, ప్రశాంత్, శశి... ఏమయ్యారు వీళ్ళు...చనిపోయారు.. కాని...

మనం బాధలో ఉన్నప్పుడు ఎన్నో ప్రశ్నలు తొలుస్తాయి. కాని ఇవన్నీ ఎందుకు. చనిపోయిన వాళ్ళని ఎలాగా తీసుకురాలేను కదా అన్న మరొకప్రశ్న. కాని ఏదో తెలుసుకోవాలన్న తాపత్రయం. కానీ ఇప్పుడు అసలు లక్ష్యం ఏంటి. ఏం చెయ్యాలి. చాలా ఆలోచించాను. ఇన్నాళ్ళు నేను సంపాదించిన జ్ఞానాన్ని వెనక్కి తోడాలనుకున్నాను. గ్లోబలైజేషన్, ఇంటర్నెట్ యుగం వచ్చాక అన్నీ తెలుసుకోవడం చాలా సులువు. వెతకడం మొదలుపెట్టాను. అన్నీ మతాల్లోనూ ఒకటి కామన్‌గా ఉంది అదే నరకం. కాని అది నిజమా?

★ ★ ★

ప్రయాణం మొదలు...

జీవితంలో ప్రయాణించడం ఎంత ముఖ్యమూ అర్థమైంది. ట్రైన్లో ఎన్నో జ్ఞాపకాలు... రైలు ఎంత వేగంగా కదులుతోందో జ్ఞాపకాలు కూడా అంతే వేగంగా కదులుతున్నాయి.

నిజానికి నేను ఇంతలా ఆలోచించాల్సిన పనిలేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరు తమ జీవితంలో ఎవరో ఒకర్ని కోల్పోతున్నారు. కానీ వాళ్ళు ఎవరు కూడా మరణం గురించి ఆలోచించట్లేదు. మరి నేనే ఎందుకు... దేవుడు ప్రతి ఒక్కరికి నుదిటి మీద రాసి ఉంచుతాడంట. తాను ఏం చెయ్యాలో... ఎలా ఉండాలో.. లేకపోతే ఆపిల్ పడగానే న్యూటన్ ఎందుకు అందరిలా ఆలోచించలేదు. మనిషి ఎప్పుడైతే ఆలోచించడం మానేస్తాడో అప్పుడే చనిపోయినట్టు.

ఆలోచన పర్వం ఆగట్లేదు. సైకాలజీలో సీనియర్ ప్రొఫెసర్ రాములుగారు చెప్పిన NDE (మరణాన్ని దగ్గరగా చూడడం) కాన్సెప్ట్ గుర్తుకువస్తోంది. కష్టకాలంలో మెదడు కొంచెం అటు ఇటుగా పనిచేస్తుంది. అయితే చురుకుగాను, లేదా మందమతిలా.

★ ★ ★

రెండో సెమిస్టరు మొదలైన చాలా రోజులకి ఒక ముసలాయన క్లాసులోకి వచ్చాడు. ఆయనకి నడవడానికి ఓపిక ఉందో లేదో కూడా తెలీదు. వయసు కాస్త ఎక్కువే ఉంటుంది. లూజు షర్టు, డొల్లలా ఉండే ప్యాంటు, పాతకాలపు కళ్ళజోడు. తానే వచ్చి ఈ సబ్జెక్టు మీకు నేనే చెప్తాను అన్నాడు. నిజానికి చాలా రోజులుగా ఎవరు రావట్లేదు ఆ పీరియడ్లో. అందరం కబుర్లు చెప్పుకోవడంతోనో లేక సుష్టుగా తిని పడుకోవడంతోనో సరిపోయేది.

ఎందుకంటే అది మధ్యాహ్నం మొదటి అవర్, చివరిదికూడా.. రోజుకు ఉండే ఆరు పీరియడ్‌లో అది చివరిది. కేవలం అటెండెన్స్ కోసం ఉండేవాళ్ళే తప్ప... అది కూడా అక్కర్లేదు అనుకునేవారు వెళ్ళిపోయేవారు.

ఆ రోజు అలాగే జరిగింది. కాకపోతే ఎక్కువ మంది బయటకి వెళ్ళలేదు. కారణం ఆ రోజు కొత్త సినిమాలేవీ లేకపోవడం. క్లాసులో ఉన్న వాళ్ళందరూ ఇవ్వాళ బుక్ అయిపోయామని అనుకున్నారు. కాని ఎవరికి తెలుసు... జరగబోయేది రాంగోపాల్‌వర్మ థ్రిల్లర్ సినిమాను మించినది ఉంటుందని..

"మీరందరు ఫస్ట్ ఇయర్ స్టూడెంట్సా!" అన్నారు.

"అవును" అన్నట్టు అందరం తలూపాం.

"మీరు ఎందుకు ఈ సబ్జెక్టు ఎంచుకున్నారో నాకైతే తెలియదు. కాని ఇదే సబ్జెక్టులో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయి. ఎదుటివారి సంక్లిష్ట మనసులని అర్థం చేసుకొని పరీక్షించడమే కాదు. మీ మనసును సంక్లిష్టం చేసే ప్రశ్నలు ఎన్నో ఉంటాయి. నిజానికి మీరు డబ్బు మీద మోజుతో ఈ కోర్సులో చేరారని అనుకోవడంలేదు.

అంతకు మించి ఏదో తెలుసుకోవాలన్న తాపత్రయమే మిమ్మల్ని ఇక్కడికి ఈ కాలేజిలోకి, క్లాస్‌లోకి, ఈ బెంచిలో కూర్చోబెట్టేలా చేసాయి అని నేననుకుంటున్నాను."

ఆయన చెప్తుంటే ఎవరో మమ్మల్ని హిప్నటైజ్ చేస్తున్నట్టే ఉంది. ఎందుకంటే ఆయన చెప్పేవన్నీ నిజాలు.

మా దాంట్లో చాలా మంది తమ తమ ఇంట్రెస్టుతో చేరారు. అసలు ఈ కోర్సుల్లో ఎటువంటి ఉపయోగంలేదని, ఏ ఎమ్‌సిఏ, ఎంబిఏ చేస్తే మంచి ఉద్యోగం వస్తుందని అన్నారని చాలామంది చెప్తూ ఉంటారు.

"ఎంతమంది కేవలం తాము నమ్ముకున్న దానికే కట్టుబడి ఉంటారు. మనసు నమ్మినదానినే చేస్తూ ఉంటారు. మన భారతదేశంలో చాలామంది తమకు నచ్చని జీవితాన్నే బ్రతుకుతున్నారు. కారణాలు ఏమైనా నా వయసుకి వచ్చాక అలా నాకు నచ్చినట్టు ఉంటే బాగుండేది కదా అనిపిస్తుంది. మీకోటి తెలుసా మన దేశంలో గొప్ప సైకాలజిస్ట్‌లు లేరు. కారణం ఇదే భయం. మనకి బతకడానికి, ఆలోచించడానికి భయం. అందుకే నిజానికి మన దగ్గర సత్తా ఉన్నా దాన్ని ఉపయోగించుకోవట్లే. ఎంతమందికి హన్స్-వెర్నెర్, గోర్డాన్, హెచ్.బొవేరా, విలయనూర్ ఎస్. రామచంద్రన్ వాళ్ళు తెలుసు. అయాన్ రాండ్, జిడ్డు కృష్ణమూర్తి, జార్జ్ బెర్నాడ్‌షా లను ఎంతమంది చదివారు. ఎవరు మొదటి నుంచి గొప్పవాళ్ళేం కాదు... మన ఆలోచనలే, వాటిని ఆచరణలో పెట్టేతీరే మనల్ని గొప్పవాళ్ళని చేస్తూ ఉంటాయి".

ఆయన చెప్తున్నదంతా నిజం అనిపించింది...

పక్కన ఉన్న అనిరుధ్ "మరి ఈయన ఎందుకు కాలేదో" అని చెవిలో గొణికాడు...

"చాలామంది అనుకుంటారు. మరి నేనెందుకు గొప్పవాడిని కాలేదా అని" అన్నారాయన.

ఆయనకేదో మా మాట వినిపించినట్టు... లేదు అసలు ఆ ఆస్కారమే లేదు.

ఎందుకంటే వాడు చెప్పింది నాకు తప్ప ఇంకొకరికి వినిపించే ఛాన్సే లేదు.

ఆయన చెప్పడం ఆపలేదు. మాకు ఆయన చెప్పేది ఏది బోరు అనిపించలేదు...

"చెప్పానుగా పరిస్థితులు ఎప్పుడు మనల్ని వెనక్కి లాగుతాయి అని... నాకు 15 ఏళ్ళు ఉండగా మా నాన్న చనిపోయారు. మా అమ్మ నన్ను ఎంత కష్టపడి పెంచిందో నాకు తెలుసు. నేను సంపాదించే సమయానికి దానిని అనుభవించడానికి ఆమె లేదు. జీవితంలో ఎప్పుడు ఏమవుతుందో మనం చెప్పలేం కదా...పెళ్లి అయిన రెండేళ్ళకి నా భార్య ఒక బిడ్డను చేతిలో పెట్టి మంచం పట్టింది. ఇప్పటికీ అలాగే మంచంపట్టి ఉంది. మనం ముందుకు వెళ్ళాలనుకున్నప్పుడు ఎన్నో పరిస్థితులు వెనక్కి లాగుతాయి. అవునూ!! ఎవరికైనా మంచి సైకాలజికల్ కాన్సెప్ట్ తెలుసా?"...

"నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్" అని అరిచింది త్రిపుర.

"రైట్... నీ పేరు అమ్మ"

"త్రిపుర"

"త్రిపుర నిజంగా యే సైకాలజిస్టో అయినా ఇది ఒక ఇంటరెస్టింగ్ కాన్సెప్ట్. చాలా బాగుంటుంది కూడా"

"నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్ అంటే" అని అడిగాను. నాకు ఇన్నాళ్ళు తెలుసుకోవాలి అనిపించే విషయం ఆయన చెప్పబోతున్నట్టు అర్థమైంది.

"మరణందాక వెళ్ళి వచ్చి.. మళ్ళీ బతకడం అన్నమాట"

అందరం నోళ్ళు వెళ్ళబెట్టి మరీ వింటున్నాం... ఆయన చెప్తూనే ఉన్నాడు. క్లాస్ ఇంకా అరగంటే ఉంది. టైం తెలియలేదు. ఇంకాస్తసేపు ఉంటే బాగుండు అనిపించింది మనసులో....

"దీని మీద చాలా పరిశోధనలే జరుగుతున్నాయ్. ఒక ఆర్గనైజేషన్ కూడా ఉంది. నేను చదివే రోజుల్లో ఇది ఒక పెద్ద టాపిక్. చాలా బుక్స్ కూడా వచ్చాయి దీనిమీద... అసలు చనిపోయిన తరువాత ఏమవుతుంది అన్న కాన్సెప్ట్. లైఫ్ ఆఫ్టర్ లైఫ్ అప్పట్లో పెద్ద సంచలనం. ఇప్పటికి చాలామంది దాని మీద పరిశోధనలు చేస్తున్నారు బుక్స్ రాస్తున్నారు"

"సార్ నేను విన్నాను... చదివాను వీటి గురించి.. కానీ, ఇవన్నీ నిజమా" అంది త్రిపుర.

"పాత సినిమాలలో పరకాయ ప్రవేశం అని చూస్తాం. చాలా కథలలో కూడా విని ఉంటాం. మన నుంచి మన ఆత్మని అంటే స్పిరిట్‌ని బయటకి తీసుకురావడమే. అమెరికాలో దీని మీద కోర్సులు కూడా ఉన్నాయి. చదువుతున్న స్టూడెంట్స్ చాలామంది వున్నారు కూడా''

ఆయన చెప్తున్నదానికి బ్రేకేస్తూ అల్లారం మోగింది. అది మాకు ఎవ్వరికీ నచ్చలేదు. అందరం అలా చూస్తూ ఉండిపోయాం. మామూలుగా అయితే ఈ పాటికి ఇంటికి వెళ్ళాలనే తొందరలో కదిలేవాళ్ళం. కాని ఇప్పుడు అలా జరగలేదు..

"సరే ఉంటాను. మీకు క్లాసులకి వచ్చి ఎవరు చెప్పరు. యూనివర్సిటీలలో మనకి మనంగా నేర్చుకోవాలి. బట్టీలు పట్టండి అని చెప్పడం ఉండదు. ఏమైనా డౌట్స్ ఉంటే నా చాంబర్‌కి రండి... జీవితంలో ఏదైనా ఒక లక్ష్యం పెట్టుకోండి. ఏదైనా తెలుసుకోవాలి, సాధించాలి..." అని నెమ్మదిగా వెళ్ళిపోయారు.

ఆయన వెళ్ళినా మేము కదలలేదు. అందరి మొహాలలో ఏదో తెలియని ఎక్స్‌ప్రెషన్. అందరం ఏదో సాధించగలం అన్న భావన...

కాని అలాంటి స్పీచ్‌ల ప్రభావం ఉండేది ఒక గంటో లేక ఒక రోజు మాత్రమే. ఆ తర్వాత... అంతా మామూలే.

కొన్ని రోజుల తరువాత

అందరం కాంటీన్లో సమావేశం అయ్యాం...

"హే మీకోటి తెల్సా మనకి వచ్చిన ప్రొఫెసర్... అదే చాలా బాగా మాట్లాడారు కదా. యూనివర్సిటీ నుంచి వెళ్ళిపోయారు అంట..."

"అవునా... మనం ఇంటికి వెళ్దామా..." అన్నాను ఆయన మీద ఉన్న ఒక్కరోజు గౌరవంతో....

"ఆయన లేరంట... ఇంకో యూనివర్సిటీలో చేరారని తెల్సింది... కాని ఎక్కడో తెలీదు"

"అవును ఆయన భార్య నడవలేదని విన్నాను" అంది గాయత్రీ పాలు తాగుతూ.

ఈ అమ్మాయిలు ఎందుకో ఎక్కువ టీ, కాఫీలు త్రాగరు. ఒక అబ్బాయి ముందు అసలే త్రాగరు. ఫోజు కొడతారు.

"అవును!! ఆయన భార్య కాళ్ళు చచ్చుపడిపోయాయంట... అప్పటి నుంచి ఆయన ఆమెని ఒక చంటి పాపలా చుసుకుంటున్నారని తెలిసింది" అన్నాడు అనిరుధ్.

"నిజంగా గ్రేట్ కదా!!! నిజానికి మనకి నాగార్జునలు, మహేశ్ బాబులు అక్కర్లేదు. అలా కంటికి రెప్పలా చూసుకునేవాడు ఉంటే చాలు" అంది త్రిపుర కొంచెం బాధ నిండిన గొంతుతో...

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్. 'ఎంత ప్రేమ ఉంటే అలా చూస్కోగల్గుతారు భార్యని, శశిని కూడా అంతే ప్రేమతో చూసుకోవాలి.' అనుకున్నాను మనసులో.

★ ★ ★

ట్రైన్ ఆగినట్టయ్యింది. కన్నీళ్లు ఆగట్లేదు. అప్పటికే చీకటిపడింది. ఆ చీకట్లో నా కన్నీళ్లు తెలియట్లేదు. శశి.. ఆమె ఒక అద్భుతం. ఆమెతో జీవితాంతం గడుపుదామనుకున్నా. కాని... అసంపూర్ణజీవితం. కళ్ళు మూతలు పడుతున్నాయి. జ్ఞాపకాలకు, కన్నీళ్ళకు తెరదించుతూ నిద్రపట్టింది...

ట్రైన్ నెమ్మదించింది. అందరూ కంగారు కంగారుగా బ్యాగ్లు తియ్యడం మొదలుపెట్టారు. ట్రైన్ కిటికీలోంచి వారణాసి అని కనిపిస్తోంది.

కాశి... బెనారస్... వారణాసి... హిందువుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ట్రైన్ దిగిన వెంటనే ఎక్కడ చూసిన కాషాయి వస్త్రాలే కనిపిస్తున్నాయి. చావుకి చాలా దగ్గర సంబంధం ఉన్న ఊరు. చాలా మంది ఇక్కడికి బతికి చావడానికి వస్తారని విన్నాను. ఉండటానికి నాన్న గారు ఇచ్చిన అడ్రెస్కే వెళ్దామని నిశ్చయించుకున్నాను. అక్కడి నుంచి ఆంధ్రా ఆశ్రమానికి చేరుకోవాలి. ఎటుచూసిన రిక్షాలే ఎక్కువ కనపడుతున్నాయి. ఇంతలో ఒక ముసలాయన "ఎక్కడికి వెళ్ళాలి" అని హిందీలో అడిగాడు...

"ఆంధ్రా ఆశ్రమం" అని చెప్పాను.

"50 రూపాయలు బాబు" అన్నాడు.

అంత ముసలాయనతో బేరం ఆడాలనిపించలేదు. మారు మాట్లాడకుండా రిక్షా ఎక్కాను. వారణాసి వీధుల వెంట నెమ్మదిగా కదులుతున్నాయి ఆ ముసలికాళ్ళు. అతని కంటే వయసులో పెద్దగ ఉన్నాయి అక్కడి కట్టడాలు.

ఈ వయసులో కూడా ఎంతటి తాపత్రయం బ్రతకడం కోసం.. మనిషి బతకడంకోసం చాలా తాపత్రయ పడతాడు. తన కోసం, తన పిల్లలకోసం, వాళ్ళ భవిష్యత్తుకోసం... ప్రతి మనిషిలోను అదే ఆశ, అదే తాపత్రయం.

అసలు ఇవేమీ లేకపోతే ఆ సన్యాసుల్లా ఎన్నో నీతి సూత్రాలు చెప్పవచ్చు.

అతని రిక్షా కవర్ పై భాగంలో ఒక ముసలావిడది చిన్న పాస్పోర్టు సైజు ఫోటో కనబడింది. అది అతని భార్యదై ఉండవచ్చు. సుమారు ఆరు ఏడు కిలోమీటర్లు దాటిన తర్వాత ఆగింది రిక్షా. ఆంధ్రా ఆశ్రమం చేరుకున్నాం. వందరూపాయిలు చేతిలోపెట్టాను. ఎన్నో వేలు నిర్లక్ష్యంగా ఖర్చు చేసినదానికన్నా ఇందులో గొప్ప సంతృప్తి ఉంది.

శ్రీతారకరామ ఆంధ్రాశ్రమం... మూడంతస్తుల బిల్డింగ్.. అక్కడ స్థాపించింది 1959 అని రాసున్నా చాలా కొత్తగా ఉంది. రీమోడలింగ్ చేసినట్టున్నారు.

నాన్న ఇచ్చిన విజిటింగ్ కార్డు అక్కడున్న రిసెప్షన్‌లో చూపించాను.

"పాండేగారిని కలవాలా" అన్నాడు ఆ రిసెప్షనిస్ట్.

"అవును" అన్నాను.

"పదండి" అని మేనేజర్ అని రాసి వున్న రూంలోకి తీసుకువెళ్ళాడు.

"నాకు మీ నాన్నగారు బాగా తెలుసు. నాకు తెలుసు మీరు ఇక్కడకి ప్రశాంతత కోసం వచ్చారని.."

ఆయనకి తెలిసింది అంతే అనుకుని లేని నవ్వుని తెచ్చుకుని ప్రదర్శించాను.

"మీరు ఇక్కడ ఎన్ని రోజులైనా ఉండవచ్చు" అని బెల్ నొక్కాడతను.

తెల్లదోతి, పైజామా వేసుకున్న ఒకతను లోపలకి వచ్చాడు.

"జోషి ఈయన అభిమన్యు. మనకు బాగా కావాల్సిన వ్యక్తి. బాగా చూసుకో" అన్నాడు.

రెండు రోజుల ప్రయాణానికి వళ్ళంతా పులిసిపోయింది. కునుకు తీద్దామని మంచం మీద వాలాను. నాన్న సిఫార్సు వల్ల కొంచెం మంచి రూము దొరికింది. పొగలా ఆవరిస్తోంది నిద్రమత్తు. దానిని పాడుచేస్తూ మోగింది ఫోను...

"నేను చేరుకున్నాను" అన్నాను ఫోన్ లిఫ్ట్ చేసిన వెంటనే...

"మంచిది... చెప్పింది గుర్తుందిగా" కొంచెం గంభీరంగా అంది త్రిపుర.

"అవసరం నాది. నేనెందుకు మర్చిపోతాను" అన్నాను.

"ఏమో శశి ప్రేమలో పడి..."

ఆపేసింది. నా నోటి నుంచి మాటరావడంలేదు. తన దగ్గర నుంచి కూడా మాటలేదు. తను గుర్తుచేసిన తప్పుకి బాధపడుతూ ఉంటుంది.

నిశ్శబ్దానికి తెర దించుతూ "అభి అభి ఉన్నావా" అంది త్రిపుర.

"బతికే ఉన్నాను" అన్నాను బతుకు మీద ఉన్న నిరాసక్తతతో...

"చెప్పింది కొంచెం జాగ్రత్తగా విను"

"సరే చెప్పు" అన్నాను. .

అది చాలా ముఖ్యమైన విషయం అని తెలిసినా నాకు అంత ఆసక్తి కలగలేదు. ఆసక్తి కలగకపోవడం అటు ఉంచితే.. ఇంత తాపత్రయం ఎందుకని అసలు... జీవితాంతం పంచుకునే ప్రేమ ఎటూ పోయింది. ఇన్నీ మనసులో కదులుతున్నాయి. రెండు రోజుల ప్రయాణం వల్ల వళ్ళు తెలియకుండా నిద్రపట్టేసింది.

తలుపుని ఎవరో గట్టిగా బాదుతున్న శబ్దం నన్ను నిద్రలేపింది. టైం అప్పటికి ఎనిమిదయ్యింది.

"సార్ సార్" అని జోషి గట్టిగా పిలుస్తున్నాడు.

అదే నిద్రమత్తులో తలుపు తీశాను.

"నిన్న రాత్రి కూడా వచ్చాను సార్... మీరు మత్తుగా నిద్రపోతున్నారు"

"అవునా, ప్రయాణంచేసి అలసిపోయాను కదా నిద్ర బాగా పట్టేసింది" అన్నాను కళ్ళు నులుముకుంటూ.

"సార్ మీరు ఫ్రెష్ అయ్యి వస్తే అలా బయటకి వెళ్దాం"

"సరే నిన్ను ఒకటి అడగాలి చెప్తావా"

"అడగండి సార్. ఇక్కడ ఉన్నంత కాలం మీ బాధ్యత నాది''

"నేను బెనారస్ యూనివర్సిటీకి వెళ్ళాలి. నాకు కొంచెం అడ్రెస్ చెప్తావా?"

"అడ్రెస్ చెప్పడం ఎందుకుసార్... నేనూ వస్తాను మీతో''

"నీకు అంత శ్రమ ఎందుకులే జోషి"

"పర్లేదు సార్. నాకు మిమ్మల్ని చూసుకోవడమే పని''

"సరే నేను స్నానం చేసి వస్తాను వెళ్దాం" అని స్నానానికి బయలుదేరాను.

★ ★ ★

ఇరుకు సందుల్లోంచి తీసుకుపోతున్నాడు జోషి. కాశి సందులు ఇరుకుగా ఉంటాయని తెలుసు కాని ఒకళ్ళే పట్టేంత ఇరుకుగా ఉంటాయని తెలియదు.

"ఎక్కడికి వెళ్తున్నాం జోషి''

"బెనారస్‌కే సర్ జి... కాకపోతే కాస్త కడుపు నింపుకుని వెళ్దాం. మీరు రాత్రి కూడా ఏమి తినకుండా పడుకున్నారు''

ఒక చిన్న పూరిపాకలోకి తీసుకువెళ్ళాడు. జోషిని నవ్వుతూ పలకరించాడు అక్కడున్న వ్యక్తి... జోషిని చూస్తూనే లోపలికి వెళ్ళి పూరిలలా పొంగి ఉన్న వాటిని తెచ్చాడు.

"ఇది ఇక్కడ ఫేమస్ సర్ జి. తినండి. వీటినే కచోరీ అంటారు" అన్నాడు.

నాకు ఒక ప్లేటే ఎక్కువ అనిపించింది. తను మాత్రం రెండు ప్లేట్లు లాగించాడు...

కానీ ఆ ఒక్క ప్లేట్తో మళ్ళీ మధ్యాహ్నం భోజనం చెయ్యక్కర్లేదనిపించింది.

"సర్ జి మీకు షేర్ ఆటో ఓకే కదా''

"ఆ అటు వైపు ఏది వెళ్తే అది". ఏ దారి అయితేనేం ఎంచుకున్న లక్ష్యం చేరుకోవడం ముఖ్యం అనుకున్నా.

అరగంట తర్వాత ఆగింది ఆటో. ఎక్కడ చూసిన స్టూడెంట్స్‌తో కళకళలాడుతోంది ఆ ప్రదేశం.

బెనారస్ హిందూయూనివర్సిటీ. మంచిపేరున్న యూనివర్సిటీ అని విన్నాను. యూనివర్సిటీ పెద్ద గేటుతో పాటు మదన్ మోహన్ మాలవ్య విగ్రహం స్వాగతం చెప్తోంది.

"సర్ జి ఎక్కడికి పోవాలి ఇప్పుదు"

ఎక్కడికి వెళ్ళాలో చెప్పాను.. ద్వారం దగ్గర నిలబడ్డాం మేం... పెద్ద కోటలా ఉంది యూనివర్సిటీ...

సైకాలజీ డిపార్టుమెంటు ఎక్కడో ఎవరో విద్యార్థిని కనుక్కుని వచ్చి "పదండి వెళ్దాం" అన్నాడు.

ప్రతి బిల్డింగ్ మీద గుడికి ఉన్నట్టు గోపురాలు ఉన్నాయి. రెండు కిలోమీటర్లు దాటిన తర్వాత చివరికి సైకాలజీ బ్లాక్‌కి చేరుకున్నాం..

"సర్ జి ఇంతకి మీరు ఇక్కడికి ఎందుకు వచ్చినట్టు"

"ఒక వ్యక్తిని కలవడానికి వచ్చాను"

"ఎవరు సర్ జి"

"ప్రొఫెసర్ శ్రీరాములుగారు ఎక్కడ ఉంటారో తెల్సా" అటుగా వెళ్తున్న స్టూడెంట్‌ని అడిగాను.

"రండి నేను చూపెడతాను" అని మమ్మల్ని తీసుకువెళ్ళాడు.

కాళ్ళు అరిగిపోతున్నాయి. అప్పటికే రెండు అంతస్తులు దాటాం.

"ఇదిగో ఆ చివరి నుంచి మూడోది... సందేహం అక్కర్లేదు... అక్కడ ఆయన పేరుతో బోర్డ్ ఉంటుంది..." అన్నాడు.

గది లోపల అడుగుపెట్టడానికి భయంగా ఉంది. ఆయనతో సరిగ్గా పరిచయం లేకపోవడమే దానికి కారణం.

"మే ఐ కమిన్ సార్" అన్నాను నోటిలోంచి మాట తెచ్చుకుని.

"య కమిన్" అంది ఆయన గొంతు... లోపలకి గురువు మీద ఉండే భక్తితోనే అడుగుపెట్టాను.

"కూర్చోండి"

"పర్లేదు సార్" అన్నాను...

"కూర్చోండి... ఇప్పుడు కూర్చోకపోతే చాలాసేపు నిల్చోవాలేమో..."

ఆయనకు నా మొహంలో ఒక పెద్ద ప్రశ్న కనబడి ఉంటుంది. అంటే నేను చెప్పబోయేది వినడానికి సిద్ధం అయ్యాడని తెలుస్తోంది.

చాలా నిశ్శబ్దంగా ఉంది ఆయన రూము. టేబుల్ మీద పుస్తకాల దొంతరపెట్టి ఉంది. ఇంత వయసులోను ఆయన చదవడం ఆపలేదని తెలుస్తోంది. ఇద్దరు మనసులు చదివేవాళ్ళు ఎదురు ఎదురుగా కూర్చుంటే ఇలా బయట పరిస్థితిని బట్టి లోపలి మనఃస్థితిని చెప్పగలరేమో అనిపించింది.

"చెప్పుబాబు" అని ఆయన అన్న మాట నా తడుముకుంటున్న చూపులకి ఫుల్‌స్టాప్ పెట్టింది.

"నేను మీ స్టూడెంట్‌ని సార్... ఆంధ్రాయూనివర్సిటీలో...."

"ఓహ్ అలాగా... గుర్తులేదు. ఎన్ని బ్యాచులని గుర్తు పెట్టుకోగలం. సరే కాని ఇంతకి ఎందుకు వచ్చినట్టు"

"సార్, నియర్ డెత్ ఎక్స్‌పీరియెన్స్ కాన్సెప్ట్ గురించి మీరు మాకు ఒకసారి చెప్పారు గుర్తుందా"

"చెప్పే ఉంటాను... అయితే"

"నాకు కొన్ని సమాధానాలు కావాలి..."

"సరే రేపు ఇంటికిరా... తెలుగువాడివి... అందులోను నా స్టూడెంటువి... తెలుగు భోజనం చేస్తూ మాట్లాడుదాం" అని ఆయన విజిటింగ్ కార్డు చేతిలో పెట్టారు...

బయటకివచ్చిన తర్వాత ఎన్నో ప్రశ్నలు మదిని తొలుస్తున్నాయి.

"ఇంతకి మీరు ఆయన దగ్గరికి ఎందుకు వచ్చినట్టు సర్ జి"

"రేపు ఈ అడ్రెస్‌కు వెళ్దాం. నీకే తెలుస్తాయి అన్ని" అని విజిటింగ్ కార్డు చేతిలో పెట్టాను. బయటకు వచ్చాక ఎన్నో ప్రశ్నలు. పాలో కోయిలో రాసిన అల్కమిస్టు గుర్తొచ్చింది. అందులో గొర్రెల కాపరి అయిన కుర్రాడు తన జీవితగమ్యం ఏంటో తెలుసుకుంటాడు. దానికై ఎన్నో కష్టాలు పడతాడు..

జీవితగమ్యం... అవును... ప్రతి మనిషికి ఒక జీవిత గమ్యం ఉంటుంది.. నిర్దేశించబడుతుంది...

"చాలా రోజులైంది తెలుగు భోజనం తిని..." అన్నాను కిళ్లీ వేసుకుంటున్న ప్రొఫెసర్ శ్రీరాములుగారితో.

మేం ముగ్గురం ఆయన ఇంటి ముందు ఉన్న చెట్టునీడలో కూర్చొన్నాం..

చాలా ప్రశాంత వాతావరణంలో ఉంది ఆయన ఇల్లు... గణేష్ పద్ కాలనీ... ఆశ్రమం నుంచి మాకు అరగంట పైన పట్టింది.

"హుఁమ్.. మగాడి వంట, అందులోను బాగా చాదస్తం గల నా లాంటి ముసలివాడి వంట బాగుంటుంది" వాళ్ళ ఆవిడకి కాళ్ళు చచ్చుపడిపోయినదని త్రిపుర చెప్పింది గుర్తొచ్చింది.

"సరే సార్ మేడంగారు ఎలా ఉన్నారు" అన్నాను.

"నేను ఉన్నంత కాలం బాగుంటుంది. మీరు వచ్చే ముందే భోజనం పెట్టి పడుకోపెట్టాను"

"ఇన్ని సంవత్సరాలు భార్యను చిన్న పాపలా చూసుకునే వ్యక్తిత్వానికి జోహార్లు సార్"

"హుఁమ్.. అది నా బాధ్యత. తాళి కట్టే ముందు మనసా వాచా కర్మణా జీవితాంతం ఆమెకు తోడుగా ఉంటానని ప్రమాణం చేసింది అందుకే". ఆయన చెప్తుంటే కన్నీళ్లు ఆగట్లేదు. మనసు ఘోషిస్తోంది.

"ఎవరు ఆమె" అన్నారు ఆయన నా కన్నీళ్ళు చూసి....

"శశి శశి... చనిపోయింది... ఈ ప్రపంచంలో నన్ను నిర్భాగ్యుడిగా వదిలి వెళ్ళిపోయింది." అన్నాను కళ్ళు తుడుచుకుంటూ....

"నీ కన్నీళ్ళు చెప్తున్నాయి... నువ్వు ఆమెని ఎంతగా ప్రేమించావో"

"ఒక ప్రశ్న మనస్సుని తొలుస్తోంది... చనిపోతున్నారు... చనిపోయిన తర్వాత ఏంటి అసలు... ఒక్కో మతం ఒక్కోటి చెప్తుంది. కాని ప్రతి మతంలోనూ కామన్ పాయింట్... నరకం... స్వర్గం.. కాని సైన్సు ఏం చెప్తోంది"

"ఇది నీకే కాదు. చాలా మందిని వేధించే ప్రశ్న. దీని మీద ఇప్పటికి రీసెర్చులు జరుగుతున్నాయి..."

"అంటే చనిపోయిన తర్వాత ఇంకో జీవితం ఉందంటారా"

"నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్, అవుట్ ఆఫ్ బాడీ ఎక్స్‌పీరియన్స్, ఆస్ట్రల్ ప్రొజెక్షన్స్ ఇవన్నీ కూడా వీటికి సంబంధించినవే. చాలామంది చాలా రకాలుగా తమ అనుభవాలను రిసెర్చ్ ఫౌండేషన్‌లతో పంచుకుంటున్నారు..."

"అసలు ఈ నియర్ డెత్ ఎక్స్‌పీరియెన్సెస్, ఆస్ట్రల్ ప్రొజెక్షన్స్ అంటే ఏంటి?"

"చనిపోయిన తర్వాత మళ్ళీ బతకడమే నియర్ డెత్ ఎక్స్‌పీరియన్స్. చాలా మంది చనిపోయిన రెండు మూడు గంటలకి లేచి వచ్చినవాళ్ళు ఉన్నారు. అలా లేచి వచ్చిన వాళ్ళు ఒక్కొక్కళ్ళు ఒక్కో విధంగా చెప్తూ ఉంటారు. యు కెన్ అబ్జర్వ్ ద వీడియోస్ ఫ్రమ్ వెబ్‌సైట్స్. ఒకళ్ళు ఒక కొత్త లోకానికి వెళ్లామని చెప్తారు. ఇంకొంత మంది తాము భయంకరమైన వ్యక్తులని చూసామంటారు..."

"ఇదంతా నిజమంటారా"

"నిజానికి నమ్మకానికి మధ్య సైన్సు ఎప్పుడు సంఘర్షిస్తూ ఉంటుంది. నమ్మకాన్ని మూఢనమ్మకం అంటుంది. నిజాన్ని ఇప్పుడిప్పుడే నమ్మలేం అంటుంది. వీటి కథ కూడా అలాంటిదే. అంతెందుకు కాశీలోనే చాలామంది ఉన్నారంటారు యోగంతో ఆత్మని శరీరాల నుండి వేరు చేసుకునేవారు"

"అవును అది నిజం. సాంఖ్యయోగం అంటారు దాన్ని" అన్నాడు జోషి... ఇదంతా అతనికి ఆసక్తిగా అనిపించింది అనుకుంటా.

"అవును... అవే కాదు... హిమాలయాల్లో చాలామంది శ్వాసను దిగ్బంధనం చేసుకుని వందల ఏళ్ళుగా బతుకుతున్నవాళ్ళు ఉన్నారంట. కొన్ని విచిత్రంగానే ఉంటాయ్"

"ఒక సైకాలజీ ప్రొఫెస్సర్ అయ్యి ఉండి ఇవన్నీ నమ్ముతారా??"

"నమ్మకం అటు ఉంచితే కొన్ని నిజంగా అనుభవంలోకి వచ్చినా నిజ నిర్ధారణ ఉండదు. దేవుడికి మొక్కుతారు అందరూ... కాని దేవుడు నిజంగా కనిపించాడా అంటే లేదే... ఇది కూడా అలాంటిదే"

"ఇప్పుడు నిజంగా నా శరీరంనుంచి ఆత్మను వేరు చేయగలమా"

"చెయ్యచ్చు.. ఆస్ట్రల్ ప్రొజెక్షన్ అని చెప్పాగ అది ఇదే. కాని ఎక్కువ సేపు అంటే...."

"ఎలా సాధ్యం అసలు"

"సాధ్యానికి ఏముంది??"

ఒక్కోసారి కలలో పెద్ద కొండమీద నుంచి పడిపోతున్నాం అన్నప్పుడు ఇక్కడ కూడా అదే ఫీలింగుకు లోనై మన శరీరం జలదరిస్తుంది. అది నిజం కాదు కాని దాన్ని అనుభవించావ్. ఆస్ట్రల్ ప్రొజెక్షన్ అనేది విచిత్రమైనదేం కాదు. పూర్తిగా నిద్రలోకి జారుకోవడమే... వళ్ళు తెలియనంతగా..."

"అంటే ఇప్పుడు నేను నా శరీరాన్ని వదిలి ఇంకో కొత్త లోకాన్ని చూడగల్గుతానా. క్వాంటమ్ టెలిపోర్టేషన్ అంటారు ఇదేనా?"

"ఇంకో కొత్త లోకాలను చూడవచ్చో లేదో... అసలు అది నిజమో అబద్ధమో... కాని రీసెంట్‌గా ఇద్దరు తాము టెలిపోర్టేషన్ ద్వారా కొత్త లోకాలను చూసామని చెప్పారు. వాళ్లది నిజమో అబద్ధమో తెలియదు. కాని శాస్త్రీయంగా ఆధారంలేదు. కాని క్వాంటమ్ టెలిపోర్టేషన్ మాత్రం సాధ్యం అని ఇప్పటికి చాలామంది శాస్త్రవేత్తలు నమ్ముతారు. పద్ధతి ఏదైనా లక్ష్యం ఒకటే"

"నేను NDE ని నామీద ప్రయోగించాలంటే"

"చెప్పానుగా సాఖ్యయోగం ఆస్ట్రల్ ప్రొజెక్షన్... ఇవి కాక ఇంకోదారి కూడా ఉంది..."

మా సంభాషణ ఎక్కడా ఆగలేదు. నాతోపాటు వచ్చిన జోషి అయితే కాళ్ళని కుర్చీలోకి తీసుకుని బాసంమఠం వేసుకుని మరీ వింటున్నాడు.

"కేటామిన్ అనే డ్రగ్ వల్ల NDE ఎక్స్‌పీరియన్స్‌ని కృత్రిమంగా కలగచేసుకోవచ్చు అని విన్నాను."

"అయితే అది మనకు దొరుకుతుంది కదా"

"చాలా కష్టంగా దొరుకుతుంది. కాని అది చాల ప్రమాదకరమైన డ్రగ్. పేరుకి మనం మెడికల్ అని చెప్తున్నా అది కొకైన్ కంటే ప్రమాదమైంది..."

"ప్రమాదం... ప్రతిచోట ఉంది ప్రమాదం.... అలాంటప్పుడు ప్రమాదాలకు, భయాలకు భయపడుతూ బతకలేం"

"మరణం నిన్ను చాలా కఠినుడిని చేసింది అభి... ఇక నేను ఎన్ని చెప్పిన ప్రయోజనం లేదు"

"ఒక గొప్ప సైకాలజీ ప్రొఫెసర్‌గా అది మీకు అర్థమైంది అనుకుంటాను. నాకు గురువుగా మీరు చెయ్యాల్సిన సాయం కేటామిన్ ఇవ్వడం"

"కాని చివరిసారిగా ఆలోచించు"

"జీవిత గమ్యం.... ఏదో ఒక శక్తి మన జీవితగమ్యాన్ని నిర్దేశిస్తుంది... అదే మన లక్ష్యంవైపు నడిపిస్తుంది. దారిని చూపిస్తుంది. దారిలో ఎన్నో కష్టాలను కలుగజేస్తుంది. ప్రస్తుతం నా జీవితగమ్యం మరణం తరవాత జీవితం ఏంటి??" అన్నాను గట్టిగా.

"నువ్వు ఒక బలమైన నిశ్చయానికి వచ్చావ్.. సరే... గాడ్ బ్లెస్ యూ.. కేటామిన్‌ని నేను తెప్పిస్తాను"

"సరే గురూజి నేను మళ్ళీ కలుస్తాను" అని లేచాను.

జోషి మాత్రం కదలలేదు... "అయ్యింది వెళ్దామా" అన్నాను భుజంమీద చెయ్యివేసి...

తను మేం చెప్పినదాంట్లో లీనమైపోయి వున్నాడు.

ఇద్దరం అక్కడి నుంచి కదిలాం...

"సర్ జి మీరు ఏం చదివారు"

"సైకాలజి ఒక సంవత్సరం అయ్యింది. ఇంకో సంవత్సరం పూర్తి చెయ్యాలి" అన్నాను.

"ఇప్పుడు మీరు ఏం చేద్దామనుకుంటున్నారు. స్వయంగా మరణిద్దాం అనుకుంటున్నారా?"

"అలా అని కాదు. ఇదొరకమైన ప్రయోగంలాంటిది."

"కాని... ఇవన్ని నిజం అంటారా?"

"ఏమో!"

"నేను ఈ సాంఖ్యయోగం గురించి విన్నాను సర్ జి"

"ఎక్కడ??? నిజంగా ఉందా??"

"మా తాతయ్యకు తెలుసు ఇవన్ని" అన్నాడు.

"ఆయన ఎక్కడ ఉంటాడు"

"కాశిలోనే"

"కలుద్దామా"

"తప్పకుండా సర్ జి. కాని ఈ రోజు కాదు. ఒక రెండు రోజులు ఆగాక వెళ్దాం.. మీరు రెస్ట్ తీసుకోండి. అలాగే కాశీలో తిరగాల్సిన ప్రదేశాలు ఉన్నాయి" అన్నాడు ఆటోదిగుతూ.

"సరే" అన్నాను.

★ ★ ★

"నువ్వు దీని కోసం అని ఆయనని కలుస్తాను అని నాకు చెప్పలేదు. ఇది చాలా ప్రమాదకరం.... దీన్ని నువ్వు చెయ్యకూడదు" ఫోన్లోంచి అరుస్తోంది త్రిపుర చెప్పినదంతా విన్నాక.

"అవును అయితే..." అన్నాను గట్టిగా...

"ఎవరిమాట వినవు కదా..."

"తెలుసుకదా"

"సరే నేను నీతో ఉంటా అప్పుడు" అంది.

"సరే చూద్దాం" అని ఫోన్ పెట్టేసాను.

త్రిపుర చాలా మొండి అమ్మాయి... తెలివైన అమ్మాయి కూడా... ఎదుటివారి మనసులని ఇట్టే చదివేయగలదు. ఎన్నో ప్రశ్నలు త్రిపుర ఫోన్ పెట్టాక...

ప్రతిసారి వేధించే ప్రశ్నలే... ఎందుకు ఇదంతా అని... శశి ఎలాగా తిరిగిరాదు.

అలాంటప్పుడు ఇదంతా ఎందుకు చెయ్యడం... ఒకే జీవితం...ఒకటే గమ్యం.

★ ★ ★

"సర్ జి, సర్ జి" తలుపుని గట్టిగా కొడుతున్నాడు జోషి...

బద్ధకంగా వెళ్లి తలుపుతీశాను.

"సర్ జి గంగాహారతికి వెళ్దామా?" అన్నాడు చాలా ఉత్సాహంగా.

"సరే అని చెప్పి ఇద్దరం దశాస్వమేధ్ ఘాట్‌కి చేరుకున్నాం. సూర్యుడు మబ్బుల వెనుక నుంచి కిందకి దిగుతూ ఉన్నాడు. అప్పటికే జనంతో కిక్కిరిసి ఉంది ఆ ప్రదేశం.

సమయం 6.45 అవుతోంది. కొంతమంది యువ పూజారులు నది ఒడ్డున ఉన్న పూజా సామగ్రిని సర్దుకుంటున్నారు. కొంతసేపటికి గంగా హారతి మొదలైంది. అంతమంది ఒకేసారి పాడటం మొదలుపెట్టారు. అది హారతిపాట... ఏదో తెలియని తన్మయత్వం ఉన్నది అందులో... హారతి అయ్యాక ఇద్దరం కరివేరు సత్రంలో భోజనం ముగించుకుని ఆంధ్రాశ్రమంకి చేరుకున్నాం.

జోషి తాతని కలవాలన్న ఉత్సుకత నిద్ర పోనివట్లేదు. కాని ఇంకా రెండు రోజుల టైం ఉంది. అసలు ఆ రెండు రోజులు గడువు ఎందుకని. ఇప్పుడే తీసుకువెళ్ళవచ్చుగా... కానీ కాశీలో సమయం చాల త్వరగా గడుస్తోంది. అదే పనిగా బయట తిరగడంతో సమయం తెలియటం లేదు. పొద్దున్న విశ్వనాథుడి దర్శనం చేసుకోవాలని మనసులో అనుకున్నాను.

★ ★ ★

జోషి పుణ్యమా అని అక్కడ ఉన్న దేవుళ్ళని అతి దగ్గరగా చూసే భాగ్యం కలిగింది. నా పిచ్చి కాకపోతే దేవుడు ఎక్కడ నుంచి చూసినా దేవుడే...

"సర్ జి ఘాట్లు చూద్దామా" అన్నాడు.

"సరే" అన్నాను అయిష్టంగానే... ఎందుకో అంతమంది జనాల మధ్య ప్రశాంతత కష్టమనిపించింది.

"సర్ జి, దీన్ని నారదా ఘాట్ అంటారు. ఇక్కడ మొగుడుపెళ్ళాలు స్నానం చేస్తే... ఎప్పుడూ కొట్టుకోకుండా ఉంటారని ఓ నమ్మకం. దీని ప్రక్కనే రాజా ఘాట్.... అలా నడుస్తూ ఒక్కొక్క ఘాట్ గురించి చెప్తూ ఉన్నాడు జోషి. చాలా దూరం నడిచాం.

"ఇంక నడవలేను జోషి" అని ఒక చెట్టుకింద కూలబడ్డాను.

"అసలు చనిపోయిన తరువాత మనిషి ఏమవుతాడు" అన్న శబ్దం చెవికి తట్టింది అది తెలుగులో.

"ఆత్మకు మరణం లేదు" అని మైకులో అరుస్తోంది ఒక గొంతు..

బ్రహ్మశ్రీ పురాణపండగారిచే ఒక రోజు పురాణం ప్రవచనం చెప్పబడుతున్నది అని రాసి ఉంది.

నువ్వు ఒక పని సంకల్పించినపుడు, ఆ పనిని నువ్వు మాత్రమే పూర్తి చెయ్యాల్సినప్పుడు ప్రపంచం మొత్తం మనకి సాయపడుతుంది అనిపించింది.

కాని అలా నిరాధారణమైన మాటలు వినాలా అనిపించింది. గరుడపురాణం గురించి పైపైన విన్నాను. ఇప్పుడు ఆయన పూర్తిగా చెప్తున్నాడు. చెప్తున్నంత సేపు ఒకింత భయం, ఉత్సుకత అన్నీ ఒకేసారి మీద పడ్డాయి.

అర్ధరాత్రి 12 దాటుతోంది. ఆయన ప్రసంగం ఆపలేదు. మధ్యలో ఒక గంట మాత్రమే బ్రేక్ తీసుకున్నాడాయన.

ఎక్కడి జనాలు అక్కడే ఉన్నారు. నరకం గురించి, అందులోని 16 నగరాల గురించి ఏకధాటిగా వర్ణించారు. ఎందుకో అదేదో కొత్త విషయంలా అనిపించింది. నిజంగా మనిషి చనిపోయిన తర్వాత ఇవన్నీ అనుభవించాలా అనిపించింది.

కాసేపటికి ముగించారాయన. జోషి కూడా నాతో పాటు అలా కూర్చొనే ఉన్నాడు. ఇద్దరం నడకదారినే ఆశ్రమానికి చేరుకున్నాం.

దారిలో వెల్తున్నంతసేపు ఏవేవో ఆలోచనలు... నరకం, స్వర్గం... ప్రతి మతంలోను వీటిని చెప్పారని బాగా విన్నాను. ఏ మతమైన చిన్న తప్పుచేసినా శిక్ష తప్పదు అని చెప్తోంది. కాని ఇవన్నీ నిజమా.???

★ ★ ★

కళ్ళు నెమ్మదిగా మూసుకుంటున్నాయి. అలసటకి అనుకుంటా నిద్ర ముంచుకువచ్చింది.

శశి నవ్వుతూ మాట్లాడుతోంది... ఆమె చూపు... ఆమె నవ్వు.. ఆమె మాట్లాడుతోంది. మాట్లాడుతూనే ఉంది. బస్సు చాలా వేగంగా కదులుతోంది. కాని అదేం తెలియట్లేదు. ఆ నవ్వులో ఒక మత్తు ఉంది.

ప్రపంచాన్నే మరిచిపోయేలా చేస్తుంది ఆ నవ్వు. బస్సు అదుపు తప్పుతోంది. గందరగోళం మొదలయ్యింది.

అదే చివరి క్షణాలేమో అని అందరిలోను భయం. ఆ ఒక్క క్షణం అందరిలోనూ మృత్యువు తాండవిస్తోంది. 'శశి శశి' అరుస్తున్నాను. శశి పక్కన అద్దానికి తగిలి కిందకి పడిపోతోంది.

"శశి పట్టుకో పట్టుకో" అని అరిచాను.. ఏడ్చాను. ఆమె నాకేసి చూస్తూ కనులు వాల్చింది. అందరూ రక్తాలోడుతున్నారు. బస్సు తిరిగబడింది. నేను తప్ప అందరూ నిద్రావస్థలో ఉన్నట్టు ఉన్నారు. అందరి శరీరాల నుంచి పొగల్లాంటి ఆకారాలు

బయటకు వెళ్తున్నాయి. 'శశి శశి' అని అరుస్తున్నాను. నా అరుపు ఆ కొండల్లో ప్రతిధ్వనిస్తోంది.

"సర్ జి సర్ జి" ఎవరో భుజం తడుతున్నట్టు అనిపించింది. వళ్ళంతా చెమటలు పట్టి ఉన్నాయి.

"ఏమయ్యింది సార్... అంతగట్టిగా అరిచారు"

"ఏదో పీడకల. అవును నువ్వు లోపలకి... ఎలా???"

"మీరు తలుపు వేసుకోలేదు సర్ జి. మీకు కాఫీ తెచ్చి ఇంకా లేవలేదని రూం సర్దుతున్నాను. ఇంతలో ఇలా మీరు..."

"హుఁమ్... చెప్పాగ పీడకలని"

"శశి శశి అని అరిచారు... ఆమె మీద ప్రేమ అరుస్తూ నిద్రలేచినప్పుడు మీ కంటి నిండా వచ్చిన కన్నీళ్లు చెప్తున్నాయి"

"అవును ఆమె నా ప్రాణం... కాని ఇప్పుడు లేదు."

"ఆవిడ చనిపోయారా!" అన్నాడు దిగాలుగా.

"పుట్టినవాళ్ళు మరణిస్తారు. ఒక్కో మతం ఒక్కోనమ్మకం. పుట్టినవాళ్ళు మరల పుడతారని ఒక మతం నమ్మకం అయితే...అసలు పుట్టుకే లేదని ఒక మతం నమ్మకం... ఏ మతం అయిన పరమార్థం ఒక్కటే... మరల పుట్టకూడదని... దేవుడు ఒక్కడే జోషి. మతాలే వేరు... అందరూ చెప్పింది ఒక్కటే... మంచిగా బతకమని, అందరితో మంచిగా ఉండమని. కాని మనమే అలా బతకలేం. అందరం చనిపోతాము.. నువ్వు నేను... మనం ఎప్పుడు చనిపోతామో మనకు కూడా తెలియదు. ఇవ్వాలో రేపో... లేక ఇప్పుడే... ఏం చెప్పగలం. మనకు తెలిసిందల్లా ఈ రోజు ఆనందంగా బతకడం. నాకో మిత్రుడు ఉండేవాడు జోషి, నాతోనే తిరిగేవాడు. వాడు భవిష్యత్తుని అందంగా ఊహించేవాడు. అలాగే ప్లాన్స్ వేసుకునేవాడు. ఇలా అవుతాను. అమ్మా నాన్నని బాగా చూసుకుంటాను అని... కాని ఒక రోజు యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అతను లేడు. అతని భవిష్యత్తు లేదు. ఇప్పుడు తనొక జ్ఞాపకంగా మిగిలిపోయాడు. ఏ నిమిషం... ఏ జీవితం ముగిసిపోతుందో"

"మీరు చెప్పింది నిజం సర్ జి... అన్నట్టు చెప్పడం మరిచాను. ఇవ్వాళ మా తాతయ్యని కలుద్దాం"

"రేపు అన్నావ్..."

"మీరే చెప్పారుగా రేపు ఏంటో తెలీదని.... అందుకే ఇవ్వాళ... మీరు రెస్ట్ తీసుకుంటారని రెండురోజుల తర్వాత అని చెప్పాను. అంతే" అన్నాడు.

"సరే అయితే ఇవ్వాళే వెళ్దాం... ఆయన కాశీలోనే ఉంటారా?"

"హ సర్ జి... కాని కొంచెం దూరం..."

"సరే అయితే.. నేను ఫ్రెష్ అయ్యి వస్తాను"

★ ★ ★

కాశీకి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంది జోషివాళ్ళ ఇల్లు. ఒక పూరిపాక.. చుట్టూతోట... చాలా ప్రశాంతంగా ఉంది ఆ ప్రదేశం. మేం ప్రవేశించిన రూము అంతా పాత పుస్తకాలతో, ఏవో మందుల డబ్బాలతో నిండి ఉంది. ఒక ముసలాయన ఏవో మందులు నూరుతున్నాడు.

"తాత ఈయన...." ఏమీ మాట్లాడొద్దు అన్నట్టు సైగ చేసాడు.

సుమారు 100 పైన ఉంటుంది ఆయన వయసు... ముడతలు పడిపోయిన చర్మం.. నుదిటికి విభూది.... వంటిమీద బట్టలు కూడా సరిగ్గాలేవు...గోచి... భుజంపై కాషాయకండువా....

మందులు నూరుతూ తనలో తానే ఏదో చదువుకుంటున్నాడు.

"ఏదో తెలుసుకోవాలనుకుంటున్నావ్".

కాసేపటికి గంభీరంగా అడిగింది ఆ గొంతు.... అది తెలుగులో... ఆయనకి తాను అడగబోయే విషయం తెలుసన్నట్టు అనిపించింది నాకు.

"తాతకు నాలాగే అన్ని భాషలు తెలుసు" అని చెవిలో గొణిగాడు.

"నాలాగే" అన్నమాటకు నవ్వు వచ్చింది.

"సాంఖ్యయోగం గురించి తెలుసుకుందామని" మాట సరిగ్గా రాలేదు. ఎందుకో చెప్పడానికి కూడా భయమేసింది.

పెద్దగా నవ్వి "తెలుసుకుని ఏం చేద్దామని...."

"చనిపోదామని"

"నాకు తెలుసులే... మరణంతో ఆటలా"

"ఏమో నేను ఈ పని చేసుండాలి అని రాసి ఉండచ్చు. ప్రతి మనిషి పుట్టుకకు ఒక పరమార్థం ఉంటుంది కదా". అప్పటికప్పుడు ఏదో వాగేసాను. ఇంకేం చెప్పాలో తెలియలేదు.

"కచ్చితంగా" అన్నాడాయన.

"అందుకే నాకు సాంఖ్యాయోగం గురించి చెప్పగలరా" అన్నాను కొంచెం గట్టిగానే.

"ప్రతి మనిషి పుట్టుకకి పరమార్థం ఉంటుంది. ప్రతి మనిషికి ఒక గమ్యం అంటూ నిర్దేశింపబడుతుంది. కానీ ఎవరి జీవిత గమ్యాన్ని వారే కనిపెట్టగలరు. మిగిలిన ప్రపంచానికి అదొక మిథ్య లాంటిది. బ్రహ్మ దేవుడు స్థానచలనంలో ఉండగా రాసినట్టు ఉన్నాడు అన్ని నీ నుదిటి మీద..."

ఆయన మాట ఏం అర్థం కాలేదు. కాని చాలా ముఖ్యమైన విషయం అని అర్థమైంది.

నిశ్శబ్దంగా ఉంది ఆ గది.... ఇద్దరం కాసేపటి వరకు మాట్లాడలేదు...

"మా తాత నాకు చెప్తూ ఉండేవాడు. ఏది శాశ్వతం కాదని ఆత్మ ఒక్కటి శాశ్వతమని... కొన్ని ఆత్మలు ప్రేతాలు కావచ్చు. అంటే వాటి కోరికలు తీరకపోయినా, దశదినకర్మలు జరగకపోయినా ప్రేతాలుగా మారతాయి. ప్రేతాలు అంటే దయ్యాలు. కొన్ని పవిత్రమైనవి ఉంటాయి. అంతెందుకు కాశీ విశ్వేశ్వరుడికి పల్లకి పట్టేవి ఆ దయ్యాలే... ప్రతి దానిలో మంచి చెడు ఉంటాయ్" అన్నాడాయన.

"అంటే ప్రతి మనిషి చనిపోవాల్సిందేనా...? చనిపోయిన తర్వాత ఆత్మ కింద మారాల్సిందేనా?"

"ఇది ఎప్పటికి ఎవరికి అర్థం కాని ప్రశ్న.... కాని ఒక విషయం ఇప్పటికి మరణాన్ని జయించినవాళ్ళు ఉన్నారు..."

"చావు లేకుండా ఉండటమా... అది ఈ కాలంలో?"

"కాలం మీకు లెక్క. కాలాన్ని జయించేవాళ్ళకు కాదు"

"కాలాన్ని, మరణాన్ని జయించినవాళ్ళా...?? ఎవరు??".

"అఘోరాలు..."

"అఘోరాలా...??"

"హ అఘోరాలే...శ్వాస దిగ్బంధనంతో ఊపిరిలు ఆపుకుంటారు"

"ఊపిరి ఆపుకోవడమా... ఆపుకుంటే మరణాన్ని జయించినట్లేనా".

ఆయన మాటలు కూడా ఆయనలాగే విచిత్రంగా ఉన్నాయి.

"చిత్రగుప్తుడు ఊపిరిల లెక్కన ప్రాణాలు లెక్కగడతాడంట... కాని ఎవరికి తెలుసువాళ్ళు అలా ఎలా ఉండగల్గుతున్నారో"

"మీరు చూసారా అలాంటి వాళ్ళని" అన్నాను ఆశ్చర్యంగా.

"నా చిన్నప్పుడు మా తాత ఒక సాధువు దగ్గరికి తీసుకువెళ్ళారు. ఆయనకి 400 సంవత్సరాలంట... ఎముకలు కనపడేలా ఉంది ఆయన శరీరం. నాకు 65 ఏళ్ళు ఉండగా మళ్ళీ ఆయన దగ్గరకు వెళ్లాను. ఆయన అలాగే చెక్కుచెదరకుండా ఉన్నారు"

"అసలు ఈ సాంఖ్యయోగం అంటే ఏంటి??? నాకు కొంచెం తెలుసు. పూర్తిగా తెలుసుకోవాలని ఉంది"

"సాంఖ్యయోగం...కపిల భగవానుడు కనిపెట్టింది. ఆదిశంకరుడు ప్రాముఖ్యానికి తెచ్చింది. మనిషి నుండి జీవుడిని వేరు చేయడమే ఈ ప్రక్రియ. అంటే మనిషి శవంలా ఉంటాడు. అతని ఆత్మ అనేది బయట తిరుగుతూ ఉంటుంది. కాకపోతే ఇదంతా జరిగేది బతికి ఉండగానే... ఇది శాస్త్రం ప్రకారం. ఇప్పుడు నీకు చెప్పాలంటే యోగాలో ఉన్న మెడిటేషన్ని ఒక పై స్థాయికి తీసుకువెళ్ళటమే ఈ ప్రక్రియ. ఇక్కడే ప్రజలు నేను యోగాలో మానసిక ప్రశాంతతను పొందాననుకుంటారు."

ఈ దయ్యాలు, దేవుళ్ళు, అఘోరాలు, సాంఖ్యయోగం అంతా మూఢనమ్మకం అని, ఒక సైకాలజీ చదువుతున్న కుర్రాడు ఇలా మూర్ఖంగా స్వామిజీల మాటలు వినడం ఏమిటి అని మనసులో అనుకున్నాను...

"మూఢనమ్మకమే... నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. చెప్పు?..."

నా మనసులో మాటలను ఆయన పలికాడు. గొప్ప గొప్ప సైకాలజిస్టులు చేయగలిగే పని అది... వాళ్ళు కూడా మనసులో భావాలను 50 శాతం మాత్రమే చెప్పగలరు.

"నువ్వు ఎలా పుట్టావు???" అని అడిగాడు నా ఆలోచనలను చేదిస్తూ...

ఒక పిచ్చి ప్రశ్నలా అనిపించింది నాకది.

"అమ్మ కడుపులోంచి" అన్నాను.

"అమ్మ కడుపులో నువ్వెందుకు ఉన్నావ్. అసలు ఎలా బయటకు వచ్చావ్. అసలు అలా పుట్టాలని, ఎదగాలని, ఏ సైన్సు చెప్పింది. బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం, మరణం వీటికి కారణాలు ఏంటి. అసలు నువ్వు అమ్మకే ఎందుకు పుట్టావ్. నాన్నకు ఎందుకు పుట్టలేదు. జన్యుపరంగా తేడాలు అంటారు. ఆ తేడాలు ఎందుకొచ్చాయి... ఎక్కడ నుంచి వచ్చాయి. సైన్సు తీసుకొచ్చిందా... సమాధానాలు ఉన్నాయా??"

ఆయన ఒక్క ప్రశ్నకు సమాధానం లేదు. ఒకవేళ కారణం ఉంది అని వాదిద్దామన్న ఆయన మొహంలో తేజస్సు ప్రపంచం మొత్తం చదివాను అంటోంది.

"దెయ్యాలు లేవని ఏ సైన్సు అయితే చెప్తోందో... అదే సైన్సు ప్రకారం స్పిరిట్యువల్ యూనివర్సిటీ అమెరికాలో నడుస్తోంది. ఈ విషయం తెలుసా నీకు. ఏది నిజం?? ఏది అబద్ధం?? ఏది పుట్టుక?? ఏది మరణం?? రెండింటి మధ్య జీవితం ఎప్పుడు కొట్టుమిట్టాడుతుంది. నిజం అబద్ధం మధ్య మరియు పుట్టుక చావు మధ్య...."

మనసులో ఒక బలమైన నమ్మకం ఏర్పడింది. అవును ఈ ప్రపంచాన్ని ఒక బలమైన శక్తి నడిపిస్తోంది. ఆ శక్తికి దేవుడని పేరు తగిలించారు అంతే... ఆ శక్తే నన్ను ఇక్కడిదాక లాక్కు వచ్చింది. ఇంకా ఏదో చెయ్యమని ప్రేరేపిస్తోంది.

మనసు ఆలోచనలతో పరుగెడుతోంది...

"నిజం విశ్వమంతటిని ఒక శక్తి నడిపిస్తోంది, అది అల్లా, క్రీస్తు, భగవానుడు... ఎవరైనా అవ్వచ్చు... నమ్మకం ముఖ్యం. నువ్వు ఎలా నమ్మితే అలా... ఇక చనిపోయిన తర్వాత అంటావా, తప్పుచేస్తే దానికి శిక్ష అనుభవించాల్సిందే"

"ఇవన్ని సరే నా శరీరంలోంచి ఆత్మను బయటకు తీసుకురావడం ఎలా??"

"చెప్పానుగా... ఒకసారి నా దగ్గరికి రా..." అని చేతిలో ఒక బూడిద ఉన్న డబ్బాని చేతిలో పెట్టాడు.

"ఎప్పుడైతే నీ మనసు నిశ్శబ్దంగా తనను తాను అన్వేషిస్తుందో.. ఆత్మ బయటకి వస్తుంది. అలా చేసే ముందు ఈ బూడిదను నీళ్ళల్లో కలుపుకుని తాగు. బహుశా నా జీవితగమ్యం ఇదే అనుకుంటా.." అని ఒక్కసారిగా పక్కకు కూలబడ్డాడు.

ఆయన శ్వాస ఆడటంలేదు. వళ్ళంతా చెమటలు... ఎటుచూసిన నిశ్శబ్దం... ఆయనలేడు ఇక. మరణం ఆయనను జయించింది అనుకున్నాను. జోషి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

మరణం... మరణం.. ప్రతి మనిషి జీవితంలో చివరికి అనుభవించాల్సిన గడియ...

ఆ ఒక్క క్షణం మనం గడిపిన జీవితం కనిపిస్తుంది అంట... ఎప్పుడో ఒకప్పుడు నేను కూడా అలా రాలిపోవాల్సిందే...

★ ★ ★

హరిశ్చంద్ర ఘాట్... శవాలు కాలుతున్నాయి. ఇంకా చెప్పాలంటే కాలకపోయినా తీసేస్తున్నారు. ఆ తాత కూడా కాలిపోతున్నాడు అందరితోపాటే.

ఒక మనిషి ఒంటరిగా ప్రయాణించడం మొదలెడితే అన్ని తెలుసుకుంటాడు. ప్రపంచం అంటే ఏంటో, మనుషులు అంటే ఏంటో, ప్రపంచంలో చాలా రహస్యాలు తెలుస్తాయి అనిపించింది.

ఎంతటి దుర్భరం మనిషి సంపాదించింది ఏది ఆ చితిలో కాలట్లేదు. డబ్బు, పరువు, ప్రతిష్ఠ ఏది తీసుకువెళ్ళట్లేదు. కాని మనిషి జీవితాంతం వాటికై తపిస్తూ ఉంటాడు. మదన పడుతూ ఉంటాడు.

కపాలమోక్షం అయ్యేదాకా అందరం ఉన్నాం. నేనే ఎందుకు ఇంతలా తపన పడటం... నిజానికి అందరి చుట్టూ ఎవరో ఒకరు చనిపోతారు. కాని ఆ బాధ చనిపోయిన మూడో రోజునుంచే పోతుంది. అక్కడి నుంచి దశాస్వమేధ్ ఘాట్ ఒంటరిగానే చేరుకున్నా. ఆ సమయానికి గంగా హారతి జరుగుతోంది అక్కడ... బ్రహ్మదేవుడు తన పది అశ్వాలను ఇక్కడ యజ్ఞంలో ధారపోశాడని అక్కడ ఎవరో చెప్పుకుంటుంటే విన్నాను. దేవునికి అంత మూర్ఖత్వం ఉండదనిపించింది.

రాత్రిపూట కాశి ఎంత అందంగా ఉంటుందో... నిజానికి ఇక్కడ కట్టెలు అమ్ముకుని కోటీశ్వరుడు అయిపోవచ్చేమో అనిపించింది. ఈ సారి జోషితో పనిలేకుండా భోజనం చేసి వచ్చాను. ప్రస్తుతం తను చేస్తున్న పని జీవితాన్నే పనంగా పెట్టి చేస్తున్నది అని అర్థమైంది. సైన్సుపరంగా, ఇటు శాస్త్ర ప్రకారం ఒక గమ్యం దొరికింది. కాని ఇలా చెయ్యడం వల్ల శశి కనిపిస్తుందా...? పోనీ నా ముందు

చనిపోయిన వాళ్ళు ఎవరైనా తిరిగి వస్తారా? ఎందుకు ఈ తాపత్రయం... ప్రతిసారి ఇదే ప్రశ్న....

★ ★ ★

"హలో చెప్పు త్రిపుర... వినిపిస్తోందా.... బోటులో ఉన్నానూ... వినిపిస్తోందా.." అందరూ నా వైపే చూస్తున్నారు నా అరుపుకి. అందులోను పరాయి భాష... నా భాషకి అందరూ నా వైపు వింతమొహం పెట్టారు.

"హ కేరళలోనే... సరే తర్వాత మాట్లాడతాను..." అని ఫోన్ పెట్టేసాను.

కేరళ... మనుష్య స్వర్గం... చుట్టు పచ్చదనం చీరలా పరుచుకుంది. వెనిస్ ఆఫ్ ద ఈస్ట్ గా పిలువబడే అలెప్పి ప్రాంతంలో ఉన్నాము నేను, జోషి. బోటు నెమ్మదిగా ఒక్కో అందమైన ప్రదేశాన్ని దాటుకుంటూ వెళ్తోంది.

కొన్ని వేల మైళ్ళు ప్రయాణం చేసిన అలసట కేరళ అందాలను చూసాక కుదుటపడింది నాకు జోషికి. వాళ్ళ తాత చనిపోవడంతో తనూ నాతో పాటు ప్రయాణం చేస్తానన్నాడు... "సరే" అనే పదంతో సరిపెట్టాను. ఒకరి జీవితగమ్యాన్ని నిర్దేశంచడానికి నేనెవరినట... నాకు కూడా ఈ ప్రయాణంలో ఒక తోడు ఉంటుందన్న స్వార్థం కావచ్చు. అడ్డు చెప్పలేదు.

ఇద్దరం అల్లెప్పిలోని కుప్పాపురం చేరుకున్నాం. డేవిడ్ శంకరం... కుప్పాపురంలో ఈ పేరుని తెలియని వాళ్ళు ఉండరు. చనిపోయిన ఒక రోజు తర్వాత బతికిన మనిషి...

"డేవిడ్ శంకరం ఇల్లు ఎక్కడో తెలుసా" అక్కడ ఒక జ్యూసు అమ్ముకునే వాడిని అడిగాను ఇంగ్లీషులో... కొంచెం వాడికి అర్థమయ్యేలా చెప్పాలి అని గ్రామర్ లేని ఇంగ్లీషులో మాట్లాడాను.

"ఇక్కడి నుంచి రైట్ తీసుకుని అక్కడి నుంచి వచ్చే నాలుగో ఇల్లు" అని తొణకకుండా ఇంగ్లీషులో చెప్పాడు.

కేరళ అక్షరాస్యతా శాతం ఎక్కువ అని విన్నాను. కాని అందరు ఇంత బాగా ఇంగ్లీష్ మాట్లాడతారు అనుకోలేదు. కొంత దూరం నడిచాక అతను చెప్పిన అడ్రస్‌కి చేరుకున్నాం. ఇల్లు చాలా పాతగా, సంప్రదాయంగా ఉంది. రెండంతస్తుల పెంకుటిల్లు.

కేరళలో ఇల్లులు అన్ని కూడా చాలా బాగుంటాయ్ అనిపించింది. జీవితాన్ని ఇంత ప్రశాంతంగా బతికితే ఎంతబాగుండు...

"ఎవరైనా ఉన్నారా" అని అడిగాను ఇంటిముందర నిలబడి...

తలుపులు తెరచే వున్నాయి కాని మనుషులు ఎవరు కనిపించట్లేదు. పిలిచి పిలిచి విసుగొచ్చి చివరికి మేమే లోపలకి అడుగుపెట్టాం. అది సంస్కారం కాదనిపించింది. కాని తప్పలేదు. చాలా చీకటిగా, ప్రశాంతంగా ఉంది ఇళ్ళంతా.... చీకటిని మించిన ప్రశాంతత లేదనుకుంటా.

ఒక మనిషి పడక కుర్చీలో కూర్చుని ఉన్నాడు. మేం పిలుస్తున్న సంగతి కూడా పట్టించుకోవడంలేదు.

కొంచెం ఆయనకు దగ్గరగా వెళ్ళి "డేవిడ్ శంకరాన్ని కలవాలి" అన్నాను.

ఆ పేరు విన్నప్పుడల్లా కాస్త వింతగా అనిపిస్తుంది డేవిడ్ శంకరం... డేవిడ్ క్రిష్టియన్ పేరు... శంకరం హిందు పేరు. ఇంట్లో కూడా అన్ని మతాల ఫోటోలు కనిపిస్తున్నాయి. వాటి ముందు తప్పా ఇంట్లో అంతా చీకటిగా ఉంది.

"నేనే డేవిడ్ శంకరాన్ని.... చెప్పండి" గంభీరంగా పలికింది ఆ గొంతు. ఆయన మాటే తప్ప మొహంలోను, ఆయన శరీరంలోను ఎలాంటి కదలికలేదు..

ఆయనకి నా కథ మొత్తం చెప్పుకొచ్చాను... చెయ్యబోయేది చెప్పుకొచ్చాను.

"మరణం.... మరణం తర్వాత ఏమిటో తెల్సుకుంటావా... ఏంటి ప్రయోజనం"

"కొన్ని పనులు ప్రయోజనం కల్గుతాయనే మొదలుపెట్టకూడదు కదా" అన్నాను.

"ప్రపంచం నీ మాట ఎప్పటికి నమ్మదు... నిన్నొక పిచ్చివాడిలా చూస్తుంది"

"కాని నాకైనా నిజం తెలుస్తుందిగా... మీరు చనిపోయి మళ్ళీ బతికారంటారు అది ఎలా..."

"సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం ఒకరోజు ఉదయం గుండెనొప్పి వచ్చి కూలపడిపోయాను.విపరీతమైన నొప్పి. ఆ క్షణం నా జీవితం మొత్తం కళ్ళముందు కదలాడింది. కాని కొంతసేపటికి నొప్పి తగ్గినట్టయ్యింది. మామూలుగానే లేచి నిలబడ్డాను. కాని లేచిన తర్వాత తెల్సింది. పడింది నా శరీరం... లేచింది నా ఆత్మ అని"

"ఆత్మా???"

"హ ఆత్మే... అలా పద్దెనమిది గంటలు ఉన్నా. ఏదో శక్తి నన్ను చీకటిలోకి తీసుకువెళ్ళిపోయింది... కొంత దూరం వెళ్ళాక ఒక విచిత్రమైన లోకం. ఇంతకి విచిత్రం ఏమిటంటే శ్వాస ఆగిన పదునాలుగు గంటలకే మరలా నేను బతికాను..."

"ఈ మధ్యలో"

"చెప్పానుగా ఆత్మగా తిరిగాను... ఎవరికి చెప్పినా నమ్మలే... ఇంకా ఎక్కువ మాట్లాడితే పిచ్చివాడంటారనిపించింది..."

"ఇంతకి ఏం చూసారు మీరు..."

"చెప్పానుగా విచిత్రలోకం అని ఏదో కాంతి పుంజం నన్ను లాక్కుని వెళ్ళింది"..

కాని ఆయన చాలా విషయాలు చెప్పారు. ఆయన తన శరీరాన్ని ముందర పెట్టుకుని ఆస్తికోసం దెబ్బలాడుకుంటున్న కొడుకులని చూశానని, అందరూ డబ్బుకోసం తన చుట్టూ చేరారని చనిపోయినప్పుడు తెల్సిందని చెప్పారు. బతికి వచ్చిన తర్వాత తన ఆస్తి మొత్తాన్ని అనాథ శరణాలయాలకు రాసి ఇచ్చారని తెల్సింది.

★ ★ ★

"ఆయన చెప్పిన దాన్నిబట్టి ఏం తెల్సింది జోషి..."

ఇద్దరం కొచ్చిన్ విమానాశ్రయంలో ఉన్నాం. ఫ్లైట్ రావడానికి ఇంకా గంట పడుతుంది.

"ఏమో సర్ జీ అసలు అలా ఎలా బతికారో కదా ఆయన"

"బతకడం, చావడం మన చేతిల్లో ఎక్కడ ఉంది. మనం వెళ్తున్న విమానం కూలి పోవచ్చేమో... ఎవరికి తెలుసు"

"మీరు అలా అనకండి... నేను విమానం ఎక్కడం మానేస్తాను" అన్నాడు భయంతో..

"హహ ఏం కాదులే" అని నవ్వుతూ చెప్పి...

ఏం కాదులే అని చెప్పడానికి నేనెవరిని అని మనసులో అనుకున్నాను. ఇద్దరం విశాఖపట్టణం చేరుకున్నాం.

అక్కడే ఒక ఫ్లాట్ తీసుకుని ఉందామని నిశ్చయించుకున్న.. అనుకున్నట్టుగానే కొంచెం ప్రశాంతంగా ఉండేలా యం.వి.పి. కాలనీలో తీసుకున్న..

"జోషి, వైజాగ్ బాగుంటుందయ్యె... చాలా ప్రశాంతంగా... చాలా నీటుగా..." అన్నాను ఫ్లాట్‌లోకి అడుగు పెడుతూ.

మాకు కావలసిన సరుకులు అన్ని కొనుక్కుని తెచ్చి పెట్టుకున్నాం, త్రిపురకి ఫోన్‌చేసి బీచ్‌దగ్గరకు రమ్మని చెప్పాను.

"అభి నువ్వు చాల సంతోషంగా ఉన్నావ్..." అంది త్రిపుర.

"మనం అనుకున్న పని చేయడంలో ఎప్పుడూ సంతోషం ఉంటుంది"

మేం ముగ్గురం ఆర్‌కె బీచ్ ఇసుకలో కూర్చుని మాట్లాడుకుంటున్నాం. అలల హోరుతో మమ్మల్ని కొంచెం గట్టిగా మాట్లాడేలా చేస్తోంది సముద్రం.

"రేపో ఎల్లుండో కేటామిన్ వస్తుంది. అది కస్టమ్స్‌కి దొరకకుండా రావాలి.." అన్నాను మాకు సంద్రానికి వినపడేలా..

"కస్టమ్సా??"

"హ అదొక నిషేధిత ఉత్ప్రేరకం... కొకెయిన్‌కంటే చాలా ప్రమాదం. అందుకే దాన్ని బ్యాన్ చేసారు"

"అలాంటిది నువ్వు ఇప్పుడు ఉపయోగించబోతున్నావా" అంది భయంగా.

"అవును..." అన్నాను.

"ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పగలను... నువ్వు ఎవరి మాటవినవు"

"తెలుసుకదా... సరే కాని.. మనకో డాక్టర్ కావాలి"

"డాక్టర్ ఆ?? ఎందుకు???" అంది త్రిపుర సందేహంగా చూస్తూ...

"ఉంటే ఎందుకైనా మంచిదని"

"నాకేదో భయంగా ఉంది అభి. అంకుల్, ఆంటీవాళ్ళ గురించి ఆలోచించావా"

"ఆల్ రైట్...ఏం కాదు" అన్నాను.

ప్రకృతిని ప్రశాంతంగా ఆస్వాదించి చాలా రోజులైంది. అంత అలల హోరులో కూడా ఏదో తెలియని భయంకరమైన నిశ్శబ్దం సముద్రాన్ని కప్పేస్తున్నట్టుంది. నిశ్శబ్దం అంతే అలజడిని ప్రశాంతతను ఒకేసారి తీసుకువస్తుంది.

"ఇక మేం ఇద్దరం ప్లాట్‌కి వెళ్తాం" అన్నాను అక్కడున్న నిశ్శబ్దాన్ని చేధిస్తూ..

"సరే జాగ్రత్త" అంది.

"ఆడపిల్లవి, నువ్వు ఒక్క దానివే వెళ్తున్నావ్. మేం చెప్పాలి జాగ్రత్త అని" అన్నాను నవ్వుతూ.

"హ హ నా గురించి నీకు తెలుసుకదా అభి" అని తన స్కూటీ మీద దూసుకుపోయింది.

ఒకటి మాత్రం నిజం అనిపించింది. త్రిపురలాంటి అమ్మాయిలు చాలా రేర్‌గా ఉంటారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అంత ధైర్యంగా ప్రతి స్త్రీ ఉండాలి అనిపిస్తుంది. ఇద్దరం అక్కడి నుండి ఆటో పట్టుకుని ప్లాట్‌కి చేరుకున్నాం.

"రేపు గరుడపురాణం కొనాలి జోషి ఒక సారి గుర్తుచెయ్" అన్నాను పడుకోబోతు...

"ఎందుకు సర్‌జి మరలా ఆ భయంకరమైన నరకం గురించి"

"పొద్దున్నే మర్చిపోకుండా గుర్తుచెయ్ జోషి.... భయంకరం ఏముంది..." అని నిద్రపోవడానికి ప్రయత్నించాను. ఈ సారి జోషి మాట్లాడుతున్న మాటలను కూడా పట్టించుకోలే. ఒక ఆలోచన ఇంకో ఆలోచనని డామినేట్ చేస్తోంది.

★ ★ ★

గరుడపురాణం... చాలా కష్టపడితే ఒక పాత గ్రంథాలయంలో దొరికింది. చనిపోయిన ఇంట్లో పది రోజులు చదువుతారంట. కాశీలో ప్రవచనం విన్నాక మరింత ఆసక్తి కలిగింది దాని గురించి తెలుసుకోవాలని...

పుస్తకం చదవడం ప్రారంభించాను. మొట్టమొదటగా ప్రేతకల్పం గురించి చదవడం ప్రారంభించాను. చదవడానికే చాలా భయంకరంగా ఉంది.

టైం తెలియట్లేదు. జోషి ఇంటిని సర్దడంలో, వంటచేయడంలో బిజీగా ఉన్నాడు. భోజనం కూడా ఒక్క ఐదు నిమిషాలు మించి తినలేదు. తెలియకుండానే పేజీలు కదులుతున్నాయి..

"జోషి ఆ ఫోన్ కాస్త ఎత్తుతావా" అన్నాను చిరాగ్గా నా ఏకాగ్రత పాడుచేస్తున్న పాడు ఫోన్‌కేసి తిరిగి...

"త్రిపుర మేడం సర్ జీ.. మీతో మాట్లాడుతారంట''

చిరాగ్గానే ఫోన్ తీసుకున్నాను. ఎందుకంటే అప్పటికే పుస్తకంలో చనిపోయిన తరువాత మనిషి యొక్క జీవుడు నరకంలో పదహారునగరాలను దాటడందాక వచ్చింది.

"మంచి టైంలో ఫోన్‌చేసావు త్రిపుర... ఏంటి విషయం చెప్పు?" అన్నాను చిరాగ్గా

"పార్సిల్ వచ్చింది"

"ఏంటి పార్సిల్" అన్నాను విసుక్కుంటూ...

"నీ ఎంకమ్మ... కేటామిన్ వచ్చింది" అంది తిడుతూ.

"సారీ సారీ మర్చిపోయా''

పార్సిల్ రావడానికి పర్మనెంట్ అడ్రస్ క్రింద త్రిపురవాళ్ళ ఇంటి అడ్రస్ ఇచ్చాను. ఆ విషయమే మర్చిపోయాను.

"విసుక్కుంటావ్ మరి నీ....."

"సరే సరే ఆపేయ్... ఆ పార్సిల్ తీసుకుని ఇంటికి వచ్చేయ్. వచ్చేటప్పుడు నీ డాక్టర్ ఫ్రెండ్‌ని కూడా తీసుకురా. మెడికల్ ఎక్విఫ్‌మెంట్ కూడా" అన్నాను...

"సరే" అని తను ఫోన్ పెట్టేసింది.

త్రిపుర చెప్పిన విషయానికి ఇంకా బుక్ చదివే మూడ్ కలగలేదు.. బుక్ తీసి పక్కన పెట్టాను. త్రిపుర వచ్చే లోపల ఏవో ఆలోచనలు మనసును కుదిపేసాయ్ 'ఇదంతా అవసరమా అన్నట్టు'. అయినా మనసుని ప్రశాంతపరచుకున్నాను. ఇంతలో త్రిపుర రానే వచ్చింది.

"ఇప్పుడేం చెయ్యబోతున్నావ్" తన ఆత్రుత మోహంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"గాఢంగా నిద్రపోబోతున్నాను..." అన్నాను తడుముకోకుండా.

తాత ఇచ్చిన డబ్బాలోని పొడుమును మంచి నీళ్ళల్లో కలిపి తాగాను. ఆ వెంటే కేటామిన్ డ్రగ్‌ని రెండు డోసుల కింద తీసుకున్నాను. కళ్ళు నెమ్మదిగా

మూతపడుతున్నాయి. అప్పటికే సిద్ధంగా ఉంచిన మంచం మీద వాలిపోయాను. గతమంతా కళ్ళముందు కదలాడుతోంది. అదే స్వప్నం మళ్ళీ తలంపుకు వస్తోంది.

"శశి చెయ్యి పట్టుకో...శశి నా చెయ్యి పట్టుకో" అని గట్టిగా అరుస్తున్నాను.

అందరూ బస్సులోంచి కిందపడి వాళ్ళ శరీరాల ఆకారాలు బయటకు పోతున్నాయి.

అదే కల... లేదు నిజం... కలా... నిజమా... ఒక్క ఉదుటున లేద్దామని ప్రయత్నించాను. లేచాను.

త్రిపుర, జోషి, డాక్టర్‌గారు కంగారుగా ఉన్నారు. త్రిపుర ఎప్పటిలాగే డాక్టర్ మీద అరుస్తోంది.

ఇక నేను అక్కడినుంచి బయటకు వచ్చాను.

"త్వరగా వెతుకు... దొరికిందా" అని...

"పాపా.. ఏం వెతుకుతున్నారు" అని గట్టిగా అరిచాను. నా మాటలు ఏవి వాళ్ళు పట్టించుకోవడంలేదు.

ఒక్క క్షణం నన్ను నేను చూసుకున్నాను. నేను నేనులాగే ఉన్నాను. కాని నా శరీరమే శవంలా పడి ఉంది.

కళ్ళు మూసి మరల తెరిచేటప్పటికి శశి ఎక్కడ చనిపోయిందో అక్కడికి చేరుకున్నాను. ఆత్మ ఎక్కడికైనా ప్రయాణించగలదు అన్న విషయం గుర్తొచ్చింది..

కాని ఇదే ప్రదేశానికి రావడం వెనకాల ఉన్న అంతరార్థం అర్థంకాలేదు. శశి మీద తనకున్న ప్రేమ ఇలా తీసుకుని వచ్చి ఉండవచ్చేమో అని అనుకున్నాను.

చాలా అందంగా ఉంది ప్రదేశం... అదే ప్రదేశం ఎంత మంది మృత్యువుకి సాక్ష్యం అయ్యిందో... ఇప్పుడు ప్రశాంతతను నింపుకుంది.

శశి ఎందుకు వదిలివెళ్ళిపోయావ్ నన్ను.. ఆ చుట్టూ జలపాతాలనేవి ఏవి లేవు... నా కన్నీళ్ళు బొట్లుగా రాలుతున్నాయి. ఆత్మ కూడా క్షోభిస్తుంది అనిపించింది. మోకాళ్ళు భూమిని అంటుతున్నాయి. కన్నీళ్లు కూడా ఇంకిపోతున్నాయి. చల్లని గాలి నను తాకడం మొదలుపెట్టింది. మనిషి తగులుతున్న స్పర్శ. ఎవరో ఓదారుస్తున్నారన్న భావన.

"శశి శశి" దిక్కులు పెక్కటిల్లేలా మరోసారి అరిచాను.

అవును శశి నన్ను తాకింది. అచ్చం ఆమె స్పర్శే అది.... జీవితం ఆమెతో పంచుకుని ఉంటె ఎంత బాగుండేదో అనిపించింది.

జీవితం ఎప్పుడు మనం అనుకున్నట్టు ఉండదు. కన్నీళ్ళకు అనుకుంటా కనులు మసకబారుతూ మూతబడ్డాయి.

క్షణంలో కనులు తెరిచే లోపల జనాలు మూగి ఉన్న ఇంటిని చూశాను. ప్రదేశం మారింది. పరిస్థితి నాకు అర్థం కాలేదు. ఇంటి ముందు జనం మూగి వున్నారు.

ఏమిటంతమంది జనం అని చూడగా.. అక్కడ ఎవరో చనిపోవడం వల్ల అంత జనం వున్నారని తెలిసింది. శవం చుట్టూ జీవుడు తిరుగుతున్నాడు. తన శరీరంలోకే దూకుతున్నాడు. బయటకు వస్తున్నాడు. అతని బాధ వర్ణనాతీతం. ఏదో చెప్పాలని పిలుస్తున్నాడు అందరిని. అతని మాట ఎవరికీ వినిపించట్లేదు.

నన్ను చూడగానే "నువ్వు నాలాగే ప్రేతానివా" అన్నాడు.

సమాధానం ఏం చెప్పాలో తెలియక "అవును" అన్నాను.

"చూశావా? ఇన్నాళ్ళు నా పిల్లలు, నా భార్య అని కష్టబడ్డాం. చివరికి చనిపోయాక వాళ్ళెవరు తోడు రాలేదు సరి కదా! నా ఆస్తి కోసం కొట్టుకుంటున్నారు" అని బోరున ఏడ్చాడు.

ఇంతలో ఎక్కడి నుంచి వచ్చారో ఎర్రగా ఉన్న అగ్ని గోళంలో భయంకరమైన రూపంతోను, మెడలో కపాలాలు ధరించి, తలపై, నోళ్ళలో కొమ్ములు ఉన్న ఇద్దరు వచ్చి అతన్ని పాశముతో ఈడ్చుకుపోయారు.

నేను చనిపోయాక... నాది ఇదే పరిస్థితి అనుకున్నా.

అక్కడి నుంచి బయలుదేరి శ్మశానానికి చేరాను. అక్కడ ఎన్నో ప్రేతాలు ఎప్పుడు తాము ప్రాప్తం పొందుతామా అని ఎదురుచూస్తున్నాయి.

అవన్నీ శ్మశానం చుట్టూ తిరుగుతూ ఏడుస్తున్నాయి. ఇంతలో అక్కడ ఉన్న గాలి లాంటి ఆకారాన్ని "ఏం మీరు వెళ్ళలేదా నరకానికి" అడిగాను.

"దాంట్లో కొందరు దశదిన కర్మలు సరిగ్గా జరగక పిశాచాలుగా మిగిలిపోయామని ఏడ్చారు. చనిపోయిన పది రోజుల తర్వాత పిండరూపం నుంచి

నూతన శరీరం వస్తుందని చెప్పారు. ఆ పదిరోజులలో... రోజూ పెట్టే పిండాల వలన రోజుకో శరీర భాగం ఏర్పడుతుందని చెప్పారు.

"ఇంతకి నరకానికి ఎలా వెళ్ళాలి" అన్నాను ఇవన్నీ చెప్తున్న పిశాచాలతో.

"విచిత్రంగా ఉందే... ఈ ప్రశ్న నువ్వు మమల్ని అడక్కూడదు, నిన్నే యమ భటులు లాక్కుపోతారు" అంది.

నా కథ మొత్తం వారికి వివరించాను.

జరిగిన కథంతా విన్న వాళ్ళు.. ఎవరైనా చనిపోయిన ఇంటి దగ్గరకి, ఇప్పటికి పన్నెండు రోజులు అయి ఉన్న ఇంటికి వెళ్ళమన్నారు. అక్కడ చనిపోయిన జీవుడు ఏడుస్తూ ఉంటాడని, అతన్ని తీసుకెళ్ళడానికి యమభటులు వస్తారని, వాళ్ళతో వెళ్ళమని చెప్పారు.

"ఇక్కడకు నాలుగు వీథులు దాటాకా ఒక పెంకుటిల్లు వస్తుంది. అతను చనిపోయి ఈ రోజుకి పన్నెండవ రోజు.. వెళ్ళు.. జాగ్రత్త" అంది పిశాచి.

వాళ్ళు చెప్పినట్టే ఆ ఇంటికి వెళ్ళి నిల్చున్నాను. అక్కడ జీవుడు దాహంతోనూ, బాధతోనూ ఏడుస్తున్నాడు.

అంతలోనే పెద్ద పెద్ద దంతాలు, బిరుసు వెంట్రుకలు, భయంకర కపాలాలను మెడలో వేసుకున్న ఇద్దరు అతన్ని ఈడ్చుకు పోతున్నారు. వాళ్ళతో పాటే ఒక చక్రంలాంటి వలయంలోకి ప్రవేశించాను. ఎంత దూరం నడవాలో తెలియట్లేదు. కనుచూపు మేరలో చెట్లు ఎక్కడా కనిపించట్లేదు. సూర్యుడు భగ భగా మండుతున్నాడు. వలయంలోకి ప్రవేశించానో లేదో జీవుల ఏడుపులతో ఆ ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది. ఎంతో మందిని ఈడ్చుకు వెళ్తున్నారు ఆ భయంకర వ్యక్తులు.

కొంత దూరం పోయాక దట్టమైన అడవిలాంటి ప్రదేశానికి చేరుకున్నాను. అందులోంచి పోతున్న జీవులను కత్తులులా ఉన్న ఆకులు కోస్తున్నాయి. రక్తం వాళ్ళ శరీరం నుంచి ధారాపాతంలా కారుతోంది.

కాని విచిత్రం ఏమిటంటే వారి శరీరాలకు అసలు గాయాలు అవుతున్నట్టు కనిపించట్లేదు. వారు బాధతో పెడుతున్న అరుపులతో ఆ ప్రదేశం నిండిపోయింది.

చాలా దూరం నడిచాను అన్న భావనతో ఒక చెట్టు కింద కూలబడ్డాను.

పై నుంచి ఏదో పడుతున్న శబ్దంతో పక్కకు జరిగాను. ఇంతలో ఒక పాము నేను కూర్చున్న ప్రదేశంలో దూకింది.

ఒక్కసారి పైకి చూడగా ఆశ్చర్యంగా ఆకులకు బదులు చెట్టునిండా పాములే కనిపించాయి. ఇదేం వింత అని అక్కడి నుంచి బయలుదేరాను.

ఇంతలో భుజాన్ని ఎవరో తడిమినట్టయ్యింది.

ఎవరా అని చూస్తే ఒక అరచేయంత వ్యక్తి భుజంపై కూర్చుని ఉన్నాడు.

"ఎవరు నువ్వు" అని అడిగాను భయం లేకుండా...

"ముందు నువ్వు ఎవరో చెప్పు? ఎలాంటి బాధ లేకుండా నరకమార్గం నుంచి పోతున్నావ్??"

"నేను ఒక అన్వేషిని. అసలు చనిపోయిన తర్వాత మనిషి ఏమవుతాడు? నరకం అనేది ఉందా? అనే ప్రశ్నలతో బయలుదేరాను" అని జరిగిన కథ మొత్తం చెప్పాను.

"హ హ పిచ్చివాడ చూశావ్ కదా నరకం ఉందో లేదో... ఇది ప్రారంభం మాత్రమే. దీని తర్వాత ఇంకా ఘోరంగా ఉంటుంది దారి" అన్నాడు.

"ఇంతకి ఇదేంటి నడవడానికి కూడా వీలులేకుండా ఉంది" అన్నాను.

నాకున్న సందేహాలతో అతను ఎవరు అన్న విషయం మర్చిపోయాను.

"ఇది అసిపత్రవనం. ఇది దాటాక సౌమ్యపురానికి చేరుకుంటావు. అది మొదటి నగరం.. అలా పదహారు నగరాలు దాటాక నరకానికి చేరుకుంటారు జీవులు"

"ఓహో అలాగా!" అన్నాను.

"నీకు ఇక్కడ మంచినీళ్ళు కూడా దొరకవు చాలా దారుణమైన వ్యధలు అనుభవిస్తావు" అన్నాడు నన్ను హెచ్చరిస్తున్నట్టు.

"నాకు ఇప్పటిదాకా ఏ బాధలు కలగలేదు." అన్నాను.

"మంచిది జాగ్రత్తగా వెళ్ళు" అని తాను అక్కడి నుంచి ఎగిరిపోయాడు.

ఇదంతా పెద్ద తలపోటులా అనిపించింది. సూర్యుడు చాలా దగ్గర పడుతున్నాడు. అంత దగ్గర ఉన్నా అసలు వేడి తగలనట్లే ఉంది జీవం. కాని మిగాతా జీవులు అత్యంత భయంకరంగా కేకలు పెడుతున్నాయి. బహుశా ఆ వేడి వల్ల అయ్యుండచ్చు అనుకున్నాను.

నరకంలో ప్రవేశించే ముందు గర్భోదక సముద్రాన్ని దాటడం గుర్తొచ్చింది. అక్కడే ప్రవేశం లేక కొంతమంది ఆగిపోవడం గుర్తొచ్చింది.ఇంతటి బాధను పడటానికి అంతలా ఎదురుచూడాలా అనిపించింది. కాని ఇదంతా ఒక సైకిలింగ్ ప్రాసెస్. పుట్టినవాళ్ళు మరణించడం. వాళ్ళ పాపపుణ్యాల ఆధారంగా మరలా పుట్టడం.

ఎంత నడిచినా దూరం తగ్గట్లేదు. వెళ్ళే కొలది పెరుగుతోంది.

నా అదృష్టం ఏమిటంటే ప్రయాణబడలిక అనేదే తెలియట్లేదు. నాకు, ఆ యమభటులకు కూడా....

అంతేకాక నేను ప్రేతాత్మలకు మాత్రమే కనబడుతున్నాను. యమభటులకు కనిపించట్లేదు. ఒకవేళ కనిపిస్తే నా పరిస్థితి మరోలా ఉండునేమో అని అనుకున్నాను.

జీవుడు నుంచి కారుతున్న రక్తాన్ని, చీముని క్రింద ఏవో జీవులు తాగుతున్నాయి. ఇదంతా భయంకరంగా తోచినా కళ్ళు మూసుకుని ప్రయాణాన్ని కొనసాగించాను. కొంత దూరం పోయాక దారిని మొత్తం కటిక చీకటి ఆవరించింది.

ఏడుపులు తప్ప ఇంకేం వినిపించట్లేదు. ఏమి కనిపించట్లేదు. ఒక లోయలోకి పడిపోతున్నట్టనిపించింది. ఆత్మకి కూడా బాధ ఉంటుందా అనిపించింది.

ఇంతలో ఒక చిక్కటి వెలుగులో ఉన్న ప్రదేశంలో ఏవో లడ్డుల్లా పెట్టబడి ఉన్నాయి.

జీవులు అది చూడగానే పరుగు లంకించుని వాటిపై పడ్డారు. కొంత మంది అదీ లేక బోరున ఏడుస్తున్నారు.

"ఇంతకీ ఇదంతా ఏమిటి? ఎవరిని అడగాలి ఇంకా ఎంత దూరం నరకానికి, అసలు మరలా తిరిగి రావడం ఎలా?".. ఇలా చాలా ప్రశ్నలు అక్కడ కూర్చున్నప్పుడు మనసుని తొలిచాయి. ఇన్ని ప్రశ్నలు బయలుదేరే ముందు వస్తే బాగుండు అనిపించింది. ఇంతలో ఒక వ్యక్తి నా ముందు ప్రత్యక్షమయ్యాడు.

కాళ్ళదాకా వేలాడే జడ, భుజం దాకా వేలాడే నాలుక, చెవులు కళ్ళు లేకుండా చూడటానికి భయంకరంగా వికృతంగాను ఉన్నాడు.

'నువ్వు చనిపోయి రాలేదు కదా" అన్నాడతను.

"అవును అది నీకెలా తెలుసు" అన్నాను అతనిని చూస్తూనే భయంతో....

"నన్ను చూసి భయపడకు నా పాపకర్మలకు ఇది తప్పదు" అన్నాడు నా భయాన్ని గమనించి.

"అసలు నరకం ఇంకా ఎంత దూరం? చనిపోయిన ప్రతి మనిషి ఇలా ఇన్ని బాధలు పడుతూ రావాల్సిందేనా?" అన్నాను.

"నరకానికి మీ లోకానికి ఎనభై ఆరు వేల యోజనాల దూరం. ఇంకా నువ్వు ఒకటే చేరుకున్నావు. అంటే 16 పురాలలో ఇది ఒకటి. ఇంకా పదిహేను దాటాలి. ఆ తర్వాత వైతరణి నదిని దాటాలి. అప్పుడు భయంకర అగ్నిజ్వాలలతో నిండి ఉన్న ద్వారం కనిపిస్తుంది. అదే నరకద్వారం. ప్రతి మనిషి ఇన్ని బాధలు పడుతూ చివరికి నరకం చేరాలి. ఇది చేరడానికి మొత్తం పదునాలుగు నెలల కాలం పడుతుంది. మీ కాలనుగుణంగా అయితే" అన్నాడు ఒకింత గంభీరంగా.

"ఇది సౌమ్యపురమా? అవును వాళ్ళు తింటున్నది ఏంటి??"

"పిండాలు.. వాళ్ళ వాళ్ళు పెట్టిన పిండాలు. కొంతమందికి అవీ దొరకక అదిగో అలా ఏడుస్తారు" అని ఒక ఏడుపుల గుంపుని చూపించాడు.

"ఇంతకి నువ్వు ఎవరు" అన్నాను భయపడుతూనే.

"నేను ఈ నగరానికి నౌకరుని. కాపలాదారుడని" అన్నాడు నవ్వుతూ. నవ్వుతున్నా అతని నాలుక మాత్రం లోపలికి పోలేదు.

"సరే ఇంకా" అనేటప్పటికి అతను మాయమయ్యాడు...

ఇంకా ఎన్ని పాట్లు పడలా అనిపించింది. అక్కడ అందరూ తినడం కూడా ఏడుస్తూనే తింటున్నారు. ఇంతలో చిన్నప్పుడు అమ్మపాడిన పాట గుర్తొచ్చింది.

"ముందు చేసిన పాపము ఎన్నటికి పోవునో సందేహము వలదు కృష్ణా" అని..

ఇవన్ని నిజంగా ఉంటాయని ఎప్పుడూ అనుకోలేదు. నేనే కాదు ఏ మనిషికైనా నమ్మకం అనుభవపూర్వకం అయితేకాని మనిషికి నమ్మాలనిపించదు. ఇంకా చెప్పాలంటే కళ్ళ ముందు కనపడాలి. చేతిని గిల్లాలి. కాని మనిషికి తెలియని ఎన్నో మర్మాలు ఈ ప్రపంచంలో దాగున్నాయని అనిపించింది.

సౌమ్యపురం దాటినా మంచులా కప్పబడి ఉండే ప్రదేశానికి చేరుకున్నాను. నేను, యమభటులు తప్ప మిగతావారందరు ఏడుస్తూ వణుకుతున్నారు.

అంతటి వణుకులోను వారి ఏడుపు సాధారణమైంది. నేను కూడా చనిపోయి వచ్చుంటే ఇన్ని బాధలు పడాల్సి వచ్చేదేమో అనుకున్నాను. దారి నిండా ఏవో రకమైన బాధలే, కొంతమందిని ఈడ్చుకుపోతున్నారు.

కొంతదూరం పోయాక నిప్పులవాన కురవడం మొదలెట్టింది.

అవి మీద పడ్డప్పుడు జీవుడు ఆ ప్రదేశం దద్దరిల్లేలా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపుకి అంతం లేదు.

అది దాటిన వెంటనే ఒక సుందర నగరానికి చేరుకున్నాం.

విచిత్రం నగరంలో చిన్న చిన్న భవనాలు అన్ని మనిషి శరీర చర్మంతోను, ఎముకలతోను కట్టబడి రక్తం ఓడుతున్నాయి. దూరం నుంచి ఎంత అందంగా ఉందో అనుకున్నాను.

కాని దగ్గరకు చేరాక తెలిసింది ఇదెంత వికృతమో అని... ఆకాశం మెల్ల మెల్లగా దూరం అవుతోంది.

నడుస్తున్న కొద్ది ఏవేవో భయాలు మనసుని కుదిపేస్తున్నాయి.

ఒక వేళ శశి చనిపోక పోయి ఉంటే ఆమెతో సుఖంగా గడిపేవాడినేమో అనిపించింది. శశి కూడా ఇన్ని బాధలు పడిందా అన్న తలంపు మనసుని కుదిపేసింది. ఎన్ని కలలు మా ఇద్దరి మధ్య.

'చివరికి ఇలా.. విధి వంచించింది' అన్న సినిమా మాట ఈ సమయంలో జీవితానికి అద్దినట్టు సరిపోతోంది.

రక్తంతో నిండిన వాగు ప్రవహిస్తూ ఉంది. దాన్ని దాటాలి ఇప్పుడు. ఎంతటి దుర్భరం అనుకున్నాను.

"పద! పద తప్పులు చేసినప్పుడు నవ్వుకొని మరి చేశావ్ ఇప్పుడు అలా ఏడుస్తావే" అంటున్నాడొక యమభటుడు తన చేతిలోని తాడుతో ఒకడిని లాగుతున్నాడు.

ప్రపంచంలో ఎన్నో సుఖాలు అనుభవించిన మనిషి చివరికి ఇలా ఇన్ని బాధలు పడుతూ మరో బతుకు కోసం బతుకీడ్చాలా అనిపించింది..

ఇంతలో మిణుగురు పురుగుల్లా ఉండే చిన్న చిన్న కాంతి పుంజాలు ఆకాశానికి దూరంగా భూమికి చాలా దగ్గరగా వెలుగుతున్నాయి. అవి పడుతున్న నక్షత్రాలు కావు.

మిణుగురు పురుగులు కావు. ఒకవేళ నరకంలో మిణుగురులు అలాగే ఉంటాయేమో అనిపించింది. కాని ఇంతలో ఒక నక్షత్రం నా మీద పడుతున్నట్టు అనిపించింది. నక్షత్రం కాదు, మిణుగురు కాదు ఇంకేదో..

నా దగ్గరకి వస్తున్న కొద్ది కాంతి ఎక్కువవుతోంది. చివరిగా నా ఎదురుకు వచ్చేటప్పటికి తెల్లగా మెరుస్తున్న ఆకారం నా ముందు నిల్చుంది.

"ఎవరు నువ్వు" అని అడిగాను అతనిని చూస్తే హాని చేసే వాడిలా లేడు. ఎవరో బాగా తెలిసిన వ్యక్తే ఎదుట నించున్నట్టు ఉంది.

"నేను మీ పితృ దేవతని...31 పితృ గణాలలో నేను ఒకడిని.. మీ తండ్రి పెట్టే నిత్య తర్పణంతో రోజు సంతసిస్తున్నవాడిని" అన్నాడు నవ్వుతూ.

రోజు నాన్న భోజనం తినే ముందు ఒక ముద్ద తీసుకెళ్ళి బయట గోడ మీద పెట్టేవారు. ఎందుకు?? అని ప్రశ్నించినపుడు... పితృదేవతలకు అని సమాధానమిచ్చేవారు.

"ఏమిటి ఈయన? ఇన్ని మూఢ భావాల్లో బతుకుతున్నాడనిపించింది"..

కానీ ఇది ఈ రోజు నిజం అని తెలిసింది.

"ఓహో అలాగా" అన్నాను అంత భయంకర వాతావరణంలోను అతని మొహం చాలా ప్రశాంతంగా కనిపించింది.

"నీవు ఈ మార్గమున పోయిన తర్వాత తిరిగి రావడం దుర్లభం" అన్నాడు హెచ్చరించే గొంతుతో.

"మరి ఎలా అన్నాను" భయంతో..

"నువ్వు ఇప్పుడు నీకు తెలీకుండానే పది పురములు దాటితివి. ఇంకను ఆరు పురములు దాటాలి. ఆపై వైతరణీ నది... నరకద్వారమునకు దక్షిణమున వైతరణీ నది ఉండును. అటుపై తూర్పుకు పోయినచో నరక ద్వారమువలె మరియొక ద్వారమునుండును. అది నిన్ను భూలోకమునకు చేర్చును" అన్నాడు.

"థ్యాంక్స్" అని చెప్పాను. ఇది ఎంతటి పిచ్చితనమో అనిపించింది. ఫ్లోలో థ్యాంక్స్ అని వచ్చినందుకు నాలో నేనే నవ్వుకున్నాను.

"గుర్తుపెట్టుకో.. రాబోయే ఆరు నగరములు మిక్కిలి భయంకరమైనవి. చివరి నగరము దాటిన వెంటనే వచ్చు వైతరణీ నది నీకు గర్భస్థ నరకమును చూపించును"

మాటలు నాకు వింతగా అనిపించాయి.. గర్భస్థ నరకమా అన్నాను.

"తల్లి కడుపులో శిశువు ఉండటం... అప్పటిదాకా పూర్వ జ్ఞానం ఉన్న శిశువు బాధ పడుతూ ఉంటాడు. తన పూర్వ జన్మలో బంధాలు అన్నీ గుర్తుతెచ్చుకొని బాధపడుతూ ఉంటాడు. అలాగే అతను ఉన్న ప్రదేశం కటిక చీకటితో నిండి ఉంటుంది. చీము, నెత్తురు, మల మూత్రాదులతో కొట్టుమిట్టాడుతుంటాడు. తనని త్వరగా బయటపడేయ్యమని దేవున్ని వేడుకుంటూ ఉంటాడు.

ఎప్పుడైతే బయటకు వచ్చాక బొడ్డు కోస్తారో, తన పూర్వ జ్ఞానం మొత్తం మరిచిపోతాడు. ఆ గర్భస్థ నరకంతో సహా"

ఒక మనిషి పుట్టేటందుకు ఒక వేదన.. బతికేటప్పుడు ఒక వేదన... చివరికి చనిపోయేటప్పుడు ఒక వేదన... చచ్చాక ఒక వేదన అనిపించింది.

"అవును... ఇన్ని వేదనలు పడకూడదనే... దేవున్ని స్మరించు.. ఇతరులను ప్రేమించు అని బోధిస్తారు" అన్నాడు నా మనసులోని మాటలను పసిగట్టి...

"అవును" అన్నట్టు తల ఊపాను.

ఇప్పటిదాకా తాను ఎన్నడూ దేవుణ్ని గుర్తించలేదు అన్న విషయాన్ని గుర్తుకుతెచ్చుకున్నాను. కాని ఎంతో మందికి అన్నం పెట్టాను. "మానవసేవే మాధవసేవ" అని తలచాను.

చూస్తుండగానే అతను మాయమయ్యాడు.

నాకు తెలీకుండానే పది పురాలు దాటానా అనిపించింది.. ఒక్కసారిగా పాములు వేలాడుతున్నా ఒక చెట్టు కింద కూలబడ్డాను.

ఇంతలో నా ఆత్మకి దానిలోని అంతరాత్మకి యుద్ధం మొదలైంది.

"శశి చనిపోయిందిగా" అంది అంతరాత్మ.

"అందుకే చనిపోయిన తర్వాత ఏమవుతారో తెలుసుకోవాలనుకున్నాను" అన్నాను.

అంతరాత్మ : "తెలుసుకొని ఏం సాధిస్తావ్ శశిని, నీ మిత్రులను, నీ బంధువులను బ్రతికించలేవ్‌గా... ఇంకా వాళ్ళు కూడా ఇలా బాధపడుతుంటారా అని నువ్వు బాధపడతావ్. ఇది అవసరమా?"

"తిరిగి వెనక్కి వెళ్ళాలంటే పది దాటాలి ముందుకు వెళ్తే ఆరు" అన్నాను. ఇంతలో అంతరాత్మ మాయమయ్యాడు. మదిలో ఎన్నో ప్రశ్నలు తొలిచాయి. ఎందుకు ఇదంతా చేస్తున్నావని...ఎవరికి ఉపయోగం అని...

ఇలా కూర్చుని ఆలోచిస్తే ఈ ఆలోచనలు ఆగవని బయలుదేరాను.

పదహారు పురాలలో పదిపురాలు అయిపోయాయి. అంటే ఇప్పటిదాకా సౌమ్య, సౌరి, నగేంద్ర భవనము, గంధర్వ నగరము, శైలాగమపురము, క్రౌంచపురము, క్రూరపురము, విచిత్రభవనము, బహ్వాపదపురము, దుఃఖదపురము ఇన్ని దాటానా... అని అవన్ని మనసుకు స్ఫురణకు వచ్చాయి... ఆ బాధలు, వెతలు..

మునుముందు ఇంకా భయంకరం అంటే ఇంకెన్ని చూడాల్సి వస్తుందా అనుకున్నాను.

నిజానికి భయం కాదు.. జాలి.. వాళ్ళు పడుతున్న బాధలు చూసి.. జాలి వాళ్ళమీద.. నిజానికి ఇదే మనిషి ఎన్ని సుఖాలు అనుభవించి ఉంటాడా. అదే మనిషికి ఇప్పుడు ఇన్ని బాధలు. నడుస్తున్నప్పుడు ఇన్ని ఆలోచనలు రావడం వల్ల ఎంత దూరం నడుస్తున్నామో తెలియలేదు. కాని నా ఆలోచనలన్నిటిని ఛిద్రం చేస్తున్నట్టు చెవులు చిల్లులు పడేట్టు ఏడుపులు వినిపిస్తున్నాయి. ప్రేతం చెప్పినట్టు నానాక్రందపురము వచ్చిందన్నమాట అని అనుకున్నాను.

పేరుకు తగట్టే ఉంది. ఎన్నో ఆక్రందనలను తనలో నింపుకుంది ఆ నగరం..

ఆ నగరంలోకి ప్రవేశించాక అందరూ తమ తమ వాళ్ళను తలుచుకుని ఏడ్వటం మొదలెట్టారు. వాళ్ళను చూసి నాకు కళ్ళలో నీళ్ళు ఆగలేదు.

బహుశా నా జీవితంలో కొంతమంది గుర్తుకు రావడం వల్ల అనుకుంటా.

"శశి" అని వెక్కి వెక్కి ఏడ్చాను. ఏడుస్తూనే ప్రయాణం సాగించాను.

కొండలు, గుహలు, లోయలు, రక్తకాసారాలు ఎన్నో ఎదురు అయ్యాయి. ఇంతకు ముందు మించినవి ఎదురయ్యాయి. ఇన్నాళ్ళు ప్రయాణం చేసిన ఎందుకో ఆకలి దప్పికలు తెలియలేదు. చివరికి సుతప్త భవనము అనే నగరాన్ని దాటి రౌద్రపురానికి చేరుకున్నా. ప్రేతం చెప్పిన పరిస్థితుల బట్టి ఆ పేర్లను గుర్తించాను. భీకరాకారులు చేతిలో ముళ్ళ దండాలను పట్టుకొని జీవులను కొడుతున్నారు. నగరం

దాటేదాకా వాళ్ళు అలా కొడుతూనే ఉన్నారు. దారిలో అన్ని రాళ్ళు, రప్పలు, ముళ్ళు ఉన్నా రొప్పుతూ పరిగెట్టసాగారు జీవులు.

చివరికి మంటలతో కూడిన చెరువువంటి దాంట్లో యమభటులు ఆ జీవులను పడవేశారు. అక్కడ కూడా "అమ్మా అమ్మా" అని అరుస్తూ ఏడుస్తున్నారు.

ఇన్ని ఏడుపులు, బాధలు చూశాక ఇక జీవితంలో ఏడవకూడదు ఏ వ్యక్తి కోసం అనిపించింది. భయ భ్రాంతులు గొలిపే ఒక నోరు తెరిచి ఉన్న కపాలంలోకి జీవులని తీసుకుని పోతున్నారు. లోపలికి వెళ్ళినంతనే మాంసపు ముద్దలు మీద పడుతున్నాయి.

ఎటుచూసినా అందకారం, ఏడుపులు... ఎందుకో గుండె శరవేగంగా కొట్టుకుంటోంది.

భయంతో నన్ను నేను గట్టిగా పట్టుకున్నాను. వింత ఆకారాలు మీదకు వస్తూ పోతున్నాయి. చివరకు వైతరణి నది ఒడ్డుకి చేరుకున్నా.

★ ★ ★

ఇప్పటిదాకా ఎనభై ఆరు వేల యోజనాలు దాటి వచ్చాను... అంటే సుమారు ఏడు లక్షల కిలోమీటర్లు దూరం. ఏడుపులు, పెడబొబ్బలు, భయంకర శవాలు, ప్రేతాలతో సాగింది. ఇది చివరి ఘట్టం ఈ నదిని దాటితే చాలనుకున్నాను.

నది చూడటానికే చాలా దరిద్రంగా ఉంది. ఎటు చూసినా చీము నెత్తురు మలంతో నిండి ఉంది. భటులు కొంతమందిని పడవలో తీసుకువెళ్తున్నారు. వాళ్ళు ఎంతో కొంత పుణ్యం చేశారంట. ఇక్కడ కూడా ఎన్ని హెచ్చు తగ్గులు అనుకున్నాను.

ఎలాగో అలా పడవ చివరన నిల్చుని దాన్ని దాటాను. జీవితంలో ఇలాంటి ప్రయాణం మరలా ఎదురవకూడదని దేవున్ని ప్రార్థించాను.

నది దాటిన వెంటనే ఒక సన్నని మార్గం ఒక ద్వారాన్ని కలుపుతుంది. ఎంత సన్నని మార్గం అంటే ఒక మనిషి కాలు పట్టేటట్టు ఉంది. కిందంతా లోయలా చిమ్మచీకటిని నింపుకుంది. ఒక్కొక్కరు దానిమీద నడుచుకుంటూ వెళుతున్నారు. నేను కూడా నడవడం మొదలుపెట్టాను. ఇది దాటితే నరకం ప్రారంభం.

ఒక్కసారిగా కాలు వణికింది. ఆ వంతెననుంచి లోయలోకి పడిపోతున్నాను. అంటే ఇప్పుడు చనిపోతున్నాను. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. చీకటి నుండి నిర్మలమైన ఆకాశం నుండి పడుతున్నాను.

అక్కడి నుండి భూమి మీదకు ఎంతో వేగంగా పడిపోతున్నాను. పడిపోతే చచ్చిపోతాను అన్న భావన చనిపోయిన వాళ్ళు పడ్డ బాధలు, వేదనలు గుర్తొచ్చాయి.

ఇంతకాలం తాను ఎవరి గురించి అయితే ఏడ్చానో తను శశి ఒక్కసారి కళ్ళముందు కదిలింది. వేగంలో కన్నీళ్ళు కారుతున్నట్టు కూడా తెలియలేదు. కళ్ళు తెరిచేటప్పటికి హాస్పిటల్‌లో.

★ ★ ★

"అభి అభి అభి" అని కదుపుతున్నారు.

కళ్ళు తెరిచేటప్పటికి ఇంట్లో కుర్చీ చెమటతో బాగా తడిసి ఉంది.

అప్పటికే నాకేదో అయ్యిందనుకొని డాక్టరుని తీసుకొచ్చారు.

కాని నేను వెళ్ళింది జ్ఞాపకాలలోకే. ప్రస్తుతంలోంచి గతంలోకి వెళ్ళానంతే.

"నాడి కొట్టుకుంటోంది.. శ్వాస ఆడుతోంది. కాని ఉలకవు, పలకవు ఏంటయ్యా మగడా" అన్నాడు ఆర్‌యమ్‌పి గోపాలకృష్ణ.

"పరధ్యానంలో ఉన్నాలెండి" అన్నాను నవ్వుతూ...

"సర్లే" అని తాను వెళ్ళిపోయాడు. అప్పటికే రాత్రి 9:30 అయ్యింది.

"అరేయ్ అభి భోజనం తింటావా??" అంది కంచాలు వేస్తూ.

"లేదమ్మా! వద్దు" అన్నాను.

కనీసం మజ్జిగన్నం తినమన్నా నాకు అది కూడా సహించలేదు.

ఒకసారి చలం ప్రేమలేఖలు తీశాను, చదవడం ప్రారంభించాను. ఇది ఎన్నోసారి చదవడమో మర్చిపోయాను. అలా చదువుతూనే కునుకు తీశాను. శశి ఈ పుస్తకం నాకు ఎందుకు ఇచ్చిందో అర్థమయ్యింది. విరహంతో కొట్టాడటం ఇందులో వ్యక్తి చేసే పని. నాది అదే పరిస్థితి.

అలా కలలు కంటూనే నిద్రపోయాను.

★ ★ ★

"అరేయ్ అభి అభి... నీకోసం ఎవరో వచ్చారురా"

ఇంత పొద్దున్న నాకోసం ఎవరా? అని ఆలోచించాను. ఊర్లో వాళ్ళందరూ అమ్మవాళ్ళకి తెలిసినవాళ్ళే... అలాంటప్పుడు ఎవరో అన్న పదం అమ్మ నుంచి రాదు అని ఆత్రుతతో వీధిలోకి వెళ్లాను..

"అభి ఎలా ఉన్నావ్ ఇప్పుడు"

"సార్ మీరు ఇక్కడ... అది ఇంత సడన్‌గా" అన్నాను ప్రొఫెసర్ శ్రీరాములుగారిని చూసి.

"గమ్యం చేరడానికి ఎంతకైనా వెనుకాడని నా విద్యార్థి దగ్గరకి వచ్చానయ్యా. ఏం రాకూడదా?"

"అదేంటి సార్...రండి" అని ఆయన ఉండటానికి రూము చూపించాను...

"నీతో చాలా విషయాలు మాట్లాడాలి అభి"

"తప్పకుండా సార్... స్నానం చేసాక బయటకి వెళ్దాం" అన్నాను.

ఇద్దరం రాముడిగారి తోటకు చేరుకున్నాం. ఎటు చూసినా కొబ్బరిచెట్లతో నిండి ఉంటుంది ఆ తోట.

"ఏం జీవితమయ్యా ఇక్కడ... ఎంత ప్రశాంతంగా ఉంది. ఇది వదిలేసి పరుగెడతాం. ఏదో గొప్పగా బ్రతుకుదామని ప్రయత్నం... కాని చివరికి గొప్పగా బతకడం అంటే ఇంటికి ఏసి, తిరగడానికి కారు కొనడం కాదని తెలుస్తుంది"

"హుఁమ్... నిజమే..." అన్నాను.

ఇద్దరి మధ్యా కాసేపు నిశ్శబ్దం

"అవునూ... మేడంగారిని తీసుకురాలేదేం సార్... కొన్ని రోజులు ఇక్కడే ఉందురుకదా" అన్నాను.

మా ఇద్దరి మధ్యన నిశ్శబ్దాన్ని తొలగించడానికి ప్రయత్నించాను.

ఆయనేం మాట్లాడలేదు...

"సార్" అన్నాను ఇంకోసారి... ఏం మాట్లాడాలో తెలియక అలా అన్నాను.

ఒక్కసారి ఆయన చిన్నపిల్లాడిలా ఏడవటం మొదలుపెట్టారు. ఆయన బాధ వర్ణనాతీతం... ఆయన కన్నీళ్లే చెప్పాయ్ ఆవిడ లేదని....

మరణం ఒక్కటే గాఢమైన ప్రేమను, బంధాన్ని విడదీయగలదు అనిపించింది.

అన్నిటికంటే కష్టమైన పని ఓదార్చడం.... "సార్" అన్నాను.

"ఐ యామ్ ఆల్‌రైట్ అభి"... కళ్ళు తుడుచుకుని ఆలోచించడం మొదలుపెట్టారాయన.

"సరే... నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుదామని వచ్చాను"

"నిజంగా నువ్వు ఏమైనా చూసావా. అదే చనిపోయిన తర్వాత.. డాక్టర్లు చెప్పడం అయితే నువ్వు డీప్ కోమాలోకి వెళ్లావన్నారు"

"అదే నిజమని మీరు నమ్ముతున్నారా?" అన్నాను నమ్మకంగా.

"నమ్మడం నమ్మకపోవడం అటుంచి నిజాన్ని నిర్ధారించడం కోసం వచ్చాను"

"అయితే వినండి నిజం" అని జరిగినది అంతా చెప్పాను.

"ఇదంతా నిజమని నేను నమ్ముతాను అభి.. కానీ ప్రపంచం నమ్మాలని లేదుగా.."

"ప్రపంచం నమ్ముతుందని నేను ఇదంతా చేయలేదు."

"నాకు తెలుసు అభి....నీకు ట్రీట్‌మెంట్ చేసిన డాక్టర్లు చెప్పడం ఏంటంటే నువ్వు కోమాలో ఉన్నన్ని రోజులు కేవలం నీ శరీరంలో గుండె మాత్రమే పని చేసిందంట...ఊపిరి తీసుకోవడం లాంటివి ఏమి జరగలేదని... నిజానికి నువ్వు బతకడం ఒక మిరాకిల్ అని చెప్పారు".

"ఇది నేను విన్నాను... అందరు నన్ను మృత్యుంజయుడు అంటే నాకు నవ్వొచ్చింది.. నిజానికి చావడం, బతకడం ఎప్పటికి మన చేతుల్లో ఉండదు సార్"

"హుఁమ్, సరే కాని నీకు ఆ స్వామిజి ఇచ్చిన ఆ బూడిదని నాకూ ఇవ్వగలవా???"

"వద్దు సార్... అయినా ఏం చేద్దామని ఆ బూడిదతో"

"ఏదో చేద్దామనిలే.. నీ శశి కోసం నువ్వు చేశావ్.. నా జానకి కోసం నన్ను చేయని.. భయపడకు నీకున్న ధైర్యం నాకు లేదులే"

ఆయన నేను చేసిన ఏ పనికి అడ్డు చెప్పలేదు. ఆయన పనిని ఆపడానికి నేనెవరిని అనిపించింది.

"ఆ పౌడర్ని వైజాగ్ ఫ్లాట్ లోనే వదిలేసాను" అన్నాను.

"త్రిపుర గాని, జోషిగాని దాన్ని తీసుకుని ఉండవచ్చేమో"

"అయ్యుండచ్చు, కాని నాకు తెలిదు"

"ఒక్కసారి కనుక్కోవచ్చుగా "

ఈ సైకాలజీ ప్రొఫెసర్లని అంత త్వరగా దృష్టి మరల్చలేమనిపించింది.

"ఇప్పుడు ఎందుకు అది" అని విసుక్కుంది త్రిపుర.

"కావాలి, నాకు కాదు మన సార్ శ్రీ రాములు గారికి" అన్నాను

"ఎవరికైనా అది లేదు.. పడేసాను" అంది.

"నువ్వు పడయ్యలేవు త్రిపుర. అది నీ నైజం కాదు"

"ఏంటి ఇప్పుడు అయితే?? నువ్వు నా మనసుని చదువుతున్నావా?? ఒకవేళ నా దగ్గర ఉన్నా ఇవ్వను"

నేను మాట్లాడతాను అని సార్ సైగ చేయడంతో ఆయనకి ఫోన్ ఇచ్చాను

పక్కకెళ్ళి ఆయనేదో మాట్లాడి వచ్చి"నేను వైజాగ్ వెళ్తున్నాను అభి" అని ఆయన వెళ్ళిపోయారు. ఇంకో మాట లేదు ఆయన నుంచి...

ఆ బూడిదతో ఆయన ఏం చేద్దామని???.. తానూ చేసిందే ఆయన కూడా చేద్దామనా.. ఆయనది 40 ఏళ్ళ ప్రేమ అని విన్నాను. ఒకవేళ అలా చేసినా తప్పు లేదనిపించింది.

అక్కడే ఒంటరిగా నిశ్శబ్దంలో నిల్చుండిపోయాను. నిశ్శబ్దం మరెన్నో ప్రశ్నలను మోసుకు వస్తుంది.

★ ★ ★

రోజులు గడుస్తూనే ఉన్నాయి...కాని ఎక్కడా ఆలోచనలకి అంతం అనేది ఉండటం లేదు.

ఒక రోజు ఉదయం

"అభి అభి....మీ ప్రొఫెసర్ గారి ఫోన్ రా"

ఒక్కసారి ఉలిక్కిపడి లేచాను... అంతకు ముందు వచ్చిన కలలో ఆయన చనిపోయినట్టు రావడమే నా ఉలిక్కిపాటుకి కారణం.. సహజంగా తెల్లారకట్ల వచ్చే కలలు నిజమవుతాయి అంటారు.. కొన్ని సార్లు మన మనసులో ఉన్న భయాలు కలలుగా కూడా రావచ్చు.

"చెప్పండి సార్" అన్నాను నిద్రమత్తుని వదిలించుకుని.

"నువ్వు బయల్దేరి వైజాగ్ రాగలవా అభి."

"వస్తాను సార్..." అని మిగతా మాటను పూర్తి చేసే లోపులో ఫోన్‌ని కట్ చేసాడాయన....

ఏం జరుగుంటుంది అన్న భయం, ఉత్కంట....ఆ భయంతోనే వైజాగ్ బయల్దేరాను.

★ ★ ★

జాని వాకర్ మందు, రెండు గ్లాసులు, ప్లేటులో చిప్స్ పెట్టి ఉన్నాయి.

వైజాగ్ YMCA దగ్గర ఉండే గెస్ట్ హౌస్‌లో ఉన్నాం నేను, ప్రొఫెసర్ శ్రీరాములు గారు, ఆయన మిత్రుడు శ్రీధర్...

నేను వైజాగ్ వచ్చి అప్పటికి గంటా ఇరవై ఐదు నిమిషాలవుతుంది.

ఇంకా ముగ్గురం తాగడం మొదలు పెట్టలేదు. ఒకేసారి తాగాలని నిశ్చయించుకున్నాం... కాని దానికన్నా ముందు ఆయన నాకో విషయం చెప్తాను అన్నారు.

"అభి నిన్ను నేనెందుకు పిలిపించానో తెలుసా????"

"తెలిస్తే వచ్చేవాడిని కాదు కదా సార్"

"హ హ.. జనరల్ సైకాలజీ... ఐ లైక్ ఇట్"

"హుఁమ్" అన్నాను.

"నువ్వు చెప్పావే నరకం, చనిపోయిన వాళ్ళు కనిపించడం. అదంతా పెద్ద కలని ఈయన అంటున్నాడు" అని శ్రీధర్ కేసి చెయ్యి చూపించారు.

డాక్టర్ శ్రీధర్ వైజాగ్‌లోనే ఒక గొప్ప మానసిక వైద్యుడని విన్నాను... ఆయన రాక వెనుక ఆంతర్యం నాకు ముందు అర్థం కాలేదు.

"కలా.........? కాదు... నిజం" అన్నాను నమ్మకంగా.

"నిజమే.... నిజంలా అనిపించే కల అది" అన్నాడు శ్రీధర్.

"నిజంలా అనిపించే కలా???" అన్నాను

"ఎస్.. లూసిడ్ డ్రీం" అన్నాడు గ్లాసులో ఐసు ముక్కలు వేస్తూ...

"అంటే కలకి... నిజానికి నాకు తేడా తెలియదంటారా??"

"తెలిదు అనట్లేదు, తెలీని పరిస్థితి అని చెప్తున్నా".

ఇంతలో శ్రీరాములు గారు గ్లాసులో విస్కీ పోసుకుని తాగడం ప్రారంభించారు. మా మధ్య ఇంత వాదులాట జరుగుతున్నా ఆయన అదేమీ పట్టించుకోకుండా విస్కీ తాగడం నా కోపాన్ని ఇంకా పెంచింది.

"మరి ఏంటి మీ ఉద్దేశం...ఏంటా పరిస్థితి???" అన్నాను గొంతుని పెంచి...

"చెప్పానుగా.. లూసిడ్ డ్రీం."

"సాక్ష్యం??" అన్నాను.

"హ హ...నువ్వు నిజంగా నరకం చూసావు అన్నదానికి సాక్ష్యం" అన్నాడు.

"నా మనఃసాక్షి "అన్నాను తడుముకోకుండా. .

"మనఃసాక్షి హ హ... నీకు జరిగింది ప్రపంచం అసలు ఎప్పటికి నమ్మనిది. నేను చెప్పనా.. నువ్వు కృత్రిమంగా కల్గచేసుకున్న సో కాల్డ్ హైపోజెనిక్ డ్రీం అంటాను"

"అలా అని మీరు ఎలా చెప్పగల్గుతున్నారు"

ఈసారి విస్కీ తాగడం నేను మొదలు పెట్టాను. బాటిల్ ఎదురుగా పెట్టుకుని ఉండలేకపోయాను.

"ఇది నేను ఏదో మందు మీటింగ్‌లో ఉండి చెప్పటం లేదు. నీ గురించి శ్రీరాములు గారు అన్ని చెప్పారు. నువ్వు సాంఖ్యయోగం గురించి వాడిన బూడిదని, కేటామిన్ డ్రగ్ ని కలిపి టెస్ట్ చేసి చూసాం."

"చూస్తే" అన్నాను విసుగ్గా... ఈ సారి విస్కీ ని ఇంకొంచెం స్ట్రాంగ్ గా కలిపాను. ఈ పరిస్థితిలో అది చాలా అవసరమనిపించింది.

"అది ఒక గాఢమైన నిద్రను, అలాగే ఒక పెద్ద కలను పరిచయం చేసింది హైపోజెనిక్ ఆర్ లూసిడ్ డ్రీం. అంటే నువ్వు కలలో ఉన్నావో, నిజ ప్రపంచంలో ఉన్నావో తెలుసుకోలేకపోవడం. ఇంకా చెప్పాలంటే అదే లోకంలో నీకంటూ ఒక కొత్త లోకాన్ని సృష్టించుకోవడం... అప్పటివరకు నీ మనసులో నాటుకుపోయిన విషయాలు, నువ్వు తెలుసుకోవాలన్న విషయాలు నీపై ప్రభావం చూపి కలలో నీకూ కొత్త లోకాన్ని సృష్టించుకునేలా చేసాయ్"

"సాధారణ బూడిద, కేటామిన్ కలపడం వల్ల ఇదంతా జరిగిందంటున్నారా"

"అది మామూలు బూడిద కాదు. Galantamine (గలాటమైన్) అనే పువ్వు ద్వారా తయారయ్యినది. దానికి లూసిడ్ డ్రీంని కల్గచేసే బలమైన శక్తి ఉంది.మీకు చూపించాను కదా శ్రీరాములు గారు" అన్నాడు విస్కీని సిప్ చేస్తూ.

కాని ఆయన మాత్రం ఆ విస్కీని ఆస్వాదిస్తున్నారు.

"నాకు తెలుసు సార్.. ప్రపంచం ఎప్పుడు నిజాలను నమ్మదు"

ఇంకో పెగ్ తీసుకున్నాను. ఈసారి మత్తు ఎక్కువైంది. ఒక్కసారి మెదడులో ఎవరో గునపం పెట్టి పొడుస్తున్న బాధ. మనసులో శశి మెదిలింది... ప్రపంచం ఏమనుకున్నా నేను చూసింది నిజం అనుకున్నాను.

"శశి శశి" అంటూ కళ్ళు మూతబడ్డాయ్.

ఫోన్ శబ్దం శవంలా పడుకున్న నన్ను నిద్ర లేపింది. నాకన్నా మత్తులో ప్రొఫెసర్‌గారు, శ్రీధర్ ఉన్నారు. జానీవాకర్ బాటిల్ కాళీగా పడి ఉంది. నేను పడుకున్న తర్వాత వాళ్ళు అది పూర్తి చేసుంటారనుకున్నాను.

ఫోన్ రింగ్ అవుతూనే ఉంది... ఫోన్ మీద పేరు కనిపించి కనిపించనట్టుగా కనపడుతోంది. నా కళ్ళకు దగ్గరగా పెట్టుకున్నాను ఫోన్ స్క్రీన్ని...అది త్రిపుర అని చూపిస్తోంది.. అప్పటికే ఒక 40 మిస్డ్ కాల్స్ ఉన్నాయి త్రిపురవి..

"అనిరుధ్ చనిపోయాడు రా"... ఫోన్ ఎత్తిన వెంటనే త్రిపుర ఏడుస్తూ చెప్పిన మాట. .

"ఎప్పుడు?? ఎక్కడ??"అన్నాను మత్తు మొత్తం ఒక్కసారిగా దిగిపోయాక...

"అర్ధరాత్రి భీమిలి రోడ్డులో యాక్సిడెంట్" అంది.

"బాడీ ఇప్పుడు ఎక్కడ ఉంది"

"వైజాగ్‌లో వాళ్ళ ఇంటి దగ్గర" అంది నెమ్మదిగా.. విషాదం ఆమె గొంతులో పూడుకుపోయి మాటను త్వరగా రానివ్వటం లేదు.

"నేను వైజాగ్‌లోనే ఉన్నా...ఇప్పుడే వస్తున్నా" అని బయలుదేరాను.

వాడి ఇంటికి వెళ్ళేటప్పటికి శవాన్ని తీసుకెళ్ళటానికి కార్యక్రమాలు అన్నీ జరుగుతున్నాయి.

అనిరుధ్ తన శవం పక్కన తానె కూర్చున్నట్టు ఉంది వాళ్ళ అమ్మ నాన్నలతో పాటు. ఒక్కసారి నన్ను నేను గిల్లుకున్నాను.

నిజం.. కళ్ళు మూసి మరల తెరిచాను. అదే దృశ్యం. వాడు ఏడుస్తున్నాడు. ఇప్పటిదాకా లేని ఏడుపు వాడిని చూసాక తన్నుకు వచ్చింది. త్రిపురని, అర్జున్‌ని ఒదార్చాల్సింది పోయి నేను చిన్నపిల్లాడిలా ఏడవటం మొదలు పెట్టాను. కాసేపటికి అక్కడ ఉండలేక బయటకి వచ్చేసాను. త్రిపుర, అర్జున్ నాతో పాటే బయటకు వచ్చేసారు.

"నాకు అనిరుధ్ కనపడుతున్నాడు. శవం పక్కన కూర్చుని ఏడుస్తున్నాడు" అన్నాను. "నాకు కూడా" అని బోరున ఏడ్చింది త్రిపుర.....

అంటే నేను చూసింది నిజం......

"జాతస్య ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ

తస్మాత్ పరిహార్యార్ధే సత్వంసోచి తుమర్హసి." అని ఘంటసాల గాఢత నిండిన గొంతు అక్కడ ప్రతిధ్వనిస్తోంది.. దాని సారాంశం ఇలా ఉంది.

"పుట్టిన వానికి మరణం తప్పదు
మరణించిన వానికి జననం తప్పదు
అనివార్యమగు ఈ విషయము గూర్చి
చింతించ తగదు.."

ఏ చావుకి వెళ్ళినా ఇది వినిపించక తప్పదు.

ఇది నాకు ఒక్కడికే కాదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఎదురయ్యే అనుభవాలే అనుకొని వాడి శవం వెళ్తుంటే చూసి అప్రయత్నంగానే కన్నీరు కార్చాను.

జీవితం ఎప్పుడు ముగింపు లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది. మనసేమో నిజానికి,అబద్ధానికి...నమ్మకానికి,మూఢనమ్మకానికి మధ్య నలిగిపోతూ ఉంటుంది...

ఏది నిజం?? ఏది అబద్ధం??

మరణంవాస్తవం. మరణానంతరం ఏమవుతుంది ? అనే ప్రశ్నకు వచ్చే సమాధానాలు ఊహాజనితాలు. మరణించిన మనిషి తన అనుభావాలను పంచుకోవడం ఎలా సాధ్యం?? అందుకే 'మరణంతో నా అనుభవాలు' అన్న మకుటం ఉత్సుకతను రేకెత్తించింది. స్వర్గ నరకాలను విశ్వసించని నా బోటి వారిని సైతం ఆసాంతం చదివించిన రచనా శైలిని తన మొదటి నవలతోనే సొంతం చేసుకున్న యువ రచయిత "విజయ్ శేఖర్"గారికి నా అభినందనలు ..

దేవి ప్రసాద్ గారు (రచయిత, సినీదర్శకులు)

కొన్ని రచనలు గొప్పగా అనిపిస్తాయి. కొన్ని రచనలు కొత్తగా అనిపిస్తాయి. అనుకరించి అద్భుతంగా రాయడం కంటే, అందమైన ఆలోచనతో 'బాగుంది' 'బాగుంది' అనిపించేటట్టు రాయడం చాలా గొప్ప విషయం. అలా రాసింది "మరణంతో నా అనుభవాలు". జీవితంలో ప్రతి మనిషికి ఎన్నో అనుభవాలుంటాయ్. అవి చెప్పడం గొప్ప విశేషం కాదు. కాని మరణంతో తన అనుభవమని చెప్పడం సాధ్యమైన పని కాదు. అంతటి ఆలోచింపచేసే టాపిక్ తో చదివింప చేసే నవల రాయడం ఓ ఎక్స్పీరియన్స్.. ఓ పరీక్ష.. అందులో విజయ్ సక్సెస్ అయ్యాడనిపిస్తుంది.

మొదటి నవలతోనే తన ప్రత్యేకతను ప్రూవ్‌చేసుకున్న విజయ శేఖర్ ఉపాధ్యాయుల ముందుముందు ఇంకా ఎన్నో కొత్తదనం ఉండే నవలలు రాస్తాదనిపిస్తోంది. చదవండి. బహుశా డిసప్పాయింట్ అవ్వరు.

– **సత్యానంద్ గారు** (ప్రముఖ సినీ రచయిత)

గుర్తుండిపోయే అనుభవం, గుర్తుచేసుకుంటూనే ఉండే జ్ఞాపకం

– **అనురాగ్**

జననం ఇన్నింగ్సుకి మొదలైతే మరణం చివర... మన పుట్టుక గురించి పక్కవాళ్ళు చెప్పడంవల్ల తెలుసుకుంటాం... పక్కవాడి చావునుంచి మరణం గురించి తెలుసుకుంటాం... సో, రెండిటిగురించీ మనకు సొంతగా అనుభవాలు ఉండే అవకాశం లేదు...

ఈ కుర్రాడు (నిండా ఇరవయ్యేళ్ళు కూడా లేవు) 'మరణంతో నా అనుభవాలు' రాస్తున్నాడంటే నవ్వొచ్చింది... మొదటి కాపీ ఇచ్చినప్పుడు అలా ఒకసారి అలవోకగా చదివి పారేయచ్చనుకున్నాను. It commanded respect... ఆద్యంతమూ...

మరణం గురించి చెబుతున్నానంటూ జీవితం గురించి, అందులో చిన్నచిన్న ఆనందాల గురించి చెబుతూ పోయాడు... మధ్యమధ్యలో క్యారక్టర్లు అవుటై వెళ్ళిపోతూంటారు. అంతే. మరణంతో పాటుగా అలవాటుగా వొచ్చే వేదాంతం, వైరాగ్యం... వీటిని దాటేస్తూ మరణాన్ని దాటుకుని వెళ్లాడు... It's a wonderful journey beyond death... కలనైనా ఊహించలేని ఒక అద్భుతమైన ప్రయాణం.

Don't want to be the spoiler... చదవండి... బాగుంటాయి... మరణంతో అనుభవాలు...

రాజ్ మదిరాజు (దర్శకులు, నిర్మాత)

మన అనుభవంలోని ప్రతి మరణాన్ని గుర్తుచేస్తూ, దాన్ని మన జీవితపర్యంతమూ చర్చించేలా చేస్తుంది ఈ పుస్తకం. మరణ సౌందర్యాన్ని, మరణాంతరంగాన్ని మనకు లీలగా పరిచయం చేస్తూ మరణించడానికి కూడా మనందరికీ ఒక అర్హత కావాలంటాడు ఈ విజయశేఖర్ ఉపాధ్యాయుల.

– మాదాల వేణు



పేరు విజయ్ శేఖర్ ఉపాధ్యాయుల, ఊరు అమలాపురం దగ్గర లూటుకుర్రు. చదివింది ఇంజనీరింగ్ అయినా మనసంతా సాహిత్యం వైపే.. చిన్నతనం నుంచే కవిత్వం రాయడం మొదలుపెట్టిన విజయ్, శ్రీశ్రీ కారణంగానే సాహిత్యం పై మక్కువ కలిగింది అంటాడు. తన జీవితం తాలూకు అనుభూతులని, అనుభవాలని చూసిన మరణాలని ఆధారం చేసుకొని రాసిన పుస్తకం 'మరణం తో నా అనుభవాలు'. పుస్తకం పేరు విని పెద్దవాడు అనుకునేరు? వయసు 22 సంవత్సరాలే..

చచ్చినట్టు చదివించే నవల...!!

– తనికెళ్ళ భరణి గారు
(ప్రముఖ నటులు, రచయిత)

★

'మరణంతో నా అనుభవాలు' – ఈ టైటిల్ ఊహించడమే సాహసం.అలాంటిది ఇలాంటి రచన చెయ్యడమా?? అందునా నూనూగు మీసాల నూత్న యవ్వనం దాటి ఇంకా కిలోమీటరు దాటని కుర్రాడా?? అది ఈ పుస్తకం పవర్. చనిపోయాక ఏం జరుగుతుందో బతికుండగా తెలుసుకోవడమే థ్రిల్. ఈ పుస్తకం చదివితే కలిగేది అదే థ్రిల్.

– ఆకెళ్ళ రాఘవేంద్ర గారు
(రచయిత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు)

ISBN 978-93-86327-90-1
ఎమెస్కో బుక్స్
రూ. 100/-
EBQ022